సంపుటము 18
సంచిక 2

భారతి

విక్రమ మాఘము
ఫిబ్రవరి 1941

ప్రకృతి పరిశీలనము

శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు

శోభోపాసకునకు నిస్సీమ మహానందమును గూర్చునది భావవైచిత్రి. బాహ్యేంద్రియ వ్యాపారములను, మెఱుఁగుఁదీఁగలవలె నిలుకడ లేక ఉదయాస్తమయముల నందు అంతరింద్రియము యొక్క తలఁపు గుంపులను అతిక్రమించి, సుదృఢమైన బాహ్య ప్రపంచమున సుస్థిరములై తలకూపు విశ్వోపాస్యములైన భావభంగిమలు మానవసంతారకములు. లోకమునకు అక్షయానందమును బ్రసాదించి, యుద్ధానిని దుఃఖసాగరము చేసి, స్వర్గసౌందర్యమును కన్నులఁ గట్టఁగల యద్భుతశక్తి భావసంపత్తికే కలదు. రమణీయమగు కవిత్వ తత్వపరిశీలనముచేఁగాని, మధురతర నాట్యకళోపాస్తిచేఁగాని, సుందరశిల్పవిన్యాసముచేఁగాని, సుమధుర దృశ్యసందర్శనముచేఁగాని, ఉదాత్త రచనముచేఁగాని, ఉజ్జ్వలఘట్టపరామర్శముచేఁ గాని, విశ్వప్రకృతి యొక్క నిరంతరోపాసనముచేఁ గాని మానవుఁడు పడయఁజాలునది హృద్వికాసమును చేకూర్చి, జీవితమును గౌరీశంకర శృంగమునకు సముద్ధరింపఁజాలు భావసంపత్తియే. విమలవిజ్ఞాన భాండారమును స్వాధీనము చేసికొన నెంచు నానందోపాసకుఁడు ఉదాత్త భావములను సేకరించుకొనఁ దహతహపడుచుండును. స్వాతిచినుకులకై వేచియుండు శుక్తిజాలమువలెను, సజలజలధరస్వామి శుభాగమనమున కెదురుచూచు మయూరసమాజమువోలెను, అమృతకిరణముల నాస్వాదింప నెంచు చకోరవ్రజమురీతిని ఆనందోపాసకుని హృదయము రసతపస్సంతప్తమగుచు మనోజ్ఞ భావముల నారాధింప వేగిరపడును. ఉత్తమభక్తుఁడు జగదీశుని కృపాసంపాదనమునకై కష్టపరంపరలను గాలఁదన్నువడువున యథార్థభావప్రణయి అమృతభావముల కోసము అంబునిధిలోనైన మునుఁగఁగలఁడు.

మధురభావోదయమునకుఁ బ్రకృతి పరిశీలనము హేతుభూతము. ఎంతటి శుష్క హృదయమైనను, విశ్వనాటకశాలలోని నానావిధ రంగములను విలోకించుటచేఁ గళాతరంగితమై రససంపన్నము కాఁగలదు. వసంతకాలమునఁ గ్రొత్తచివుళ్లు దొడిగి, వన్యశోభల నానందవాటికలై పొల్చు కుసుమితోద్యానముం గాంచి ప్రఫుల్లహృదయుఁడు గాని మనుజుఁ డుండఁడు. భూధర శిఖరములనుండి గుసగుస ధ్వనులతోఁ బాఱు సెలయేళ్ల గాననిస్వనములో నెవ్వఁడు తన జీవిత మధురరాగములను మేళవించుకొనఁడు? రసప్రపూర్ణ హృదయము

లలో మేల్మిత్రీవలవంటి మెఱుఁగుఁదీఁగలఁ గై సేసికొని సహజ గంభీరములైన గర్జారావములఁ బుడమిపడఁతి తాపమును బోకార్ప నుద్యమించు నంబుదకుమారకు లేవారికి దర్శనీయులు కారు? రమ్యభావవీథులఁ బచారు సేయు నేర్పుంగారి కదర్థ రహస్యములను గభీరతర భావ్యములను వ్రాసికొనఁడు? శరన్మేఘజ్యోతి కలోఁ బరుండి, తారకామణులతోఁ దోబూచులాడు అమృతకరుఁడు ఎట్టి జడహృదయమునైనను స్పందింపఁ జేయును. ఈ శరచ్చంద్రుని చేయూఁతఁ గొని కవిచంద్రు లెన్నెన్ని కళావిధానములచే స్వీయకావ్యముల దిద్దుకొనలేదు? జిలుఁగు మంచు దువ్వలువలు గప్పుకొన్న పర్వతకుమారుల దాఁగుడుమూఁత లెందఱెందఱు కళాజనకుల నలరింపలేదు? విశ్వవ్యాప్తమయ్యు గుప్తమైయున్న పరమేశ్వరుని దివ్య సౌందర్యము మంచుఁదెరలోని సుమేరుశోభవంటి దని వేదఋషులు గానముచేసినది మఱచితిమా? అకులను రాల్చి మోడులై కన్పట్టు వనస్పతులు కృత్రిమైశ్వర్యము పాపాయమని పాఠములు నేర్పుట ఒజ్జ లెఱుంగనిది కాదు. ధీరస్వాంతుని హృదయమట్లు గంభీరము, నిస్సీమము నగు రత్నాకరము నిజ సౌందర్యమును వెలనిచ్చి, ఎన్ని మానసములను దనవశము చేసికొనలేదు? ఉదయాస్తమయవేళల వాహినీనాథుని ప్రసన్న మధుర గంభీరాకృతిని దర్శించి యానంద తుందిలముకాని చేతము- భావప్రదీప్తము కాని హృదయముకూడ హృదయమా? ప్రకృతిప్రబంధమును బఠించి, జీవితములో నవరస శోభల నింపుకొన్న కవికుమారులు, కళోపాసకులు, రసికవరులు వేనవేలు.

అనురాగవతి యగు సంధ్యాకుమారిసంపర్కమును గోరు దివసకుమారుని యాశాభంగములో విప్రలంభ మున్నది. నిశాచంద్రుల నిరంతరప్రణయరస తరంగములు సంభోగశృంగార రసకారణములు. అనూరుసారథ్యముచే అభ్యుదయము నందు సూర్యుఁడును, ఓషధీపాలకుఁడయ్యుఁ గాలవశమునఁ బడమటి కనుమల దుర్గమాటవులలోఁ జిక్కి పొక్కు చంద్రుఁడును ఆశ్చర్యమును, గరుణమును బ్రకటించుచున్నారు. ఏకపత్నీవ్రతమును భంజించి, బహుస్త్రీవిహారకుఁడైన కళానిధిని ఆగ్రహోదగ్రమూర్తియై సహస్రపాదములతోఁ దన్ని పడవేయు చండకరుని వీరావేశము జగత్ప్రసిద్ధము. విశ్వనియంతృమహిమాతిశయము నెఱుంగక, అనంతపథమును ఆపిడిపెట్టెద నని ఘోషించుచు నుత్తాల తరంగ మాలలచే మిన్నుల కుఱికి విఫల ప్రయత్నుఁడై సిగ్గునఁ బాతాళమునఁ బడు సముద్రునియొక్క చేష్టలయందలి హాస్యరసలావణ్య మెల్లరకును రుచ్యమే. కులగిరులనుగూడ ముంచునట్లు సప్తసాగరజలము నల్లకల్లోలము చేసి జగమును సమున్మూలించు ప్రళయఝంఝామారుతము భయంకరము. దయమాలి నిష్కారణముగా సాంద్రారణ్యములను భస్మావశేషము లొనర్చు నగ్రభంకపార్శ్వలను జిమ్ముచు వెలిఁగెడు ననలమూర్తి రౌద్రరసస్ఫూర్తి దుర్దర్శము. విలయరుద్రుని వీరతాండవమునకు రంగస్థలమై, యనంత జంతుసంతానముల కంతిమకాలమున శయ్యాతలమై సెగడు శ్మశానవాటి బీభత్సబహుళము. శరత్పూర్ణిమానిశీథమున నీరవమై, నిరంజనమై, ఆనందమయమై అనిర్వచనీయశాంతులఁ దేజరిల్లు నాకాశశోభ అద్భుత శాంతరసప్రవాహములఁ బ్రవహింపఁ జేయును. రసోపాసకుఁడైన మధువ్రతునకుఁ బ్రకృతిలో నేకడఁ జూచినను నవరసతరంగశ్రీలు వెల్లివిరియుచు నాత్మజీవితమును బావన మొనర్పఁ జూచుచుండును. రసస్వరూప స్వభావముల నెఱుంగక, రసార్ద్రహృదయుఁడు కాక నీరసప్రకృతియైన రసప్రకృతి నవగాహింపఁజేసెనో కాని, చిద్రసమును హృదయఘటములు పొరలునట్లు నింపుకొన్న రసికుఁ డెందుఁ బరాజితుఁ డగుట యెందును గానము.

ప్రకృతి వికాసశోభలు దక్కిన వెండ్రు కాదు. నిత్యసౌందర్య శోభితమై యనుక్షణము నపూర్వ రుచులను వెలార్చు కాంతిమతి. పురుషుని దృక్ప్రసార మాత్రమున వసంతాగమమున వన్నెచిన్నెలనీను వనలక్ష్మివోలెఁ గిసలయితమై, నవ్యభావకుసుమముల విదిర్చు నాహ్లాదమయి. నిజహృదయము నెఱింగి తన్నుపాసించు నానందవ్రతులకు అనంత భావభాండారము నందించుట కిది జగన్నాథుని రత్నమంజూష యనవచ్చును.

ప్రకృతిపేటిలో నిక్షిప్తములైన యమూల్య మణిజాలములు నందఱికిని జిక్కఁబట్టివిగూడఁ గావు. స్వార్థాంధులైన దొంగలకు, ఎన్నటికో శ్రమించి గాజుపూసలను దెచ్చి గరుడపచ్చలనుగా చలామణి చేయనెంచు కుహుకకీర్తికాములకు, పెఱవారి సాహచర్యముననో, అన్యకృతుల భావమరీచుల వెలుఁగుననో, ఎంగిలిచేసిన నాలుగు ముక్కల నలనల్లన తమ యంతరంగములో నతికించుకొని యద్భుత భావోపాసకులుగా వన్నె కెక్కఁజూచు ఖాళీఖజానాదారులకు ఈ బొక్కసములోని సరుకులు చిక్కవు. ఎవ్వాని చేతిలో నిశిత ప్రతిభ, నిర్మల విజ్ఞాన లను తాళము చెవులుండునో, ఎవ్వాఁడు నిరంతర పరిశ్రమమున, సమ్యక్పరిశీలనమున, వజ్రోత్సాహమున సృష్టిహృదయము నవగాహింప దివురునో, ఏవాని బుద్ధి సత్యభాండముపై ఆచ్ఛాదింపఁ బడిన, నవరత్న ఖచితమైన మూఁతను గాంచి విముగ్ధము గాదో, అట్టి భావలుబ్ధునకే, నిరంతరోద్యోగికే, భ్రాంతిదూరునకే యా పెట్టెను దెఱచుటకు సాధ్యపడును. ఎట్లో కష్టించి పెట్టెమూఁతను విప్పుకొన్నను వెలలేని మణిపుంజముల నేరికొనుట గూడ దుష్కరమే. నవరత్నములను, నత్తగుల్లలను వేఱుపఱచి మన కెవ్వరు నందీయరు. స్వీయపరీక్షాదక్షతచేతనే ద్వంద్వనిర్ణయము చేసికొనవలయును. పరీక్షాశక్తి కొఱవడినచో మంచి సరుకు నేరుకొనలేముగదా!

అద్దములోఁ గన్పట్టు పాపాయిని అన్యునిగా భావించి పసిబిడ్డ కేరింతలు కొట్టవచ్చును. క్రొత్త జగత్తును సృష్టించుకొని పిచ్చివాఁ డానందింపవచ్చును. ఎదుటివాఁ డొనర్చు ముఖస్తుతు లన్నియుఁ దెల్లమే యని యెంచి యమాయికుఁ డుబ్బి తబ్బిబ్బు కావచ్చును. అందులో యథార్థ సత్త యెంత? వాస్తవికానంద మెంత? శాశ్వత నిర్వృతి యెక్కడ? విశ్వప్రకృతిలో నీకు లభించినవి రత్నములో, రాళ్లో! రాలం గాంచి రత్నము లని భద్రపఱచుకొనవచ్చును. రత్నములను పోల్చుకొనలేక రాలని జారవిడుచుకొనవచ్చును. సముద్రమునకు రత్నాకర నామ మున్న దని తత్తరంగములు రత్నరాసులనే విసరునని, యొడ్డుననున్న రాలనెల్ల నేకరించుకొని మోసపోవు మందుని లీల మనకృత్యము గాఁగూడదు. అగుచో, ఆపసిబిడ్డకును మనకును, పిచ్చియ్యకును మనకును నభేదమే సిద్ధము. జగములో సత్యముకన్నను మోసమునకే రాజ్యాధికారము మెండు గావునఁ బ్రకృతియెడను మనము వంచకులమును, వంచితులమును గావచ్చును.

తన్ను గుర్తుపట్టినవానిని బ్రకృతి వంచింపలేదు. అట్టివానికి సుస్వాగత మిచ్చి, యాత్మరహస్యముల నావిష్కరించి యవ్వాని సముచితప్రయోగ విధానములనుగూడ నిరూపించి పెట్టును. ఇది లోకమర్యాద యుంగూడ. తన్నెఱింగిన పెద్దమనిషికి నెట్టివాఁడైనను గపటముం బలికి యథాస్థితమును మసిఁబూసి మారేడుకాయం జేయఁజాలకుంట తథ్యముకదా! దృఢబద్ధమయిన పరిచితిలో నున్న మహత్త యట్టిది. నిరంతరము ననుచరితమైన స్నేహవ్రతము విపరీతఫలదాయి కాఁగూడదు. అగునో, సుధామూర్తి నిప్పుకలు విసరినాఁడు; పూలగుత్తులు విషపువాకలు వెల్లివిరియించినవి; చండకరుఁడు మంచువానలు గురిసినాఁడే; అగ్నిహోత్రుఁడు చందనచర్చ చేసినాఁడే! ఇవి ప్రకృతికి విరుద్ధములు. ఉదాత్తులగువా రాత్మధర్మపరిచ్యుతులు గారు. విశిష్ట ప్రకృతులనుండి విరుద్ధధర్మలాభములను బొందుట అవస్థాంతరమునఁ గలిగినఁ గలుగవచ్చును. సామాన్యమున నైసర్గిక సూత్రము భ్రంశితము కాదు. విశేషవిధి యన్నివేళలను బ్రసక్తము కాదు. తన్ను వెంటనంటు మధుర స్వభావునకుఁ దన హృదయమును దెఱచి యందలి యత్యపూర్వ మర్మములను, అతిలోక రహస్యములను ఆవిష్కరింపని వంచకునకు లోకములో నెంతస్థానమున్నది? టక్కుటిక్కుల కెఱఁగిన మానవ హృదయమే యట్టిచేఁతలకు వెనుకంజవేయుచుండ నిఁక నే పాపమెఱుఁగని ప్రకృతి మాయావిని యగునా? వస్తుస్థితి మాఱుట సుకరము గాదు. ఎండమావి యథార్థముగ లేదు. ముత్తైపుఁజిప్ప వెండి కాఁజాలదు. త్రాడు పామై పగపట్టదు. స్థాణువు పురుషుఁ డగుట మిథ్య. అయిన నీ భేదజాత మెటనుండి ప్రవర్తిల్లుచున్నది? చూపులోని తేడానుండి, పోల్చుకొనలేమిని బాటిల్లెడు

భ్రాంతినుండి. సమ్యగ్దృష్టి కలిగినంతనే స్వస్వరూప జ్ఞాన మావిర్భవించుచున్నదిగదా! అట్లే మన యుపాసనలోఁ దత్త్వదృష్టి లేకపోవచ్చును. అనుశీలనము ఆలోచనానిశితము కాకపోవచ్చును. ప్రకృతిమాత పాదపద్మముల చెంగట మనసుండెల నర్పించు దీక్షా వ్రతము మనలో కొఱవడవచ్చును. అపుడు విజయము శూన్యమగుటయో, విపరీతఫలము సిద్ధించుటయో తప్పదు.

అనంత భావజాలమునకు మనికిపట్టు మానవుని యంతరంగము. జన్మ జన్మాంతర వాసనలు, చిత్ర విచిత్రానుభూతులు, ఇంద్రియ ప్రత్యక్ష విషయములు, అదృష్ట సంస్కార విశేషములు అనేకములుగా మనుష్యుని హృదయదరిలో నెలకొనియుండును. ఏ నూతన స్వర్గధామమునుండియో భావములు చేరికొనివచ్చి మదిలో మూఁదికొనుపని లేదు. అట్లొనరించినను సంస్కార ప్రాబల్యము లేని భావకణములు హృదయములో నంటికొనవు. నిజవాసనలకు వ్యతిరేకములైన భావసంపత్తు లెంతటి మహత్తరములైనను ఒకానొక జనుఁ డవ్వాని వశీకరించి స్వభావము ననుసరించుట మన మెఱుఁగుదుము. సృష్టిగర్భములో ననాదిసిద్ధములై యున్న భావజాలములు సూక్ష్మాతిసూక్ష్మ పరిణతరంగముల సాహాయ్యమున విశ్వసంచారము చేయుచున్నా యనట్లు, నియతిలేక మానవహృదయముల నివ్వి తాఁకుచుండును. కావున నున్న భావసంపత్తి యంతయు నంతరంగనిధానమున నిక్షిప్తము. ఇవి యన్నియు నెల్లపుడును పైపైని తొణఁకులాడుచు మానవునకుఁ బ్రత్యక్ష విశ్వమునఁ దమ రూపములఁ జూపుచుండవలయు నని నియతి లేదు. సముద్రగర్భమున నిలీనములై యున్న రత్నరాసులవోలె అనంత భావచ్ఛాయలును నిజహృదయమున నిమగ్నములై సుప్తి యోగమునఁ దప మాచరించుచుండును. అనురూపానుభూతి చేకూరినపుడు, నిరుద్ధశక్తుల పోరాటము సందర్శించినపుడు, వివిధ విషయ ప్రేరకదృశ్యములు కనుల పండువు గావించినపుడు, దృష్టాదృష్టశక్తులతోఁడఁ బ్రత్యభిజ్ఞానమానముల మూలమున స్వీయ సంస్కారములు చేతులు కలుపుకొన్నప్పుడు, విషాదమోదములయందలి తిక్తమధురరసాస్వాదము హృత్తుభేదకమైనపుడు అంతర్నిలీన భావసంతానములు ఱెక్కలు కట్టుకొని బయలున కుఱుకును. నిగురించిన బుద్ధితేజము సుఖస్వప్నమున పక్కనవిడి ప్రబుద్ధుఁడై క్రీడారంగమున నాటాడ మొదలిడినట్లు, హృదయంగత భావమును (సంస్కారమనుఁడు, భావన యనుఁడు) ప్రేరిత మగుచు నాచరణరంగమున నతిలోకనటనాకౌశలమును జూప నయ్యది తొందరపడుచుండును. ఏ విధమైన సన్నివేశము చేతను గాని యీ యాంతరంగిక ప్రేరణమును, భావప్రబోధమును మానవుఁ డందితీరవలసినదే. అంతర్జగత్తునుండి కానిండు, బాహ్యలోకమునుండి కానిండు సంభవించెడు నీ మహాప్రేరణమునే ఆత్మప్రబోధ మనవచ్చును; అంతర్జ్యోతిర్వికాస మనవచ్చును; అఖండదివ్యస్ఫూర్తి యనవచ్చును. ఈ దివ్యప్రేరణమున కన్ని మార్గములు నిర్దిష్టములై యున్నవో యం దెల్ల ప్రముఖము ప్రకృతిపరిశీలనము.

ఉదాత్తజగత్తులో నున్న చిదవిలాసములను ఈ ప్రపంచములో మెలఁగనీక, ఆకలిదప్పుల సంతర్పణముతోనే ఆత్మతృప్తి జూరఁగొని, అర్థకామముల సిద్ధితో నానంద మనుకొని సుఖముపెట్టు మార్గమునకు-, తన మనస్సును కంటకపుష్పలమీఁదఁ బచారు చేయించుచు సుమనస్సుగంధ మున్న దేనిని చుకొను మనుష్యవరాహమునకు భావప్రబోధము నందవలసిన పని లేకున్న లేకపోవచ్చును. సంస్కారలేశ మున్న యే హృదిమాన భావప్రేరణమునకు యత్నింపకుండఁడు. హృదయాకాశమున భావవిద్యుల్లతాంకురములు తళుక్కుమత్తనేని, కారుమబ్బుల కటికచీఁకట్లే యందు చిందులు తొక్కును. భావాంబరవీథిని విశ్రుతవిహారము సేయలేని జనుని జీవితయాత్ర యసంపూర్ణమయి తన గమ్యమును జేరలేని దశల నిక్కును.

దేహప్రాణమనోధాతువుల నతిక్రమించి పురుషుఁడు (లింగాది సంజ్ఞలచే సులభముగా పిలువఁదగిన మగవాఁడని కాదు. "పురి హృదయగుహాశయనాత్ పురుషః" అని యాత్మపక్షమున వాస్తవికార్థమును గ్రహింపవలెను) విజ్ఞానభూమికలో నడుగుపెట్టినఁగాని భావప్రపంచద్వారమును దాటినట్లు కాదు. దిగువనున్న మూఁడులోకము (శరీర ప్రాణ మనోమయలోక

ములు) లందును విశిష్ట జ్ఞానసంపత్తి చేకూరదు. శరీర ప్రాణమయములలో సంచారము జంతుమాత్రసహజ మయినది. మనోభూమికను చేరునప్పటికి ప్రాణికి మానవత్వము ప్రారంభమగుచున్నదని చెప్పవచ్చును. అనంత సంకల్ప జాలమునకు, వాంఛాలీలలకుఁ బుట్టినిల్లయిన మానసిక క్షేత్రములో సంచారము సాగించునపుడు బుద్ధి (మనసస్తు పరా బుద్ధిః) సాహాయ్యమునఁ దనకంటెను భిన్నమగు పరిసరమునందును, స్వోపయోగమును బట్టి కాని, తనయందలి యుదార భావగరిమచేఁ గాని మానవునకుఁ బ్రేమోదయ మగుచున్నది. అనఁగా మనః కోశము మానవునకు స్వార్థరాహిత్యమును బోధించుట కోనమాలు దిద్దఁబెట్టె దనవచ్చును. తనతోడిదే లోక మనుకొను పశుప్రవృత్తి నించుక దూరీకరించి, తనకంటె భిన్నమయిన జగత్తులోని కితనిం బ్రవేశపెట్టుచున్నది. సమస్త శుభాశుభ బంధములు, నీ యవస్థయందే కల్పితము లగుచున్నవి. ఈ యవస్థలో సుస్థిరములగు చిరశాంత్యానందములు లేవు. ఆత్మ పరిణతియు కాలేదు. వ్యాప్తతభావవికసనమున కనువగు నుపాసన మార్గము కాలేదు. ఆరాధనీయములైన తేలఁపు లేవో వ్యక్తము కాలేదు. చరాచరజగత్తులో రూపాంతర పరిణతమైన స్వీయాంశను (ఆత్మాంశ, ఆత్మకళ, చిద్విలాసము, మాయాశబలితమై తత్తద్భావ ప్రేరకమైన పరాప్రకృతి—ఏ శబ్దముతోనైనను బిలువవచ్చును) దిలకించి దివ్యసమాధి, నిమగ్నుఁడగు స్థితి చేకూరలేదు. అయ్యది విజ్ఞానభూమిం దటిసిననేకాని యలవడదు. మనోబుద్ధుల సాహాయ్యమున నీకోశములోఁ బురుషుఁడు విస్తృతవిహారము సేయవలయును. సంతతము నుదయించెడు నైకవిధ భావసంతానముల యుపయోగానుపయోగములను గుర్తుపట్టవలయును. నిజప్రజ్ఞాపరిణతి కవ్వానిని సాధనములుగాఁ జేసికొను శక్తి నుపార్జించవలయును. అపుడుగాని హృదయగ్రంథి భేదము నందదు; సర్వ సంశయములును విచ్ఛిన్నములు కావు. ఇది యొక దివ్యావస్థ; దివ్యానుభూతి. చరాచర జగద్వలయమునఁ దొనఁకులాడు జ్ఞానపీయూషవాహిని యీ యవస్థలోఁగాని యాత్మసంస్థము కాదు. జగత్తుతోడఁ దనకుఁ గల సంబంధము, ప్రకృతి పురుషులకుఁ గల హేయోపాదేయతలు నిపుడు వ్యక్తము కాఁగలవు. క్రమక్రమముగ భిన్న భిన్న ప్రకృతుల మూలకారణము సాక్షాత్కార మగుడు (విజ్ఞాన నేత్రమునకుఁ గాని తోలుకండ్లకుఁ గాదు) నానావిధ ప్రకృతిశక్తుల నాత్మాయత్తము చేసికొని, యీ విజ్ఞానవిభుఁడు తేజరిల్లఁ గలఁడు. ఇఁక బుద్ధికావల నెసఁగు పురుషోత్తముని (యో బుద్ధేః పరతస్తు సః) జేరుకొన్న మానవుని విజ్ఞానమాత్ర సఫలమై యానందధామము, నాత్మప్రత్యక్షము చేయును.

పురుషోత్తముఁ డన నెక్కఁడో యీవిశ్వమునకావల, ఈ భౌతికలీలలకు వెనుక, ఇంద్రియ గోచరమగు పదార్థరాశి కతీతముగ, ఏ మబ్బులమాటునో, ఏ స్వర్గధామమునో తన దివ్యసింహాసనము నధిష్ఠించి భువనములను శాసించుచున్నాఁ డని మోహపడఁదగదు. పాలయందలి నేతింబలె నెల్లయెడల నెల్లవస్తువులయందును నంతర్నిమగ్నుఁడై, బాహ్య సౌందర్యమునకుఁ గారణమైనయనిర్వచనీయానంత సత్త్వమై పరఁగుచున్నాఁ డని యీ భూమికలోఁ దెలియఁగలము. అనంతసాగరము తరంగములకంటె భిన్నము కాదనియు, అసంఖ్యాక తరంగమాలలు సముద్రోత్థములే యనియు, బుద్బుదములు, ఆవర్తములు, నురుఁగులు మున్నగు రూపాంతరములన్నియు జలములోనివే యనియు గ్రహించు నైక్యబుద్ధి చిత్రమైనది! స్థాణువునకును నందలి యగ్నికిని, అగ్నికిని అందుండి వెలువడు ధూమజ్వాలా స్ఫులింగములకును అభేదము నెఱుంగెడి యవస్థ యెంత విచిత్రమైనదో యూహింపుఁడు. పాదులో నింపఁబడు నొక్క జలరసమే, నేలనుండి పీల్చఁబడు నొక్క భూసారమే వృక్షవ్యాప్తమయి కొమ్మలుగను, ఆకులుగను, పూవులుగను, పండ్లుగను వెలసెడి సృష్టిరహస్య మచింత్యము కాదా? అట్లే ఏకమాత్రమగు సత్పదార్థము బహువిధ రూపజాతము నంది, పృథక్కులుగాఁ దోఁచు నవ్వాని యంతః ప్రవిష్టమై, యాత్మభోగమునందు దివ్యపరిణామము మానవప్రాణికి విజ్ఞేయము. ఇటనే ప్రకృతిరహస్యము గర్భీకృత మైయున్నది. ఈ రహస్యమునందే నవరస ప్రవంతులు—నవరసములే కాదు, అనంతరసనిర్ఝరులు వెల్లివిరియుట! ఇటనే అనర్ఘ భావసంతతులు

ఉదయశాంతుల నందుట! ఇట్టిపటనే నిఖిలకళా స్వరూపములు సుద్ధమించి చరితార్థములగుట! ఏతత్పరిశీలనమున కృతార్థత నందినపుడే, జీవితయాత్ర పరిపూర్ణము కాగలదు. పురుషునిలోని దివ్యవిభూత్యాత్మకమగు ప్రకృతిని, ప్రకృతిలో సంతర్లీనమైయున్న పురుషుని స్వీయవిజ్ఞానకేంద్రమున, అపృథగ్భూతమైన, కృత్స్న దృష్టితో విలోకించు, నీపరమానుభూతిలోనే, శోకమోహములు దూరీకృతములై (తత్ర కో మోహః కః శోక ఏకత్వ మనుపశ్యతః...) శాశ్వతనిర్వికార దివ్యసత్త స్వతఃస్ఫురితము కాగలదు.

క్షణభంగురమును, పరివర్తనశీలమును, అసంఖ్యేయమును నగు ప్రకృతి యేడ, నిత్యనిరంజనమై యేకమాత్రమునఁ దేజరిల్లు పురుషతత్త్వ మేడ? వెలుఁగు చీఁకటులవలె నిత్యవిరుద్ధములైన భిన్నతత్త్వములకు సమ్మేళనమా- చీఁకటిలో వెలుఁగును, వెలుఁగులోఁ జీఁకటిని సందర్శించుటయా అను శంకలకుఁ బునస్సమాధాన మిటుఁ జెప్పఁబూనుకొనుట విస్తరము. ఈభూత పృథగ్భావము నెప్పు డేకత్వముగాఁ దెలియఁగలమో, తెలిసి పార్థక్యమునందిన పదార్థరాశిస్వరూపస్వభావముల జ్ఞానమున నాత్మభోగము (ఆత్మోపలబ్ధి)న కప్పు డవ్వానిని పరమసాధనములుగా స్వీకరింపఁగల్గుదుమో యావాఁడేకదా యించుకైనను ప్రకృతితత్త్వము మన కర్థమయినట్లు. కావునఁ బ్రకృతిపురుషుల ద్వైక్యము వెలుఁగు నీజ్ఞానము తేజస్తమముల ద్వైక్యమువలె విరుద్ధముగాఁ దోఁపవచ్చును. ఆ విరోధములో నున్న మైత్రీ విశేషము గోచరించినప్పుడేకదా మన భిన్నభిన్న కళోపాసనములకుఁ జారితార్థ్యము!

కావుననే మన భారతీయవైదిక లౌకిక సాహితీ సంప్రదాయమునను, కళాకలాపమునను భౌతికాధ్యాత్మికళ కులుగాని, ప్రయోజనములుగాని విడివడలేదు. కావ్యకళ, నాట్యకళ, శిల్పకళ, గానకళ, వేదహృదయము, దార్శనికదృష్టి ఇవి యన్నియు నీ లక్ష్యమునే పురస్కరించుకొని పయనించినవి. మైథునమంటే యింద్రియోపభోగము తుచ్ఛసుఖానుభూతిమాత్రము కాదనియు, * సంయోగక్రియా ఫలరూప సృష్టి సందర్శనానంద మనియు సిద్ధాంతీకరించిన యుపనిషద్హృదయ మెంతవిశాలమును, దూరదృక్భితమునో అరయుఁడు. అట్లే ఇది ప్రకృతి, ఆతఁడు పురుషుఁడు నని వేఱుపఱచి చూచుటకు నవు గాదు. సౌధాంతర్గత సోపానములయొక్క క్రమగతిచే సౌధము నెక్కినట్లు, పురుషాంతర్గతమైన ప్రకృతియొక్క అనవరత పరిశీలన, ఉపాసనలచేతనే భావతయును పూని యానందసిద్ధి నందవలసి యున్నది. శరీరేంద్రియ మనోభూమికల సాహాయ్యమున నేకదా

* తైత్తిరీయోపనిషత్తున భృగువల్లిలోని బ్రహ్మోపాసనమును వివరించుపట్ల "ప్రజాతి రమృత మానంద ఇత్యుపస్థే" అను వాక్యమును భాష్యీకరించుచు శ్రీ శంకరాచార్యుఁడు—"ప్రజాతిరమృత మమృతత్వప్రాప్తిః, పుత్రేణ ఋణవిమోక్షద్వారేణానందః సుఖ మిత్యేతత్సర్వముపస్థనిమిత్తం బ్రహ్మైవానేనాత్మనోపస్థే ప్రతిష్ఠిత మిత్యుపాస్యం." ఈభాష్యమును వివరించు శంకరానందుఁడును తన దీపికలో "ప్రజాతి ర్బ్రహ్మ ప్రజననరూపం, అమృతం బ్రహ్మ ప్రియాలింగన దర్శనాదిరూపం, మైథునం క్షుద్రసుఖరూపం, ఆనందో బ్రహ్మ మైథునక్రియానివృత్తిజం సుఖం పుత్రఫలం" అని వ్రాసియున్నాఁడు. దీనింబట్టి క్షుద్రసుఖము మైథునప్రయోజనము కాదనియు, పుత్రప్రాప్తి, తద్ద్వారమున నైహికాముష్మిక పురుషార్థసిద్ధిరూపానందమునే వాంఛనీయమైనట్లు పరమపవిత్రత యద్దాని కారోపింపఁబడిన దని తెల్లమేకదా! మీఁదుమిక్కిలి తన్నిమిత్తమను బ్రహ్మమే యుపస్థయందుఁ బ్రతిష్ఠితమయినట్లుపాసించవలె ననుచున్నాఁడు. ఈ పురుషకర్మ మింతటి పవిత్ర మగుటచేతనే ప్రజాపతివ్రతమని యుపనిషదంతరమునను "ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ" అని గీతలో భగవానుఁ డయ్యది మత్స్వరూపమే యని ప్రవచించుటకును గారణమైనది. ధర్మశాస్త్రములు సైతము అనృతుగమనమును పాశవికకామ సుఖములని తెగనాడుటయు, రెండవ కుమారుని కామసంతానములో లెక్కపెట్టుటయు నిద్దాని యంతరార్థమునే తెలిపెడిని.

నీవు విజ్ఞానదీపమును వెలిఁగించితివని, పొందకలసినది దివ్య విజ్ఞానతేజమైనను (వెలుఁగు నపేక్షించువానికి దీపశిఖ యవసరమయినట్లు) శరీరప్రాణములు హేయము లందుమా? అది పొరపాటు. ఏకత్వములోని వైవిధ్య రహస్యము నెఱుఁగలేని సంకుచితదృష్టి, ప్రమాదావహము. "మృత్యోః స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి"

ప్రతి భావోపాసకుఁడును, దనశక్తికొలఁది ప్రకృతిని బరిశీలించుచుండునే కాని, ఈ పరాకాష్ఠ నందువాఁడు 'కశ్చిత్' (కశ్చిన్మాం వేత్తి తత్త్వతః) బాహ్యప్రకృతిని దర్శించిన కళాకోవిదులు కొందఱు; అంతఃప్రకృతిని సాక్షాత్కారము చేసికొన్న రసతపస్వులు కొందఱు. ఎవ్వని ప్రకృతి దర్శనమునకుఁ దగిన యనుభూతు లవ్వాని కావ్యదర్పణమునఁ బ్రతిబింబించుచుండును. రమణీయమైన యీ ప్రకృతిద్వయములో మునుకలు వెట్టిన ధిషణాధురంధరులును గొంద ఱున్నారు. బాహ్యాంతస్తత్త్వసారములను జీవేశ్వరులనుగాఁ దమ ప్రజ్ఞాకేంద్రమున విహరింపఁజేసికొన్న యిమ్మహనీయుల సంఖ్య చాల నలఁతి. ఉత్తర రామచరితమును వ్రాసిన భవభూతి యట్టివాఁడు. సుందర సుందర పర్వతారణ్యములను, గిరినదీ సరిత్తటాక సరోవరదృశ్యములను దన యెడందలోఁ జిత్రించుకొని దండకారణ్య భూభాగములోని ప్రకృతిసౌందర్యమును, మనకు సాక్షాత్కరింపఁజేయు నీకవీశానుఁడు, నిజహృదయములో విశ్వరూపసందర్శనమును జేసికొన్నాఁడేమో యనిపించును. గోదావరీ పరిసర గిరితటములయందు వృక్షములను, మృగములను జుట్టములనుగాఁ జేసికొని, ఏనుఁగుగున్నలను, మత్తహరిణములను, వనమయూరములను జెంద్లిండ్లుచేయుచు తన ప్రేమయోగము సార్థకమగునట్లు విహరించినవాఁడు దాశరథి యొక్కఁడే కాఁడు; ఆరణ్యకజీవనమున కలవాటుపడి, ప్రియప్రాయమైన వృత్తిని, వినయమధురమైన వాఙ్మయమును, సహజకల్యాణమైన బుద్ధిని, అనింద్యమైన పరిచయమును, ఆత్మజీవితమునుండి వ్యక్తము చేసిన భవభూతి సుకృతి గూడను. స్వేచ్ఛానుప్తగభీరభోగ భుజగశ్వాస ప్రదీప్తాగ్నులకు వెఱవకయు, ప్రోచ్చండ సత్త్వస్వనములకుఁ బొఱకయు, తీర్థాశ్రమగిరిసరిద్గర్తకాంతార మిశ్రములైన దండకారణ్య భాగములలో జనదారివోలెఁ దిరుగుచున్న "సాంసారిక రసములయందు ప్రేమ రసజ్ఞుల" మని చెప్పఁగలిగిన శ్రీకంఠ పదలాంఛనుఁడు (భవభూతి మొదటి పేరు) జానకీదేవిచే కర్ణామృతములును, మనోరసాయనములు నగు పల్కులచే, ఆదర్శప్రేమసిద్ధాంతమును నిరూపింపఁజేసినాఁడు. శేటికూనల రొదలను, జలపక్షినిచయంబుల రొదను సీతకుఁ జూపిన మక్కువ మిక్కుటమైనది. ఏ కొండ కోనయందేని నెమ్మినెఱజాణ కూసినదో, ఏ బాలకదళీవనాంతరములందో మయూరకుమారుఁడు పురివిచ్చి యాడినాఁడో, ఈతని హృదయము వికసించిన దన్నమాటే. ఎందెందు ప్రకృతిసౌందర్యము క్రీడించునో యట్టి తావులనెల్ల నెమకి పట్టుకొని స్వీయకావ్యములోఁ జిత్రించి, యద్దానిని మహనీయము చేసికొన్నాఁడు. ప్రకృత్యుపాసనములోఁ గృతార్థుఁడైన యీకవివరేణ్యుఁడు, తమసా మురళానదులను చెలికత్తెలను జేసికొనియు, గంగాగోదావరులను ఇఱవు రమ్మలుగా నారాధించియు, వనదేవతలను సహచారిణులుగా నొనర్చికొనియు, కాననజంతుసంతానమును తనజాతి యనుయాయివర్గముగా భావించియు వారణ్యకవ్రతమును గొనసాఁగించినాఁ డనుట యవితథము. ప్రకృతియే తాను, తానే ప్రకృతి యయిపోయిన భవభూతికి ఉత్తరరామచరితమువంటి కరుణరసకావ్యము చిక్కుట యాతనియదృష్టమే కాదు, రసలుబ్ధులమగు మన యదృష్టముకూడను.

సీతారాముల అదృష్టదివ్యానుభూతిని ప్రదర్శించుటలోను, కౌసల్యాజనకుల యాంతరంగిక భావావస్థలను జిత్రించుటలోను, తండ్రిబిడ్డల సమావేశసందర్భమునఁ బ్రదర్శితమయిన మానసికసంగ్రామమును నిరూపించుటలోను నీతఁ డగపఱచిన యంతఃప్రకృతిపరిజ్ఞానము అన్యకవిదుర్లభమైనది. కాళిదాసుని విడిచిన నొండొకఁ డింతటికవయిత సంస్కృతసాహిత్యరంగమున దొరకఁడేమో. ఈతనికిఁ దమ్ములెవరా రుండిన నుండవచ్చును; మార్గదర్శకులై భావోన్మేషమున ప్రా

కావ్య సందర్భమునం దుండిన నుండవచ్చును. వీరరసమూర్తులైన కుమారులను జూడఁగనే రామునకు, పుణ్యానుభావదర్శనుఁడైన రామచంద్రునిఁ జూడఁగనే కుమారులకు, విరోధము విశ్రాంతమై, నిర్వ్యాజఘనమైన స్నేహరసము ప్రస్ఫుటమై, బహిరుపాధుల నాశ్రయింపని అనిర్వచనీయమైన యొకానొక యాంతరిక హేతువు ప్రీత్యుత్పాదనము చేసినదఁట. "ఆత్మావై పుత్త్రనామాసి" యని వేదములందుకే గాఁబోలును గానముచేసియున్నారు. పితాపుత్త్రుల సంబంధమును గోచరింపఁజేయుటకుఁ గారణాంతరము లవసరము లేకపోయినవి. జన్మాంతర నిబిడబద్ధమైన పరిచయముకన్నను నియ్యది సన్నిహితమై, సన్నిహితముకూడ కారు-తన యాత్మప్రతిబింబమే కావున నాత్మానందము వికసించి, కాల్పనిక బహిర్విరోధములు పాఱిపోయినవి. ఇయ్యది వెక్కుర యనుభవములో సిద్ధమే. కాళిదాసిట్టి యనుభూతినే దుష్యంతునకును, భరతునకును గల్పించినాఁడు. కాని యాతని నిరూపణము ప్రౌఢము; వ్యంగ్యప్రధానము. భవభూతి హృదయమును గుప్తము చేసికొనలేఁడు. ఉదయించిన భావమును ఇంక నాలుగుపదము లెక్కువ వేసియైనను స్పష్టముగఁ జెప్పకొందమను మానిసి. ఇది తత్కావ్యములలోఁ బెక్కు సందర్భములలో వ్యక్తమే. ఇట్టి ప్రకృత్యుపాసనాజన్యమైన యనుభవపూర్వక రచనాదిక్షేమముచేతనే యాతఁడు "ఉత్తరే రామచరితే భవభూతి ర్విశిష్యతే" అను ప్రతీతికిని బాత్రుఁడయినాఁడు. మానవపాత్రల భావోన్మేషమునందే గాక తిర్యక్కుల హృదయపరిశీలనమునను, చేతనముల నిరూపణమునను గూడ నీతఁ డసమానుఁడే. ఎందఱు కవులుత్తరచరితను వర్ణించలేదు? భవభూతి యొక్కఁడు మాత్రమందుఁ గృతకృత్యుఁడు కాఁగలిగెను. పూర్వచరిత్రమును వ్రాసి విజయమందినది మురారియనుచో, నుత్తరచరిత్రమున గెలుపొందినది భవభూతి. కావుననే సగర్వముగా పరిణతమైన ప్రాజ్ఞుని వాణి యనియు, లేదా శబ్దబ్రహ్మవిదుఁడైన పరిణతప్రజ్ఞుని వాణి యనియుఁ జెప్పికొన్నాఁడు. సంస్కృత సాహిత్యలోకమునఁ గాళిదాసుని పిమ్మట రెండవకీర్తిని సంపాదించుకొన్న యాతని ప్రకృతిపరిశీలనము మన కనుకార్యము.

తరువాతఁ జెప్పఁదగినవారు బాణుఁడు మున్నగువారు కొందఱున్నారు; సత్తు. కవికిఁగాని, రచయితకుఁగాని, సంస్కారికిఁగాని స్వీయజీవితమును ధన్యముగాఁ జేసికొనుటకు ప్రతిమానవునకును ప్రకృతిదర్శనమునకన్న వేఱొండు మార్గము భావప్రబోధమునకును, విజ్ఞానవికాసమునకును సుకరము గాదు. ఉదాత్తమతీయమైన దృష్టిగలవాఁడు ప్రకృత్యుపాసనము చేఁ గృతకృత్యుఁ డగు ననుట తథ్యము. పండితునినుండి పామరునివఱకును అంతియో ఇంతయో ప్రకృతిదర్శనము చేసికొనిగాని యానందసిద్ధిని పొందలేఁడు.

కవినిర్మితమైన కావ్యము, శిల్పినిర్మితమైన శిల్పకళ తన్నుఁ బరిశీలించు కోవిదుల కానందమును గూర్చుచుండ, ఇష్టార్థసిద్ధిని గల్పించుచుండ, విశ్వకవియైన జగదీశుని ప్రకృతికావ్యము, విశ్వశిల్పియైన విశ్వకర్మ ప్రకృతిశిల్పమును దర్శనయోజనముల నెంతటివారికిగా సంపాదింపఁగలవో యూహింపుఁడు. ఏకాంతవాసమునను, ప్రకృతివీథుల సంచారమునను తమ హృదయములోనే దివ్యభావసౌందర్యమును జూచుకొన్న మన ఋషులును, ఆచార్యులును మన కపరిచితులు కారు. ఎంతటి యుపాసనాయోగమునఁ గాఁకలదే యట్టి వాచార్యపురుషులనుండి యిట్టి శిల్పకళ వెలువడినది? ఆర్షకవుల నుండి యిట్టి భావప్రపంచములు వెల్లివిరిసినవి? జనసమ్మర్దమును వీడి నిర్మలప్రకృతిలో నడయాడు (1) భాగవతపర్వోత్సవలాంతర ప్రకృతిని బరిశీలించు రసోపాసకుఁడు తద్ద్వారమునఁ బరాప్రకృతి తత్త్వము నెఱింగికొని ప్రాకృతికంటెఁ బరుఁడును, ప్రకృత్యంతర్లీనుఁడును నగు పురుషుని సాక్షాత్కారము నంది పురుషోత్తమప్రాప్తిచే నఖండ చిద్విభూతి సాగరమున నొకతరంగమై, యీశ్వరుని యనంతలీలలలో నొక్క లీలానుభూతియై పరవశుఁ డగును.

తెనాలి రామకృష్ణుఁడు

అతని సమకాలికులు

శ్రీ నేలటూరి వెంకటరమణయ్య



తెనాలి రామకృష్ణకవి యెప్పటివాఁడు ? చిరకాలమునుండి వచ్చునై తిహ్యములందు వచింపఁబడినట్లు శ్రీ కృష్ణరాయలసభ నలంకరించిన యష్టదిగ్గజములలో నొక్కఁడా, లేక యాధునిక కవి చరిత్ర పరిశోధకులు కొందఱు తలంచునట్లు తరువాతి కాలమువాఁడా ? ఇతనిగూర్చి చెప్పఁబడు కథలు వాస్తవములా, లేక కేవలకల్పనలా ? ఈ ప్రశ్నలకు సమాధానముల నిచ్చుటకు దిగ్దంతులవంటి పండిత ప్రకాండులు యత్నము చేసి రామకృష్ణుని కాలమును స్థూలముగ నిర్ణయించియున్నారు. అట్లు మహాపండిత శిఖామణులచే నిర్ణయింపఁబడిన కాలమును దృఢపఱచి, రామకృష్ణుని జీవితచరిత్రకు సంబంధించిన వివాదాస్పదములగు సమస్యలను గొన్నిటిని సాధ్యమైనంతవఱకు తృప్తికరముగఁ దీర్చుటయే ప్రస్తుతవ్యాసముయొక్క ముఖ్యోద్దేశము. ఈయత్నము సఫలము కాక, శ్రీ మానవల్లి రామకృష్ణకవిగా రన్నట్లు "శృంగభంగమైనను విలాసభావమే" *

కాలనిర్ణయము

తెనాలి రామకృష్ణుని కాలమును నిర్ణయించుటకుఁ గడంగిన పండితులు, నాయెఱుకకు, నలుగురు కలరు. వీరియందు ప్రథమమునఁ బేర్కొనఁ దగినవారు శ్రీ గురుజాడ రామమూర్తిపంతులుగారు. వీరు 'కవిజీవితము'లను గ్రంథమున రామకృష్ణుని చరిత్రనుగూర్చి విపులముగా వ్రాసియున్నారు. ఇందాతని కాలమునుగూర్చిన చర్చ యత్యల్పము. స్థానికచరిత్రములు ౩-వ సంపుటమున సంగ్రహింపఁబడిన చింతకుంట తాలూకా కైఫీయత్తులోని యనిమెల సంగమేశ్వర దేవాలయమందలి మంగయ గుర్వరాజు దానమును దెల్పు శా. శ. ౧౪౮౬ క్రోధికృతు సంవత్సరమునాఁటి శాసనము నాధారపఱచుకొని, "కవియగు రామకృష్ణుని కాలము మన మించుమించుగా తీర్మానించవచ్చును" అని యొక్క వాక్యముతో ముగించిరి. † వీరిచే నిర్ణయింపఁబడిన కాలము సరియైనదే; కాని రామకృష్ణుని జీవితమునందలి పెక్కు విషయములను ఈకాలనిర్ణయము ననుసరించి యెట్లు సమర్థించ వీలగునో వీరు తెల్పరైరి. ఏతత్కారణమున నీశాసనసాక్ష్యము నిరసింపఁబడి యసంగతములైన యూహాపోహలనేకములు బయలువెడలుటకవకాశము కల్గెను.

రామకృష్ణుని చరిత్రకు సంబంధించిన యంశములనన్నిటిని విపులముగఁ జర్చించి యాతని కాలమును నిర్ణయించుటకుఁ బ్రయత్నించినవారలలో నగ్రగణ్యులు శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారు. రామకృష్ణుని కాలమునుగూర్చి వీరి వాస్తవాభిప్రాయ మేదియో కనుఁగొనుట సులభసాధ్యము గాదు. ఆంధ్ర కవులచరిత్రయందు మూఁడు తావుల మూఁడువిధములుగ

---

* ఉగాదిసంచిక (౧౯౧౪) పుట, ౧౦౦.

† కవిజీవితములు, పుట, ౧౯౮.

కాలనిర్ణయము చేసియున్నారు. రామమూర్తిపంతులు గారాధారముగఁ గొన్న యనిమెలశాసనము విశ్వాసపాత్రము గాదని త్రోసిపైచిరి. "కృతినాయకుఁడైన వేదాద్రికి ప్రభువగు సంగరాజుయొక్క తండ్రి గురువరాజు సదాశివరాయని రాజ్యకాలములో నుండి యాతనివలన శాలివాహనశకము ౧౪౬౫-వ సంవత్సరమునం, దనఁగా క్రీస్తుశకము ౧౫౪౩-వ సంవత్సరమునందు దేవుని నిమిత్తము నాలుగుగ్రామములను సంపాదించినట్టు మెకంజీదొరవారు సమకూర్చి చెన్నపురిలో ప్రాచ్యలిఖితపుస్తకనిలయమునం దుంచిన స్థానికచరిత్రమువలనఁ దెలియుచున్నది. మంగయకొడుకైన గురువరాజును మంగయతమ్ముని గాఁ జెప్పిన యాచరిత్రమెంత నమ్మవచ్చునో యాలోచనీయముగా నున్నది. ఈ కాలమునుబట్టి చూచినను గురువరాజుకొడుకైన సంగభూపాలుఁడు పదునాఱవ శతాబ్దముయొక్క కడపట రాజ్యముచేసినట్టే యూహింపఁ దగియున్నది. ఆతని యాశ్రితుఁ డగుటచేత రామకృష్ణ కవియు ౧౫౬౦-౮౦ సంవత్సర ప్రాంతమునుండి కవియై యుండవచ్చును." * సంశయాస్పద మని తమచే ఖండింపఁబడిన యనిమెలశాసనముపై నాధారపడియున్న యీ కాలనిర్ణయము పంతులుగారి సంపూర్ణాంగీకారమును బడసిన దని తలఁచుటకు వీలుకాదు. ఏలన, రామకృష్ణ తాతాచార్యాప్పయదీక్షి తాప్పళాచార్యుల సమకాలీనతను సూచించు గాథల నాధారము చేసుకొని వారు రామకృష్ణుని కాలము నన్యథా తీర్మానించియున్నారు. "రామకృష్ణకవి యప్పయదీక్షితులవారితోను, తిరుమల తాతాచార్యులవారితోను సమకాలికుఁ డయి చంద్రగిరి రాజగు వెంకటపతిరాయల ప్రభుత్వకాలములో నుండినవాఁ డయినట్లు కొన్ని నిదర్శనములు కనఁబడుచున్నవి." వెంకటపతి రాయలు క్రీస్తుశకము ౧౫౮౬-వ సంవత్సరమునుండి ౧౬౧౪-వ సంవత్సరము వఱకును రాజ్యము సల్పెను. తాతాచార్యులును, అప్పయదీక్షితులును వెంకటపతిరాయల కాలమున నుండిరి. కావున రామకృష్ణకవియు నాకాలమువాఁడై యుండవలయును. కృష్ణరాయని కాలమువాఁడు కాఁజాలఁడు. † మఱియొక సందర్భమున నీకవికాలము క్రీస్తుశకము ౧౬-వ శతాబ్దమని సూచించియున్నారు. అయ్యలు భాస్కరు లను కవులు రెట్టమతశాస్త్ర మను గ్రంథము నాంధ్రీకరించి మంగయగురువరాజు దౌహిత్రుఁడగు కొండ్రాజు వెంకటరాజున కంకితమిచ్చిరి. గ్రంథాంతమందలి సీసపద్య మొకటి తద్రచనాకాలము కలియుగ ప్రథమభాగము ౪౬౮౧-వ సంవత్సరమునకు సరియైన శాలివాహనశకము ౧౫౦౨ వికృతిసంవత్సర మని తెల్పుచున్నది. దీనినిబట్టియే తద్గ్రంథకర్త లిరువురును క్రీస్తుశకము ౧౫౮౦-వ సంవత్సరమున రెట్టమతశాస్త్రము నాంధ్రీకరించినట్లు విదితమగుచున్నది. ఈ కృతినాయకుని మేనమామయగు మంగయగురువరాజు పెదసంగరాజుయొక్క మంత్రియగు విరూరి వేదాద్రిమంత్రికే రామకృష్ణకవి తన పాండురంగమాహాత్మ్యము నంకితమొనర్చెఁ గావున "రామకృష్ణుని కాలమును కనుఁగొనుటకు సహితము కొంత యాధారము గానవచ్చుచున్నది" అని వ్రాసిరి. ‡ ఇట్లు వీరేశలింగము పంతులుగారు పరస్పర విరుద్ధములగు కాలనిర్ణయములను మూఁడు తెఱఁగులఁ గావించియున్నారు.

వీరేశలింగము పంతులుగారి కాలనిర్ణయమును ఖండించుచు శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు ఆంధ్రపత్రిక నైదవ సంవత్సరాది సంచికయందు 'తెనాలి కవులు' అను శీర్షిక క్రింద నొక చక్కని వ్యాసమును ప్రకటించిరి. వీరి ముఖ్యాధారములు నాలుగు: (౧) పాండురంగమాహాత్మ్యము, (౨) ఇందుమతీకల్యాణము, (౩) కామందకము, (౪) అహోబలశాసనము.

'పాండురంగమాహాత్మ్యము విరూరి వేదాద్రిమంత్రి కంకితమయ్యె'. ఇతఁడు 'మంగయ గురువరాజు కుమారుఁడగు పెదసంగభూపాలునకు వ్రాయస

* ఆంధ్రకవుల చరిత్రము, పుటలు, ౨౬౯-౭౦.

† ఆంధ్రకవుల చరిత్రము, పుటలు, ౨౬౬-౨౬౮.

‡ ఆంధ్రకవుల చరిత్రము, పుట, ౪౫౦.

కాఁడు'. 'రెట్టమత మను గ్రంథము కొండ్రాజు తిమ్మరాజు కుమారుఁడగు వెంకటాద్రికి నంకితమీఁబడి యున్నది. ఆవేంకటరాజు మంగయగురువరాజు కుమార్తె యగు పాపమాంబకుఁ బుత్రుఁడు; అనఁగా విరూరి వేదాద్రి యజమానియగు పెదసంగభూపాలునకుఁ జెల్లెలి కొడుకు'. రెట్టమతము కడపట తద్రచనాకాలమును దెల్పు సీసపద్యము పరిగణింపఁ దగినది కాదు. 'ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమున నున్న చాల్గ ప్రతులలో నొకదానిలో మాత్రము కలదు'. అన్యత్ర లభ్యమైన ప్రతులయందును కానరాదు. మఱియు, రెట్టమత కృతినాయకుఁడగు కొండ్రాజు 'వెంకటాద్రికేఁ గామందక మను రాజనీతిగ్రంథ మొకటి అంకితముగా రచింపఁబడియున్నది.' తత్కర్తలగు రామకృష్ణకవులు తామా పుస్తకమును శాలివాహనశకము ౧౫౦౭ స్వభాన్వబ్దమున రచించినట్లు గ్రంథాంతమునం దొక పద్యమున నుడివి యున్నారు. కొండ్రాజు వెంకటరాజు వెలసిన కాలము వాస్తవముగ నిదియే యని రుజువుపఱచు బలవత్తరమైన సాక్ష్యము వేఱొకటి యున్నది. శాలివాహన శకవర్షంబులు ౧౫౦౭ సంవత్సరమునకు సరియైన తారణాబ్దమున శ్రీరంగరాయదేవమహారాయలు పెనుగొండయందు పృథ్వీసామ్రాజ్యముఁ జేయుచున్న కాలమున శ్రీమదహోబల శఠకోపజియ్యంగారి కార్యకర్తలు రాచప్పగారు పై కొండ్రాజు వెంకటరాజుగారికి అహోబలస్థలమును పాడుగావించిన తురకలను వెడల నడచినందుకై కొన్ని మర్యాదల నొసఁగి గౌరవించిరి. ఈ శాసనకాలము సహితము శా. శ. ౧౫౦౭-వ సంవత్సరమే. కావున రెట్టమత కామందకకృతినాయకుఁడగు కొండ్రాజు వెంకటరాజు శా. శ. ౧౫౦౭-అనఁగా క్రీ.శ. ౧౫౮౫-వ సంవత్సరప్రాంతమున నుండెనని నిశ్చయమగుచున్నది. ఇతని 'మేనమామయగు పెద్దసంగభూపతి ౨౦ వీండ్లపూర్వమున్నను పాండురంగకృతి రచనాకాలము ౧౫౬౫ అగుచున్నది'

ఇతరములగు నాధారములను బట్టి చూచినను పైని జేసిన కాలనిర్ణయమే సరియైన దని తోఁచుచున్నది.

రామకృష్ణుని తమ్ముని మనుమఁడగు రామభద్రకవి తన ఇందుమతీకల్యాణాంతర్గత స్వవంశ కథనమునందు రామకృష్ణునికి సుదక్షిణాపరిణయకృతికర్త యను నన్నయ్యయు, శ్రీశైలమాహాత్మ్యప్రణేతయగు శ్రీగిరియను నను జులనియును, శ్రీగిరికుమారుఁ డిమ్మడి రామకృష్ణుఁ డనియును, నతని పుత్రులు వీరరాఘవ రామభద్రకవు లనియును దెల్పుచున్నాఁడు. రామకృష్ణకవి సోదరుఁడైన అన్నయ్య దన సుదక్షిణాపరిణయమును కోనేటి తిమ్మరాజు రామరాజుకడఁ బ్రధానిగ నుండిన పులిజాల సోమామాత్యునకు అంకితమిచ్చెను. 'రామరాయలను మనుమనివరుసయగు కోనేటి రామరాజు బుక్కయరామరాజునకుఁ బెద్దకుమారుని సంతతిలోఁ జేరినవాఁడును ౧౫౭౦ లకే యళియ రామరాయలకు మనుమలు కలిగినందున వీరు నాకాలము నా తనుటకు సందేహింపఁబనిలేదు. కావున సుదక్షిణాపరిణయ రచనాకాలము కూడ ౧౫౭౫ అగు చున్నది'. 'పై సందర్భములన్నియుఁ గూర్చి యూహింపఁగా రామకృష్ణకవి కృష్ణరాయల సభలో నూత్నయౌవనముఁ జెల్లించి, తిరుమలరాయలరాజ్యకాలము నకు వృద్ధుఁడై ఘటికాచలమాహాత్మ్యకృతిలోఁ జేయి వడఁకుచుండును.' *

రామలింగడే రామకృష్ణుఁడు

ఇట్లు మానవల్లి రామకృష్ణకవిగారిచే నిర్ణయింపఁబడిన కాలమే సరియైన దని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవారు సిద్ధాంతీకరించి యూహోజన్యములగు వారి యనుమానములకుఁ గొన్నింటికి స్థిరమైన పునాదిని వేసిరి. ప్రభాకరశాస్త్రులవారు నూతనముగ తమకు లభ్యపడిన యుద్భటారాధ్యచరిత్రయందలి యజ్ఞాతాంశములను బయలుపెట్టి తెనాలిరామకృష్ణుఁ డాంధ్రభోజుని యాస్థానమును గన్న అష్టదిగ్గజములయం దొక్కఁడని నిరుత్తరముగ నిర్ధరించినారు. ఉద్భటారాధ్యచరిత్రము రచించిన కవిపేరు రామలింగకవి. అతఁడు కౌండిన్యగోత్రజుఁడు. శుక్లయజుశ్శాఖీయుఁడు. తండ్రి రామయ్య. తల్లి లక్ష్మమ్మ. తెనాలిరామకృష్ణుఁడును

* ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక [౧౯౧౪] పుటలు, ౯౯-౧౦౩.

కౌండిన్యగోత్రజుఁడే. ఇతఁడును శుక్ల యజుర్వేదియే. రామలింగని తల్లిదండ్రులవలె నితని తల్లిదండ్రులును లక్ష్మమ్మ రామయనామధారులే. కావున రామలింగఁడే రామకృష్ణుఁ డనుట సంగతమగును. "ఇన్ని సరిపడి యున్నను నుద్భటచరిత్రమున రామలింగయ యని గ్రంథకర్త పేరును, పాలగుమ్మి యేలేశ్వరుఁ డని గురుని పేరును, పాండురంగమాహాత్మ్యమున రామకృష్ణుఁ డని గ్రంథకర్త పేరును, భట్టరుచిక్కాచార్యులని గురుని పేరును గానవచ్చుటయు, గద్యముల రీతులు భిన్నములుగా నుండుటయు రెండు నొక్కని పేళ్లే యనుసిద్ధాంతమునకుఁ గొంత బాధకములుగాఁ గానవచ్చును. ఈ భేదములు మతమూఅంటచే నేర్పడినవే" కాని భిన్న వ్యక్తిత్వమువలన నేర్పడినవి కావు. రామకృష్ణునే రామలింగకవి యని యర్వాచీనులగు కవులును, లక్షణగ్రంథకారులును పేర్కొనియున్నారు. మొదట నాతఁడు శైవుఁడనియు నప్పటి పేరు రామలింగఁ డనియు, వనంతరము వైష్ణవముపుచ్చుకొని రామకృష్ణుఁడని పేరును మార్చుకొనెననియుఁ బ్రతీతి గలదు. దీని కనుగుణముగ తెనాలిరామపండితుని పుత్రుఁడును, సహజశైవాచార సంపన్నుఁడును, సుదక్షిణాపరిణయకర్తయు నగు అన్నయ్య దనకు పినతాత యనియుఁ, పెదతాతయు పాండురంగాది సత్కృతులు చేసిన రామకృష్ణకవి యొక్క యనుజుఁ డనియుఁ దెనాలి రామభద్రకవి తన ఇందుమతీకల్యాణమునఁ దెల్పియున్నాఁడు. మఱియు రామలింగనివలె అన్నయ్యయుఁ బాలగుమ్మివారి శిష్యుఁ డని సుదక్షిణాపరిణయమువల్లఁ దెలియవచ్చుచున్నది.

"మనుమఁడగు రామభద్రకవి చెప్పుటచేతను, తండ్రి పేరు మొదలగునవి సరిపోవుటచేతను రామకృష్ణుఁడును, నన్నయ్యయు నన్నదమ్ములని స్పష్టపడినది. ఉద్భటచరిత్రమందుఁ గానవచ్చు రామ(లింగే)శ్వరస్వామియనుగ్రహము, పాలగుమ్మివారి శిష్యత్వము, శైవాచారము మొదలగునవి సరిపోవుటచేతను, లోకమందుఁ బారంపర్యముగా వచ్చుచున్న ప్రతీతికిఁగూడ నిర్వాహ మేర్పడుటచేతను నుద్భటారాధ్యచరిత్రకర్త యగు రామలింగయయే వైష్ణవముపుచ్చుకొని రామకృష్ణుఁడై పాండురంగమాహాత్మ్యమును రచియించినాఁడని, వారు వేఱుపురుషులు గారని నిర్ణయించుట ప్రమాణసారము కాదు."

రామలింగకవియే రామకృష్ణకవి యూరెయే నను టకు బలవత్ప్రమాణ మింకొకటి కలదు. 'శైవవైష్ణవ పురాణావళీనానార్థరచనాపటిష్ఠైకరమ్యమతిధి' అను పాండురంగమాహాత్మ్యములోని సీసపాదము రామకృష్ణుఁ డింతకో శైవపురాణకథలను రచించినట్లు సూచించుచున్నది. అది ఈ యుద్భటారాధ్యచరిత్రము కానోపు. మఱియుఁ "గొలఁదిఁ దాను శైవుఁడై యున్నప్పుడు రచియించిన యుద్భటారాధ్యచరిత్రములోని పద్యములే మార్చిమార్చకుండఁ దర్వాత వైష్ణవుఁడై రచించిన ఘటికాచలమాహాత్మ్యమున నాతఁడు చేర్చుకొన్నాఁడు." (చూ: ఉద్భ. ఆ. ౧: ౫౪, ౫౫, ౫౬, ౫౭; ఆ. ౨: ౭౭- ఘటి. ఆ. ౧: ౧౩, ౧౧, ౯, ౮, ౨౫). "మఱియు రామలింగని కాలము రామకృష్ణునికాలముతో సరిపోవుచున్నది. ఉద్భటారాధ్యచరిత్ర కొండవీటిదుర్గాధ్యక్షుఁ డయిన నాదెండ్లగోపమంత్రికడ కార్యనిర్వాహకుఁడై యుండిన యూరె దేచమంత్రి కంకితమీయఁబడెను. నాదెండ్ల గోపయ శ్రీ కృష్ణరాయల సర్వశిరఃప్రధానియైన సాళువతిమ్మరసునకు మేనల్లుఁడు. కృష్ణరాయలు క్రీ. శ. ౧౫౧౫-సంవత్సరమునఁ గొండవీటిని జయించెను. అదిమొదలు క్రీ. శ. ౧౫౨౫ వఱకు నాదెండ్లగోపమంత్రి కొండవీటి దుర్గాధిపత్యము గావించెను. క్రీ. శ. ౧౫౧౬-వ సంవత్సరమున నాతఁడు దేచమంత్రి కొక యగ్రహారము నిచ్చెను. ఇంచుమించుగా క్రీ. శ. ౧౫౨౫-వ సంవత్సరమున నుద్భటచరిత్రము కృతినందియుండును. పాండురంగమాహాత్మ్యము తరువాత రచింపఁబడెను. కృతినాయకుఁడగు విరూరి వేదాద్రిమంత్రి కందాళ అప్పలాచార్యుల శిష్యుఁడు. మంగయగురువయు పెద సంగభూపాలునికడ వ్రాయసకాఁడు. 'చిత్రభారత కృతిపతి తండ్రి పెదతండ్రులును, శైజయంతీవిలాసకర్త యగుసారంగుతమ్మకవియు నీయప్పలాచార్యుల శిష్యులు. క్రీ. శ. ౧౫౪౨ పరాభవసంవత్సరమున గండికోట ప్రభువు కందాళ అప్పలాచార్యులకు భూదానమొసఁగిన శాసనము కలదఁట. దీనినిబట్టి పాండురంగమాహాత్మ్య

రచనాకాల మించుమించుగా క్రీ.శ. ౧౫౫౦, ౧౫౬౦ అగునని తలంపవచ్చును."

మంగయగురువయ పెదసంగరాజుగూడ నాకాలమువాఁడే. ఆతని చెల్లెలికొమారుఁడగు కొండ్రాజు వెంకటరాజు శా. శ. ౧౪౦౬ అనఁగా క్రీ.శ. ౧౪౮౪ నందు వెంకటరామకృష్ణు లను కవులచేత కామందక కృతిఁ గొనెను. 'వీనినిబట్టి చూడఁగాఁ బాండురంగ మాహాత్మ్యరచనాకాలము క్రీ. శ. ౧౫౬౫ ఇంచుమించుగా నని యేర్పడుచున్నది. అనఁగా తెనాలిరామలింగకవి యించుమించుగా క్రీ.శ. ౧౫౨౫ లో ఉద్భట చరిత్రమును, మఱి ముప్పదేండ్లకుఁ బాండురంగమాహాత్మ్యమును రచించియుండు నని చెప్పనొప్పుచున్నది.*

౨

ఇంతవఱకును తెనాలి రామకృష్ణకవియొక్క కాలమును నిర్ణయింపఁగడంగిన వాఙ్మయచరిత్రపరిశోధక పండితుల యభిప్రాయములను సంగ్రహముగఁ దెలిపితిని. వీరియందు వీరేశలింగముగారి పరిశోధన యడవిని గాచిన వెన్నెల యాయెను. జలాశయమును విడిచి యెండమావుల నీరరసినట్లు చరిత్రాంశములను త్రోసిపుచ్చి గాథల నాధారపఱచుకొని వారు రామకృష్ణునికాలమును గనుఁగొనఁ గడఁగిరి. ఈగాథ లంధకారమందలి కొఱవిదయ్యములవలె మూలమూలకుఁ ద్రిప్పితుద కథ్వాన్నపుంబట్టున మాయమాయెను. రామమూర్తిపంతులుగారు వాస్తవార్థముపైఁ జేయిడియు నది మిథ్య యని వాదించువారి మాటలను త్రోసిపుచ్చ నేరక మౌనము వహించిరి. రామకృష్ణ కవిగారు వీరేశలింగము పంతులుగారి వలయందుఁ జిక్కుకొనక తప్పించుకొని యథార్థముఁగనుఁగొను మార్గమును గని పెట్టి యించుమించుగా వాస్తవ మిట్టిదని గ్రహించిరి. ప్రభాకరశాస్త్రులవారు రామకృష్ణకవిగారు సూచించిన మార్గముననే జని, యథార్థముఁ గని, తత్స్వరూప మిట్లుండు నని తెలిపిరి. వీరి పరిశోధనల మూలమున తెనాలి రామకృష్ణుఁడు కృష్ణరాయలయుగమువాఁ డని తేటతెల్లమైనది. కాని యతని కాలమును ఇంతకంటె స్పష్టముగ నెఱుంగ సాధ్య మగునని నేను తలఁచెదను. ఈ తలంపే చర్విత చర్వణ మగు నీ విషయమును మరల తడవఁ బురికొల్పినది. నాతలఁపు కేవలము భ్రమజన్యమగునో, లేక సత్యమో పరిశీలించి కనుఁగొనుటయే యీ వ్యాసముయొక్క ముఖ్యోద్దేశము.

గార్లపాటివారు తెనాలివారెవ్వరైరి?

తెనాలి రామకృష్ణుని కాలము నెఱుఁగుటకు మూలాధారము లాతని గ్రంథములే. ఇందు ముఖ్యముగ నిచ్చట పేర్కొనఁ దగినవి రెండు: (౧) ఉద్భటారాధ్యచరిత్రము, (౨) పాండురంగమాహాత్మ్యము. ఇవి గాక, వీని కుపాంగములుగ నెన్నఁదగినవి సమకాలిక గ్రంథములు. వీనియందు ప్రధానమైనవి: (౧) రెడ్డిమతశాస్త్రము, (౨) కామందకము, (౩) సుదక్షిణాపరిణయము. వీనికి వెనుక నెన్నఁదగినవి యర్వాచీనగ్రంథములు. ఇందుమతీకల్యాణ మొక్కటియే యీతరగతికిఁ జేరినది. దేహమునకు ప్రాణమువలె నీ యాధారముల కన్నిటికిని చైతన్య మొసఁగునవి శాసనములు. ఈపరికరముల సాహాయ్యముతో (తెనాలి)రామకృష్ణకవికాలమును నిర్ధరించుటకుఁ గడంగెదను.

ముఖ్యాధారములలో ప్రథమమున నెన్నఁదగినది ఉద్భటారాధ్యచరిత్రము. దీనిని రచియించిన కవి తెనాలిరామలింగయ. ఈరామలింగయయే పాండురంగకృతికర్త యగు రామకృష్ణకవి యని ప్రభాకరశాస్త్రిలవారు నిరూపించియుండుటచే మరల నా విషయ మిచ్చట ప్రస్తావింపవలసినయవసరము గాన్పించదు. ఉద్భటారాధ్యచరిత్ర కృతిపతి యగు దేచమంత్రి క్రీ. శ. ౧౫౧౫-వ సంవత్సరమునుండి ౧౫౨౫ వఱకును గొండవీటి దుర్గాధిపత్య మొనర్చిన నాదెండ్ల గోపప్రధానికిఁ గార్యనిర్వాహకుఁ డైయుండెఁ గాన వాతఁ డీ మధ్యకాలముననే యుద్భటారాధ్య చరిత్ర కృతి నందియుండు ననుట నిర్వివాదాంశము. కాని రామలింగ(కృష్ణు)ని గురించి యుద్భటారాధ్య చరిత్ర నుండి తెలియవచ్చు వృత్తాంత మింతియే యైనను ఈ

* ఉద్భటారాధ్యచరిత్రపీఠిక, పుటలు, ౧-౧౩.

పట్టున విచారింపఁదగిన విషయ మొక్కటి కలదు. తెనాలియగ్రహార పూర్వోత్తరము నించుక దడవుట యావశ్యకము. రామకృష్ణుని కాలమున నిది యగ్రహారముగ నుండెను. దీనికిఁ బాండురంగమాహాత్మ్యము సాక్షి. కాని తెనాలి యెప్పు డగ్రహార మాయెను, దాత యెవ్వఁడు, ప్రతిగృహీత యెవ్వఁడు అనునవి విచారణీయములు. ప్రభాకరశాస్త్రులవారిచే నుదాహరింపఁబడిన రామలింగేశ్వరాలయ శాసనమున "శ్రీ తెనాలి నగరే వ్యరాజయ ద్గార్లపాటిపురి రామపండితః" అని యుండుటచేత నుద్భటారాధ్యచరిత్ర కృతిసమర్పణమునకుఁ బదిరేండ్లముందు తెనాలి యగ్రహారము కాదనియు, రామపండితుని యింటిపేరు తెనాలివారు కాదనియు స్పష్టమగుచున్నది. మఱియు నుద్భటారాధ్య చరిత్రమున రామలింగఁడు స్వగృహనామమును జెప్పలేదు. కాని క్రీ. శ. ౧౫౫౦ ప్రాంతమున రామలింగని తమ్ముఁ డను నన్నయ్య విరచించిన సుదక్షిణాపరిణయమునఁ దాను తెనాలి రామపండితుని పుత్రుఁడనని చెప్పుకొనియున్నాఁడు. గార్లపాటి రామపండితుఁడే తెనాలి రామపండితుఁడనుట నిశ్చయమేని క్రీ. శ. ౧౫౧౦ - ౧౫౫౦ సంవత్సరముల మధ్య గార్లపాటివారు తెనాలివారైరని తేలుచున్నది. ఈమధ్యకాలమునఁ గలిగిన ఈ మార్పునకుఁ గారణ మేమి? "తెనాలిలో నుండుట చేతనే తెనాలివారని యింటిపే రేర్పడిన" దని ప్రభాకరశాస్త్రిగా రనుచున్నారు.* తెనాలిని అగ్రహారముగఁ బడయుటచేతనే యింటిపేరు మాఱిన దని నేను తలఁచెదను. క్రీ. శ. ౧౫౧౦-వ సంవత్సరము నాఁటి రామపండితుని శాసనమున తెనాలి యగ్రహారమని లేకపోవుటయు, విరూరి వేదాద్రిమంత్రి కంకిత మొసఁగిన పాండురంగమాహాత్మ్యమున రామకృష్ణుఁడు తాను 'తెనాల్యగ్రహార నిర్ణేత'† నని తెల్పుటయుఁ జూడ రామకృష్ణుఁడే తెనాలి యగ్రహారముగ మాఱుటకుఁ గారకుఁ డాయెనన్న యనుమానము కలుగుచున్నది. ఉద్భటారాధ్యచరిత్ర కృతిపతి యగు జేచమంత్రి రామకృష్ణునికిఁ దెనాలి నగ్రహారము నొసఁగి బహూకరించియుండును. ఇట్లు తెనాలి నగ్రహారముగ నొసఁగుటచేతనే కవి యింటిపేరు తెనాలివా రని మాఱెను.

ఉద్భటారాధ్యకృతిసమర్పణ కాలము

ప్రభాకరశాస్త్రులవారు తలఁచినట్లు ఉద్భటారాధ్యకృతిసమర్పణ 'మించుమించుగా' క్రీ. శ. ౧౫౩౫-వ సంవత్సరమున జరిగె నన్న యూహ నిర్బాధకము కాదేమో యను సంశయము కలుగుచున్నది. కృష్ణరాయల సర్వశిరఃప్రధానియగు సాళువ తిమ్మరుసు యొక్క మేనల్లుఁ డగు నాదిండ్ల గోపన క్రీ. శ. ౧౫౧౫-వ సం. నుండి ౧౫౩౫-వ సం. వఱకు కొండవీటి దుర్గాధిపత్య మొనర్చె నని యింతకు పూర్వము తెలియఁజేసియున్నాను. తన కుమారుఁ డగు తిరుమలదేవమహారాయలను విషము పెట్టి తిమ్మరుసు కుమారుఁడు తిమ్మదండనాథుఁడు చంపించె నని కలుషించి కృష్ణరాయలవారు తిమ్మరుసును, నతని బంధువులను, నాశ్రితులను స్థానభ్రష్టులను గావించి వారి సర్వస్వమును నగరఁ గలుపుకొని వారి నందరిని కారాగారనిబద్ధులఁ గావించెను. గోపమంత్రియుఁ దనవారిం బోలి స్థానభ్రష్టత్వము నందెను. ఈ యడావడియందు గోపమంత్రియొక్క కార్యనిర్వాహకుఁడు శాంతచిత్తుఁడై సుఖ మనుభవించుచు నుద్భటారాధ్యచరిత్ర కృతిఁ గొనెనని యెంచుట యుక్తముగఁ గాన్పింపదు. కావున రామలింగయ కృతిసమర్పణము తత్పూర్వమే యొనర్చె ననుట యొప్పిదము కాకపోదు. ఈతలంపు సంభావితము కాదేని ఉద్భటారాధ్యచరిత్రము క్రీ. శ. ౧౫౧౫-౧౫౩౫ సం.ల మధ్య నెప్పుడో యొకప్పుడు ప్రాయశః ౧౫౨౦-వ సం. ప్రాంతమున జేచయ యంకితము గొనెనని యెంచవచ్చును. ఉద్భటారాధ్య కృతిసమర్పణకాలమున రామలింగఁడు తరుణవయస్కుఁడైయుండిన ట్లా గ్రంథమునందే కొంత యాధారము గలదు. 'కుమారభారతి' యను

* ఉద్భ. పీఠిక-పుట, ౬.

† పాండు. ఆ. ౧-౨౩.

రామలింగని బిరుదును ఈ సందర్భమున స్మరణకుఁ దెచ్చుకొనవలయును. శాసనసాక్ష్యమును దీని కూఁత యిచ్చుచున్నది. ఉద్భటారాధ్యచరిత్ర పీఠికయందు ప్రభాకరశాస్త్రిలవారు రామలింగని యింటిపేరు మొదట గార్లపాటివా రనియుఁ, దెనాలివాసమువల్ల తరువాత తెనాలివా రని మాఱె ననియు తెల్పుచు, దీనిని ఋజువు పరచుటకుఁ దెనాలి రామలింగేశ్వరుని యాలయమందలి యొక యుత్సవ విగ్రహపీఠముపైని

"శ్రీ తెనాలినగరేశ్వరాజయ
గార్లపాటిపుర రామపండితః,
శుక్లమాఘసితపంచమీగురౌ
రామలింగమమయోత్సవాకృతిమ్."

అను శ్లోకము నుదాహరించినారు. శాస్త్రులవారు వచించునట్లు ఇందుఁ జేర్కొనఁబడిన గార్లపాటి రామపండితుఁడును, రామలింగని తండ్రి యగు రామధీమణియు నొక్కరే యగుదురేని రామలింగని తండ్రి శా. శ. ౧౪౬౩ వకు సరియైన శుక్ల వర్షమున, అనఁగా క్రీ. శ. ౧౫౪౧-వ సంవత్సరమున సజీవుఁడైయుండెనని నిశ్చయ మగుచున్నది. క్రీ. శ. ౧౫౧౧ సంవత్సరము వఱకును రామపండితుఁడు జీవితుఁడై యుండుటయు, క్రీ. శ. ౧౫౭౫ కు పూర్వము 'కుమారభారతి' బిరుదు మాఱకుండుటయును రామకృష్ణుఁ డప్పటికి పసివాఁడై యుండినట్లు సూచించుచున్నవి. ఉద్భటారాధ్య చరిత్రనుండి తత్కర్తయగు రామ (లింగ) కృష్ణుని కాలమునుగురించి తెలిసికొనఁగల దింతియే.

కాని రామకృష్ణుని యితరకావ్యము లెప్పుడు రచియింపఁబడెనో తెలిసికొనుటకు ఉద్భటారాధ్య చరిత్ర మేవిధమునను ఉపకరించదు. ఘటికాచల మాహాత్మ్యమును సంపూర్ణము గావించి కృతి నెవ్వరికేని యు నిచ్చుటకు పూర్వమే యతఁడు కాలధర్మము నందుటవల్ల నది యతని కడపటి గ్రంథమని తోఁచుచున్నది. దానిని రామకృష్ణుని మనుమఁడు ఖండోజీయను మహారాష్ట్రుని కొసఁగఁగా నాతఁడు వెంకటగిరియను కవీంద్రునిచేఁ గృత్యాదికములు వ్రాయించుకొని తన కంకితము గావించుకొనెను.

పాండురంగ కృతిసమర్పణ కాలము

ఇఁక పాండురంగమాహాత్మ్య రచనా కాలమును దెలియవలసియున్నది. దీని రామకృష్ణుఁ డెప్పుడు రచించెను, ఉద్భటారాధ్య చరిత్రకుఁ బూర్వమా, యనంతరమా యను విషయము విచార్యము. పాండురంగ మాహాత్మ్యమునఁ దద్రచనాకాలమును సూచించెడి యంశము లెవ్వియుఁ గానరావు. కాని, కృతినాయకవర్ణనసందర్భమున నుక్తములైన విషయములఁ గొన్నిటి నాధారపఱచుకొని పాండురంగకృతిసమర్పణకాలము నొకరీతిగా నిర్ణయింపవచ్చును. దీని కృతినాయకుఁడు మంగయ గురువరాజు కుమారుఁడు పెదసంగరాజు కడ వ్రాయసకాఁడగు విరూరి వేదాద్రిమంత్రి. ఈ పెదసంగరాజెవ్వఁడో, అతనికాల మెద్దియో తెల్పఁదగు సాధనము లెవ్వియు పాండురంగ మాహాత్మ్యమునఁ గానరావు. కాని యయ్యలు భాస్కరకవులచే విరచింపఁబడిన రెట్టమతశాస్త్రమువలన నాతని వృత్తాంత మొకకొంత తెలియవచ్చుచున్నది. రెట్టమత కృతిపతి యగు కొండ్రాజు వెంకట్రాజు అతనికి మేనమామ. తత్కారణమున రెట్టమతపీఠికయం దాతని పూర్వోత్తరము వర్ణింపఁబడెను. దాని నిచ్చటఁ బొందుపఱచుచున్నాను.

మ. "విదళించెన్ గరిరాడ్ధరిత్రదను భూ
విఖ్యాతమై మించు న
భ్యుదయం బంది యశంబుఁ గాంచె మహిలో
నుద్దండ విద్వేషులన్
గదనక్షోణులఁ దోలి గెల్పుసిరులం
గైపట్టెఁ గొండ్రాజు శ్రీ
పెదతిమ్మక్షితిపాలమౌళి కనకో
పృథ్వీపతుల్ దక్కరుల్.

తే-గీ. అట్టి పెదతిమ్మరాజు ధైర్యాద్రిరాజు
మంగవిభుగుర్వరాజు ననుంగుఁగూఁతు
నంగనాశిరోమణిఁ బాపసంగమాఖ్యఁ
బ్రేమ వరియించె విభవాభిరాముఁ డగుచు.

క. గుణనిధి యగు తత్కన్యా
మణిజనకున్ బోధజనకు మంజులభాషా

ఫణివరు రణవిజయార్జునుఁ
గ్రణుతింపఁ దరంబె సురవపార్థివవర్యున్.

సీ. పృథులవిక్రమశాలి పెదసంగనృపతియు
సత్యసంధుఁడు చిన్నసంగరాజు
ధీరగుణాఢ్యుండు తిమ్మభూపాలుండు
రుచిరకీర్తిధనుండు రుద్రఘనుఁడు
ప్రథనాంగణకిరీటి బసవనరేంద్రుండు
స్థిరభాగ్యనిధి పెద్దచిట్టఘనుఁడు
సింధుగాంభీర్యుండు చినచిట్టధన్యుండు
సతతగణ్యుఁడు పొట్టిసంగశౌరి

తే.గీ. కలితతేజుండు పాపసంగప్రభుండు
ననఁగఁ బరఁగిన తొమ్మండ్రు తనయవరుల
గాంచి దిగ్జయశాలి యై మించె సార
మంగరాజన్యసురవసమ్రాడ్వరుండు.

క. ఆ సురవరాజవరునకుఁ
ద్యాగసముద్రునకు నల్లుఁ డయి వెలసె ధరా
భాగధురంధరతను నా
భాగుఁడు పెదతిమ్మరాజు ప్రజలు నుతింపన్.

తే.గీ. ధీరశేఖరుఁ డా పెద్దతిమ్మరాజు
లలితగుణముల నభయుఁ డుల ప్రసిద్ధ
యైన యుల పాపసంగమాహ్వాయపత్రి
తాశిరోమణియందు ముదంబుతోడ.

చ. పరపురభంజనోగ్రుఁ డయి
భాసిలు దాసరిరాజశేఖరున్
తిరుపతిధారుణీసుఁ గుల
దీపకు వెంకటపార్థివోత్తమున్
గురుయశుఁ గృష్ణయప్రభుని
గొండలధీరుని బాహుశౌర్యగు
స్థిరు రఘునాథశౌరిఁ జిన
తిమ్మనృపాలుని గాంచె ధన్యఁడై."

ఈకొండరాజు పెద్దతిమ్మనృపాలునకు మంగయ సురవ్వరాజుపుత్రికయగు పాపసంగమయం దుద్భవించిన కుమారులలోఁ దృతీయుఁడగు వెంకటరాజే రెట్టమత శాస్త్రకృతిపతి. ఏతద్గ్రంథరచనాకాలము గ్రంథాంత మం దొక సీసపద్యమునఁ దెల్పఁబడియున్నది. కాని ఈ పద్యము గ్రంథకర్తలు వ్రాసినట్లు తోఁచదు. ఇది యొక్క వ్రాఁతప్రతియందుఁ దప్ప మఱి యెచ్చటను గానరా దని మానవల్లి రామకృష్ణకవిగారు చెప్పియున్నారుకదా.

మఱియు నీరాజు కృతిఁగొన్న వేంకటరామకృష్ణ విరచిత కామందకకావ్యము క్రీ. శ. ౧౭౬౪-వ సంవత్సరమునఁ బూర్తిసేయఁబడెనని యందలి,

మ. "రమణీయంబుగ శాలివాహశకవ
ర్షంబుల్ గతింపై సహ
స్రము పేనూఱును నాఱు నై వెలయఁగాఁ
గ్రోధిం దెనింగించి రా
ర మహిం దిమ్మయవెంకటాద్రి విభుపే
రన్ జేసృ్టిఁ గామందకీ
యము శ్రీవేంకటరామకృష్ణులు స్వభా
వప్రౌఢంబునన్ రూఢిగాన్." *

అనుపద్యమువల్ల దెలియుచున్నది. కొండ్రాజు వెంకటరాజుయొక్క సరియైనకాల మిదియే యని

---

* తంజావూరు సరస్వతీమహాలు పుస్తకభాండాగారమువారిచేఁ బ్రకటితమైన A Descriptive Catalogue of Telugu Manuscripts అను పుస్తకము, పుట, 30! లో సీసపద్య మి ట్లచ్చుయియున్నది.

మ. రమణీయంబగు శాలివాహశకవర్షంబులో వెయ్యినే
నూరును నారునై వెలయఁగా క్రోధిం దెనింగించి రా
ర మహిం దిమ్మయవెంకటాద్రి విభు పేరన్ వేడ్క గామందకీ
యము శ్రీవెంకటరామకృష్ణులు స్వభావం బొంద నారూఢిగా.

యూతని యహోబలశాసనములు రుజువుచేయుచున్నవి. ఇంకొకటి శా. శ. ౧౫౦౬ నకు సరియైన తారణ సంవత్సరమునందు శ్రీరంగదేవరాయలు పెనుగొండ దుర్గమునుండి పృథ్వీసామ్రాజ్యము నేలుచుండిన కాలమున జేశముపై నెత్తివచ్చి యహోబలస్థలమును పాడుగావించిన తురకలను వెడలవడచినందుకు సంతసించి, శతకోపజియ్యంగారు కొండ్రాజు వెంకట్రాజుగారికి అహోబలనాథుని యాలయమునఁ గొన్ని మర్యాదలు జరుగున ట్లేర్పాటుచేసిరని తెల్పుచున్నది. మఱియొకటి శా. శ. ౧౫౦౭ నకు సరియైన పార్థివ సంవత్సరమున వెంకటపతిదేవమహారాయలు పెనుగొండయందు పృథ్వీసామ్రాజ్యము పల్పుచున్నకాలమున కొండ్రాజు వెంకట్రాజుగారు అహోబలనాథునికి పాలుకు లాంఛర హోల ఆదాయము వచ్చు కావలిపన్నును దానముచేసిరని తెలియఁజేయుచున్నది. * ఈ శాసనములవల్ల కొండ్రాజు వెంకట్రాజు క్రీ. శ. ౧౫౮౪-వ సంవత్సర ప్రాంతమున నుండెవని నిశ్చయ మగుచున్నది. ఇతని మేనమామయగు గురువరాజు సంగరాజు ఇతనికంటె కొంచెము పూర్వమున నుండవచ్చును కదా! అట్లుండె ననుటకు నిదర్శనములు లేకపోలేదు. కడపజిల్లా కామలాపురంతాలూకా యనిమెలగ్రామమందు సంగమేశ్వరస్వామియాలయమున శా.శ.౧౫౧౫-వ సం.కు సరియైన నందనసంవత్సర అధికాషాఢశుద్ధ ౧౫ లు సోమవారోపరాగసమయమున, అనఁగా క్రీ. శ. ౧౫౯౩-వ సం. జూన్ నెల ౧౪ తేది బుధవారమునాఁడు గురువరాజు బసవరాజు కొమారుఁడగు గంగాధరదేవ చోడమహారాజు అనిమెలసంగమేశ్వరస్వామికిఁ జేసిన భూదానముఁ బ్రకటించు శాసన మొకటి కలదు. † గంగాధరదేవచోడుని తండ్రియైన బసవరాజు మంగయగురువరాజు పుత్రులలో మధ్యముఁడు. ఆతనికంటె పెద్దవారొ వల్వురును, చిన్నవారునల్వురును నుండినట్లు రెట్టమతమువల్ల తెలియుచున్నది. ‡ గురువరాజుకుమారులందఱియందును జ్యేష్ఠుఁడైన పెదసంగరాజు క్రీ. శ. ౧౫౫౦-వ సం. ప్రాంతమున నుండెనను నూహయందేవైపరీత్యమును లేదుకదా. ఊహయేల? తత్పూర్వమే యుండెవనిరెం శాసనములు సాక్ష్యము పల్కుచున్నవి. సదాశివదేవమహారాయలుగారు విద్యానగర వజ్రసింహాసనముపైఁ గూర్చుండి పృథ్వీసామ్రాజ్యము సేయుకాలమునఁ స్వస్తి శ్రీవిజయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౪౮౫ అగు నేటి శోభకృతునామసంవత్సర భాద్రపదశుద్ధ ౩ సోమవారమునాడు కాశ్యపసగోత్రం ఆపస్తంబసూత్రం యజుశ్శాఖాధ్యాయులైన సూర్యవంశోద్భవులైన శ్రీమన్మహామండలేశ్వర బొమ్మరాజులుంగారి పౌత్రులైన మంగరాజుగారి పుత్రులైన గురువయదేవచోడమహారాజులుంగారు తుంగభద్రాతీరమందు శ్రీవిరూపాక్షదేవుని సన్నిధిని రంగరాజు రామరాజుగారి మూలాన శ్రీ సదాశివదేవమహారాయలచేత రెండు తామ్రశాసనాలు పుచ్చుకొని.... అనిమెలసంగమేశ్వరదేవునికి ఓబుళంమయ తిరుమంమయ అనే దేవుళ్లు యిద్దరున్ను, పెద్దసంగరాజు, పింనసంగరాజు, తిరుమరాజు, రుద్రరాజు, బసవరాజు, పెదచిటిరాజు, చిదచిటిరాజు, బొజ్జసంగరాజు, పాపసంగరాజు అనే తొమ్మండ్రు కుమారులు సమీపస్థు లయివుండగాను అఘనాశిని పాపఘ్ని సంగమస్థళాన శివరాత్రిపుణ్య

ఈ క్యాటలాగును తయారుచేసినవా రన్నవిధముగా 'పద్యము లక్షణయుక్తము కాదు.' దీనిని మానవల్లి రామకృష్ణకవిగారుపై నున్నరీతిగా సంస్కరించినారు.

* Mac. Mss. 15-3-5. p. 95. తారణాబ్దమునకు సరియైన గత శకాబ్దము ౧౫౦౭ గాని ౧౫౦౬ కాదు. అట్లే పార్థివకు సరియైన శకాబ్దము ౧౫౨౭.

† Mac. 15-3-6 p. 276.

‡ రెట్టమతశాస్త్రము అ. ౧ : ౨౭.

కాలమందు సహిరణ్యోదకదానధారాపూర్వకంగా ధారపోసి యిచ్చిన గ్రామాలు." *

ఈ శాసనము మంగయగురువరాజును, నాతని తొమ్మండుగురు పుత్రులును క్రీ. శ. ౧౫౪౩-౪౪ సంవత్సరమున నుండిరని తేటతెల్లముగాఁ బల్కుచున్నది. ఇంతేకాదు. మంగయగురువరాజు ద్వితీయ పుత్రుఁడగు పినసంగరా జప్పటికే పెద్దవాఁడై నిర్వాహకుఁడై స్వయము పొత్తపినాట రాజ్యపాలన సేయుచుండెను. కడపజిల్లా రాజంపేటతాలూకా పొత్తపి గ్రామములోని గోపాలస్వామిదేవాలయమున కెదుట నున్న శిలాశాసనమున శా. శ. ౧౪౬౮ పరాభవ సం. ఆషాఢ బ. ౧ నాడు "పొత్తపిగ్రామమును శ్రీమన్మహామండలేశ్వరగురువరాజు చినసంగదేవమహారాజుల గారికి పాలించివుండగా సదాశివరాయలవారి ఆనతిని రాయలవారి ఆజ్ఞాపాలనము చేస్తావున్నటువంటి రామ రాజయ్యగారి ముదలను పొత్తపిమంగలవారు అచ్చే పన్ను నగరికానిక కట్నం అన్ని సర్వమాన్యం చేసియిచ్చి నారు" అని వ్రాసియున్నది. † ఈచినసంగరాజు కృష్ణ రాయల కాలమునఁగూడ నుండెనని మఱియొక శాస నమువల్ల తెలియుచున్నది. ఈ శాసనము జమ్మల మడుగుతాలూకా మాచుపల్లెమజరా బుక్కాయపల్లె సమీపమున నొక జొన్నచేనియందున్నది. ఇందు శక వర్షము లేదు. "ప్రమాదిసంవత్సర ఆషాఢశుద్ధ ౧౧ లు శ్రీమన్మహామండలేశ్వర గురుకూరు అవుబళదేవ మహారాజులుంగారు కడప శ్రీపతి కొండసానికి యిచ్చిన ధర్మశాసనక్రమ మెట్లన్నను మారు గురువ రాజు చినసంగరాజుగారు పాలించిన సిద్ధవటము సీమ లోని మాచుపల్లిగ్రామాన కడప తిరువెంగళనాథుని దేవరకు దాసివైన నిమిత్తము నీకు సేను మాన్యము పెట్టిన చేను-బంకంమ్మ కుంటస్థలానకు వుత్తరం గం గులపుల్లయ సుక్షేత్రకంచేను ౧౩ ముత్తుము చేసున్న యిస్తిమి" ‡ ప్రమాదినామ సంవత్సరమునకు సరియైన శకవత్సరము ౧౪౮౧. అనఁగా క్రీ.శ. ౧౫౫౯-వ సం.న మంగయగురువరాజుయొక్క రెండవకుమారుఁడగు చిన సంగరాజు సిద్ధవటసీమయందు మాచుపల్లె మొదలైన గ్రామములను పాలించుచుండెనని విశదమగుచున్నది. పెదసంగరాజుశాసన మేదియు నింతవఱకు లభించ కున్నను నతఁడు తన తమ్ముఁడగు చినసంగరాజువలెనే కడపమండలమున నెచ్చటనో క్రీ. శ. ౧౫౫౯-వ సంవత్సరమునుండియు రాజ్యపాలనము సేయుచుండె ననుట నిశ్చయము. కావున నాతని వ్రాయసకాఁడైన వికూరివేదాద్రిమంత్రి కంకితమీయఁబడిన పాండురంగమాహాత్మ్యము కృష్ణరాయలవారి రాజ్య కాలముతుదనో, తరువాత నచిరకాలమునకో విరచిత మయ్యె నని యూహించుచున్నాను. పైఁజెప్పిన శాసన ములనన్నిటిని సమకూర్చి చింతించిన నీయూహ సత్యమునకు దూరము కాఁజాలదని తలఁచెదను.

---

* Mac. Mss. 15-3-6 P. ఈశాసనపుసారాంశమునే స్థానికచరిత్రల 7-వ సంపుటమునఁ గని దీనియాధారమున రామకృష్ణుఁడు కృష్ణరాయలకాలమున నుండెనని రామమూర్తి పంతులుగారు వ్రాయఁగా, వీరేశలింగంపంతులుగారు మంగయ కొమారుఁడగు గుర్వరాజును మంగయతమ్ముఁడని చెప్పినట్టి యాచరిత్ర విశ్వాసపాత్రము కాదని గర్హించి త్రోసిపుచ్చిరి. పంతులుగారు మెకంజీపుస్తకములనే చూచియుండిన పెడత్రోవలు ద్రొక్కియుండరు.

† Mac. Mss. 15-3-45. pp. 26-27.

‡. Mac. Mss. 15-4-28 p. 28.



తుపాను

శ్రీ విశ్వనాథ శ్రీకృష్ణదేవరాయలు

తలచుకుంటే శరీర మంతా
పులకరించే జలమధ్యంలో
పంచప్రాణముల చేత బట్టుకొని
దడదడలాడే గుండెలశబ్దం
నిశ్శబ్దంలో ప్రతిధ్వనించగ
అర్ధనిమీలిత నేత్రా లన్నీ
యిష్టదైవములకు జోహారంచూ
పర దేశాలకు ప్రయాణ మైతే
దారిలోననే ముప్పు వచ్చెనని
ఆందోళనలో దిగాలుపడు
నామిత్రుల మొగాలు జూస్తూ
తుపా నంటే యిదివర కెన్నడు
పేరే యెరుగని నాకాక్షణమున
ఓడయెక్కితే చాలనుకొంటూ
బుజమెగరేసే బాల్యావస్థను
అర్థంలేనీ యానందంతో
గడపినరోజులు జ్ఞప్తికి రాగా
అప్పటికప్పుడు నాదుమనస్సుకు
తుపా నంటే యింతే నంటూ
గురువులకన్నా, యెక్కువశ్రద్ధతో
ఊహాలు వచ్చీ యుపదేశించాయ్.

తెనుగు తేటదనము



వాడుకభాష మంచి నీటివలె బహుప్రయోజనము గలది; కావ్య భాష చందదారపానకమువలె పరిమితప్రయోజనము గలది

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

తేటతెనుగునుగూర్చి కొంచెమంత తెలుపబోవుతున్నాను. ఆంధ్రద్రవిడకర్ణాటభాషలలో తెనుగుమాట ప్రసన్నమయినదిగా ఉండడంచేత 'తెనుగుతేట' అనీ, 'తేటతెనుగు' అనీ, 'దేశభాషలందు తెలుగు లెస్స' అనీ నానుడ్లు పుట్టినవి. తెనుగు కీతేటదనమూ, లెస్సతనమూ సంస్కృతప్రాకృతముల పాళ్లు సమరసముగా కలియడమువల్లనూ, ద్రవిడకర్ణాటములకంటె తెలుగుమాట మార్దవమూ, సౌలభ్యమూ కలదగుటవల్లనూ ఏర్పడ్డవి. ఈ తేటతెలుగు చచ్చుడి వాడిదగ్గరినుండి జగద్గురువుదాకా, ఉగ్గుపాలనాటినుండి ఉసురుడిగేదాకా, బాలశిశుదగ్గర్నుండి మోక్షవిద్యదాకా అన్ని జాతులలో, అన్ని దశలలో, అన్ని విద్యలలో క్షణక్షణపరిణామముతో, నవనవవికాసముతో కలకలలాడుతూ, తొలకులాడుతూ ఉన్నది. హెచ్చుకాలము లిపిరూపము పొంది నిలిచియుండనక్కరలేని సంభాషణాదులు, సవ్వటాలు, తగవులు మొదలయిన వాగ్వ్యాపారములను విడిచిపెట్టి ఎప్పటికీ లిపిరూపముపొంది కొన్ని పురుషాంతరములదాకా ఉండవలసినవి వర్తకమూ, దేశపాలనమూ, ఆచారవ్యవహారములూ, దస్తావేజులూ, రాజశాసనాలూ, దానశాసనాలూ మొదలయినవాటిలోనూ, దేశము, భాష ఉన్నంతకాలమూ ఉండవలసినవి కథలూ, కథలూ, పాటలూ, పదాల్లూ, నాటకాలూ, నానాశాస్త్రాలూ, కావ్యాలూ మొదలయిన వాటిలోనూ భాషాప్రవాహము పాయలువారి పాఱుతూ, మాఱుతూ, తేఱుతూ కావ్య

సరస్సులలో నిండార్లుగా నెలకొంటూఉంటుంది. భాష కున్న ప్రయోజనా లన్నింటిలోనూ ప్రౌఢకావ్యరచన పరమప్రయోజన మనవచ్చును. భాష పెండే క్రమపరిణామపు మెట్లలో ఉత్తమకావ్యరచన కడపటి మెట్టు. వాడుకభాష అనే ముడిసరకునుండి ఉత్తమకావ్య మనే నున్నితపు మేల్మిసరకు తయారవుతుంది. అయినా భాషాప్రయోజనము లన్నింటికీ యీ మేలిమిసరకు ఉపయోగపడదు. వాడుకభాష మంచినీటివలె బహుప్రయోజనము గలది; కావ్యభాష పంచదారపానకమువలె పరిమితప్రయోజనము గలది.

ప్రౌఢకావ్యప్రయోజన మొకటి విడనాడితే తక్కిన భాషాప్రయోజనా లన్నిటిలోనూ వాడుకభాషే వాలలాడుతూ ఉన్నది. కొందఱు సంస్కృతాంధ్రకవీశ్వరులు శాసనకావ్య మనేపేరుతో ప్రౌఢగద్యపద్యరచనలలో వెలయించినా ప్రాచీనశాసనా లెన్నో వాడుకభాషలోనే ఉన్నవి.

ఇంకా ప్రాచీనకావ్యవ్యాఖ్యానాలూ, కథలూ, శాస్త్రగ్రంథాలూ, వ్యవహార గ్రంథాలూ, దేశచరిత్రలూ చాలాచాలా వాడుకభాషలోనే ఉన్నవి. వాటి నన్నిటినీ ఉదాహరించడానికి ఇక్కడ చోటు చాలదు. శ్రీ గిడుగు రామమూర్తిపంతులుగారి గద్య చింతామణిలో చూచుకోవచ్చును. ఇంకా పద్యగంధులయిన బాలకథలు, పొడుపుకథలు, నానుడ్లు, పలుకుబళ్లు, సామెతలు, స్త్రీలపాటలూ, పదాలూ, పనిపాటులవారి పాటలూ పదాలూ, వృద్ధులవేదాంత—వైరాగ్యపుపాటలూ పదాలూ, ఎఱ్ఱిగొల్లలు, పిచ్చుకుంట్లు, జంబవారు మొదలగువారు పాడే దేశికథారచనలూ—అన్నీ వాడుకభాషలోనే ఉన్నవి. ఇవికూడా వాఙ్మయంలో చేరుతవా అని పండితులు కొందఱు పరిహసిస్తారు. వాటిరుచిని గుర్తింపగల్గడాని కొక అనుభావవిశేష ముండవలెను. ఒక్కతార్కాణ చూపుతాను. చల్లపల్లిజమీందారుగారి పట్టాభిషేకోత్సవపు రోజులలో వారి కోటలో రాత్రులు నాటకాలూ, పాటకచ్చేరీలూ, భోగమాటలూ సాగుతూఉండేవి. కోటవెలుపల మాలదాసరుల వీథినాటకాలూ, తోలుబొమ్మలాటలూ సాగుతూఉండేవి. వచ్చిన పండితులందఱూ కోటలో ఆటలూ, పాటలూ, నాటకాలూ చూడబోతూఉండేవారు. మాగురువులు చెళ్లపిళ్ల శాస్త్రులుగారు కోటవెలుపల మాలదాసర్ల వీథినాటకాలు చూడబోయేవారు. రాత్రి తా మాస్వాదించిన రసానుభవాన్ని మర్నాడు పునశ్చరణచేస్తూ, ఆనందిస్తూ వినిపించి మమ్ము ఆనందింపజేసేవారు. వారు గుర్తించి చెప్పినప్పుడే వాటిరుచి ననేకులు గ్రహింపగలిగేవారు. వా రీమధ్య పత్రికలలో వ్రాస్తూవున్న లోకాభిరామాయణములను మంచి వాడుక పలుకుబళ్లతో ముంచెత్తుతూన్నారు.

ఆంధ్రభాషలో ఆదికాలంనాటి కావ్యరచన ముడిసరకుభాషతో, దేశిచ్ఛందో రచనతో ప్రజాసామాన్యానికి సులభంగా ఉండేదనీ, అదే యిప్పటి పాటలపదాల వాడుక భాషనీ నా నమ్మకము. నన్నయభట్టారకునికి పూర్వము శాసనాలలో సీసగీతమధ్యాక్కర పద్యాలు కనబడుతూఉన్నవి. వాటిలో మధ్యాక్కరను నన్నయాదులయిన ఆదికాలపు ప్రౌఢకవులు కొందఱే కొంచెంగా పాటించినారు. ఆదికాలపు మధ్యాక్కర ఒకటి చదువుతున్నాను:

స్వస్తి నృపాంకుశాత్యంతవత్సలసత్యత్రినేత్ర
విస్తరశ్రీయుద్ధమల్లు జనవద్యవిఖ్యాతకీర్తి
ప్రస్తుతరాజాశ్రయుండు త్రిభువనాధారుండు సకల
వస్తుసమేతుండు రాజసల్కిభూవల్లభుం డర్థి.

ఇందులో కొన్ని అక్షరాలు చేర్చినా తీసివేసినా పద్యం పద్యంగానే ఉండేటట్టు రచన ఉన్నది. పఠనఫణితి తాళగతికలదిగా గోచరించడం లేదు. సంగీతరుచి గుర్తించిన తెలుగుకవులు ఈపద్యాన్ని ఎందుకు పాటించినారా అని సందేహిస్తూఉండేవాణ్ణి. అర్వాచీనకవులు దీనిని అందుకనే విడిచిపెట్టినారు కాబోలును. ఒకనాడు మాయింట్లో మా అమ్మగారు పాతకాలపు పాటలేవో పాడుతూఉండగా వింటూవున్న నాకు అందొకపాట ఫణితి చాలా ఆనందజనక మయింది. నేటి కావ్యరచనల కనుకూలింపజేసుకుందా మని గణవిభజన చేసిచూతునుకదా అది మధ్యాక్కరలక్షణముకలదయి యుంది. మధ్యాక్కర పఠనఫణితి నా కపుడు తెలియవచ్చింది. దానిమాదిరి చూపుతున్నాను:

అంతట రాములవారూ అంగన సీతను గూడీ
సంతసమందుచు వేగా స్వపురమునకు చనుదెంచీ
తమ్ములతోడను గలసీ సెమ్మది రాజ్యము లేలే
ధర్మముతో ప్రజలెల్లా తామరతంపరలైరీ.

ఇందు రెండు ఇంద్రగణాలు, ఒక సూర్యగణము, రెండు ఇంద్రగణాలు ఒక సూర్యగణము వెరసి ఆఱుగణాలు కలది ఒక చరణము. మూడవ గణం కడపట సీసచరణ దళంవలె మధ్యాక్కర చరణం మధ్యకు విరుగుతుంది. ఆదికాలపు కవులు పాటించిన సీస ద్విపదగీతపద్యములు కొంచెము మార్పులు చెందీ చెందకాకూడా స్త్రీబాలపామరాదులు పాడే పాటలలో పదాలలో కానవస్తున్నవి. స్త్రీలు పాడే శ్రావణమంగళవారంపాట సీస పద్యమే.

'శ్రావణామాసాన శుద్ధపాడ్యమినాడు మహాలక్ష్మి ముత్యాలచీర గట్టి'

అని దాని మొదటిచరణము. మఱిన్నీ ద్విపద అనే ఆదికాలపు రచన అనేక ఫణితిప్రభేదాలతో పాటలూ పదాలలో చేరిఉంది. ఒకటిరెండు ద్విపదఫణితిప్రభేదాలు చూపుచున్నాను:

ఒకరూ కట్టిన చీరా ఒకరూ కట్టారూ
ఒకరూ తొడిగిన రైకా ఒకరూ తొడగారూ
ఒకరూ పెట్టిన నగలూ ఒకరూ పెట్టారూ
వార్నీ పొసగింపా నావశమూ కాదనెనూ.

ఇది ద్విపదవికారమే.

జెన్నెలశైలనే వేలసంఖ్యలనూ
పందిళ్లూ వేయించీ పరమాపావనులూ

ఇదీ ద్విపదే. ఇట్లు ఒక ద్విపదయే పలురసము లలో పలుఫణితులలో వాడుక భాషలో పలుపాటలుగా వెలసినది.

ఆదికాలమునాటి పాటల ప్రభేదములను కొన్నింటిని పాల్కురికిసోమనాథుడు పేర్కొన్నాడు. వాటి నన్నింటినీ ఇక్కడ వివరింప కుదురదు.

సంస్కృతాంధ్రములలో ప్రౌఢభాషామయములైన భారతరామాయణాదులను చదివి తత్కథాప్రయోజనము ననుభవించేవారికంటె వాడుకభాషలో పాటలూపదాలుగా నున్న భారతరామాయణకథలను బొమ్మలాటలలో, వీథినాటకాలలో వినీ చూచీ ఆ ప్రయోజనము ననుభవించే ప్రజలు దేశంలో చాలా హెచ్చు. పైటీరున లోకసామాన్యము నకు అర్థముకాదగినదీ, తేటతెలుగనీ, దేశితెలుగనీ, జానుతెలుగనీ, అచ్చతెలుగనీ ప్రాచీనులు పలుతెరగులతో పేర్కొన్నదీ అయిన వాడుకభాషలో ఉన్న అందచందాలు వ్యాకరణంతో దిద్దితీర్చిన ప్రౌఢగ్రాంథికభాషలో పనుపడ వని ప్రాచీనులే పేర్కొన్నారు. తిరుపతిలో ౧౫,౧౬ శతాబ్దులలో ప్రఖ్యాతకవీశ్వరులై సంకీర్తనాచార్యు లనబరగిన తాళ్లపాకవారు వందలకొలది పాటలనూ, పదాలనూ వాడుకభాషలోనే రచించినారు. పాటలూపదాలలో వాడుకభాషే యుండదగినదనీ, దానిని ప్రౌఢవ్యాకరణప్రకారము దిద్దితీర్చడము పువ్వును నలిపి వాసనచూపించడంవంటిదనిన్నీ 'సంకీర్తనలక్షణ'మనే లక్షణగ్రంథంలో వా రిట్లా చెప్పారు:

పల్లవనారీస్మేచ్ఛా, దుల్లాసమనోజ్ఞబంధురోక్తులు చవులై
చెల్లున గ్రామ్యములైనను, హల్లీసకముఖ్యనాటకాదికఫణితిన్.

'జగతిఁగలచెల్లుబళ్లై, నగినగిభాషించునట్టినానుడిపలుకుల్
తగ దన రహిఁ జెడుఁ బువ్వుల, సొగసుడుగన్ బిసికికంపు చూపినభంగిన్.

ఈలక్షణంచొప్పున యక్షగానా లనే నాటక ప్రభేదాలలో ఉండే దేశిచ్ఛందో రచనావిశేషములను పేర్కొనుట కిక్కడ చోటు చాలదు. ఇంకా వాడుకభాషలో ద్విపద

లలో, కావ్యములుగా కాటమరాజుకథ, పల్నాటికథ, కుమారరాయినికథ, మరీ కొత్త తరంపదములయిన బొబ్బిలికథా, దేశింగురాజుకథా, లంకాసారథీ మొదలయిన రసవద్రచనలు ఎన్నో వున్నవి. సర్వే చేసినట్లు ఇట్టిరచనల భాషను సర్వే చేయవలెను.

దేశము నలుమూలాలా గాలించి మంచి మంచి పలుకుబళ్లనూ, కథలనూ, సామెతలనూ, పాటలనూ, పదాలనూ, వింతశబ్దజాలములనూ, సేకరించవలెను. అచ్చురాకముందు అన్నిరకాల రచనలు తాటాకులమీదా, నోటివాడుకలమీదా, నెలకొని వుండేవి. అచ్చువచ్చినతరువాత ప్రాయికముగా ప్రౌఢకావ్యరచనకే పరిపోషము రావడము చేత, పాతకాలపు దేశిరచన లెన్నో అడగారిపోజొచ్చినవి. విద్యాశాఖవారు, యూనివర్సిటీవారు, ప్రజలూ దేశీయవాఙ్మయపరిశీలనకు పనిపూనవలెను. దేశము నలుమూలల నుండి, పాఠశాలల పండితుల మూలమున, ఇంకా ఇతర భాషాభిమానుల మూలమున అధికవ్యయప్రయాసము లక్కరలేకుండానే, అక్కడక్కడనే వాఙ్మయ సర్వే జరుపవచ్చును. ఆంధ్రభాషయందచందములు సరిగా గుర్తించుటకీ సర్వే యత్యావశ్యకము.

[రేడియోప్రసంగము: ఆలిండియా రేడియో మద్రాసుకేంద్రమువారి అనుమతిన]

ఆ ప్రేమ--

శ్రీ జనమంచి కామేశ్వరరావు

పసిపాపలా నన్ను
పలుకరించిన ప్రేమ
కౌగలింతల విరిసి
కవిత నిచ్చింది ;
ప్రేమపాపట దిద్ది
కలలు శిఖలో తురిమి
నొసట కుంకుమ పెట్టి
బ్రతుకు నిచ్చింది.

★ అమరమూర్తి డాంటే ★

శ్రీ చాపరాల సత్యనారాయణరావు

ఎత్తిన జన్మ నిప్పచ్చరపు సంసారములో; ధరించినవి జీర్ణవస్త్రములు; కష్టించిన కృషి బిలబిలాక్షులు సంగ్రహించినది; జీవితము అయోమయము, అంధకారము. ఇది తొలినాటి డాంటేకవిజీవితము.

యువకుడు; ఉత్సాహముల సంపుటీకరణి; పట్టువిడువని మేధావి; చాకచక్యము గల దూరపుచూపు.

దూరదేశము అతిక్రమించి విజ్ఞానార్థము శ్రమచేసి ప్రయాణమొనర్చెను. ఎడారులు, మహానదులు, తేరిచూడరాని దుర్గమారణ్యములు ఉత్తరించినాడు. ఆహారము లేదు; ఎండిపోవు నాలుకను తడిపికొనుటకు నీటిబిందువు దొరకలేదు; కాళ్లు బొబ్బలెక్కినవి; రక్తము చిందినది; పొట్టనకనకలాడి నడుము వంగిపోయినది; నిరంకుశమైన స్వీయమానసికఆజ్ఞలను ఆచరించలేక హీనసత్వము కలదియైనది కాయము. ఒక్కమారు ఆకాశమువంక, ఒక్కమారు స్వీయకాయము వంక దృష్టిబరపినాడు. ముప్పిడిగొని హృదయములో ఏదో తుపాను చెలరేగినది. తిరిగిచూచినాడు గతించిన పథమువైపునకు. "ఇంతియేనా నీపని? యువకుడవు కాదూ? నడువు, నడువు" అని హెచ్చరించినట్లు తోచినది వాతావరణ. దానిని ఆశీర్వచనముగా గ్రహించినాడు ఉత్సాహము గంతులేసినది. ముందుకు సాగినాడు.

ఒకటి ఆరుఏళ్లు అజ్ఞాతవాసము. తల్లి, తండ్రి, హితులు, మన్నీలు అందరును తహతహపడినారు. కాని కుర్రనిజాడ తెలియరాదు.

మస్తిష్కము పెద్దది. విషయములను, విజ్ఞానమును జీర్ణించుకొనుటకు ఎడతెరపిలేక ప్రయాసపడినది. ప్రయత్నము ఫలించినది. ఒక్కనాడుకూడ స్వీయదేహసౌకర్యమునకై చింతించలేదు. అహోరాత్రములు యంత్రమువలె కృషిచేసినాడు. అగస్త్యుడు సప్తసముద్రములను త్రావినంత శక్తిని సంపాదించినాడు. గురువు అమోఘమైన ఆశీర్వచనమును ప్రసాదించినాడు. అప్పుడు తల్లి, తండ్రి, సోదరులు, హితులు, మన్నీలు— ఏకాంతవాసియైన విస్మృతజీవికి ఒక్కసారిగా స్మృతిలోనికి ప్రవేశమొనర్చిరి. ఆహా! నిర్భరానందము!!

ఇపుడు క్రొత్త మానిసి. ఆ మూర్తి వేరు, ఈమూర్తి వేరు. లోకమంతయు తన బంధువువలె కనిపించినది. లోకము తనకొరకు గాక లోకముకొరకు తాను జన్మించినట్లు కొన్నితీరులు మస్తిష్కములో పరుగెత్తినవి. గడచిన జీవితమును, గడచుచున్న జీవితమును తక్కెడలో నుంచి తూచి చూచినాడు. మహాభారమైన జీవితము ప్రాతది. నవనవలాడు జీవితము క్రొత్తది. వహ్వారే అనుకొనినాడు. తిరిగి సాగించి

నాడు ప్రయాణమును. అనాయాసముగా ఉత్తరించినాడు కష్టపథమును. స్వేచ్ఛగా స్వస్థల ప్రవేశము జరిగినది.

కుగ్రామము వదలిపోయినవాడొక మూఢుడు; జరాభారముచే క్రుంగి కృశించి జీర్ణజీవితముల గడుపు తల్లిదండ్రులను వదలి పోయినవాడొక తుంటరి యువకుడు; మలమల మాడు ఘోరపు టెండలో నాగలి దున్న లేక పారిపోయినవాడొక సోమరిపోతు; ఆకలికి అలమటించు స్వీయఉదరధాటికి ఆగలేక పరసీమలపాలయినవాడొక భీరుడు. ఆయువకుడు కాడు ఈయువకుడు. విశాల మైన హృదయము, ఆరితేరిన మానసిక పథము, ప్రసన్నమైన నుదురు, ఉత్సాహ పూరితమైన మూర్తి; కష్టమును సహించ గల లోతైన ఆలోచనతో గూడిన ఈయువ కుడు వేరు. గ్రామము హర్షించినది. తలి దండ్రులు మహానందము చెందినారు. ఆత్మ హితులు సెహబా సనినారు.

రాజకీయోద్యోగము దొరకినది. దరి ద్రము పారిపోయినది. ఆనందము, భోగము తాండవించినవి. జరిగిన కథ మరచి పోయినాడు. జరుగనున్న దానిని ఊహించ లేకపోయినాడు.

దేశము రోము. ముఖ్యపట్టణములందు ఇతని కీర్తి వ్యాపించినది. కలము పట్టినా, కత్తి పట్టినా రెంటియందును రసోన్మత్తుడే. అనుభవించునది న్యాయాధికారిపదవి.

సతత ఏకాంతము జీవితములో సహారా ఎడారివంటిది; ఫలరహితమైన ఘంచు లోయవంటిది. దారితెన్నులులేక ప్రవహించు నిష్ఫలఝరీప్రవాహమువంటిది. దృష్టిలో పడినది రూపవతి. పేరు బియాట్రిస్. ఆమెను జీవితసహకారిణిగా చేసికొనవ స్థిరసంకల్ప మేర్పడినది. కార్యమునకు భావము పితా మహుడువంటిది. భావించువరకే మానవుని శక్తిగాని, ఆతరువాత దానికి పట్ట పగ్గము లుండవు. అంత ఆత్మలో నేదో గంతువైచి నది. విశ్వప్రపంచమంతయు ఆనందమయ ముగా ప్రకాశించినది. మేఘములు దాటి శూన్యాకాశముదాక దౌడుతీసినది మాన సికతురగము.

ఆశాభంగములు జీవితములో సూర్యాస్త మయములు. కోరిన పడుచు ఎవరికో దక్కినది. జీవితమంతయు శిథిలరూపముగా కనిపించినది. పిల్లయు కవిని మనసార ప్రేమించి నది. పరస్పర రసాలవాలమైన ప్రేమ యది. కొన్ని దినములకే ఆపడుచు జీవితము చాలించినది. మన కవి ఆకారముమాత్రము లోకమునకు విశదమైయున్నది గాని జీవ మున్నట్లు ప్రస్ఫుటము కాలేదు. ఎంతో కాలము పట్టినది దానినుండి మేలుకొను టకు. బ్రతికి బయటపడినాడు. నల్లని క్రీనీడ తెరలతో కప్పబడిన రంగభూమివలె ప్రపంచ ము ఆయనకు తోచినది.

ఉద్యోగము సాగుచునేయున్నది. అతని కలముకూడ విజృంభించినది. అతని కలముచిందులతో దేశమంతయు ఉత్తేజము చెందినది. అతని తలపుగీతలు జాతీయ గీతములైనవి.

రాజకీయము వేయిపడగలు ధరించినది. భిన్నభిన్న దృక్పథములు చెలరేగినవి. రెండు భాగములైనది జాతి. ఒకభాగమునకు మన కవి అధిపతి. అయితే పార్టీ శక్తిలేనిది యైనది. అధికారము మన కవిని వదలిపోయినది. ఉద్యోగము లేదు. ప్రత్యర్థులు కవిని ఖూనీ చేయ నిశ్చయించుకొనిరి. తిరిగి అజ్ఞాతవాసము. అహా! ఏమి జీవిత విపరీతము!!

కవిని పట్టితెచ్చినవానికి నాలుగులక్షల ధనము! కవిని చిత్రవధచేసినవానికి ఇరువదిలక్షల ధనము!! కవిరక్తమును సంపాదించినవానికి పదిలక్షల ధనము!! కాని ప్రయత్నము నిష్ప్రయోజనము.

ఒక్కడే — అర్థరాత్రమందు, చీకటిలోనికి కన్ను చొచ్చుకొనిపోవదు, అంతులేని దూరము; ఆహారపానీయములులేని కాయముతో సరిహద్దులుదాటి పలాయనమైనాడు.

దేశము పరదేశము; మానసముగల మనీషి; చేయిచాపుట ఎరుగడు; చలిని బాపుకొనుటకు దుస్తులు లేవు; ప్రతినిమిషమును బాధించు మహాఘోరమైన పొట్టకు మెతుకులు లేవు; అలసిపోయినది కాయము; ఆలోచనపోదు; కర్తవ్యతామూఢ్యమేర్పడినది.

అప్పుడతడొక మహాపర్వతముపై నున్నట్లు తోచినది. తొంగి క్రిందికి చూచినపుడొక మహానది ఆ పర్వతపాదమందు ప్రవహించునట్లు కలగన్నాడు. ఆపర్వతముపై నుండి ఆనదిలోనికి కుప్పించవలసిన దేనా? ఆపర్వతముఎత్తు అతని కవసరము లేదు; ఆనదిలోతు అతని కవసరములేదు. కుప్పించుటే జీవితపరమావధి.

శరీరము జలదరించినది. అది ఎందుచేతనో, కన్నులు మూతపడినవి. కాని కవి చలించలేదు. బ్రతికి జయించవలెనని అతని ఇచ్ఛ.

ఆశ్రయించుట తప్పలేదు. దొరకిన పాలకుడు హృదయముకలవాడు. కావలసినది ఒక్కపూట ఆహారము; శరీరమును రక్షించుకొనుటకు గుడ్డలు; ఉండుటకు కొద్ది నివాసము. ఇవి కోరికలు. మంజూరుచేయబడినవి వాంఛలు.

కృశించిన శరీరము, సంతోషశూన్యమైన మోము, అరమోడ్పులైన కన్నులు, శ్రద్ధ తీసికొనబడని మూర్తిని చూచిన ప్రజలు కొంగులతో కనులద్దుకొనెడువారు. అది అతని జీవిత మచట.

పోషించు రాజు పిలిపించినాడు సభాస్థానమునకు ఒక్కనాడు. కవులు, గాయకులు, మంత్రులు సమకూడియున్నారు. ఆసభలో మన కవి తన పోషకుని ఆశ్వాసించవలె కవిత్వముతో. సభ కేతెంచినాడు కవి. నిస్పృహునివలెనున్న కవి సభాంగణము వంక ఒక్కమారు తలయెత్తి చూచినాడు. శోభనలీలలు చిందులు వేయుచున్నవి. కవిని జూచి హేళనచేసినట్లు కనిపించినది ఆసభాలంకరణ. చిన్నపోయినాడు. "రాజా! నీవు చేయు పోషణకు ఇట్టి అమర్యాద నాకు వలదు. నేనొక గతించిన జీవిని. ఇట్టి ప్రేమను నాయందు నీవు చూపుట నాకు మరణము." అని కనులు మూతపడ్డవి. సభపై తెర జారినది. నిష్క్రమణ క్రాంతిఅయినది.

వయస్సు మీరిపోయినది. శల్యములు మాత్రము మిగిలినవి. తన పడిన భంగపాటునకు ప్రతీకారము చేయలేకపోయినాడు. ఎక్కడో జన్మించినాడు, ఎక్కడో అస్తమించబోవుచున్నాడు. తుకతుక ఉడికిపోయినది ఆత్మ. తన దేశము తనకు గావించిన ఆమహాఘాతుకమును సంస్మరించినాడు. అస్థిపంజరము లో నేదో అగ్నిపర్వతము బ్రద్దలై ఉరుములు మెరుపులు మెరిసినది

శక్తి ధరించినట్లుగా కలము చేత ధరించినాడు. నిమిషములు, గంటలు గతించిపోయినవి.

కావ్యము తయారైపోయినది. ఒక్కమారు తిరిగి చదివికొనినాడు. ఆత్మ తృప్తి చెందినది అమరత్వము కవిని చెందపోయినది. చావు అతనిని బాసి పారిపోయినది. అపుడు ఫక్కున నవ్వుకొన్నాడు.

ఆ కావ్య మిది. ఒక్కరాత్రి మన కవి నిద్రపోవుచున్నాడు. ఇటలీ దేశీయులకు వాల్మీకియైన వర్జిల్ కవి తనను సమీపించి, నిద్రనుండి లేపి తీసికొనిపోయినాడు.

అవి కొన్ని విపరీతమైన లోకములు. వానిలో ప్రయాణము చేయుచున్నాడు. ముందు పరమేశ్వరుడు నడచుచున్నాడు. వెనుక వర్జిల్ కవి. ఆతరువాత మన కవి డాంటే. మొదటి లోకము మహానరకము. దేవుడు లోకములోని వింతలను, విడ్డూర్యములను కవులకు చూపించుచున్నాడు. ఎంతో గర్వముగా కవులు చూచుచున్నారు. డాంటే కవిని బాధించినవారు, డాంటేకవిని చిత్రవధచేయించ ప్రయత్నించినవారు అందరు – కవిశత్రువులందరును నరకములో యమయాతన లనుభవించుచున్నారు. కవిని చూచి వారలు తలలు వంచుకొనినారు. ఆనరకములో క్రుంకిపోయినారు. డాంటేకవిని చూడలేకపోయినారు. సిగ్గుచేత, భయముచేత, నామోషిచేత విహ్వలులైనారు. అందరివంకను కదీర చూచినాడు డాంటేకవి. తాము పడు బాధను చూచి, డాంటేకవి ఆలోకములో దేవునితో కలిసి నడచుట చూచిన ఆశత్రువులకు మానభంగమైనది. కవికి కక్ష తీరిపోయినది. చివరకు దేవుని సమీపములో పీఠ మాక్రమించినాడు. అదిఆశత్రువులకు మరింత చూపోపమిదైనది.

తుదకు కవి నెగ్గినాడు. శత్రువులు ఓడిపోయినారు. ఆ వ్యముపేరు డివైన్ కామెడీ (Divine Comedy).

ఇది ఇటలీ దేశీయుల విజ్ఞానము, కవిపూజ, వీరపూజ. ఎవనిని కూటికిని గుడ్డకును లేకుండ చేసి పరదేశముల పారదోలిరో, ఎవనిని వధించుటకు కత్తులు పదును బెట్టిరో, ఎవని రక్తమునకై తహతహపడిరో, ఎవనిని దేవశాస్త్రీయర్థమై చిత్రవధచేయు మహిమముపలెచంప నెంచిరో ఆ కవిని నేడు చేయెత్తి నమస్కరింతురు; ఇంటింటను వీరునివలె పూజింతురు. ఆంగ్ల భూమికి షేక్సుపియరువలె, భారతభూమికి కాళిదాసువలె, జర్మనీ దేశమునకు గెటీవలె, రష్యాదేశమునకు టాల్స్టాయివలె నేడు ఇటలీ దేశీయులు డాంటేకవిని స్మరించెదరు.

సాయణభాష్యపర్యాలోకనము

[ప్రతివిమర్శ]

శ్రీ జటావల్లభుల పురుషోత్తము

గత డిసెంబరుమాసపు భారతిలో శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు 'మన వ్యాఖ్యాతలూ, పాశ్చాత్యులూ పూర్తిగా తప్పుడర్థం చేసిన కొన్ని ఋక్కులు' అను శీర్షికతో వ్రాసిన వ్యాసము విచిత్రముగ నున్నది.

"అసలు ఋగ్వేదము యజ్ఞాలు చేయుమని కాని వద్దని కాని చెప్పదు." ఇది పాఠకుని తప్పుదారి కీడ్చు వాక్యము. ఋగ్వేదము యజ్ఞములను, యజ్ఞములను చేయువారినిగూర్చి గొప్ప గౌరవభావమును వెలిబుచ్చుచున్నది. ప్రథమసూక్తమే అగ్నిని స్తుతించుచు "యజ్ఞస్య పురోహితం" అని చెప్పినది. అగ్ని యజ్ఞములో ప్రధానుడుగా, ననగా ఆహవనీయముగా నున్నాడని దీని యర్థము. యజ్ఞమునకు పురోహితుడైనాడనునదియే యగ్నియొక్క గొప్ప యర్హతలలో నొకటైనపుడు, యజ్ఞము సత్కర్మ యని వేరుగ చెప్పవలెనా? అంతవరకు పోనేల? శ్రీశాస్త్రిగారుదాహరించిన

యదఙ్గదాశుషే త్వమగ్నే భద్రం కరిష్యసి
తవేత్తత్సత్యమంగిరః. (౧-౧-౬.)

అను ఋక్కులోనే యజ్ఞప్రశంస కలదు. "ఓ యగ్నీ! నీవు హవిర్దాతయైన యజమానునికొఱ కేమంగళమును చేయుచున్నావో యా మంగళము నీకే సుఖహేతు వగును" అని దీని యర్థము. అనగా "అగ్నికి హవిస్సు నిచ్చువాని కగ్ని యైశ్వర్యము నిచ్చును. ఆ యైశ్వర్యముయొక్క సహాయముచే నాతడింకను యజ్ఞములు చేయును. ఇట్లు అగ్ని యజమానున కిచ్చు నైశ్వర్యమువలన చివరకు అగ్నికే లాభము కల్గును" అని దీని తాత్పర్యము. ఋగ్వేదములో వందలకొలది వాక్యము లీధోరణిలో కలవు. ఋగ్వేద మతము యజ్ఞమతమని వీనివలన విస్పష్టముకాదా? "యజ్ఞము చేయుము" అని శాస్త్రిగారి మాటలలో చెప్పినపుడే యది యజ్ఞమత మగును గాని యిట్టి వాక్యములవలన కాదు కాబోలు! "మనమందరమును తండ్రిమాట వినవలె నని రామాయణ మెచ్చటను చెప్పుట లే" దనుట యెట్లుండునో "ఋగ్వేదము యజ్ఞము చేయుమని చెప్పుటలేదు" అనుటకూడ నట్లే యుండును. "మీరందరు తండ్రిమాట వినుడు" అని రామాయణము చెప్పుటలేదు కాని రామాయణము పితృభక్తిని బోధించుచున్నది. అట్లే ఋగ్వేదము "మీరు యజ్ఞము చేయుడు" అని మనల నుద్దేశించి చెప్పుట లేదు కాని యది యజ్ఞమును విధించుచున్నది.

"తర్వాత వచ్చిన వేదాలూ బ్రాహ్మణాలే యజ్ఞాల కనుగుణంగా ఋగ్వేదాన్ని మార్చివేయటానికి ప్రయత్నించినై...ఆ కాలపు ప్రకృతికవులు ప్రకృతిలో కనపడే దృశ్యాలను చూచి తమలో నున్న కవిత్వకళతో వాటిని చక్కగా వర్ణించారు. చతుర్థ మండలంలోని ఉషస్సూక్తం చూస్తే ఈ సంగతి బోధపడగలదు....యజ్ఞ కాండలో మునిగి తేలిన సాయణుని ఋగ్వేదము యాగాలలో ప్రయోగించే మంత్రగ్రంథంగానే కనపడింది." అని శాస్త్రిగారు వ్రాసినారు. మంత్రములలో కవిత్వ ముండుటయు, నవి యజ్ఞములలో వినియోగింపబడుటయు పరస్పర విరుద్ధము లను నభిప్రాయములో శాస్త్రిగా రున్నారు. మంత్రములు యజ్ఞములో వినియోజ్యము లని భావించినంతమాత్రమున సాయణులు మంత్రములలోని కవిత్వము నర్థము

చేసికొనలేకపోయి రనుట సాహసము. ఋగ్వేద మంత్రములు యజ్ఞములో పఠింపబడు దేవతాస్తుతులు. వానిలో నెంత కవిత్వ మున్న నేమి చిక్కు ? పైగా భక్తుడు తన్మయత్వముతో నుచ్చరించు మాటలలో కవిత్వ ముండు ననుట ప్రాచీనాధునిక సారస్వత విమర్శకు లంగీకరించిన విషయమే. మంత్రములో కవిత్వ మున్నంతమాత్రమున నది యజ్ఞములో నిషేధింపబడ వలసినదేనా ? యజ్ఞములలో వాడినంత మాత్రమున కవితాదృష్టి వదలబడినట్లేనా ? నేటి భక్తులు పాడుకొను దేవతాస్తోత్రములలోనుండు కవితా సౌందర్యము సాధారణ కావ్యములలోగూడ గన్పట్టదు కదా ! అట్టి కవిత్వమును మత ప్రయోజనమున కందులకు వాడినా ననుటలో నేమైననర్థ మున్నదా ? సాయణులు ఋగ్వేదకవిత్వమును యజ్ఞములలో వినియోగింపవలెనని తలచుటకూడ నట్లే యవిమర్శనీయము.

సాయణులు మంత్రమున కపార్థము చేసినా రనుటకు శ్రీ శాస్త్రిగారు కనిపెట్టిన యొక గొప్ప హేతువును చూడుడు : సాయణులు కర్మకాండము లో మునిగి తేలినవా రగుటయే వారి యపమార్గమునకు కారణమట ! శ్రీమాధవాచార్యులవారి జీవితము నెఱిగినవా రెవ్వరు నిట్లు వ్రాయలేరు. (శాస్త్రిగారు సాయణమాధవుల కభేదమును పాటించినారు కావున నేము నట్లే చేయుచున్నాము.) శ్రీ మాధవులు కర్మకాండలోనే మునిగి తేలిరా? బ్రహ్మానందములో మునిగి తేలలేదా? 'వేదాంతపంచదశి', 'అనుభూతి ప్రకాశిక' మున్నగు గ్రంథము లేమి తెల్పును ? రాజకీయములలో మునిగి తేలలేదా ? విజయనగరరాజ్య మేమి సాక్ష్యమిచ్చును? చరిత్రలలోను, కవిత్వములోను మునిగి తేలలేదా? 'శ్రీశంకరవిజయము' ఏమి ఋజువు చేయును? నాటికి అధమపక్షము ౫౦౦ సంవత్సరములకు పూర్వముననుండిన శ్రీ శంకరాచార్యుల జీవితచరిత్రను వ్రాయుట కెంత భావనాశక్తి యుండవలెను? ఎంతయూహా యుండవలెను? మాధవకృతము లైన వివిధ దేవతాస్తోత్రములలోని కవితాసౌందర్యము వారు కవిత్వములోగూడ మునిగి తేలిరని ఋజువు చేయదా? శ్రీ మాధవులు మునిగి తేలనిది దేనిలోను ? వారికి తెలియని విషయ మెద్ది ? ఆర్యవిజ్ఞానములో నన్ని గ్రంథములను అన్ని విషయములపైన, అంత కూలంకషప్రజ్ఞ గన్పరచు విధమున రచించినవా రింతవరకు మరొకరు పుట్టియుండలేదు. అంతకు పూర్వమునను నట్టిరచయిత మరొకడు లేడు. అట్టి యుత్తమోత్తమపండితుడు కలియుగములో జనించినను ఋషులలో పరిగణింపదగినవాడు; శంకరుని యవతారమని పారంపర్యముగ విశ్వసింపబడుచున్నాడు. శ్రీ మాధవవిద్యారణ్యులకు కర్మకాండలో మునిగి వేదము నపార్థముచేసినా డనుటకు శ్రీ మాధవాచార్యుల ప్రజ్ఞలో సహస్రాంశమైనను గ్రహింపలేకుండుటయే హేతువై యుండవలెను. శ్రీమాధవవిద్యారణ్యుల పేరు తలచుకొనుచో నేటికిని హిందువులకు గౌరవభావముతో నొడలు పులకరించు నని మాక్డానెల్ దొరగారు వ్రాసినారు. మాధవులు మన జాతికే కాక మానవజాతి కంతకును అలంకారప్రాయులు. అట్టి దివ్యపురుషులను గూర్చి మనశాస్త్రిగారు అసభ్యముగా వ్రాయుచు పైగా వారిచే "కొన్ని సూక్తాలూ, ఋక్కులూ చాలా అసభ్యంగా వ్యాఖ్యానం చేయబడ్డవి" అని నుడివినారు.

సాయణులు వేదభాష్యము వ్రాసిన పిమ్మట మరెవ్వరును వేదమునకు క్రొత్తగాథముగ నర్థము చెప్పుటకు వీలు లేదని నే ననుటలేదు. కాని యట్లు చెప్పువారు సాయణులను ఖండింపదలచినపుడు తగిన యుక్తులను దెల్పి ఖండింపవలయును. తమ యర్థమును చక్కగ సమర్థించుకొనవలెను. శాస్త్రిగారీ రెంటిలో దేనిని గూడ చేయలేదు. పైగా హేతువులుగాని హేతువులను దెల్పి యందువల్ల సాయణుడు తప్పినా డనినారు. అంగిరోఽగ్నులకు పితాపుత్రభావమును తెల్పుటలో సాయణుడు పురాణగాథను చక్కగా చిత్రించినాడని శాస్త్రిగా రనినారు. కాని సాయణులు చిత్రించిన పురాణ గాథ పురాణము లని చెప్పబడువానిలోనిది కాక ఋగ్యజుర్వేదములు రెంటిలోను కలదే యనునదియే యిచట ప్రధానమైన విషయము. ఒక గ్రంథమున కర్థము చెప్పుటలో వీలైనంతవర కాగ్రంథకర్తహృదయమున కనుకూలముగనే యర్థము చెప్ప

వలెను గాని మన కవిత్వము సందులోనికి చొప్పింప రాదు. ఋ. వే. ౫-౧౧-౬ లోను, తైత్తిరీయసంహిత ౪-౪-౪ లోనుగూడ అగ్ని యంగిరసులకు పుత్రు డెట్లైనాడో చెప్పబడినది. "అరణీయాది రహస్యస్థానములయం దున్న యగ్నిని మొట్టమొదట కనిపెట్టినవారు అంగిరసు లను మహర్షులు. వారు చాల శ్రమతో నగ్నిని కనిపెట్టినా" రని యీ మంత్రము చెప్పుచున్నది. ఈ కథ కనుగుణముగనే సాయణు లర్థము వ్రాసినారు. ఇచట కారణమైన యంగిరసులకును, కార్యమైన యగ్నికిని నభేదము పాటింపబడినది. కార్యకారణముల కభేదమును సమర్థించుటకు శాస్త్రిగారు "ఆత్మా వై పుత్రనామాసి," "ఏకేన మృత్పిండేన" నేత్యాదివాక్యముల నుదాహరించి వ్యర్థముగ శ్రమపడినారు. కార్యకారణముల కభేదము పాటించుట సాయణుల భాష్యములోనే యున్నది కదా! ఋ. వే. ౧౦-౧౦-౮ పై భాష్యము వ్రాయుచు గూడ శ్రీ సాయణులు "కార్యకారణయో రభేదోపచారాత్ అంగిరసాం ప్రకృతిభూతోఽ ప్యగ్నిః అంగిరా ఇత్యుచ్యతే" అని నుడివిరి.

తా మేదో ప్రకృతి రహస్యమును,కవితా సౌందర్యమును వేదములో కనిపెట్టినట్లు శాస్త్రిగారు వ్రాయుచున్నారు.వీరు కనిపెట్టిన ప్రకృతిరహస్యముయొక్క మహత్వమునుచూడుడు.జఠరాగ్ని శరీరస్థితి హేతువైవరసమును చేయుచున్న దట! వైద్యశాస్త్రములో నిదాన గ్రంథమును రచించిన మాధవుల కీపాటి ప్రకృతిరహస్యము తెలియలే దనుట యజ్ఞానమూలకమో, యన్యాయ్యమో కావలెను. దీనిని, దీనిని మించిన రహస్యములను మాధవు లెరిగియుండి రనుటకు వారి గ్రంథములే సాక్ష్యములు. ఇక వీరు కనిపెట్టిన కవిత్వవిశేషము: కార్యకారణముల నొకటిగనే భావించుటయట! ఇందులో నెంత గొప్ప కవిత్వ మున్నదో శాస్త్రిగారికే తెలియవలెను! ఇంతకు నీ 'కవిత్వము' సాయణుల భాష్యములో నుండనేయున్న దని పైన తెల్పియుంటిని.

శ్రీ శాస్త్రిగారు వర్ణవినిమయముచేత 'అంగి'ని 'అగ్ని'గ చేసినారు. 'అగ్ని' కారణము, 'రసము' కార్యము అనిరి. ఇట్లు వీరు 'అంగి+రస్' న కర్థము చెప్పినారు. ఈ యంగిరశ్శబ్దములో కార్యకారణములు రెండును చేర్కొనబడినవి. ఇందు మొదటిభాగమునకు స్వతస్సిద్ధముగనే యగ్ని యర్థమై యుండగా రెండవభాగమునకు కార్యకారణముల కభేదముచే అగ్ని యర్థ మగును. ఇది శాస్త్రిగారి మాటలవల్లనే తేలుచున్నది. ఇట్లు అంగిరశ్శబ్దమునకు రెండురెట్లగ్ని యగుచున్నది. ఇట్టి యద్భుత పద ప్రయోగమును శాస్త్రిగారే మెచ్చుకొనవలెను! దీనిలోని కవిత్వమునకును వారే యానందింపవలెను!

అన్నింటికంటెను వింత యేమన: స్కందస్వామి వ్యాఖ్య తమ కనుకూలముగ నున్నదని శాస్త్రిగా రను చున్నారు. స్కందస్వామి యిట్టి యర్థమును చెప్పనే లేదు. స్కందస్వామి అంగిరశ్శబ్దమున కంతకును గలిపి అగ్ని యను నర్థమును చెప్పిరి. అంగి యనగా శరీర మనియు, దానిస్థితికి హేతువైన యశితపీతరసమును చేయువాడు జఠరాగ్ని యనియు స్కందస్వామి చెప్పి నాడు. ఇది యొక దారిగా నున్నది. శాస్త్రిగారు చెప్పిన దేదారికిని పోవుటలేదు.

సాయణులుగాని, మరొకరుగాని చెప్పిన యొక యర్థమును ఖండించినా మనివనేకాని మన యర్థమునకు ఖ్యాతి రాదని యెవ్వరును తలపనక్కరలేదు. శాస్త్రిగారు అంతసారమైన యర్థమును చెప్పుచో వారు సాయణులను ఖండింపకపోయినను మనము దాని నంగీకరింపవచ్చును. వ్యాస మంతయు నిరాధారమైన ఖండనవాదముతోనే నిండి తుదకు చెప్పిన దేమియు లేనపుడు వ్యాసకర్తగారి సదుద్దేశమును శంకింపవలసి యుండును. అఙ్గిరశ్శబ్దార్థమునకు సంస్కృతభాషా మర్యాదలనుబట్టి వేయియర్థములను చెప్పవచ్చును. అట్లు చెప్పబూనుచో మన మందరము శ్రీ సాయణుల వద్ద నెందులకును బనికిరాము. చెప్పదలచినదానిలో సందర్భశుద్ధి యుండవలెను, విశేష ముండవలెను. సాయణులే మరికొన్ని స్థలములలో తమ వేద భాష్యములోనే అఙ్గిరశ్శబ్దమునకు 'హే అంగ సౌష్ఠవయుక్త' అని యర్థము వ్రాసినారు. తైత్తిరీయ సంహిత ౨-౧౧-౧ పైనను, నితరస్థలములు కొన్నిటిలోనుగూడ

సాయణులి ట్లర్థము వ్రాసిరి. అగ్ని ప్రకాశించు వాడు గావున నీ యర్థముకూడ సరసముగనే యున్నది. శ్రీశాస్త్రిగారు ఈయర్థమును బొత్తుగా నంగీకరింపని యభిప్రాయముతోనో, మరి యేహేతువుచేతనో కాని తమవ్యాసములో నీయర్థము నెత్తుకొనలేదు. వేదము వంటి యుత్కృష్టగ్రంథముపై విద్యారణ్యులవంటి మహాపురుషులు వ్రాసిన మాటలను తుడుపు పెట్టుటకు వాగ్బాహుళ్యముకంటెను హేతువాదమునే శాస్త్రి గారు హెచ్చుగ నవలంబించినచో బాగుండు నని సూచించుచున్నాను.

కరకు రెక్కలు

శ్రీ అనిశెట్టి సుబ్బారావు

కరకు రెక్కల
కాలచక్రం
కదలి పోతూంది
మనసు పొంగిన
ఆశ లన్నీ
మాటు మణిగేను
లేటలా రే
యేటిగానము
నాలకించానా
తేటి వ్రాలని
తేనెవాకల
నారగించానా
చల్లగా జా
బిల్లి నింగిని
జారిపోతూంది
శీతకన్నుల
లో తపస్సుల
నాచరించానా

తిక్కన నవ్వులు

శ్రీ ఆండ్ర శేషగిరిరావు

కవిబ్రహ్మ తాను రచియించిన నిర్వచనోత్తర రామాయణములో, భారతములో అనేక విధములైన 'నవ్వుల'ను ప్రయోగించి ఉన్నాడు.

పలువిధములైన పరిస్థితులలో పలువిధములైన 'నవ్వుల'ను ఆ కవిగ్రామణి వాడియున్నాడు. ఆ పలువిధములైన నవ్వులతో నాతడు తన పాత్రల వ్యక్తిత్వమును లెస్సగ పరిపోషించుకొనినాడు.

నిదర్శనములను పరికింపుడు. ప్రబల శత్రువు తన చేతులలో మడిసినను అర్జునుడు నవ్వడు. యుద్ధము ప్రారంభించు ప్రతిసారియు నతడు నవ్వును. ఇక ధర్మరాజుసంగతి. అతడు గంభీరముగ నుండును. కాని తఱుచు నవ్వడు. 'దుస్తరబలభాసి' ఐన భీముడు తిక్కనరచనలో 'హర్షావేశ లఘుచారిత్రుడు'. అతడు ఎప్పుడు నవ్వినను 'పెలుచ' నవ్వును. శ్రీ కృష్ణుడు అర్జునునితో సంభాషించునపుడు తఱుచు నవ్వును.

శృంగారఘట్టములందు తిక్కన స్త్రీ పాత్రలకు ప్రాయికముగా 'ఎలనవ్వు', 'అల్ల నవ్వు' మొదలయిన మృదుహాస్యములు హత్తించును. అనుశాసనికపర్వమున చతుర్థాశ్వాసమున కైకేయీ శాండిలీ సంవాదమున తిక్కన తన పాత్రచేత స్త్రీలు 'పెలుచ నవ్వరా' దని చెప్పించినాడు.

తిక్కన్నను చూచి తరువాతి తెలుగు కవులు పలువురు అతని నవ్వులను తమ కావ్యములందు చక్కగా సంతరించుకొన్నారు. ఆముక్తమాల్యదలోని అంకురిత స్మితము, కాశీఖండములోని కటికనవ్వు, ద్విపద హరిశ్చంద్రలోని మంచి వెన్నెలవంటి మందహాసము మున్నగు వానికి తిక్కన ఒరవడి పెట్టినా డనవలయును.

గౌరనమంత్రి విశేష ప్రచారములోనికి తెచ్చిన 'పకపక నవ్వు'కాని, శ్రీనాథుడు విరివిగా వాడిన 'ముసిముసి నగవు' కాని తిక్కన వాడియుండలేదు.

తిక్కన రచియించిన మహాభారతములోని పదునైదు పర్వములును, నిర్వచనోత్తర రామాయణమును తఱచి చదివినవారికి అతడు ఇరువది రకముల నవ్వులను వాడి యుండుట స్పష్టతర మగును.

ఆ ఇరువది నవ్వులు ఏవి యనిన:

౧. పిన్ననవ్వు, ౨. చిఱునవ్వు, 3. అల్లన నగవు, ౪. అలతినవ్వు, ౫. మందస్మితము, ౬. హర్ష మందస్మితము, ౭. ఉద్గత మందస్మితము, ౮. జనిత మందస్మితము, ౯. అనాదర మందస్మితము, ౧౦. కలకలనవ్వు, ౧౧. పెలుచనవ్వు, ౧౨. ఉబ్బుమిగిలిననవ్వు,

౧౩. కన్నులనవ్వు, ౧౪. కన్నుల నిప్పులు రాలు నవ్వు, ౧౫. ఎలనవ్వు, ౧౬. కినుక మునుంగు నవ్వు, ౧౭. నవ్వుగాని నవ్వు, ౧౮. ఎఱ్ఱనవ్వు, ౧౯. కటికి నవ్వు, ౨౦. కినుక నూనిన నవ్వు.

ఇందులో మొదటి తొమ్మిది చిన్న నవ్వులుగాను, ౧౦, ౧౧, ౧౨ నెంబరుగలవి పెద్ద నవ్వులుగాను, మిగిలిన ఎనిమిదియు గొప్ప నవ్వులుగాను మనము విభజింప వచ్చును.

ఈ నవ్వులలో ప్రతిఒకదానికిని తిక్కన కావ్యమున పరమ ప్రయోజన మున్నది. ఆ ప్రయోజన గ్రంథమును మఱియొకసారి ప్రస్తరింపగలను. ప్రస్తుతము పై నిచ్చిన ఇరువదిరీతుల నవ్వులకు ఒక్కొక్క ఉదాహరణమును తిక్కనరచననుండి ఇచ్చుచున్నాను.

౧. పిన్న నవ్వు

కర్ణార్జునుల ద్వంద్వయుద్ధమున—

చ. అలిగి కడంగి సూతసుతుఁ
డచ్యుతపార్థులఁ దీవ్రబాణ సం
తతులఁ బొదవం బరాక్రమకు
తూహలి యవ్విజయుండు పిన్నన
వ్వొలసి ముఖాంబుజంబునకు
నొప్పుగఁ దద్రథరథ్యకేతు సూ
తులను దదీయగాత్రమును
దూపులవెల్లి మునుంగఁ జేసినన్.
—కర్ణపర్వము: పుట౧౧౪. పద్యము ౨౭౫.

౨. చిఱునవ్వు

గాంధారి శ్రీకృష్ణునకు శాపమిచ్చుచు—

తే. అరయ దిక్కెవ్వరును లేని యగ్గలంపుఁ
గుత్సితంపుఁ దెఱంగునఁ గూలువాఁడ
విట్లు మీ వధూజనములు నేడ్చువారు
పతుల సుతులను బంధులఁ బనివి పనివి.

క. అని ఘోరంబుగఁ బలికిన
విని విపులమనస్కుఁడైన విష్ణుఁడు చిఱు న
వ్వున నానన మొప్పఁగ న
వ్వనితకు నిట్లనియె గౌరవస్తుత్యముగన్.
—స్త్రీపర్వము: పుట ౩౦౮. పద్యము ౧౬౦.

పిన్ననవ్వు, చిఱునవ్వు ఇతరకవుల రచనలలో పర్యాయపదములు కావచ్చును కాని తిక్కనరచనములో ప్రత్యేకప్రయోజనములను కలిగియున్నవి.

౩. అల్లననగవు

ఆ. కౌరవేశ్వరుండు గనుదిచ్చి దిక్కులం
గలయఁ జూచి పార్థుఁ గాంచి కడఁగి
యదరఁ జూచుటయును నమరనదీసూనుఁ
డతని కిట్టు లనియె నల్ల నగుచు.

క. ఇంత రొఱుంగవు సైన్యము
లింత వడిం దలలు చీర లెఱుఁగక మోహా
క్రాంతంబు లయ్యెఁ బని దెసఁ
గాంతేయుఁడు సొరఁడు గాని క్రౌర్యంబునకున్.
—విరాటపర్వము: పు ౧౪౫. ప ౨౧౪.

౪. అలతినవ్వు

ద్రోణుని ఐదవనాఁటి యుద్ధమున దుర్యోధనుఁడు పాండవబలమువలన చీకాకునొందిన కురుసైన్యంబును రక్షింపుమని కోర కర్ణుఁ డుబ్బి 'చూడు నా తెంపును తెంపునున్' అని బీరములు పల్కె. అది చూచి కృపాచార్యుండు అలంతినవ్వుతో 'మన ఘోషయాత్రను బడంపడి గోగ్రహణంబునందుఁ జేరుగానిన నీకు నిట్ల నుట దగు, క్రొవ్వులు దక్కుము.' అని కర్ణుని ఉపాలంభించెను.

—ద్రోణపర్వము: పుట ౨౭౭. పద్యము ౯౮.

౫. మందస్మితము

కర్ణుని ధాటికి ఓర్వలేక శిబిరము చేరిన ధర్మరాజు నేమం బరయుటకు కృష్ణార్జునులు పోయిరి. వారు

రాధేయుఁ వధించి వచ్చి రని తలంచి ధర్మరాజు డెందం బలర మందస్మితంబుతో నభినందించె.

—కర్ణపర్వము: పుట ౪౭౪. పద్యము ౨౮.

౬. హర్షమందస్మితము

తే. హర్షమందస్మితముతోడ నమ్మురారి
యపుడ హయముల మెయి వెట్టునట్లు సేసి
తటిని నీళులు ద్రావించి తడవి మగుడఁ
దెచ్చి మనమోఘులెల్లను బిచ్చలింప
సేదదీర్చను.

—ద్రోణపర్వము: పుట ౨౧౯. పద్యము ౧౬౩.

౭. ఉద్గత మందస్మితము

ద్రోణుని నాలవనాఁటి యుద్ధమున అర్జునుఁడు సైంధవుని తలఁనునిమి కురుబలముల దొడరి గెలిచినపుడు కృష్ణమూర్తి ఇట్లే కర్జునికూడ జోర్చితివయేని నాకు ప్రీతి యగుననిరి. అప్పుడు అర్జునుఁ డిట్లనును—

చ. ... ... మహాత్మ భవ
త్కరుణం బ్రతిజ్ఞ రే
న సెలపఁగంటిఁ బాండవమ
నోరథసిద్ధి భవద్దయాసమృ
ద్ధి నగుట వింతయే భవద
ధీనులకున్ విజయంబు వాఁతె నీ
వను పొనరించువారమట
భారము నీ యదిగాదె యెప్పుడున్.

అ. అనుడు నుద్గతమందస్మితాస్యుఁ డగుచు
దనుజ మర్దనుఁడు ...

—ద్రోణపర్వము: పుట ౨౬౭. పద్యము ౧౦.

౮. జనిత మందస్మితము

పాత్రల సంభాషణావసరముల ఇది పలు చోటుల వాడబడినది.

౯. అనాదర మందస్మితము

పాంచాలీ పాండవులు విరటుపాలఁ దమ మెలంగ వలయు పనుల నిశ్చయించుకొను సమయమున ధర్మనందనుఁడు ద్రుపదనందన కిట్లనిరి—

క. మన వంశంబును వృత్తం
బును వెంపును గావఁజాలు పుణ్యసతివి దు
ర్జనులగు తులువల తలఁపులు
గనుఁగొని యేమఱక మెలఁగఁ గావలయుఁజుమీ.

వ. అనిన విని యాజ్ఞసేని యనాదర మందస్మిత సుందరవదనారవింద యయి 'గౌరవభారం బెడలంగనీక పాతివ్రత్యాచారము మై వర్తింతురు సైరంధ్రీజాతివారు' అన్నది.

—విరాటపర్వము: పుట ౧౨. పద్యము ౧౧౧.

తిక్కనయొక్క ఈ అనాదర మందస్మితమునే ఊతగా గొని శ్రీనాథుడు శృంగారనైషధములో "తొయ్యాంబుజాక్షీ యక్షిభ్రూవిక్షేప విభ్రమంబున ననాదరంబు దెల్పిన" దనినాడు.

౧౦. కలకల నవ్వు

ద్రోణుఁడు, భీష్ముఁడు మొదలగు పూజార్హుల 'మాన్యులఁ జంపుట మగపాడి గాదు' అని అర్జునుఁడు 'ఖండనంబు సేయ కుందువాఁడ' ... ... అనిన విని కలకల నవ్వి నారాయణుండు వరున కిట్లనిరి—

చ. వగవఁగ నేమియుం దగని
వారికి నై హృదయంబు గుందఁగా
వగచెదు బుద్ధి మాటలును
వాలిరి నాడెదు నీవు పండితుల్
వగతురె యున్నవారికి న
వశ్య విధేయతఁ జన్నవారికిం
దగు వగ లెల్లఁ జిత్తము ప్ర
దీప్తవివేకమయత్వ మొందినన్.

—భీష్మపర్వము: పుట ౨౩. పద్యము ౧౪౫.

౧౧. వెలుచనవ్వు

తన గదాదండమునఁ దొడలు విరిగిపడిన దుర్యోధనుని చూచి భీముండు 'వెలుచనవ్వి' తన వారిని నాలోకించి,

ఆ. శంక లేక కడఁగి సభ కట్లు పాంచాలి
నంటరానిదాని నొంటిచీర

తోన యున్న సాధ్వి వేసలి వట్టి యీ
డ్పించినతనిఁ జూడుఁ డంచుఁ బొదలి.

—శల్యపర్వము: పుట ౨౦౭. పద్యము ౨౮౨.

౧౨. ఉబ్బు మిగిలిన నవ్వు

ద్రోణుని నాలవనాఁటి యుద్ధమున కురుకుమారుల శేపురఁ గూల్చిన భీము నొప్పించుటకై కర్ణుఁడు—

ఆ. కడిసి దెబ్బ దేను కాండంబు లాతని
మేనఁ బఱపి యుబ్బు మిగిలి నవ్వె.

—ద్రోణపర్వము: పుట ౨౫౨. పద్యము ౨౧౩.

౧౩. కన్నులనవ్వు

క. వెన్నమునుఁగఁ దివియఁగ లే
కున్నను ద్రావఁ దనుసీశు లాడివివహయముల్
నిన్న గెలిపెంచు ననవుడుఁ
గన్నుల నగి యర్జునుండు గల విపె యనుచున్.

—ద్రోణపర్వము: పుట ౨౧౯. పద్యము ౧౬౨.

౧౪. కన్నుల నిప్పులు రాలు నవ్వు

భీష్ముని చతుర్థ దివసయుద్ధమున దుర్యోధనుఁడు

ఉ. తమ్ములు పీఁగినం బతి యు
దగ్రత భీము నెదిర్చి యార్చుచుం
దొమ్మిది యమ్ములం దనువు
దూఁటులు సేసిన నాతఁ డిల్చి చే
గమ్మ రథమ్ముపై కరిగి
కన్నుల నిప్పులు రాల నవ్వి యు
క్కుమ్మడి నాతఁ జేసె నృపు
నుగ్రగతిం బది నారసంబులన్.

—భీష్మపర్వము: పుట ౫౭. పద్యము ౬౩౨.

అమానుషగదాశక్తి సముద్దాముఁ డగు భీమునకు ఈ నవ్వు ఎంతయు సముచితమై యున్నది కదా!

౧౫. ఎలనవ్వు

శల్యుఁడు ధర్మరాజుల యుద్ధము—

చ. బరవస మొప్ప మద్రపతి
పాండవముఖ్యునివైఁదఁ గాండముల్
గురిసిన నాన్నృపాలుఁడు న
కుంఠితుఁడై పదునాల్గు తూపుల
న్నరపతి మేనఁ గ్రుచ్చి యెల
నవ్వున నొప్పిన నమ్మహీశు పై
గురసున నాకె సారథిఁ
జొక్క సముజ్జ్వలబాణ మేసెనన్.

—శల్యపర్వము: పుట ౧౪౭. పద్యము ౧౭౬.

౧౬. కినుకమునుంగు నవ్వు

ద్రోణాచార్యుని రెండవనాఁటి యుద్ధమున భగదత్తుఁడు సుప్రతీక మను ఏనుఁగును బంపి పాండవ సైన్యంబులం గలంచుచుండిన వానిపై అర్జునుండు ఎత్తి పోవుచుండ సుశర్మ అడ్డువచ్చెను. అర్జునానుమతిని కృష్ణుండు తేరు మరల్చెను. అప్పుడు—

చ. ... ...
... మోహమునం
గినుక మునుంగునవ్వొలయఁ
గ్రీడి త్రిగర్తుని చాప దండ కే
తనములు ద్రుంచి ... ...
... యా
తని నవ లీల నొంచిన న
తండు వెసం బడి మూర్ఛవోయెను...

—ద్రోణపర్వము: పుట ౧౪౯. పద్యము ౩౪౪.

కినుకనూనిన నవ్వునకును ఈ నవ్వునకును ఉన్న భేదము గమనింపదగినది. ఇక్కడి నవ్వు కినుకలో మునిగిపోయినది.

౧౭. నవ్వుగాని నవ్వు

ద్రోణుని మూఁడవనాఁటి యుద్ధమున పద్మవ్యూహంబు భేదించుకొనిపోయి అభిమన్యుఁడు కురుసైన్యంబును పీనుఁగుపెంటలు సేసిన నవ్వాఁడ క్కుమారు నాలోకించి వికాస భాసిత వదనుం డగుచు గురుండు గురుపతి నెఱుఁగుదాఁకఁ బలుకవలయు నను తలంపున నతండు వినుచుండం గృపాచార్యుతో నిట్లనియె—

ఉ. తమ్ములు నన్నలుం జెలులుఁ
దండ్రులు మామలు భృత్యులుం బ్రమో

దమ్మునఁ దేల నిట్లు వడిఁ
దాఁకెదు నే విజయాత్మజుండు ఘో
టమ్ములఁ గుంజరమ్ములు బ
డల్పడఁ దేరులు నుగ్గుగాఁగ నా
నమ్మిన యోధవీరులు వి
నాశము భంగము నొంద నొక్కఁడున్.

ఆ. అనిన పలుకఁ బాటి యతిదీనమగు నాన
నమున నవ్వుగాని నవ్వు నెఱయ
సౌమదత్తి కర్ణ శల్యాదులగు యోధ
జనులతోడ నిట్టు లనియె విభుఁడు.

—ద్రోణపర్వము: పుట ౧౩౩. పద్యము ౪౪.

దుర్యోధనుని 'వెలరువారునట్టి వగ'కు తగిన నవ్వే కదా ఇది. అతడు నవ్వినాడు. కాని అది నవ్వు అనిపించుకొనదు. కావుననే లోకజ్ఞుడగు తిక్కన దానిని నవ్వుగానినవ్వు అన్నాడు.

౧౮. ఎఱ్ఱ నవ్వు

ద్రోణుని మూఁడవనాఁటి యుద్ధమున పద్మవ్యూహము భేదించుకొని పోవుచున్న అభిమన్యుని కర్ణుఁడు కదిసిన అతని—

తే. ......భుజవీర్య శౌర్య విశేషభంగి
సరకు గొనక యబ్బాలుండు సమదలీలఁ
జెనఁగ నయ్యంగరాజు డస్సిన నెఱింగి
యతనితమ్ముఁ డయ్యర్జునసుతునిఁ దాఁకె.

చ. హయములమీఁద సూతుపయి
నాతని యంగములందు నస్త్ర సం
చయ మునెకించినం గమల
చారుముఖంబున నెఱ్ఱనవ్వు చె
న్నయి విలసిల్ల భల్లమున
నన్నరసూనుఁడు ద్రుంచె విద్విష
ద్భయద విలాస బాహు సము
దగ్రత వాని శిరంబు గ్రక్కునన్.

—ద్రోణపర్వము: పుట ౧౬౩. పద్యము ౫౪.

కవిచమత్కారమువలన నవ్వుకు రంగు హత్తింపబడినది. ఈ రంగునవ్వు ద్రోణపర్వములోననే కాకుండ అశ్వమేధపర్వములో గూడ మనకు దొరకుచున్నది, చూడుడు:

ధర్మజుం డశ్వమేధదీక్షం బూని పుడమిఁ దిరుగ విడచిన హయమును బట్టిన త్రిగర్త దేశాధిపతులను అర్జునుఁడు—

చ. పలవరు పొంపడంగ నిలు
వంబడ కేపున సూర్యవర్మ య
బ్బలియునిమీఁదఁ గ్రూరశర
పంక్తి నిగిడ్చినఁ ద్రుంచెఁ జెప్పయ
మ్ములనది యెఱ్ఱనవ్వు తన
మోమున తమ్మికి లేఁతయెండయై
చెలువము చెన్ను వింతలుగఁ
జేయఁగ నా విజయుండు భూవరా!

—అశ్వమేధపర్వము: పుట ౨౬౮. పద్యము ౮.

చూడ్కికి ఎఱ్ఱరంగు హత్తించి ఎఱ్ఱని చూడ్కి అనుట కవులకు పరిపాటి విషయము. నవ్వుకు ఎఱ్ఱరంగు హత్తించి ఎఱ్ఱనవ్వు అని వర్ణించుట భవ్య కవితావేశుడైన తిక్కనకు చెల్లిన విషయము.

౧౯. కటికి నవ్వు

ధర్మరాజువలన అభిమన్యుని మరణము విని అర్జునుఁడు కోలఁదిగడరాని దుఃఖమున పొగిలి—

ఆ. అవుడుగఱచి యెఱ్ఱనగు నాననంబుతో
బొమలు ముడిచి చెమట వొడమ మేను
కంప మొందఁ గనలు గదిరినకటికిన
వ్వెసక మెసఁగ నన్న కిట్టు లనియె.

మ. వినుఁడీ నాదు ప్రతిజ్ఞ నీవు నిఖిలో
ర్వీనాథులున్ సింధురా
జు నకల్యంబును నెల్లి సంపుదు భయ
స్థుండై నినుం జొచ్చినన్

వనజాక్షుఁ గౌ శరణంబు వేఁడినను గ
ర్వంబేది నన్నుం దగం
గనినం బోరు దొఱంగి పోయిన నెఱుం
గం గాని సత్యవ్రతా.


—ద్రోణపర్వము: పుట ౨౨౮. పద్యము ౨౨౫.

అభిమన్యు మరణకారణమున ఉదయము నొంది సైంధవమరణము సిద్ధిగాగల నవ్వ కటికినవ్వుగాక మఱియొకటి ఎట్లగును? ఈ కటికినవ్వ ఒక మరణమువలన మఱియొక మరణముకొఱకు పొడమిన నవ్వు. శ్రీనాథుడు కాశీఖండమున దీనిని వాడియున్నాడు.

౨౦. కినుకనూనిన నవ్వు

ద్రోణుని శాల్గవనాఁటి యుద్ధమున వృషసేనుండు లోనగు సెనమండ్రురథికు లొక్కపెట్ట పెల్లేసిన నర్జునుండు 'కినుక నూనిన నవ్వు రౌద్రరసంబు నలంకరింప' వారిని అందఱిని నిలువరించె.

ఇవికాక లేతనవ్వు, కొండొకనవ్వు, రోషకలితమగు హాసము మున్నగు ఇతరము లగునవ్వులును తిక్కనరచనములో నున్నవి. అవి అన్నియు విపులముగ విమర్శనీయములై ఉన్నవి.



సంహిత - సంధి

శ్రీ వక్కలంక శ్రీనివాసరావు

సంస్కృత భాష లో శ్లోకమున రెండేసి చరణము లొక్కొక్క ఖండముగ నంగీకరింపఁబడెను. దీని కర్ధర్చ మని పేరు. అనఁగాఁ జతుర్థచరణాంతము నందువలెనే యర్ధర్చాంతమునందును (ద్వితీయచరణాంతమునను) బూర్ణ విచ్ఛేద ముండవలయును. కాన చతుర్థ చరణాంతమును శ్లోకాంతముతో నావలి శ్లోకపుఁ బ్రథమచరణమున కె ట్లేకసమాస ముండరాదో, అట్లే ద్వితీయ తృతీయ చరణముల కును నేకసమాస ముండరాదు. తుదకు, మాలికలందు సైతము రెండేసి చరణములకే యేకసమాస ముండవచ్చును. ఆ రెండేసి చరణములలో సైతము పాదాంతముననే కాక పాదమధ్యమునందును నియమితస్థానములలో పదచ్ఛేద మగుచుండవలెను. పదమధ్య పదావసానముగాని, పదమధ్యయతిస్థానముగాని యుండరాదు.

సంహిత, సంస్కృతమున, నేకపదమునందును, సమాసమునందును మాత్రమే నియతము; వాక్యమధ్యమున నైచ్ఛికము. సంస్కృతమున సంహితను వివక్షించి నపుడే సంధికార్యములు గల్గును గాన సమానపదమునందును, సమాసపదమునందును మాత్రమే సంధికార్యములు నియతములు. వాక్యమధ్యసంధి వైవక్షికము. కాని, శ్లోకములలో నర్ధర్చలందుమాత్రము వాక్యమధ్యమైనను, వాక్యావసానమైనను సంహిత నిత్యమనియు, నచటి సంధికార్యములు నియతము లనియు సంస్కృతా లంకారికుల సిద్ధాంతము. కాఁగా, గద్యలో వాక్యాంతమందును, వాక్యమధ్యము నందును సంధికార్యములు చేసినను జేయవచ్చును; చేయకున్నను జేయకపోవచ్చును. శ్లోకములం దర్ధర్చాంతమున సంధి చేయకేరాదు. ఇంక, వాక్యమధ్యమున సంధి వివక్షించినపుడును పాక్షికసంధిస్థలములందును సంధి జరుగకుండుట తటస్థించును. పై విధముగ సంహిత వివక్షింపనప్పటి సంధ్యభావస్థలములందును వ్యంజనవ్యవధానములేని స్వరద్వయము నిల్చుచుండుట కలుగవచ్చును. అట్టి స్వరద్వయము నట్లే పలుకవలసినదే కాని వాని నడుమ నుచ్చారణ సౌకర్యార్థముగ నేదని వ్యంజనము నిల్పు సంప్రదాయము సంస్కృతమున లేదు. కాఁగాఁ బైరీతిని శాస్త్రసమ్మతమే యైన వ్యంజనవ్యవధానము లేని స్వరద్వయస్థితి యసకృదావృత్తిగా శ్లోకములలో నుండరాదని యాలంకారికులు సిద్ధాంతీకరించిరి. కాఁగా నట్టి యసకృదావృత్తి యందును, శాస్త్రసమ్మతముగాని విసంధియందును విసంధి దోషమును సంస్కృతా లంకారికు లుదాహరించుచుందురు.

ప్రాకృతమున నుద్వృత్తస్వరము వచ్చినపుడు (సమాన పదమున వ్యంజనము లోపింపఁగా మిగులు స్వర ముద్వృత్తస్వరము) హ్రస్వాకారద్వయ మధ్యమున మాత్రము యకారము నిల్చునని త్రివిక్రముఁడును, "అ, ఆ" అనువానికిఁ దర్వాత

ఋయచ్చువచ్చినను యకారము నిల్చునని దండుఁడును జెప్పెను. కాని, యిదియుఁ ప్రాచీనవరరుచ్యాది సమ్మతము కాదు.

తమిళభాషలో సంహితలోని స్వరముల నడుమ నుచ్చారణ సౌకర్యార్థముగ "య,వ" లు నిల్చునుగాని, యవి నియతములు కావని తొల్కాప్పియరే చెప్పియున్నాఁడు.

కర్ణాటమునందు సంధిలేని యచ్చుల నడుమ "య,వ" లు నిల్చునుగాని యట్లు నిలువరాని స్థలములును అనేకములు గలవని కర్ణాటవైయాకరణులు చెప్పియున్నారు. కాఁగా నట్టియెడల నుచ్చారణ సౌకర్యార్థక వ్యంజన వ్యవధానము లేని స్వరములను సంస్కృత ప్రాకృతములందువలెనే యుచ్చరింపవలసినదే.

యడాగమము:— ఈ విషయమునఁ దెనుఁగుమార్గము చాల భిన్నము. తెనుఁగునఁ బద్యములం దర్ధర్చనియమము లేదు. నాల్గుచరణములకును నేకసమాస ముండవచ్చును. మాలికలయం దెల్లపాదములకును నేకసమాసమును గూర్చవచ్చును. మాలికలుకాని పద్యములలో మాత్రము పద్యద్వయమున నేకసమాస ముండరాదు. చతుర్థ చరణముతో సమాసము ముగిసిపోవలెను. అట్లే సంధికార్యములును బద్యద్వయమధ్యమున జరుపరాదు. కాని, పద్యమునం దెల్లయెడలను, ననఁగాఁ బాదాంతములందును నియతముగా సంధికార్యములను జరుపకతీరదు. పాదమధ్యమున విశ్రమస్థానములందు వర్ణసాబాల్యయతినే యుంచవచ్చునుగాని పదవిచ్ఛేదయతి నుంచనక్కరలేదు. గద్యములలోను, వాక్యమధ్యమునను, సంహితావివక్షయు, సంధికార్యములును నియతములే యైయుండును. గద్యమునను, వాక్యాంతమునను ఆ రెండిటిని మానిన మానవచ్చును. పద్యములలో వాక్యాంతమయినను పాదమధ్యమున సంహితా సంధి కార్యములు నియతములు. వీనిలోఁ బాదాంతమందు వాక్యాంత మగునపుడుమాత్రమే సంహితా సంధికార్యముల నుపేక్షించిన నుపేక్షింపవచ్చును. వాక్యాంతము కానపుడు, పాదాంతమైనను సంహితా సంధికార్యములు నియతములే. ఇఁక నట్లు పద్య గద్యములందును సంభవించెడి సంహితలలోని స్వరములకు సంధిలేని చోటులే తెల్గున నధికముగా నుండును. కాని యట్లు సంధి కానపుడుమాత్ర మా స్వరముల నుచ్చారణ సౌకర్యార్థకమగు యకారవ్యంజనవ్యవధానము లేక పలుకరాదు. పాదాంత స్వరములకుఁ బరపాదాది స్వరములు పరమగునపుడు సైతము (పరరూప) సంధి జరుగనపుడు, వాని నడుమ నుచ్చారణ సౌకర్యార్థకమగు యకారము నిల్పితీర వలెను. అట్టి పాదాంతమందు వాక్యాంత మయ్యెనేని, సంధికివలెనే యడాగమమును సైతము మానిన మానవచ్చును. గద్యములందును నట్లే రెండు వాక్యముల నడుమ మాత్రము సంధివలెనే యడాగమముసైత మైచ్ఛికము కావచ్చును. ఆధునికులు కొందఱు గద్యములలోని పదములనడుమ స్వరసంధిని, సరళాదేశాది సంధులను, యడాగమమును, ద్రుతస్థితిని ఉపేక్షించినను ఉపేక్షింపవచ్చునని తలఁచుచున్నారు గాని యిది లాక్షణిక మహాకవి సమ్మతము కాదు.

సీరియల్ నాటకము :

రజరాజు



శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

మూడో రంగం

రత్నాంగి నగరిలో విశాల మైన వొక నడవ.

అంతటా రత్నకంబళీ పరిచివున్నది.

పార్వతీతపశ్చర్య, గంగావతరణమూ, కుమార క్రీడలూ, కిరాతార్జునీయమూ, శివతాండవమూ, మార్కండేయరక్షణమూ, కామదహనమూ, వీరభద్రావిర్భావమూ — ఇలాంటి శివలీలాచిత్రాలతో గోడలన్నీ నిండి వున్నాయి.

కంబళీమీద, అక్కడక్కడ, ఎత్తయిన చక్కని పీటలూ, వాటిమీద నటరాజవిగ్రహాలూ, కుమారవిగ్రహాలూ, గణపతిప్రతిమలూ, నందికేశ్వరవిగ్రహాలూ, మధ్యమధ్య పూలచెట్లకుండ్లూ చక్కగా అమర్చి వున్నాయి.

వసారాలో మంజూరికి వేలాడుతూ వున్న పంజరంలో మైనగోరువంక ముద్దుముద్దుగా పలుకుతోంది.

ఒకచోట, గోడకి చేర్చి వున్న శాలీసుని ఆనుకుని రత్నాంగి పరుపుమీద కూచుని వుంది.

ఆమె యెదట, కుడిపక్కగా, సారంగధరుడూ, అతనికి కొంచెం దూరంగా సుబుద్ధీ చేతులు కట్టుకుని అలాంటి ఆసనాలమీదే కూచుని వున్నారు.

ఏమి చేమిటో పనులమీద నలుగురైదుగురు పరిచారికలు చాలా అడావడిగా తిరుగుతున్నారు.

***

రత్నాంగి — కోరిన వెంటనే అరవై మంది రాజులు తమ పుత్రికల చిత్రపటాలు పంపారంటే అది మాకు అసాధారణ మైన ఘనతే; కాని అందరు అందకత్తెలలో వొకా నొకని యేరి నిర్ణయించడం చాలా కష్టమైన పని. ఎంత నిదానం కలవారి కైనా కళ్లు జిగజిగలాడిపోతాయి. మనస్సు గజిబిజిపడి పోతుంది. బుద్ధి యితికర్తవ్యతామూఢం అయిపోయి, దానిమూలాన, చేసిన పరిశీలన అంతా చివరి కడవిగాసిన వెన్నెల అయిపో వచ్చు.

సుబుద్ధి — తమరు సెలవిప్పించింది అక్షరాలా సత్యం అమ్మగారూ! ఒక రాజ

పుత్రి మాంచి రూపవతి అవుతుంది. ఇంకొక రాజపుత్రి గొప్ప విద్యావతి అవుతుంది. మరొక రాజపుత్రి సుగుణవతి అవుతుంది. ఇలాగ వొక్కొక్క రాజపుత్రి దగ్గిర వొక్కొక్క యోగ్యత యెక్కువగా వుంటుంది. అన్ని లక్షణాలూ వొకచోట వుండడం అసంభవం కనక, కన్యను నిర్ణయించడం సులువైన పని కాదు.

రత్నాంగి — అంతమాత్రమేనా నాయనగారూ? ఎంత లక్షణవతి అయినా ముందు భట్టారకులవారికి నచ్చాలి. తరవాత మహారాజులుంగారికీ నచ్చాలి. వారు చూసే లక్షణాలు వేరు. తుద కెంత సరిపుచ్చుకున్నా కొంచెమో గొప్పో నాకూ నచ్చాలి. నా చూపు వేరు. మహాప్రతిభావంతులు మరిదిగా రున్నారు. అత్తయ్యగారి తరవాత అంతటివారు వదినగా రున్నారు. వారు కోరే యోగ్యతలు వేరు. మంత్రు లున్నారు. వారికన్నీ తృప్తి కావాలి. అన్నిటికీ మూలం (సారంగధరుడి కేసి చూస్తూ చిరునవ్వుతో) నాయనకి నచ్చాలి. అతని రుచులు వేరు.

[సుబుద్ధి సారంగధరుడి కేసి "యేమంటా" రన్నట్టు చూస్తాడు. సారంగధరుడు సుబుద్ధికేసి "గప్ చిప్" అన్నట్టు చూసి తల వంచుకుంటాడు.]

రత్నాంగి—(సారంగధరుడికేసి క్రీగంట చూస్తూ) ఇదివరకే అబ్బాయి మనస్సు యే సుందరి మీదయినా నిలిచివుం దేమో అదిన్నీ చూసుకోవాలి.

[సుబుద్ధి "చెప్పేస్తా" అన్నట్టు సారంగధరుడి కేసీ, చెప్పడానికి సందేహిస్తున్నట్టు రత్నాంగికేసీ చూసి మొగం వంచుకుంటాడు. రత్నాంగి మందహాసం చేస్తూ సారంగధరుణ్ణీ, సుబుద్ధినీ పరీక్షగా చూస్తూ వుంటుంది. సారంగధరుడు చూపులతో సుబుద్ధిని వారించి మొగం వంచుకుంటాడు.]

రత్నాంగి — (సుబుద్ధితో) నే ననుకున్నదే నిజం అయింది. సెలవిప్పించండి.

సుబుద్ధి — (సారంగధరుడికేసి మళ్లీ చూసి, జంకి, మళ్లీ మొగం వంచుకుంటాడు.)

రత్నాంగి — అనుమానిస్తా రేమి నాయనగారూ? సెల విప్పించండి.

సుబుద్ధి — (సారంగధరుడికేసి "యిక తప్ప" దన్నట్టు చూస్తాడు.)

సారంగధరుడు — (సుబుద్ధికేసి "వద్దు సుమండీ" అన్నట్టు కొంచెం చురుగ్గా చూస్తాడు.)

రత్నాంగి — (సుబుద్ధితో) తమ రెందుకు వెనకాడుతున్నారో నాకు తెలవకుండా వుంది. ఇదివరకే—(అర్ధోక్తి)

సుబుద్ధి — (చేతులు నలుపుకుంటూ) లేదమ్మా, లేదండి.

రత్నాంగి — ఇదివరకే నాయన చూపొక రాజపుత్రిమీద వుండి, యిప్పుడు మే మింకొక రాజపుత్రిని నిరుకుచేస్తే యేమవుతుందో ఆలోచించారా తమరు? కనక, సెలవిప్పించండి. ఇప్పటికే మానాయన వొకామెని వరించి వుంటే నిజంగా ఆమె సర్వలక్షణసంపన్నురాలే అయివుంటుంది. అతను పైపై మెరుగులకు భ్రాంతు డయ్యేవాడు

కాదు. నేను చెప్పకోడం కాదు; కాని నా కొడుకంతటి యోగ్యుడు దేవలోకంలో కూడా వుండడు. అంచేతే యీవిషయమై నేను చాలా అటమటించిపోతున్నాను. మహారాజులుంగారుకూడా పరిపరివిధాల ఆలోచిస్తున్నారు. కనక, అది అలా జరిగివుంటే — తమకి తెలిసిన్నీ వుంటే వివరంగా సెలవిప్పించండి. తరవాత, అబ్బాయి కోప్పడతాడని తమరు జంకవద్దు. అది సిగ్గు కాని కోపం కాదు.

సారంగధరుడు—(సుబుద్ధికేసి చూస్తూ) అయ్యవారివాళ యెంచేతో చాలా వింతగా ప్రవర్తిస్తున్నారు. (రత్నాంగితో) తమరూ, బాబయ్యా ఆలోచించి యెలా సెలవిస్తే అలా చెయ్యడానికే నేను నిశ్చయించుకొని వున్నానండీ అమ్మా! ఇందులో అసత్యం యేమీ లేదండీ!

రత్నాంగి — నాయనా! నీమాట యెందు కసత్యం అనుకోవాలి? నువ్వు, చివరికి మాయిష్టం వచ్చినట్టే చేసినా, పరిపక్వమై వుంది కనక నీమనస్సు కొంత కల్పన సాగించవచ్చు కాదుటోయీ? కాకపోయినా, సుబుద్ధిఅయ్యవా రేదో సెలవిస్తున్నారోయ్!

సారంగధరుడు— చిత్తం చిత్తం, నేనూ సావధానుణ్ణయి వున్నానమ్మా!

రత్నాంగి—(సుబుద్ధితో) సరా?

సుబుద్ధి — అమ్మా, మూడేళ్లనాటి గొడవ. ఒకనాడు, పాపికొండల్లో, యువరాజులుంగారూ, జక్కులదీవి మండలేశ్వరుల కొమార్త చిత్రాంగీదేవమ్మగారూ వుమ్మడిగా—(అర్థోక్తి)

రత్నాంగి — అవునవును. జ్ఞాపకం వుంది. అప్పుడది తమరే సెలవిప్పించారు.

సారంగధరుడు— (సుబుద్ధిని విడిచి రత్నాంగికేసీ, రత్నాంగిని విడిచి సుబుద్ధికేసీ చూస్తూవుంటాడు.)

సుబుద్ధి—అప్పుడు యువరాజులుంగారి హృదయఫలకంమీద ఆమె రూపం లగ్నమయిందా అని నా అనుమానం.

సారంగధరుడు— (చకితుడై మొగం వంచుకుంటాడు.)

రత్నాంగి—ఇది కొత్తసంగతి. అయితే, ఆమె చాలా బుద్ధిమంతురాలనీ, చురుకైనదనీ, త్రిలోకసుందరికూడా అనీ—భద్రాచలం యాత్రకి వెళ్లినప్పుడు, పద్నాలుగేళ్ల పిల్ల అయివుండగా, అత్తయ్యగా రామెని చూసి వున్నారు. తరవాతకూడా వా రామెమాట యెన్నో మాట్లు ఆప్యాయనంగా సెలవిస్తూ వచ్చారు. తమరు సెలవిప్పించిందే నిజ మయితే మానాయన చాలా అదృష్టవంతుడే. నేనూ పెట్టి పుట్టినదాన్నే.

సుబుద్ధి — చిత్తం అమ్మా! అప్పుడలా జరిగివుండకపోతే మాత్రం యువరాజులుంగారి మనస్సు ఇప్పటికీ చలించలేదనే నా నిశ్చయం.

రత్నాంగి — నాయనా! వివాహం అంటే పరమపవిత్రం కావడం అలా వుండగా, స్త్రీపురుషుల కది విడిపోని శాశ్వత బంధం. అది సరిగా యేర్పడకపోతే తరవాత అనేకచిక్కులు వస్తాయి. మూడుముళ్లూ పడ్డతరవాత యెన్నిప్రాతికూల్యాలు వచ్చినా, భార్యా భర్తాకూడా యెలాగో సరిపుచ్చు

కోవాలి గాని, లేకపోతే తనుహానీ, లోక నిందా చుట్టుకుంటాయి.

సుబుద్ధి—చిత్తం చిత్తం.

రత్నాంగి—(సారంగధరుడితో) కనక, నాయనా! మర్మం విడిచి నీఅభీష్టం యేమిటో చెప్పవోయ్! నేను అమ్మను కానూ? నా దగ్గిర సిగ్గెందుకు తండ్రీ?

సారంగధరుడు—సుబుద్ధి అయ్యవారికే అనుమానాస్పదంగా వున్న విషయం నేను మనవిచేసుకోడం యెలాగండీ అమ్మా?

సుబుద్ధి—అమ్మగారి ఆజ్ఞ – (అర్ధోక్తి)

సారంగధరుడు — తమ ఆజ్ఞే నాకు శిరోధార్యం. ఇక అమ్మగారి ఆజ్ఞవిషయమై చెప్పడం యెందుకూ? (రత్నాంగితో) అయినా, అమ్మా—(అర్ధోక్తి)

[అప్పుడు గౌరి వస్తుంది.]

గౌరి—అమ్మా! బుల్లిబాబయ్య వచ్చి దర్శనం కోరుతున్నారు.

[అది విని రత్నాంగీ, సారంగధరుడూ, సుబుద్ధీ ఆటాలున లేచి నుంచుంటారు.]

రత్నాంగి— (లేస్తూ) మరిదిగారే? (సారంగధరుడితో) వెళ్లు నాయనా! బుల్లి బాబయ్యగారిని తోడితెచ్చుకో.

సారంగధరుడు—చిత్తం అమ్మా!

[సారంగధరుడు బయలుదేరి వెడతాడు. సుబుద్ధి ద్వారందాకా వెళ్లి యెదురుచూస్తూ నుంచుంటాడు. గౌరి, యిద్దరు పరిచారికలచేత, రత్నాంగి యెదట, కొంచెం యెడమపక్కగా వున్న స్తంభానికి చేర్చి పరుపూ, బాలీసూ వేయిస్తుంది. ఇంతలో ముందు సారంగధరుడూ, తరవాత విజయాదిత్యుడూ గుమ్మం దాటి వస్తారు. వెంటనే చేతులు కట్టుకుని సుబుద్ధి నమ్రుడవుతాడు. విజయాదిత్యుడి వెనక, చిత్రపటాలు పట్టుకుని వొక పరిచారిక నిలిచి వుంటుంది.]

విజయాదిత్యుడు — (సుబుద్ధితో) తమరూ వున్నారుకదా? దయచెయ్యండి.

సుబుద్ధి — చిత్తం మహాప్రభూ!

[సారంగధరుడూ, సుబుద్ధీ తమతమ ఆసనాల దగ్గిరికి వచ్చి నుంచుంటారు.]

రత్నాంగి—(విజయాదిత్యుడికేసి గంభీరంగానూ, పరీక్షగానూ చూస్తూ, కొత్త ఆసనం చూపించి) దయచెయ్యండి. (నిదానించి) ఏమిటి? తమ రలా వున్నారేం మరిది గారూ?

విజయాదిత్యుడు — (తనని చూసుకుంటూ) నాకేమిటి? నాలో యేమిటి మార్పు లేదే? (రత్నాంగితో) నేను బాగానే వున్నాను వదినా!

రత్నాంగి— లేరు, ఎంతమాత్రమూ లేరు. తమ మొగంమీద వుల్లాసమే కనపడ్డం లేదు. నేనెరిగి వున్నంతలో తమ రెప్పుడూ యిలా లేరు. (సారంగధరుడితో) బుల్లిబాబయ్య నీకెలా కనపడుతున్నారు నాయనా?

సారంగధరుడు — (రత్నాంగితో) తమరు సెలవిచ్చినట్లే బుల్లిబాబయ్య యేదో గాఢమైన విచారంలో వున్నారు. (విజయాదిత్యుడితో) నిజం బుల్లిబాబయ్యా!

విజయాదిత్యుడు — (సుబుద్ధికేసి చూస్తాడు.)

సుబుద్ధి—అమ్మా! మళ్లీ దర్శనం చేసుకుంటాను, ఇప్పటికి సెలవిప్పించండి. (లేస్తాడు)

విజయాదిత్యుడు — (సుబుద్ధిని చెయ్యి వూపి నివారిస్తూ) అదేమిటా? తమ రిప్పు డిక్కడ వుండనేవచ్చు. ఇప్పుడు తమరు విన గూడని రహస్యాల్లేవు సరికదా, తమరున్నూ వినవలసినవే వున్నాయి. నాలో తమరున్నూ మార్పు కనిపిస్తూ వుందా అని—(అర్థోక్తి)

సుబుద్ధి —చిత్తం మహాప్రభూ! ఏలిన వారు మర్మాంతిక మైన ఆవేదన పడుతు న్నట్టే నాకూ కనిపిస్తున్నారు. (కూచుంటాడు.)

విజయాదిత్యుడు— (కళ్లు మూసుకుని నిట్టూర్పు విడుస్తాడు.)

రత్నాంగి— (అది గుర్తించి) సరే, యిక వేరే చెప్పడం మెందుకూ? నేను నుంచో లేకుండా వున్నాను. నా నరాలు కుంగతీసేస్తున్నాయి. ముందు తమరు దయ చెయ్యండి.

[అందరూ కూచుంటారు.]

విజయాదిత్యుడు—వదినా!

రత్నాంగి—ఏమి సెలవు?

విజయాదిత్యుడు — అన్నయ్యగారు అబ్బాయికోసం రాజపుత్రికల పటాలు తెప్పించారు. (పరిచారిక చేతిలో వున్న పటాలు పుచ్చుకుని రత్నాంగిఎదుట వుంచి) వీటిని తమకీ, అబ్బాయికీ చూపించవలసిం దనీ, తమ వుభయుల నిష్కృష్టాభిప్రాయా లూ తెలుసుకురావలసిం దనీ వారు నాకు ఆజ్ఞాపించారు.

సారంగధరుడు—(చకితుడై రత్నాంగి కేసి చూస్తాడు.)

రత్నాంగి — చాలా సంతోషం. అయితే, నే నిలా అన్నా నని తమకు కోపం వద్దు.

విజయాదిత్యుడు—కోపమా? ఎందు కూ? సెల విప్పించండి.

రత్నాంగి— ఈ విషయమై తమ బాధ్యత కూడా చాలా గొప్పదే; కాని వారు దూరంగా వుండిపోడానికి కారణం?

విజయాదిత్యుడు — ఉంది, వదినా! చాలా పెద్దకారణమే వుంది.

రత్నాంగి — ఓల్చుకో లేకుండా వున్నాను. చిత్రపటాల విషయమై నిన్న వుదయం చాలా కలివిడిగానే మాట్లాడారు; కాని నిన్న రాత్రి వారి దర్శనం కాలేదు. ఇవాళ ఉదయం రాజకార్యాలలో ప్రవృత్తులై యిక్కడికి దయచెయ్యానే లేదు. సరే, వా రిప్పు డీవిషయమై నాతో మాట్లాడ్డానికే యిష్టపడ్డం లేనట్టు స్పష్టమే కదా? ఇలాంటి స్థితిలో ఆకారణం గొప్పదే అని వేరే చెప్పా లా? ఏమయినా, తప్పదు కనక, అదేదో సెల విప్పించండి.

విజయాదిత్యుడు — (చేతులు జోడిం చుకుని సవినయంగా) నేను తమ బిడ్డవంటి వాణ్ణి. అన్నయ్యగారి ఆజ్ఞా, అక్కడి వార్తా తమతో మనవిచేసుకోడమే నాపని. నన్న న్యథా భావించవద్దని మరీమరీ వేడుకుంటు న్నాను.

[సారంగధరుడూ, సుబుద్ధీ నిర్విణ్ణులై ఒకరి నొకరు చూసుకుంటారు.]

రత్నాంగి — పురుషసింహులైన తమర్నే అంత కదిలించేస్తూ వున్న ఆవిషయం

నన్నెంత ఆరాటపెడుతుందో. అయినా సరే సెలవుదయచెయ్యండి.

విజయాదిత్యుడు — (పటాలు నిర్దేశిస్తూ) ఇవి అరవైపటాలు. అయితే, వీటిలో తమరూ, అబ్బాయీ పరిశీలించవలసినవి యాభైతొమ్మిది మాత్రమే. ఒకటి తమకు చూడవచ్చు; గాని అది ప్రత్యేకించబడ్డది.

రత్నాంగి — ఎందుకోసం?

విజయాదిత్యుడు — ఆపటం మొవరిదో ఆరాజపుత్రికను అన్నయ్యగారు— (తలవంచుకుని) వరించారు వదినా!

సారంగధరుడు — (చకితు డవుతాడు.)

రత్నాంగి — (చెవులు మూసుకుని) శివశివా!

సుబుద్ధి—హరహరా! విధివైపరీత్యం!

విజయాదిత్యుడు — ఇలాంటి వార్త మోసుకు వచ్చినందుకు నేను సిగ్గుపడుతున్నాను. తమయెదటికి రాలేక రాలేక విధిలేక వచ్చాను. ఈ సంగతి నాతో సెలవివ్వడానికి అన్నయ్యగారికి మొగం చెల్లలేదు.

రత్నాంగి — తమతో మరెవరు సెలవిచ్చారూ?

విజయాదిత్యుడు—గుమ్మం దిగాటప్పటికి మహారుద్రయ్యగారు వచ్చి వూదారు.

రత్నాంగి — వారిని మహారాజే పంపారు.

సుబుద్ధి—ఈ పన్నుగడే మహారుద్రయ్యగారి దని నా వుద్దేశం మహాప్రభూ! మహారాజులుంగారి అనుగ్రహం తప్పిపోకుండా వుండడానికి వారెప్పుడూ యిలాంటి మెత్తులే వేస్తున్నారు.

విజయాదిత్యుడు—అవునవును. తమ వూహ సుసంగతంగానే వుంది. నర్మసచివులని మహారుద్రయ్యగారికి పేరేకదా?

సారంగధరుడు— ఇది మహారుద్రయ్యగారి పన్నుగడ అయినా, బాబయ్యగారికి స్వయంభువు అయినా పర్యవసానం వొకటే; కనక బుల్లిబాబయ్యా! ఆరాజపుత్రిక పేరున్నా— (అర్ధోక్తి)

రత్నాంగి — అబ్బాయి. చెప్పింది బాగానే వుంది. సెల విప్పించండి.

విజయాదిత్యుడు—జక్కులదేవి— (అర్ధోక్తి)

[పిడుగు పడ్డట్టయి సారంగధరుడు మొగం వంచుకుంటాడు. మొగం కప్పుకుని రత్నాంగి "హ—మ్మో" అంటూ కుంగిపోతుంది. "హర హరా! హరహరా" అంటూ సుబుద్ధి చెవులు మూసుకుంటాడు.]

విజయాదిత్యుడు— (తెల్లపోయి సుబుద్ధితో) తమ ధోరణి చూడగా నాకేదో మహావైపరీత్యం స్ఫురిస్తోంది.

రత్నాంగి — అవును. తమరు సరిగానే గ్రహించారు.

విజయాదిత్యుడు—వివరంగా వినకోరుతున్నాను.

రత్నాంగి— అరవైయేళ్లు నిండనున్న మహారాజు ఒక నవోఢను వరించినందుకూ, యాభైయేళ్ల వయస్సున నాకు సవతి దాప

రిస్తూ వున్నందుకూ నాకేమీ విచారం లేదు. ఈకారణంవల్ల వారిని అల్లరిపెట్టి నేను నలుగురి నోళ్లలోనూ పడ్డమూ మంచిది కాదు; కాని, మహారాజు కోడలిమీద కన్ను వేశారు.

విజయాదిత్యుడు—(ఉలిక్కిపడి, హీనస్వరంతో) అం-టే ?

సుబుద్ధి — (ఒక్కమాటు రత్నాంగి కేసి చూసి, తరవాత విజయాదిత్యుడితో) తరవాతి సంగతి నేను మనవి చేసుకుంటాను మహాప్రభూ! తమరు దయచేశాటప్పటికి అమ్మగారితో నేనీ విషయమే మనవిచేసుకుంటున్నాను. మరేమీ లేదు, యువరాజులుంగారు జక్కులదీవి రాజపుత్రిక చిత్రాంగీదేవమ్మగారిమీద మూడేళ్లుగా మరులుగొని వున్నారు.

సారంగధరుడు—(సుబుద్ధికేసి పులుకూ పులుకూ చూస్తాడు.)

విజయాదిత్యుడు— (ఆవేశంతో) హరహరా! ఏమి దుష్కాలమూ! ఎంత అసుర సంకల్పమూ! ధోరణి చూడగా చళుక్య వంశానికి నేడేదో దారుణమైన అపాయం కనిపెట్టుకుని వున్నట్టుంది. సూర్యచంద్రుల గతులు తప్పేటట్టూ వుంది. వైదికధర్మం విలుప్తమయిపోయే సూచనలు కనపడుతున్నాయి.

సారంగధరుడు—(గంభీరంగా చూస్తూ) బుల్లిబాబయ్యా! ఇప్పుడంత ప్రమాదం యేం వచ్చిందీ? తమరంత బెంబేలుపడిపోవలసిన సన్నివేశమున్నా యేమి తటస్థపడ్డదీ?

రత్నాంగి—అయ్యో, అయ్యో! (విజయాదిత్యుడికేసి చూస్తుంది.)

సారంగధరుడు—అమ్మా! తమరు నా మనవి చిత్తగించ కోరుతున్నాను. రాజకుటుంబాలలో బహుపత్నీకత్వం సర్వసాధారణమైన విషయం. అది అనేక కారణాల వల్ల తటస్థపడుతుంది. ఇప్పుడు బాబయ్యగారీ వివాహం తలపెట్టారంటే జటిలమైన రాజకీయపు ఎత్తేదో యిందులో నిగూఢమయివుందని మనం గుర్తించాలి. కాని, కేవలమూ యింద్రియలోలత్వంవల్ల వారిందుకు సిద్ధపడుతున్నారని నిశ్చయించుకోగూడదు.

సుబుద్ధి—(సారంగధరుడితో) చిత్రాంగీదేవమ్మగారి విషయమై తమరు — (అర్ధోక్తి)

రత్నాంగి-(సుబుద్ధితో) క్షణం కిందటిదాకా ఆమెపేరు చెబితే యెంతో గాంభీర్యం నటించిన నాయన యెంతలో యెలా మారిపోయాడో చిత్తగించారా? (విజయాదిత్యుడితో) వెర్రితండ్రీ! అదీ ధోరణి!

విజయాదిత్యుడు— కనకనే అన్నయ్యగారి కలాంటి సాహసం కలిగింది. (సారంగధరుడితో) బాబూ! నువ్వు చెప్పింది సరే అని వొప్పుకుందాం. అయితే, కోడలిమీద కన్ను వెయ్యడం—(అర్ధోక్తి)

సారంగధరుడు—తెలిసే వారలా చేస్తున్నారనడానికి మన కాధారం యేమిటీ?

విజయాదిత్యుడు— తెలిస్తే ఆ కోరిక మల్లించుకోవలసిందే కాదూ?

సారంగధరుడు— సుబుద్ధి అయ్యవారి వూహా నమ్మెయ్యడమేనా తమరు?

రత్నాంగి — (సుబుద్ధితో) ఆలకించారా?

విజయాదిత్యుడు — పోనీ, సుబుద్ధి అయ్యవారి మాట అలా వుంచు. నిజం చెప్పు. ఆమెని నువ్వు— (అర్ధోక్తి)

సుబుద్ధి — (తర్జనితో టాకాయిస్తూ) అలా అడగకండి మహాప్రభూ!

సారంగధరుడు—(సుబుద్ధితో) ఆమాట తమరూ అడగవచ్చు. (విజయాదిత్యుడితో) ఆమె తల్లిగా రవుతా రంటేనే నాహృదయాని కాహ్లాదంగా వుంది బుల్లిబాబయ్యా!

రత్నాంగి— శివా! శివా!

సుబుద్ధి— నే నంగీకరించను. (సారంగధరుడితో) ఆ వేళ నేను తమ సన్నిధిని లేనను కున్నారా? తమరూ, ఆమే చూసుకున్న చూపులు నే నర్థంచేసుకోలే దనుకున్నారా?

సారంగధరుడు—(సుబుద్ధితో) అయితే, నాచూపుల అర్థం నాకు తెలవ దంటారా తమరు? వాటికి ప్రేరక మైన నాచిత్తవృత్తి యెలాంటిదో నాకు తెలవనే తెలవ దంటారా తమరు? నామనస్సుకి తమ రేమి ఆరోపించినా నాబుద్ధి అంగీకరించితీరా లంటారా తమరు?

రత్నాంగి— (సుబుద్ధితో) ఇక మన మేమి చెప్పగలమూ?

సుబుద్ధి — (విజయాదిత్యుడితో) ఆ తర్కం యెవ రందుకోగలరు మహాప్రభూ?

సారంగధరుడు — (సుబుద్ధితో) మనకి తర్కం యెందుకూ యిప్పుడూ? బాబయ్యగారి నిశ్చయం పూర్వపక్షం చేసెయ్యా లని ప్రయత్నం మాత్రం యెందుకూ మనకి? (విజయాదిత్యుడితో) అమ్మగారికీ, తమకూ నేను ధర్మాలు చెప్పగలవాణ్ణా బుల్లిబాబయ్యా? కాని బాబయ్యగారి స్థితిగతులు మనం కొంచెం యోచించుకోవాలి. వారు చతుర్వేదాలూ అభ్యసించారు. షట్ఛాస్త్రాలూ పఠించారు. సకలపురాణేతిహాసాలూ క్షుణ్ణంగా పరిశీలించారు. తమ సర్వజ్ఞతకీ, ధర్మనిరతికీ వినియోగంగా, గురుదేవులవారి చేత, పంచమవేద మైన మహాభారతం తెనుగుచేయిస్తున్నారు—(అర్ధోక్తి)

విజయాదిత్యుడు— ధర్మాలు తెలుసుకోవడం సులభమే.

సారంగధరుడు — ఎంతమాత్రమూ కాదు. సామాన్యధర్మాలూ, విశేషవిధులూ కార్యాచరణలో సమన్వయపరుచుకోడం మహామహులకున్నూ వాక్కాక్కప్పుడు తలప్రాణం తోకకు తెస్తూ వుంటుంది.

విజయాదిత్యుడు—ధర్మచింత వుంటేను.

సారంగధరుడు — ధర్మం తెలవడం అంటే బుద్ధికి సంస్కారం కలగడం కాదా బుల్లిబాబయ్యా?

సుబుద్ధి— అయితే, యిది మహారాజులుంగారికి విశేషవిధికి సంబంధించిన ధర్మాచరణం అనా తమ నిర్వచనం?

సారంగధరుడు— ముమ్మాటికీని. ఇది చిత్తగించారా? బాబయ్యగారి వయస్సు, వివాహయోగ్యం కాదు. ఇప్పటి సందర్భమూ, జనసమ్మత మైనది కాదు. (పటాలు చూపిస్తూ) ఈరాజపుత్రికలూ, వారికి పరిగ్రాహ్యలు కారు. ఇలాగ, యీకారణాలలో

వొక్కొక్కటే వారిని దిగ్భ్రాంతులను చేసి య్యగలిగినవి. కాని యివన్నీ యోచించుకోకుండా బాబయ్యగా రిందుకు సిద్ధపడుతున్నారనా తమ అభిప్రాయం? తమరు కొంచెం సావధానంగా యోచించండి. అత్యంత క్లిష్టాలైన సన్నివేశా లేవో కొన్ని వారిని ముట్టడించాయి. వాటిని సరిపుచ్చుకోడానికే— (అర్ధోక్తి)

విజయాదిత్యుడు— బాబూ! నువ్వ వెయ్యి చెప్పు లక్ష చెప్పు, యిందులో యింద్రియలోలత్వం తప్ప మరేమీ లేదు. మహారుద్రయ్యగారి ప్రోత్సాహం తప్ప దీనికి ప్రేరకమైన రాజకీయపు టెత్తున్నూ లేదు.

రత్నాంగి—అదీ మాట.

సారంగధరుడు—(రత్నాంగికేసి చూసి వూరుకుంటాడు.)

రత్నాంగి—కాకపోతే, ఈ పటాలకు చెందిన రాజపుత్రికలను విడిచి మరో పది మందిని పెళ్లాడమను, నా అభ్యంతరం లేదు.

విజయాదిత్యుడు—ఏం, అది బాగుండా?

సారంగధరుడు—(నిరుత్తరుడై మొగం వంచుకుంటాడు.)

సుబుద్ధి—(సారంగధరుడితో) అయితే, యిప్పుడు కర్తవ్యం యేమిటనీ తమవుద్దేశం?

సారంగధరుడు—బాబయ్యగారి వివాహ ప్రయత్నమే.

రత్నాంగి—(ఉలిక్కిపడుతుంది.)

విజయాదిత్యుడు—అలాగ వొక్కనాటికీ కాదు. తమ అభిప్రాయం యేమిటి వదినా?

రత్నాంగి— నే నేమీ చెప్పలేను. నాకు మతి పోతోంది. ఏంచేసినా తమరూ, గురుదేవులూ, చిట్టివీరన్నగారూ--(అర్ధోక్తి)

విజయాదిత్యుడు—ముందు అన్నయ్యగారికి నే నేమిటీ చెప్పడం?

[అందరూ సారంగధరుడికేసి చూస్తారు.]

సారంగధరుడు — దీని కింత ఆలోచన యెందుకు బుల్లిబాబయ్యా? తండ్రీకొడుకులకు ఏకకాలంలో వివాహం అశాస్త్రీయం. లోకమున్నూ హర్షించదు. వివాహం విషయమై బాబయ్యగారికే గాని నా కిప్పుడు తొందరలేదు. ఈసంగతి వారితో విన్నవించి, వుపయోగించవలసిం దని పటాలు కూడా వారికే సమర్పించండి.

విజయాదిత్యుడు — (రత్నాంగికేసి చూస్తాడు.)

రత్నాంగి — (సారంగధరుడికేసి చూస్తుంది)

సారంగధరుడు — (రత్నాంగితో) తమరు నామనవి ఆలించండి. ఇది యిలా జరిగిపోవలసిందే.

రత్నాంగి—(విజయాదిత్యుడితో) ఇక లాభం లేదు. అబ్బాయి కేదేనా తోచకే పోవాలి; కాని తోస్తే అది అలా జరగవలసిందే. ఈమాటలే వారితో విన్నవించండి. ఏమాత్రమేనా తరవాయి వుంటే, చెరకాకు బల్లే లయి యివేనా వారి కావేదన పుట్టించవచ్చు.

సుబుద్ధి — అమ్మగారు సెలవిచ్చింది బాగుంది. అలా చేయించండి మహాప్రభూ!

విజయాదిత్యుడు--అన్నయ్యగారిప్పుడు కామజ్వరపీడితులై వున్నారు. వారికి దేమీ తలకెక్కదు.

[అందరూ లేస్తారు.]

రత్నాంగి — మరిదిగారూ, ఒక్క మనవి.

విజయాదిత్యుడు — ఏమి సెలవు?

రత్నాంగి — అబ్బాయి నా కేకసంతానం. ఇప్పటిమట్టుకి వారికీ అంతే. అతనేనా లేకలేక కలిగాడు. ఎన్నో వ్రతాలు చెయ్యగా, ఎన్నో తీర్థక్షేత్రాలు సేవించగా, ఎందరో సాధువులను కొలవగా పుట్టుకు వచ్చాడు నాయన. అతను చెప్పినట్టు వివాహానికిప్పుడేమంత తొందరలేదు. ఇక వున్నదల్లా నా కొక్కటే కోరిక. (చేతులు జోడించుకుని) అతను మహారాజు కడుపున పుట్టాడు. జ్యేష్ఠుడుకూడా అతనే అవుతాడు. కనక నాయనకి రాజ్యాధిపత్యం తప్పిపోకుండా — (అర్ధోక్తి)

సారంగధరుడు—(రత్నాంగితో) తమదంతా వెర్రండీ అమ్మా!

విజయాదిత్యుడు —వదినా! ఇంతకింత యుంది కదా? ఇక భవిష్యత్తా? దానిమాట యిప్పుడు కాదు (సుబుద్ధితో) వెంటనే తమ ఇంటికి దయచేసి, సంగతంతా విన్నవించి, దీపాలు పెట్టాక బాబయ్యగారిని ఒక్కమాటిక్కడికి పంపండి.

రత్నాంగి—తమరూ దయచెయ్యండి నాయనగారూ!


సుబుద్ధి— చిత్తంమహాప్రభూ, చిత్తం అమ్మగారూ!


విజయాదిత్యుడు—వదినా, సెలవు

రత్నాంగి—చిత్తం, సెలవు.

సారంగధరుడు — బుల్లిబాబయ్యా! సెలవు. (గిర్రున తిరిగి లోపలికి వెళ్లిపోతాడు.)

[రత్నాంగీ, విజయాదిత్యుడూ, సుబుద్ధీ అతను వెళ్లిన దిక్కుగా చూస్తారు. తరవాత, ముందు విజయాదిత్యుడూ, పటాలు పుచ్చుకుని వెనకాల పరిచారికా, తల వంచుకుని పిమ్మట సుబుద్ధీ వెళ్లిపోతారు. రత్నాంగి సారంగధరుడు వెళ్లిన వేపుకి చూస్తుంది]











తరువాత?

శ్రీ చిలుకూరి నారాయణరావు

ఉత్తరక్షణములో ఎవరి కేమి జరుగుతుందో ఎవరు చెప్పగలరు?

ఇది ఒక వెఱ్ఱివేదాంతపు మాట అని అనుకొనే వాడను. ముందు రాబోయే విషయాలు మన యిచ్ఛాధీనము లనుకొనేవాడను. "మే మీదినము, రేపు, నెల్లాళ్లయినతరువాత, కొన్నియేళ్లు గడచినవెనుక, ఈయీ పనులు చేస్తాము" అని చాలామంది అనడమూ, నేను కూడా అనుకొనడమూ సాధారణముగా జరుగుతూనే ఉన్నది.

కాని, మనుష్యుల ఊహాలు ఉత్త ఊహాలే. ఒకప్పు డూహాలు కొంతవరకు కార్యరూపములో నెరవేరినట్లే భాసించడమూ, ఇసుకపునాదులమీద కట్టిన గృహములవలె ఆ ఆకాశహర్మ్యములు కూలిపోవడమూ, తరతరములుగా అనాదిగా అనుభవించినవారు చెప్పే విషయమే. అయినా, మానవుడు స్వశక్తిని నమ్ముకొంటూనే ఉన్నాడు. పరశక్తిని విస్మరిస్తూనే ఉన్నాడు.

అట్లా చేయకపోతే జీవయాత్ర సాగదు. జగల్లీల విస్తరిల్లదు.

దీనినే మోహ మంటారు కొందరు; మాయ అంటారు మరికొందరు.

ఇది మోహమూ కాదు, మాయా కాదు; ఇదీ సత్యమే, అదీ సత్యమే అంటారు ఇంకా మరికొందరు.

సత్యమయిన దొక్కటే; తక్కిన దంతా అసత్యమే అని ఇంకాకొందరు.

సత్యపదార్థమే లేదనేవారుకూడా ఉన్నారు.

ఏమి టీగొడవంతా?

పుట్టుక ఏమిటి? చావేమిటి?

ఎందుకు పుట్టుతాము? ఎందుకు చస్తాము?

పుట్టేవా డెవడు? చచ్చేవా డెవడు?

పుట్టించేవా డెవడు? చంపేవా డెవడు?

పుట్టించడ మెందుకు? చంపడ మెందుకు?

అసలు పుట్టించేవా డున్నాడా?

పుట్టించేవాడే చంపేవాడుకూడానా?

లేక, వారు వేరా?

"ఓయీ, వెఱ్ఱివేదాంతీ! చాలించవోయ్. పుట్టినవాళ్లు పుట్టుతారు; బ్రతికినవాళ్లు బ్రతుకుతారు; చచ్చేవాళ్లు చస్తారు. వాళ్లతో నీకేమిపని? నీపనేదో నీవు చూచుకో. నీధర్మ మేదో నీవు నిర్వర్తించుకో" అని ఎవరో ఉద్బోధిస్తున్నారు.

నాకు పని ఏముంది?

నాకు ధర్మ మేముంది?

ఆపని నేను కల్పించుకొన్నదే కదా!

మరెవ్వరయినా నాకోసము కల్పించినారా?

ఆ ధర్మమును నాకెవరు నిర్ణయించినారు?

ఒకరు నిర్ణయించినదానిని నే నెందుకు నిర్వర్తించవలెను?

లేక, ఆధర్మముకూడా నేను కల్పించుకొన్నదేనా?

పనులను, ధర్మములను నేను నిర్ణయించుకొనడ మెందుకు?

వాటి నాచరింపలేక కష్ట మనుభవించడ మెందుకు?

ఆచరింపలేదని ఒకరిచేత నిందను పొందడ మెందుకు?

నాపనిని నేను చేసుకొంటే ఎవరికి మేలు?

నాపనిని నేను చేసుకోకపోతే ఎవరికి కీడు?

నాధర్మమును నే నాచరిస్తే లోకోద్ధార మవుతుందా?

ఏమో!

అవుతుం దంటారు కొందరు. ఆచరించేవాళ్లు మాత్రము క్వచిత్తుగా కనబడుతారు.

వారయినా డంబమునకోస మాచరిస్తారేమో!

ఏమో? ఒకరి ఊసు నాకేల?

* * *

సరే! నాపనిని నేను చేస్తాను; నాధర్మమును నేను నిర్వర్తిస్తాను.

తరువాత?

"తరువాత?" అని ప్రతిధ్వని వస్తున్నది. ప్రత్యుత్తరము వినబడదు.

తరువాత? — నిశ్శబ్దము.

***

వాజశ్రవసుడు విశ్వజిద్యజ్ఞము చేస్తున్నాడు. నీరుగాని, గడ్డిగాని లేని బక్క ఆవులను దానముచేస్తున్నాడు.

కొడుకు నచికేతుడు చూచినాడు. "అయ్యో, ఇట్టి ఆవులను దానముచేసి నాతండ్రి సౌఖ్యములేని లోకములకు పోతాడే!" అని వగచినాడు. "తండ్రీ! న న్నెవరి కిస్తా" వన్నాడు. తండ్రికి కోపము వచ్చింది. "నిన్ను మృత్యువు కిస్తానురా!" అన్నాడు.

నచికేతుడు:

"నాకు ముం దెందరో పోయినారు; నాకు
వెనుక నింకెందరో యుట్టె వెడలఁగలరు.
యముని కే నెట్లు పచరింతు? అతఁడు నాకు
నేమి చేయంగఁగలవాఁడు నిపుడు తండ్రి!
పూర్వులందఱు నెట్టులు పోయినారొ
వరుసఁ బోయిరి తరువాతివారుఁ గూడ;
సస్యజాలంబువలెఁ జచ్చి, సస్యమువలె
మరల జనియించుచుండును మర్త్యుఁ డెపుడు"

అన్నాడు.

(ఇది కథ. నచికేతుని కెట్లు తెలిసింది "సస్యజాలమువలెఁ జచ్చి సస్యమువలె మరల తానున్ను జన్మ మెత్తుతా" డని?)

సరే. నచికేతుడు మృత్యువుఇల్లు ప్రవేశించినాడు. అక్కడ మూడురాత్రు లుపవసించినాడు. బ్రాహ్మణు డిట్లుపవసించడము తన కనర్థహేతు వని మృత్యువు భయపడి, "అయ్యా! బ్రాహ్మణా! దయచేసి ఉపవాసము మాను. నీకు కావలసినవి మూడు వరములు తప్పకుండా ఇస్తా" నన్నాడు.

"నీవు నన్ను విడిచిపెట్టు. నాతండ్రివద్దకు పంపు. అతడు నన్ను పోల్చుకొని తన కొడుకుగా పరిగ్రహించనీ" అని మొదటివరము కోరుకొన్నాడు నచికేతుడు.

మృత్యు వావర మిచ్చినాడు.

"నాచికేతాగ్నిని గురించిన జ్ఞానము చాలా గొప్పదట. దాని నుపదేశింపు" మన్నాడు నచికేతుడు రెండోవరముగా.

ఆ వరముకూడా ఇచ్చినాడు మృత్యువు. మూడోవరము కోరుకో మన్నాడు.

నచికేతుడు:

"మనుజుఁడు గతింప నాత్మయు మరల నుండు
ననుచుఁ గొందఱు; ఉండదటంచుఁ గొంద
ఱంద్రు; నీసందియము నెల్ల, అయ్య! నీవ
తీర్పవలయు; నిదియె నాతృతీయవరము"

అన్నాడు.

మృత్యువుకు గుండెలో గుభిలుమన్నది. "మహాత్మా! మరి యేమయినా అడుగుగాని ఇదిమాత్ర మడుగవద్దు. దేవతలకుకూడా ఇటువంటి సందేహమే కలిగింది. వారికికూడా దీని రహస్యము తెలియలేదు. నీకు సమస్తభాగ్యభోగ్యములను ఇస్తాను. సంతుష్టిపడు" అన్నాడు.

"నా కవేవీ వద్దు. ఇదే కావా" లని హఠము పట్టినాడు నచికేతుడు.

అప్పుడు మృత్యువు నచికేతునికి ఆత్మజ్ఞానముపదేశించినాడు. అదంతా ఇక్కడ వివరించ నక్కర లేదు. కఠోపనిషత్తు చదువుకొంటే తెలుస్తుంది.

ఆత్మ నిత్యుడు. అత డమృతస్వరూపి. అతనికి మృత్యువు లేదు. సకలదేహములలోను వర్తించి, వానిని చైతన్యసహితములుగా చేసేవా డతడే. ఆయాజీవులు తాము చేసుకొన్న కర్మముల ననుసరించి ఆయా యోనులలో జన్మమెత్తుతూ ఉంటారు. ఆత్మజ్ఞానము కలుగగానే జన్మరాహిత్యము కలుగుతుంది. అందుచేత మృత్యురాహిత్యమున్నూ కలుగుతుంది. కాబట్టి ఆత్మజ్ఞానలబ్ధికోసము ప్రయత్నము చేయవలెను.

***

నచికేతునికి సందేహము తీరినది. కాని, నాకు తీర లేదు. ఎట్లు తీరుతుంది? నేను నచికేతుడనైతే కదూ? మృత్యువు సిద్ధవిషయమేకదా. ఏమి టామృత్యువు—ఏమి టామృత్యువు? మృత్యువు చెప్పలేదు; నచికేతుడు తెలుసుకొననూ లేదు. ఈ సనాతనప్రశ్న కింకా ఎవ్వరున్నూ సమాధానము చెప్పలేదు.

*　　*　　*

సరే! నిలువుగ్రుడ్లు పడుతవి, లేదా కన్నులు మూతలుపడతవి. దౌడలు దగ్గరకు కరుచుకపోతవి. వాతపిత్తకఫములు ప్రకోపిస్తవి. గుండె కొట్టుకొనడము మానివేస్తుంది. శరీర మంతా చల్లబడి కొయ్యబారిపోతుంది. ఇదే మృత్యువు అంటారేమో. కాని ఈ అవస్థ మృత్యువుకు బయటిచిహ్న మవుతుంది గాని, అసలు మృత్యు వంటే ఏమిటి? ....ఏమిటి? ...... ఏమో!

*　　*　　*　　*

శరీరమునకే మృత్యువు; ఆత్మకు కాదు. ఆత్మ శరీరములో చేరి సుఖదుఃఖముల ననుభవిస్తూ ఉంటుంది. ఎందుచేత? అజ్ఞానముచేత అంటారు. ఆత్మ కజ్ఞాన మేమిటి? అజ్ఞానము భ్రమమూలముగా కలుగుతుం దంటారా? ఆ భ్రమ ఎందుకు కలుగవలెను? తాను చేసుకొన్న కర్మవల్లనా? కర్మ ఎందుకు చేయవలెను? అట్లా ఇష్టమయినదా? కానీ, ఆత్మకర్మానికి మన మేమిచేస్తాము? ఆత్మమాత్ర మేమి చేయగలదు (డు)?

*　　*　　*

సరే! మృత్యువు సిద్ధము. తరువాత?—

స్వర్గ మంటారు, నరక మంటారు — కొంత కాలమువరకు. తరువాత జన్మము—పూర్వజన్మపరంపరా కర్మానుసారముగా. నిజమేనా? 'నిజమే,నమ్ము' అంటున్నవి శాస్త్రాలన్నీ. కాని, చచ్చి ఎవ్వడున్నూ తిరిగిరాలేదు, మనకు చెప్పడానికి. పునర్జన్మము కాగానే పూర్వజన్మజ్ఞానము మరపునకు వస్తుంది.

పూర్వజన్మజ్ఞానము కలవారు కొంతమంది మహాత్ములున్నారట. ఉండవచ్చును. నమ్మి సంచరించు కోవలసినది తప్ప అంధకారములో తడకులాడుతూ ఉన్న నాబోటి సామాన్యనరులకు దిక్కేమున్నది?

***

మొన్న జనవరి మూడో తేదీనుంచి ఏడో తేదీ వరకు చెన్నపట్టణములో పనిమీద నిలువవలసి వచ్చినది. నేను లేనప్పుడు నాభార్యకు గొప్పగండము గడచినది. ఏడో తేదీ ఉదయము ఇల్లుచేరుకొన్నాను. ఆమె స్వస్థముగానే ఉన్నది. ఇద్దరమున్నూ అర్ధగంట సేపు మాట్లాడుకొన్నాము. దేవుడు మాపాల నున్నా డని సంతోషించినాము. కాని ఆ సంతోషము ఆ అర్ధ గంటమాత్రమే.

నేను కాలేజీకి పోదామని ఒక అడుగు ఇంటి లోనుంచి బయటికి పెట్టినాను. లోపలినుంచి పెద్ద కేక వినబడ్డది! "ఏమది?" అని లోనికి పోయినాను. నా భార్య "నేను వెళ్లుతున్నాను. పిల్లలను చూచుకోండి" అని ఊరకొన్నది. నాకళ్లయెదుట పెద్దజ్యోతిస్సు కనబడినది.

ముప్పైఏండ్లుగా కలిసి ఈడ్చిన ఈమహాసంసారరథము; ఒంటిగుర్ర మీడ్వగలదా?

ఒక్కనిమిషము. ఈడిలకు జా లన్నీ వచ్చినవి. కదిలించినా స్మృతిలేదు; సూదితో గ్రుచ్చినా స్మృతి లేదు.

ఆసుపత్రికి మేఘాలమీద తీసుకొని వెళ్లినాను. పర్ణను చూచి పెదవి విరిచినాడు. కార్యము లేదన్నాడు. ఒకటో, రెండో నిమిషము లన్నాడు.

ఒకటి,......రెండు నిమిషములలో ఏమిచేయ గలిగితే అది చేయం డన్నాను.

నా ధైర్యము చూచి ఆయనకున్న ధైర్యము వచ్చినది.

చికిత్స చేసినాడు. అయిదుగంటలకాల మట్లే ఉన్నది; అప్పటికి కంటిరెప్పలు కదలినవి. ఆశ .....

(ఇప్పు డామెకు బాగున్నది. క్షమించాలి. స్వవిషయము గనుక.)

ఇంటికి వచ్చినతరువాత నవ్వుతాలుగా అడిగినాను: "నీకు స్మృతిలేనట్టు మాకు కనబడిన నీ అవస్థలో నీ కేమి కనబడినది?" అని.

"నా కేమిన్ని కనబడలేదు."

"ప్రయత్నం చేసి జ్ఞాపకం తెచ్చుకో."

"ఊహూఁ! ఏమిన్ని కనబడలేదు."

"పురాణాలలోను, శాస్త్రాలలోను ఏమేమో చెప్పతారే!"

"అవి నిజము కావచ్చును, నా కేమీ కనబడ లేదు."

"గట్టిగా ప్రయత్నము చెయ్యి."

చిరునవ్వు నవ్వింది. "ఆ తరువాత ఏముందో తెలుస్తే ఇంకేమున్నది?" అన్నది.

నావంటిదే ఆ వెర్రివేదాంతి!

* * *


ఆమెకు స్మృతితప్పిపోతున్నప్పుడు నాకు కనబడిన ఆజ్యోతి ఏమిటి? శారీరకవికారమా? అయితే అటువంటి మెరపే నామనసు కుదుటపడిఉన్న ఇప్పుడు కూడా అప్పుడప్పు డెందుకు నాకళ్లలో మెరుస్తుంది?

బ్రతుకుచావులమధ్య ఒక నల్లనితెర. అంధకారముకంటె గాఢాంధకారము. తెర కీవల మన లోకములో వెలుతురు; ఆతెరచాయ లీవెలుతురులో మిళితము లౌతూఉంటవి. తెరఆవల మహాతేజస్సు; ఆతేజస్సుకు ఈ చర్మచక్షువులు తాళలేవు.


ఆతెరను చీల్చుకొని అవలిజ్యోతిలో కలిసి పోవడానికి ఆమెఆత్మ ప్రయత్నించింది. ఆసందులో నుంచి ఒక్కకిరణము నాయెదుట మెరసింది. ఇది భ్రమ కాదనుకొంటున్నాను. ఆమె ఆవలికి పోకుండా తెర మూతపడినది.

* * *

మళ్లీ సంసారము. కామము — క్రోధము — మోహము — లోభము — మదము — మాత్సర్యము. జీవితనాట్యము—జగల్లీల. అదే ఈశ్వరలీల.



మహాబలిపురములోని దీపస్తంభము



పరీక్షా ఫలితాలు

శ్రీ నోరి నరసింహశాస్త్రి

[గత-౨౪]

౬

ఆశ కేమాత్రము అవకాశ మున్నా దానిమీద ఆధారపడడము మానవస్వభావము. అందువల్లనే పరీక్షఫలితాలు వచ్చిన మర్నాడుకూడా, తప్పిన విద్యార్థులు వార్తాపత్రిక చూస్తారు. ఆరోజు దిద్దు ఉండ కూడదా అని వాళ్ల ఆశ. కాని చంద్రునిది సామాన్య ప్రకృతి కాదు. భయానికి ఏమాత్రము అవకాశమున్నా దాని వదిష్ఠించి దానిలో కుంగిపోవడానికి అతడు తనశక్తి అంతా వినియోగిస్తాడు. "వచ్చే టర్ములో బాగా అభివృద్ధి చూపవలె నన్నారు. సంవత్సరం చివరదాకా చదవ నిచ్చి అప్పుడు అటెండెన్సు సర్టిఫికెటు పంపక పోతే మరీ కష్టము కాదండీ!" అనేవాడు. క్రిస్టమసు సెలవులు ఇట్లా గడిచిపోతూ ఉన్నప్పుడే నాబలవంతాన 'విమప్రయోగము' కథ వ్రాయ మొదలుపెట్టినాడు. తన అటెండెన్సు సర్టిఫికెటుమీద ధ్యానంపెట్టుకున్నవాడు 'విమప్రయోగము' ఎట్లా పూర్తిచేస్తాడు?

క్రిస్టమసు సెలవు లైనాక పట్నంవెళ్లినాము. ఆప్రయాణంలోనే అతను, ఉత్సాహంగా ఉన్న ఏదో ఒకక్షణంలో, లాకాలేజీ ముద్దువిద్యార్థుల సంగతి మాట్లాడడమూ, లాకాలేజీ విద్యార్థుల కందరికీ కోపము వచ్చి ఇతను తప్పవలెనని కోరుకోవడమూ తటస్థించినది.

పట్నంలో ఎండ లారంభించినవి. అప్పుడు మే మున్న గది మరీ ఇబ్బంది అనిపించింది. గదులకోసము వెదకినాము. చివరకు ఎక్కువ అద్దె పెట్టి ఒక పెద్దగది తీసుకున్నాము. నాకొత్త అడ్రసు స్నేహితులకూ, మా ఇంటికీ వ్రాసినాను. చంద్రుడుమాత్రము వాళ్ల ఇంటికి ఉత్తరం వ్రాస్తూ పాతఅడ్రసే ఇచ్చినాడు. అది నేను చూడడము తటస్థించి ఏమిటని అడిగితే "అడ్రసు మారి నప్పుడల్లా వ్రాయడ మెందుకు? ఇన్ని అడ్రసులు ఇస్తే ఏ అడ్రసుకు వ్రాయవలెనో తెలియక మావాళ్లు అసలు ఉత్తరమే వ్రాయరేమో! మన పాతగదిలో స్నేహితు లుంటారుగా. ఉత్తరము వస్తే వాళ్లు నా కివ్వరా?" అన్నాడు.

జనవరినెల గడిచిపోతున్నది. చంద్రునికి కొత్త భయ మొకటి వచ్చినది. అటెండెన్సు చాలదేమో! దసరా సెలవుల కింటికి వెళ్లినప్పుడు ఇంటినుంచి వారంరోజులు ఆలస్యంగా వచ్చినాడు. క్రిస్టమసు సెలవుల తర్వాత మూడురోజు లాలస్యంగా వచ్చి నాడు. ఇంకా అప్పుడప్పుడు ఒకటి రెండురోజులు క్లాసులకు వెళ్లలేదు. ఇవన్నీ కలిసి ముప్పైరెండు రోజులై, అతనికి అటెండెన్సు చాలకపోతుందేమో!

చేసి నవ్వినా, వాదించినా, లెక్కవేసిచెప్పినా అతని భయము మాత్రము తీర్చగలిగేవాణ్ణి కాదు.

ఒకరోజున వాళ్ల ప్రిన్సిపాలు కొందరిని తనతో మాట్లాడి పొమ్మని కబురంపినాడుట. ఆనోటీసు చూసి తనను కూడా పిలిపిస్తాడేమోనని, ఫీజిక్సుమాష్టరుతో పోట్లాడినవిషయమేననీ మొదట భయపడ్డాడుట. కాని ఆజాబితాలో తనపేరు లేదని త్వరలోనే తెలుసుకున్నాడు. అటెండెన్సు కొంత తక్కువగా ఉన్నవాళ్ల నట్లాపిలిపించి జాగ్రత్తగా ఉండమనిచెప్పినట్లు తెలిసింది. ఇందువల్ల తనకు అటెండెన్సు ఏమాత్రమూ తక్కువగా లేదని స్పష్టమైనప్పటికీ "ఏమో నన్ను పిలిపించడము మరిచిపోయి ఉండగూడదా? అంతా అయిపోయిన తర్వాత చివరకు తెలిస్తే ఏం చేస్తాము!" అని భయపడసాగినాడు. ప్రతి చిన్నవిషయానికీ ఉలకడము అతని జీవనమేమో!

కాని కొద్దిరోజులకే ఆభయము విచ్ఛేదమైపోయినది. ఎవరెవరికి ఎన్నెన్నిరోజులు అటెండెన్సు ఉన్నదీ జాబితా కాలేజీ బులెటినులో వేసినారు. చంద్రుడు స్కూలుకు వెళ్లనిది పన్నెండురోజులే. ఇక అతను భయపడేందుకే వీలు లేకపోయినది. నేనప్పుడు సందుచేసుకొని "చూశావా, ఊరికే భయపడ్డావు! ఇట్లాగే నీభయం ప్రతిదీని!" అన్నాను.

"ఏమో, ఎవరికి తెలుస్తుం దేం?" అని సిగ్గుతో చిరునవ్వు నవ్వుతూ చంద్రు డన్నాడు.

సరిగ్గా, అదృష్టవశాత్తుగా, ఈరోజుల్లోనే చంద్రునికి ఉత్సాహకారణాలు అన్నివైపులా కనపడసాగినవి. కొన్నాళ్లబట్టి వాళ్ల ఫీజిక్సులెక్చరరు ఎన్నడూ లేని ఆదరము చూప మొదలుపెట్టినాడట. ఆమధ్య వాళ్లంతా ఒక ఫోటోకు కూర్చున్నారు. ఆరోజు చంద్రుడు ఫోటోకు వెళ్లేప్పుడు కులాసాగానే వెళ్లినప్పటికీ బొమ్మల్లో మాత్రము ఏదో కలవరిస్తూ ఉన్నవాడివలె పడ్డాడు. ఆవేళటి కేదో పరధ్యానంగా ఉండి ఉంటాడు. ఆఫోటో చూచినప్పటినుంచే మొదలుట, వాళ్ల ఫీజిక్సులెక్చరరుగారి ఆదరము. ఆయనను ఆ బొమ్మలో ఏమాకర్షించినదో! అకారణకోపము వచ్చేవాళ్లకు అకారణవాత్సల్యమూ వస్తూఉంటుంది.

చంద్రునికి చదువు బాగా సాగడము మొదలుపెట్టింది. అతని మనోవీథివలెనే చెన్నపట్టణముఆకాశముకూడా నిర్మలంగా ఉంటున్నది. మాకొత్తగది మెత్తాన వసతిగానే ఉంటున్నది. అందులో అతని మొదటికథ ఇన్నాళ్లా ప్రచురము కాకుండి ఆరోజుల్లోనే 'భారతి'లో ప్రచురణమై వచ్చినది. తనపేరు మొదటిసారి అచ్చులో చూచినప్పుడు గ్రంథకర్తకు కలిగేసంతోషమతని కప్పుడు కలిగినది. 'చంద్రశేఖరం' అని అతనినిండుపేరు స్ఫుటంగా పెద్ద అక్షరాలతో అచ్చుపడ్డది. అది చూచినప్పుడు సాహృదయమే గంతు వేసినది. అన్నిటికీ అనుగుణంగా ఆకథ చదివినవాళ్లల్లా దానిని పొగడసాగినారు. కొంతమంది దానిని పొగడడంతో ఊరుకోక నాకథలతో పోలికలుపెట్టి అతని కథే ఎక్కువ బాగున్న దన్నారు. అందువల్ల అతను కొంత ఉబ్బకపోలేదు. అందుకు నాకు అతనిమీద కాని, ఇతరులమీద కాని ఏమాత్రమూ ఈర్ష్య కలగలేదు. చంద్రుణ్ణి, అతనికథనూ పొగడితే నన్నూ, నాకథలనూ పొగడినకంటె ఎక్కువ ఆనందము నాకు కలిగేది.

ఒకనాటి సాయంకాలము ఆకథచదివిన పండితుడు మాగదికికూడా వచ్చి చంద్రుణ్ణి ఎదటనే ప్రశంసించి, ఆకథ అంతా ఒక్కసారిగా వ్రాసి ఉండవలెననే తన ఊహ నిజమనిరించుకొని వెళ్లిపోయిన సంగతి వెనకనే చెప్పినాను. మరి ఆరాత్రి ఆసంతోషముతో చంద్రుడు గంటసేపు చదువుకూడా చాలించి ఆ పెద్దమనిషి సంగతే మాట్లాడినాడు.

౭

ఆ మర్నాడు పొద్దునే మాగదికి చంద్రుని చిన్ననాటి స్నేహితుడొకడు వచ్చినాడు. అతని పేరు ఉచ్చరించనని నాకొక ప్రతిజ్ఞ ఉన్నది. కాని ప్రస్తుతము నియమభంగము చేసుకోక తప్పదు. వెంకటరామయ్య పొడుముకాయవలె పొట్టిగా, నల్లగా ఉంటాడు. ఇంతకంటె అతని విషయము నేనేమీ

మాట్లాడగూడదు కాని ఈ మధ్య చంద్రుడు చెప్పిన అతని కథ ఒకటిమాత్రం నాలో ఆగడంలేదు.

మన జనసామాన్యములో పచ్చదనమూ, ఎఱ్ఱదనమూ చక్కదనానికి పర్యాయపదా లయిపోయినవి. దేశాభిమానం కోసమైనా మనము నల్లదనము అందమనము. తెల్ల వాళ్ల రంగును చాలామంది నిరసిస్తారు కాని మనస్సులలో వాళ్లు దాని ఆకర్షణను ఎరగనివాళ్లు కారు. వెంకటరామయ్య ఈ శషభిషలేవీ పెట్టుకోక తెల్లదొరసానులను పొగడుతూ ఉంటాడు. ఒకసారి తెల్లదొరసాని ఒకతె అతనితో "మీ దేశములో నల్లనివాళ్లు మా కెక్కువ బాగుంటారు" అన్నదట. కారునలుపుకూ, తెలుపుకూ ఏమి అన్యోన్యాకర్షణ మున్నదో మనకు తెలియదు. ఏది ఎట్లా ఉన్నా ఆ తెల్లదొరసాని అట్లా మాట్లాడినప్పటినుంచే వెంకటరామయ్య వాళ్ల అందాన్ని పొగడడము సాగించింది! అప్పటినుంచే, ఏమాత్ర మవకాశ మున్నా, వాళ్లను చూడడానికి పోవడము! ఇది మొదటిసారి విన్నప్పుడు మన చంద్రుడు "ఓరి పిచ్చివాడా, నిన్ను దివాలా తీయడానికి అది అట్లా అన్నదేమోరా" అన్నాడు. వెంకటరామయ్య కోపముతో వెలాతెలా పోయినాడట. "మన దేశంలో ఎవరూ అతన్ని, అతనిరంగునూ పొగడక నాకోఆపరేషను చేస్తే అతను అంతమాత్రము తెల్లవాళ్ల అందాన్ని పొగడడము తప్పా? నీ వెందుకతనితో అంత కఠినంగా మాట్లాడవలె!" అని చంద్రశేఖరాన్ని నా కీమధ్య ఈసంగతి చెప్పినప్పుడు నేను కోపపడ్డాను.

పాపము, మాగదికి వచ్చినప్పుడు వెంకటరామయ్య తెల్లదొరసానుల అందముసంగతి మాట్లాడే స్థితిలో లేడు. మన్నెపుజ్వరముతో బాధపడుతూ రెండు రోజులబట్టీ లంకణము చేస్తున్నాడు. అతను ట్యుటోరియలు కాలేజిలో చదువుతూ రాజమహేంద్రవరము సెంటరుకు దరఖాస్తు పెట్టినాడు. పదిరోజుల్లో ఇంటికి వెళ్లి అక్కడినుంచి రాజమండ్రి వెళ్లదా మనుకుంటూఉండగానే ఈజ్వరము వచ్చి ప్రయాణం తొందరచేసింది. ఆరోజే ప్రయాణం కొదలచుకొని డబ్బులేక చంద్రునివద్ద పదిరూపాయలు బదులు తీసుకుందా మని వచ్చినాడు. చంద్రునివద్దకూడా పైకము లేక నాదగ్గర తీసుకొని ఇచ్చినాడు. ఆరోజుకూడా అతను లంకణము చేదా మనుకొన్నాడు కాని నేనే బలవంతపెట్టి మాహోటలులో పథ్యంగా భోంచేసేట్లు చేసినాను. భోజనము చేసినతర్వాత అతనికి కొత్త ఓపిక చేరుకున్నది.

అప్పుడు మళ్లీ వెంకటరామయ్య చంద్రునితో కలిసి మాగదికి వచ్చినాడు. నేను టాగూరు కథల పుస్తక మేదో చదువుకుంటూ కూర్చున్నాను. వాళ్లేమేమో మాట్లాడుకున్నారు. పరీక్షరోజుల్లో విద్యార్థులు ఒకరి నొకరు కలుసుకొన్నప్పుడు ఎట్లా చదువుతున్నా వని ఒకరి నొకరు అడగడము ఆచారము. ఎంత బాగా చదువుకున్నప్పటికీ ఆ ప్రశ్నకు జవాబుగా "ఏమోరా, ఏమీ చదవడము లేదు" అనడము కూడా ఆచారమే. అట్లా అనకపోతే అవతలివాడు "నీకేంలే, ఫస్టుక్లాసులో ప్యాసవుతావు" అంటాడు. అటువంటి మాట పడడముకంటె మన విద్యార్థికి అవమాన మింకొకటి లేదు.

మన చంద్రుడికీ, వెంకటరామయ్యకూ కూడా అటువంటి సంభాషణే జరిగింది. కాని చంద్రుడు సంప్రదాయానికి కొంచెము విరుద్ధంగా "ఇంగ్లీషు ఫరవా లేదు కాని ఆప్షనల్ సబ్జక్టులవిషయము ధైర్యం లేదు" అన్నాడు. వెంకటరామయ్య హిస్టరీ మొదలైన తన సబ్జక్టులు ప్యాసయినాడు. ఇంగ్లీషే కావలసిఉన్నది. కాబట్టి వాళ్లిద్దరూ ఆపైన ఇంగ్లీషులో ఏమేమి ప్రశ్నలు రావచ్చునో, ఎట్లా ఎట్లా జవాబులు వ్రాయవలెనో మాట్లాడుకుంటూ కూర్చున్నారు.

నేను టాగూరుపుస్తకము పూర్తి చేసేప్పటికి వాళ్లసంభాషణకూడా పూర్తి అయింది. అప్పుడు మా సంభాషణలో ఏదో సందర్భంలో కొత్తగా అచ్చయిన చంద్రుని కథసంగతీ, అప్పు డచ్చవుతున్న ఇంకొక రెండుకథల సంగతీ ప్రస్తావము రాక తప్పింది కాదు. అప్పటిదాకా వెంకటరామయ్య చంద్రుడు కథలు వ్రాస్తున్న సంగతి ఎరగడు.

అతని స్నేహితుని ఎదట తన కథల సంగతి మాట్లాడడముచేతనూ, ఆవెనకటిరోజునవే పండితుడు

మాగడికి కూడా వచ్చి అతని కథను పొగడిపోవడము చేతనూ ఈమధ్య కొత్త ఉపక్రమించిఉన్న కథ నోత్సాహము చంద్రునిలో మళ్లీ మొలకెత్తినది. వెంటనే నేను అది కనిపెట్టి "అప్పుడు పూర్తిచేయకుండా ఉన్న 'విప్రప్రయోగము' ఇవ్వాళ పూర్తిచేస్తావా ఏమిటి? ఒక్కరోజుతో చదువు ముంచుకుపోదేమిటి?" అన్నాను.

"ఇప్పుడు వ్రాయలేనండీ" అన్నాడు చంద్రుడు.

"ప్రయత్నం చేయలేవా?" అన్నాను.

"ఏమి లాభము? వ్రాయలేను" అని చంద్రుడన్న మీదట నేను ఒత్తి అడగడము చాలించినాను. ఆ 'విప్రప్రయోగము' కథ నాటికీ నేటికీ పూర్తికానే లేదు.

నేనప్పుడే పూర్తిచేసిన టాగూరు పుస్తకములో చంద్రుడు వ్రాతా మనుకొన్న కథలాంటిదే ఒకటి ఉన్నది. చంద్రుడు కథ వ్రాయలేడని తెలిసిన తర్వాత ఆకథా, ఇంకో మూడు చక్కని కథలూ గుర్తుపెట్టి "ఇవి మాత్ర మన్నా చదువు, కథ వ్రాయకపోతే వ్రాయకపోయినావు! మళ్లీ పుస్తకము సాయంత్రానికే ఇచ్చివేయవలె" అన్నాను. చంద్రు డాకథలు చదివి మెచ్చుకున్నాడు. ఆ ఉత్సాహంలో నేను గుర్తుపెట్టినవే కాక, ఇంకా రెండు ఇతరకథలుకూడా చదివినాడు.

కొంత విశ్రాంతి తీసుకొని సాయంత్రంనుంచీ వెంకటరామయ్య వెళ్లిపోయినాడు.

౭

వెంకటరామయ్య వెళ్లి వారమురోజు లైనది. ఆరోజున నేనింటికి త్వరగా వచ్చి నాకువచ్చిన ఉత్తరాలకు జవాబులు వ్రాసి చంద్రు డింటికి వచ్చేవేళ కాగానే అతనికి వచ్చిన ఉత్తర మియ్యడానికి అతని రాకకు నిరీక్షిస్తూ ఉన్నాను. వ్యవహారపు ఉత్తరాలు ఎక్కువ వ్రాయనివాళ్లకు వచ్చే ఉత్తరాలు సామాన్యముగా ప్రేమాస్పదులు వ్రాసినవై ఉంటవి. అందువల్ల ఆ ఉత్తరాలు ప్రేమసందేశాలుగా ఉంటవి. నే నారోజున చంద్రుని కా ఉత్తరమిచ్చి సంతోషము కలిగించడానికి ఎదురు చూస్తూ ఉన్నాను.

అట్టి సమయంలో చంద్రుడు వచ్చినాడు. అతను వాకిట్లో అడుగుపెట్టీ పెట్టడంతోనే ఆ ఉత్తర మతని కళ్లబడ్డది. అది చూసీచూడడంతోనే అకస్మాత్తుగా అతని ముఖము వికృతమైనది. ఎండలో నడిచి రావడమువల్ల కలిగిన చెమట మరింత ఎక్కువైనది. కొంచెము కంపిస్తూఉన్న కంఠముతో అతను "ఈఉత్తర మిక్కడి కెట్లా వచ్చినది?" అంటూ ఆ ఉత్తర మందుకొనేప్పుడు అతని చేతులు వణుకుతున్నవి. నేను నిర్ఘాంతపోయి చూస్తున్నాను.

అతను అది చదువుతున్నంతసేపూ నిలువెల్లా నీరసమైనాడు. ఉత్తరము చిన్నదే ఐనప్పటికీ, ఆ అడావిడిలో అక్షరాలు స్పష్టముగా గోచరించక కాబోలు, ఎంతోసేపు చదువుకున్నాడు. ఉత్తర మొకసారి పూర్తిచేసిన తర్వాత మళ్లీ తిప్పి ఒకటి రెండు పర్యాయములు చదివినాడు.

చిరకాలము గాఢమైన అనురాగాదరములు కలిగి అతి కోమలస్వభావులతో కలిసిఉన్న తర్వాత వారి భావములు తెలుసుకోడానికి వాళ్లు పలికే మాటలు వినవలసిన అవసరము లేదు. వాళ్ల ముఖభంగులే ఒక్కొక్కప్పుడు మాటలకంటె స్పష్టతరముగా వాళ్ల భావములను వ్యక్తీకరిస్తవి. రెండు నిముషాలు అతనివంక నేను ఆదుర్దాతో చూచేసరికి అతను చదువుతున్న ఉత్తరముసారాంశము నాకు బోధపడ్డది.

అతను వాళ్ల ఇంటికి తన కొత్త అడ్రసు ఇయ్యలేదుగదా! ఈ అడ్రసుకు వాళ్ల నాన్నగారి దగ్గరనుంచి ఉత్తరము రావడమువల్లనే దస్తూరీ గుర్తుపట్టి ఉత్తరము చూసీచూడడంతోనే అతడు కంపించినాడు. ఉత్తరములో పలకూడా కోపిస్తూ ఉన్న మాట లున్నవి. గదులు ఊరికే మారుస్తూ ఉన్నావేమనీ, కథలు వ్రాస్తూ చదువు పాడుచేసుకోవద్దనీ అందులో ఉన్నదను కొన్నాను. కాని నాకా ఉత్తరము చూపమనిగాని, సారాంశము చెప్పమనిగాని అడగవలెననే ఊహకూడా నాకు రాలేదు. అతనూ ఆవిషయ మేమీ మాట్లాడలేదు.

మళ్లీ ఆరోజునుంచి అతని హృదయాకాశాన కాలమేఘ మావరించినది. వెనకటికంటె ఏమాత్రమూ ఎక్కువ చదవలేకున్నాడు. కాని ఆవిషయమైన ఆదుర్దా, పరీక్షను గూర్చిన భయమూ అతిశయింప సాగినవి.

జ్వరము తగిలినట్లు ఆరోజునుంచీ రాత్రిళ్లు అతని ఒళ్లు వేడిగా ఉండసాగినది. ఐనా వెనకటివలెనే చదువుతూ అంతకంతకు తక్కువనిద్ర పోతున్నాడు. నాకు ఆదుర్దా ఎక్కువయింది. ఇట్లాగే పరీక్షలదాకా ఉంటే పరీక్షకు కూర్చోగలడా అనిపించింది. అతను మందైనా తీసుకోవడం లేదు.

ఒకరోజున అతనికి తీవ్రమైన జ్వరం వచ్చింది. ఆరాత్రికూడా చదువుతూనే ఉన్నాడు. అప్పుడు నేను పట్టలేక "ఇట్లా ఉంటే నీవు పరీక్షనాటికి మూలపడతావు, వైద్యుణ్ణి ఐనా చూడు!" అన్నాను. అతను తన ఆరోగ్యవిషయములో చూపుతున్న అశ్రద్ధకు నాకు దిగులే కాక కోపముకూడా వచ్చింది.

నా ప్రశ్నకు జవాబు చెప్పినప్పటి అతని కంఠస్వరము ఇప్పటికీ నా చెవులలో ఘోషించి హృదయభారము కలిగిస్తున్నది.

"వైద్యు డెందుకండీ! పరీక్ష ప్యాసుకాని దానికి!" అన్నాడు. పరీక్ష చదువుకూ, వైద్యానికీ హీనముగా సంబంధము కల్పించినాడేమో ఇతనని మొదట నాకసహ్యము వేసినది. కాని ఒక్కక్షణములోనే అతని మనోవ్యథ నాకు గోచరించినది. అప్పటికి నే నేమీ మాటలాడ లేకపోయినాను.

ఆరోజు రాత్రి పదిగంటలైనది. నేను నిద్రపోవడానికి పక్కవేసుకొని పడుకున్నాను. చంద్రుడింకా చదువుకూనే ఉన్నాడు. నాకు నిద్ర పట్టలేదు. చంద్రుని సంగతే ఆలోచిస్తూఉన్నాను.

అప్పుడు నాకొక ఊహ తోచింది. వెంటనే నేను లేచి చంద్రుని పరుపుకూడా పరిచి "చంద్రా, నీ విహ పడుకో" అని ఆదర ముట్టిపడే స్వరముతో అన్నాను. అతను తలఐనా ఎత్తక, జవాబుచెప్పక చదువుకుంటూనే ఉన్నాడు. నాకు కన్నుల నీళ్లు గిర్రున తిరిగినవి.

అంతట నేను దగ్గరకు పోయి అతని రెండు చేతులూ పట్టుకొని "నీకు జ్వరము వేగిపడుతున్నది! ఇవ్వాళిటికి నామాట విని ఇంతటితో పడుకో! నీకు చదివినది వంటపట్టదు కూడాను" అన్నాను. ఆమాటలు మాట్లాడుతూ ఉన్నప్పుడు నాకు డగ్గుత్తిక పడ్డది.

చంద్రుడు నెమ్మదిగా చేతులు వదిలించుకొని "మీకు తెలియదుకాని, మీరు నిద్రపోండి!" అన్నాడు.

ఇంత ఆరోగ్యవంతుణ్ణి ఏమీ చేయలేకపోయినాను. నా కేమీ తోచక అతనివంక ప్రేమఒలికే చూపులతో తీక్ష్ణముగా చూడసాగినాను. అత నప్పుడున్న స్థితిలో నన్ను తిట్టినా నాకు కోపము వచ్చేది కాదేమో! కాని తిట్లకంటె క్రూరమైన నిశ్శబ్దముతో అతను తలవంచుకొని చదువుకో సాగినాడు.

ఎంతసేపు చూసినా నాచూపు నిష్ప్రయోజనమైనది. చివరకు విసిగి లేస్తూ "ఐతే నీ విప్పుడు పడుకోవా?" అని కఠినంగా అన్నాను. ధ్వని కఠినంగా ఉన్నదే కాని నా హృదయ మప్పుడు ఆర్ద్రమై ద్రవిస్తున్నది. నా కంఠధ్వనిలో ఏదో అతన్ని ఆకర్షించగా తల ఎత్తి చూచినాడు. నాకళ్లనిండా నిండిన నీళ్లమీద అతనిదృష్టి పడ్డట్లున్నది. అతను నావంక తదేక దృష్టితో కొంతసేపు చూసి చివర కేదో మహా నిశ్చయము చేసుకున్నవానివలె "అయ్యా, మీరు నా కోసము ఆదుర్దాపడక నిద్రపోండి. రేపు డాక్టరుకు చూపిస్తాను, ఇక సరేనా!" అని యథాప్రకారము తలవంచుకొని చదువు సాగించినాడు.

అంతట నేను రభసముగా అక్కడినుంచి లేచిపోయి నా పక్కమీద పండుకొన్నాను. అప్పటికీ చంద్రుడు నిశ్చలముగా చదువుకుంటూనే ఉన్నాడు. ఎప్పటికి నాకు నిద్రపట్టినదో, ఎప్పుడు చంద్రుడు చదువు చాలించినాడో నాకు తెలియదు.

నా కెంత ప్రేమ ఉన్నదో అంత అహంకారమూ, అభిమానమూ కూడా ఉన్నవి. ఆరాత్రి నన్ను కన్నీళ్లు కార్చేట్లు చేసినవాడే, చివర కింత అమూల్యమైన కన్నీళ్లు కార్చినా నామాట పెడచెవినిబెట్టి నన్నవ

మానపరచినవాడే అని నాకు విచిత్రమైన కోపము కలిగినది. అందువల్లనే మర్నాడు పొద్దున చంద్రుడు డాక్టరుదగ్గరకు వెళ్లడము నేను జ్ఞాపకము చేయలేదు. అతనూ వెళ్లలేదు. అందామని ఎన్నోసార్లు నోటిదాకా వచ్చింది కాని ఆపూట నా అహంకారమే జయించింది.

ఆ మధ్యాహ్నమే మా ఊరినుంచి నా ముఖ్య స్నేహితుడు వ్రాసిన ఉత్తరంలో ఇలా ఉన్నది:

“................

నీవు చంద్రశేఖరాన్ని చెడగొట్టుకున్నావనీ, అతను కథలు వ్రాయడంతో ఏమాత్రమూ చదవడం లేదనీ, ఆప్షనల్సులో ప్యాసు కావని అతనే చెప్పినాడనీ వెంకటరామయ్య అనే పెద్దమనిషి వాళ్ల నాన్నగారితో చెప్పినాడట. కోపిస్తూ వాళ్లనాన్నగారు చంద్రశేఖరానికి ఉత్తరం వ్రాశారట. ఆ వెంకటరామయ్య అనే దుర్మార్గుడు ఎవరు? నీ సహవాసము వల్ల ఎవరూ చెడిపోరే, బాగుపడతారు గాని!”

ఆ భాగము చదివేటప్పటికి నా దేహములో నెత్తురంతా శిరస్సు కెక్కింది. వెంటనే చంద్రునికి ఉద్రేకముతో వినిపించినాను. అన్నినిజాలూ తేలినవి. చంద్రుడి నాన్నగారికి నేను పెద్ద ఉత్తరం వ్రాసినాను. కాని ఇంతలో నా అహంకారము వచ్చినది. నేను చేసే పనులకు కారణము మా నాన్నగారికే చెప్పనివాణ్ణి చంద్రశేఖరము తండ్రిగారికి వ్రాయడము నా గౌరవానికి భంగకరమనిపించినది. “నా సద్భావము వారే తెలుసుకుంటారు! లేకపోతే మాత్రము నష్టమేమి!” అనుకున్నాను. ఇట్లా అనుకొని ఆ ఉత్తరము పోస్టులో వేయలేదు.

ఆ సాయంత్రము నేను షికారు వెళ్లుతూఉంటే చంద్రుడు తానుకూడా వస్తానని బయలుదేరినాడు. అట్లా వస్తే అన్యాయముగా నొచ్చిన నామనస్సుకు కాస్త శాంతి వస్తుం దనుకున్నాడేమో!

“రోజూ జ్వరం తగులుతున్న నీవు బయటికి రావడము మంచిది కాదు. అందులో సముద్రతీరానికి అసలు రాకూడదు” అన్నాను.

చంద్రుడు ఆదరంతో “మీకట్లా కనపడుతుంది కాని నాకు జ్వరం రావడంలేదు. ఊరికే కాస్త ఒళ్లు వేడిగా ఉంటున్నది. ఐనా మన మెక్కువ దూరము వెళ్లవద్దులెండి!” అన్నాడు.

చంద్రుడు రావడానికి నిశ్చయించినట్లున్నాడు. నేనిక రావద్దంటే, పట్టుదలకు, నేను వెళ్లినదోవను కాక ఇంకోదోవను వెళ్లుతాడని తెలుసుకొని అతని రాకకు సమ్మతించినాను. అతనూ ఉల్లాసముగానే బయలుదేరినాడు.

బీచివద్దకు వెళ్లినాము. అప్పుడు చంద్రుడు మాకు ఎదురుగా వస్తున్న ఇద్దరిని చూపి “వాళ్లే మా కెమిస్ట్రీ ఫిజిక్సు లెక్చరర్లు” అన్నాడు.

అందులో జోక్యము లేనివానివలె “అట్లాగా!” అన్నాను.

వాళ్లు దగ్గిరికి రాగానే చంద్రుడు నమస్కరించినాడు. వాళ్లల్లో ఒకాయన “బాగా చదువుతున్నావా?” అని ఇంగ్లీషులో ప్రశ్నించినాడు. “బాగానే చదువుతున్నా” నన్నాడు చంద్రుడు. అంతట వాళ్లేదో మాట్లాడుకుంటూ మమ్మును దాటిపోయినారు.

నా ధోరణిని నే నేదో మాట్లాడుతున్నాను. ఇంతలోనే చంద్రుడు చిరునవ్వుతో “మా ఫిజిక్సు లెక్చరరు అంటున్నది విన్నారా?” అన్నాడు. చంద్రుని ఆ చిరునవ్వును చూస్తే నాకు భయము. అటువంటిచిరునవ్వు అతని భవిష్యద్బాధాసూచకము.

“లేదు” అన్నాను.

“ఎట్లా ఉన్నాడని నా సంగతి కెమిస్ట్రీ టీచరడుగుతే ఫిజిక్సుటీచరు ‘గోడమీద ఉన్నా’ డని చెప్పుతున్నాడు.”

“వాడి మొఖం” అన్నాను నేను.

“దానికేం లెండి! ఆయనకు తోచింది ఆయన చెప్పినాడు!”

“సరే కాని నామాట విను. వీళ్లకు నీవు ప్యాసవుతావనికూడా ధైర్యము లేదు కాబట్టి ముఖ్యంగా ఫిజిక్సులో డిస్టింక్షను తెప్పించుకోవాలె!” అన్నాను.

"నామొహం! నేను ప్యాసయితే చాలులెండి!" అన్నాడు. చంద్రుడికి అహంకార మున్నదన్న లా కాలేజీవిద్యార్థులు అమాటలు విని అప్పటి అతని ముఖం చూసిఉంటే బాగుండేది.

హాలుటిక్కెట్లు ఇచ్చే రోజులు వచ్చినవి. నెంబర్లు శుభమైనవీ, అశుభమైనవీ ఉంటవని విద్యార్థులు అనుకుంటూ ఉంటారు. వాళ్లు అది నవ్వుతూనే అన్నప్పటికీ వాళ్లకే చెడ్డనెంబరు వచ్చినప్పుడు మనస్సులలో ఎంత బాధపడతారో తెలుస్తే నవ్వు రాకతప్పదు. నెంబరు మంచీ చెడ్డా తేల్చడానికి నానా విద్యార్థులలో నానామతా లున్నవి. అది నాలుగుచేత నిశ్శేషముగా విభాజ్యమై ఉండవలెనని కొంతమందీ, రెండుచేతనైతే చాలు—సరిసంఖ్యగా ఉండడమే ప్రధాన మని కొంతమందీ, ఎనిమిదింటిచేత విభాజ్యమై ఉండవలెనని మరికొందరూ అంటారు. కాని ఏడూ, సున్నల విషయములో అభిప్రాయభేదాలు లేవు. చంద్రుని కిటువంటిదేదో తటస్థపడవచ్చు ననీ, ముందుగానే జాగ్రత్త చేయవలెననీ ప్రయత్నం చేసినాను. అవన్నీ వ్యర్థభయములని నేనంటే చంద్రుడు "లేకపోతే ఏమిటి!" అని బలముగా అన్నాడు. ఐనా ముందే జాగ్రత్త చేయడము కోసము "ఏడు చెడ్డ సంఖ్య అని తెలుగుదేశంలో తప్ప మరెక్కడా ప్రతీతిపడలేదు. అది ప్రతిదేశము లోనూ మంచిసంఖ్య కూడాను. ఇక సున్నలోనుంచే కొందరు ఓంకారమునూ, పరబ్రహ్మమునూ ఉద్భవించినట్లు రూపించినారు." అని ఈ విధముగా ప్రసంగించినాను. చంద్రుడు పోయి హాలుటిక్కెట్టు తెచ్చుకున్నాడు. నేను భయపడ్డట్లే ఏడూ, సున్నా లున్న సంఖ్యే వచ్చింది. మును పిదంతా విని నవ్వినప్పటికీ శుభాశుభసంఖ్యల సిద్ధాంతముల సంగతీ, వాటికీ తన సంఖ్యకూ ఉన్న సంబంధముసంగతీ ఆరోజు కొన్ని గంటల సేపు నాతో చంద్రుడు మాట్లాడక ఊరుకోలేదు.

హాలుటిక్కెట్టులో అతనినెంబ రెట్లా ఉన్నా అది చూడడంతో చంద్రునికి ఒక భయము తీరింది. ఫీజెక్కువలో రెండవ టర్ము జాగ్రత్తగా ఉండకపోతే అటెండెన్సు సర్టిఫికేటు పంపమన్న బెదిరింపుభయం ఇక లేదు. "కాబట్టి నా అటెండెన్సు సర్టిఫికెట్టు పంపినా రన్నమాట!" అన్నాడు చంద్రుడు, చేతులో హాలుటిక్కెట్టు పట్టుకొని.

కాని దురదృష్టపు చంద్రునికి దెబ్బలు అంతటితో ఆగలేదు. జ్వరము రావడ మాగిపోయినది కాని ఆరోజు కారోజుకు క్షీణించిపోతున్నాడు. మనిషికి వికృతాకారము పడుతున్నది.

పరీక్ష నాలుగురోజు లున్నది. నేను మధ్యాహ్నము ఒకానొక స్నేహితునివద్దకు వెళ్లి వచ్చేటప్పటికి చంద్రుడు చేతులో ఒక కార్డు పట్టుకుని కొంచెము చిన్నబోయిన ముఖంతో నవ్వుతూ "ఇప్పటికీ మా నాన్నగారు నేను బాగా చదవడం లేదనే అనుకుంటున్న ట్లున్నారు. బాగా చదివి ఆఖ్ఖ వల్సులోకూడా ప్యాసు కావలసినదని ఉత్తరము వ్రాశారు" అన్నాడు.

అప్పుడు నే నేమీ మాట్లాడలేదు. ఆదరముతో అతన్ని చేరి, అవుశ్య సరియైన సంస్కారము లేక చిక్కుపడిఉన్న అతని క్రాపింగు స్వాధీనమైనంతవరకూ దువ్వినాను. కాని భూమ్యాకాశము లన్నీ ఈ కుఱ్ఱవాణ్ణి పరీక్ష తప్పించవలెనని ప్రయత్నం చేస్తున్నట్లు నా కప్పుడు పొడకట్టక తప్పిందికాదు. ఇంత సుకుమారునిమీద లోకానికి అంత కసి ఎందుకో!

౬

ఆశిషూ, చంద్రుని పరీక్ష రోజు వచ్చినది! కనపడకుండా పిశాచమువలె ఇన్నాళ్లబట్టీ వెళ్లి చంద్రుణ్ణి బాధిస్తూ ఉన్న పరీక్ష ఎట్లాగో అట్లా కొద్దిరోజుల్లో ఐపోతుందిగదా అని నిద్రలేవగానే నాకు తోచి, భారము తీరినట్లు నిట్టూర్పు విడిచినాను.

ఆరోజు చంద్రుడు శుభ్రంగా తలదువ్వుకొని శుభ్రమైన బట్టలు చక్కగా కట్టుకొని నవ్వుమొగంతో పరీక్షకు వెళ్లినాడు. అతని ఫౌంటెను కలములలో జాగ్రత్తగా నేనే సిరా పోసి ఇచ్చినాను. నేనూ మా కాలేజీకి వెళ్లినాను. కాని నా మనస్సు వింటున్న ఉపన్యాసాలమీదకంటె చంద్రునిమీదనే ఎక్కువగా ఉన్నది. "ఇప్పటికి పేపరు చూసుకొని జవాబు వ్రాయ మొదలుపెట్టి ఉంటాడు — ఇప్పటికి సగము పేపరు బాగా

వ్రాసి ఉత్సాహంగా ఉంటాడు — ఇప్పటికి పేపరు పూర్తిచేసి హాలులోనుంచి బయటికి వచ్చి ఉల్లాసంగా కాఫీకి వెళ్లుతూ ఉంటాడు —" ఎంత ఆపినా ఆగక నాబుద్ధి ఇటువంటి ఊహలతో చంద్రునివద్దకు పరుగు లెత్తుతున్నది.

ఆరోజు సాయంత్రము ఎంత ఉత్కంఠతో అతని రాకకు ఎదురుచూచినానో ఊహించుకోవచ్చును. సంస్కృతకావ్యాలలోని వాసకసజ్జికాది శృంగార నాయికలు జ్ఞాపకం రాగా నాలో నాకే నవ్వువచ్చినది.

చివరకు నవ్వుతూ వచ్చినాడు. "అన్ని పేపర్లూ ఇట్లాగే ఉంటే మీ రన్నట్లు నాకు ఫస్టుక్లాసు తప్పదు" అన్నాడు.

నాకు ధైర్యము కలిగినది. మొదటిరోజు పేపర్లు బాగా ఉంటే చంద్రుడు మిగిలినవి ధైర్యంగా వ్రాస్తా డని నాకు తెలుసును.

మర్నాడు సాయంత్రముకూడా ఏమి చేయ డానికీ తోచక చంద్రుని రాకకు నిరీక్షిస్తూ ఉండగా అతను దిక్కుమొగంపెట్టుకొని కాస్త ఆలస్యంగా వచ్చినాడు. నా కాశ్చర్యమయింది.

"బాగానే వ్రాశా నని సంతోషిస్తూ వచ్చానండీ! కాని దోవలో తెలిసింది. ఈ ప్రశ్నకు ఒక్క పేజీ మించకుండా జవాబు వ్రాయ మని ఉంటే మూడక మూడు పేజీలు వ్రాసి వచ్చానండీ! ఇక ఇంగ్లీషులోకూడా ప్యాసుకావడ మనుమానమే" అన్నాడు.

"నీవు అనుమానించ మొదలుపెట్టితే రేపు తెలుగు కాంపోజిషనుకూడా అనుమానమే"అన్నాను.

"అది మాత్రము ఎవరికి తెలుసు! ఇప్పటికి కాస్త ఐనా చదవలేదు. అయినా ఈ ఇంగ్లీషు ప్యాసు కావద్దూ?" అన్నాడు.

"చెడిపోయినది ఒక ప్రశ్నేగదా! నిన్న రెండు పేపర్లూ, ఇవ్వాళ ఒక పేపరూ, ఒక్కప్రశ్న తప్ప ఇవ్వాళ రెండో పేపరూ బాగా వ్రాసినావుగదా. మార్కులన్నీ కలుపుతారు. నీవు ప్యాసుకాకపోవు గాని వృథాగా అధైర్యపడవద్దు!" అన్నాను. కాని నామాట లతనికి ఎంత ధైర్యము కలిగించినదో ఎరగను.

మర్నాడు తెలుగు కాంపోజిషను! ఆరోజు కూడా వెనకటిరోజు ప్రశ్న చెడగొట్టినదాని సంగతి మాట్లాడుతూనే ఉన్నాడు.

ఆ మర్నాడు లెక్కలు! అతను పరీక్షకు వెళ్లుతూఉంటే "అధైర్యపడకుండా వ్రాయి! డిస్టింక్షను మరవవద్దు!" అన్నాను.

"ఏమో, మొదటిలెక్క బాగా వస్తే మిగిలిన వన్నీ బాగానే చేస్తాను!" అన్నాడు.

ఆసాయంత్రము అతను డీలాపోయి వచ్చినాడు. "ఇవ్వాళ బొటాబొటీగా మార్కులు వస్తవేమో! పొద్దున పేపరంతా చెడగొట్టినాను" అన్నాడు.

"సాయంత్రం పేపరో?"

"సాయంత్రం పేపరు బాగానే వ్రాశాను. రెండూ కలిపితే ప్యాసుమార్కులు రావచ్చునేమో!"

"సరే, ఐపోయిన దైపోయినది. రేపటికి జాగ్రత్తగా చదువు, ఫిజిక్సుగదా!" అన్నాను.

"ఎందుకండీ ఇంకా చదవడము!"

"తప్పతావని నిశ్చయం లేదుగా లెక్కల్లో! మిగిలినవి చదవవద్దూ?"

"తప్పతావని నిశ్చయ ముండవలెనా ఏమిటి?"

"ఇట్లా అసందర్భంగా మాట్లాడుతున్నావు, నీకు పిచ్చా ఏమిటి?" అని ఎన్నోవిధాల నవ్వించీ, ఆడించీ ధైర్యంచెప్పి చదువుకు కూచోబెట్టినాను. కాని ఇన్నాళ్లబట్టీ చదివిన బడలికకు నిలవలేక దీపము ముందు కూర్చున్నవాడు కూర్చున్నట్టే కాస్తసేపట్లో నిద్ర పోయినాడు. ఒళ్లు కొంచెము వెచ్చగా ఉన్నది.

మర్నాడే ఫిజిక్సు! అందులోనే అతనికి తప్పతావని ఏదో అధైర్యముగా ఉన్నది. కాని అంతముఖ్యముగా మరేదీ చదవలేదు. హాస్యాద్భుతములు అందులోనే ఉంటవి.

అతడారోజు ఆశ్చర్యపడతాడని, పరీక్షకు వెళ్ళేటప్పుడు నేను దగ్గర ఉండి ఫౌంటెనుకలము లందించి చేతితో చేయి పట్టుకొని ఆదరము చూపి పంపవలెనని నిశ్చయించుకున్నాను. పురాణకాలంలో యుద్ధానికి వెళ్ళేవాళ్ళకు ఆప్తులైనవాళ్లు ధనుర్బాణములూ, ఖడ్గాద్యాయుధములూ అందిచ్చేవాళ్లు. యుద్ధములో ఆయుధములకంటె పరీక్షలో కలము లెక్కువ అవసరము.

కాని నే ననుకున్నట్లు జరగలేదు. పొద్దున నేను కాఫీకి వెళ్లివస్తూఉండగా దోవలో ఒకానొక ప్రసిద్ధ కవి నా కెదురైనారు. వారిని కుశలప్రశ్నము చేసి దాటి పోదామనుకున్నాను గాని, వారు నాతో ఎక్కువ ఆదరముతో మాట్లాడుతూ తమ ఇంటికి నన్ను తీసుకొని వెళ్లి, తా మామధ్య వ్రాస్తున్న పుస్తకాలసంగతి ప్రశంసించసాగినారు. వారిమీద నున్న గౌరవాతిశయంచేత నేను తొందరపని ఉన్న దనలేకపోయినాను. వారైనా నా పరధ్యానమూ, అశాంతీ గమనించలేదు. కవులు తమ కావ్యాల సంగతి మాట్లాడేటప్పుడు విశ్వము మరుస్తారని జగద్విదితమే గదా! నేను నా గదికి తిరిగి వెళ్ళేటప్పటికి పది ఐంది. ఇక చంద్రు డేంకనపడతాడు? నాకు అటెండెన్సు చాలా తక్కువ ఉండడంవల్ల స్నానభోజనాదులు లేకుండానే కాలేజీకి వెళ్లి, నా అటెండెన్సు చెప్పమని ఇతరులకు అప్పగించి వచ్చినాను.

మధ్యాహ్నమైనా వెళ్లి అతన్ని కలుసుకోవలె ననిపించింది. కాని హాస్యాస్పదంగా ఉంటుందని ఊరుకున్నాను. సాయంత్రముదాకా ఓపిక పట్టి ఉండ నిశ్చయించినాను.

ఆరోజు సాయంత్రము నేను చూచినప్పటి చంద్రుని ముఖము నాకీ జీవితములో ఎన్నటికీ మరుపుకు రాదు. తేనె లొలికే అతని ముఖంలో అంతదైన్యము మూర్తీభవించి ఎదట కనబడితే అది భరించడ మెట్లాగు! అబ్బా! పరీక్ష ఎంత అల్పమైనది! ఆ అల్పమైన పరీక్షకు అమూల్యమైన అతని వికాసమును గ్రసించే శక్తి వచ్చింది గదా! ఈ పరీక్షాపిశాచచేష్టలవల్ల ఎందరెందరి దివ్యబుద్ధులు క్షీణించిపోతున్నవో ప్రతిసంవత్సరమూ!

చంద్రుడు రాగానే ఏమీ మాట్లాడక, పోయి చాప మీద బోర్లబుక్కలా పండుకున్నాడు. నేను నవ్వు తెచ్చుకొని మాట్లాడుదా మని ప్రయత్నించినా నాకది రాలేదు. కొంతసే పయినతర్వాత నే నతని పక్కకు పోయి కూర్చుని, నెమ్మదిగా వీపు చరిచి, అతని శిరస్సు నాతొడమీద ఉంచుకున్నాను. అతనిదేహ మేమీ చెమటపోసినట్లు లేదు కాని నాకాలు తడుస్తున్నట్లు నాకు తోచింది. కాని అప్పుడు చంద్రుడు కన్నీళ్లు విడుస్తున్నా డనుకోను. అత నెప్పుడూ కన్నీళ్లు విడవడు. అతని దుఃఖము నతను దిగమింగవలసినదే కాని పొంగనీయడు. నా ఎదట నైనప్పటికీ కన్నీళ్లు విడవడాని కతని అభిమాన మొప్పుకోదు. ఆరోగ్య మున్నవాళ్లే తమ కష్టసుఖాలు రెండూ సమంగా వెలిబుచ్చ సాహసిస్తారు. అందువల్లనే చంద్రుడు నాకళ్ల నీళ్లు ఒకటి రెండుసార్లు చూచినాడు కాని నేను అతని కన్నీళ్లెన్నడూ చూడలేదు.

ఆరోజున ఇక నెంత చెప్పినా అతడు మర్నాటి పరీక్షకేమీ చదవలేదు. "ఎందుకండీ, నిన్నటి పరీక్షలో ప్యాసవుతాను కాని ఇవ్వాళ పేపరులో నన్ను ప్యాసు చేయడను ఎవ్వరికీ సాధ్యము కాదు" అన్నాడు.

"నీకు ఆశ్చర్యపడడ మభ్యాసమేగా!" అన్నాను.

"మీకు పిచ్చా ఏమిటి? రెండుప్రశ్నలుమాత్రమే వ్రాస్తే ఎవడు ప్యాసు చేస్తాడండీ? మీరైతే పేపరిస్తే ప్యాసుమార్కులు వేస్తారా?" అని బిగ్గరగా అడిగినాడు.

నే నేమీ తొందరపడక శాంతముగా "రెండు ప్రశ్నలే వ్రాయడమేం? పేపర్లు రెండూ అంత కష్టంగా ఉన్నవా?" అన్నాను.

"అంత చులకన పేపర్లెప్పుడూ ఉండవు. అందరూ పూర్తిగా వ్రాసి వచ్చారు. ఇప్పుడు మళ్లీ ఆ పేపర్లే ఇస్తే అరవై మార్కులు తెచ్చుకోలేనూ?"

"ఐతే నీ తెలివితక్కువ నాకేమీ అర్థం కావడం లేదు!" అన్నాను.

తన ముఖం వేలితో చూపి, చంద్రుడు, దీనంగా "అది!" అన్నాడు.

ఆరోజు పొద్దున పేపరు చూచినాడుట. చులకనగా ఉన్నదిగదా పూర్తిగా వ్రాద్దామని మొదలుపెట్టినాడు. కాని వ్రాయబోతే మనస్సు నిరామయమయిందట. ఏంచేస్తాడు! సాయంత్రమూ అంతే అయింది. రెండు పేపర్లూ ఇట్లాగే చెడగొట్టినాడు.

అన్నాళ్లకు అన్నిసార్లు అనుభవమైనతర్వాత ఆరోజున మొదటిసారి అతని అధైర్యముతో నేను ఏకీభవించినాను. ఆ పేపరులో ప్యాసుకావడము కష్టమని నాకూ తోచింది. ఆరోజు పరీక్షలో తప్పితే మిగిలిన పరీక్షలలో ఎన్నిమార్కులు వచ్చినా లాభం లేదు. ఐనా జూదంలో ఎత్తువలె మర్నాటి పరీక్షకు కూడా బాగా చదివి కూర్చుని రమ్మన్నాను. ఆపరీక్షకు కూర్చొనేట్లు ఒప్పించడమే నాకు కష్టమయింది. ఆ పరీక్షకు అత నేమీ చదవలేదు.

అది కెమిస్ట్రీపరీక్ష. అదే చివరరోజు! దానికి ఎక్కువ వల్లెవేయవలె. అందువల్ల మును పెంత చదివి ఉన్నా ఆపరీక్షముందు అంతా ఒకసారి జ్ఞాపకంచేసుకోకపోతే లాభం లేదు. ఆరోజు రాత్రిల్లా నిద్రపోకుండా కూర్చుంటా నంటూఉండేవాడు చంద్రుడు. కాని పుస్తకమన్నా ముట్టుకోలేదు.

ఆరోజు పొద్దున నేను నవ్వు తెచ్చుకొని "నీ వివ్వాళ బాగా వ్రాస్తావని ఏమో చెప్పుతున్నది నాకు!" అన్నాను.

"మీ కెట్లా తెలుసు? దేన్నిబట్టి చెప్పుతున్నారు?" అన్నాడు.

"నాకుమాత్ర మేం తెలుసు? అట్లా అనబుద్ధివేసి అన్నాను!" అన్నాను.

"ఇవ్వాళ, నిన్నా చదవకపోయినా బాగానే వ్రాయవచ్చు! ఐనా ఏంలాభం?" అన్నాడు.

ఆరోజతను బండిలో ఎక్కేదాకా నేను వెంటనే ఉన్నాను. బండి సాగిపోతూఉంటే అతను నావైపు చూచి మనోహరంగా నవ్వినాడు. అప్రయత్నంగా నాకూ చిరునవ్వు వచ్చింది. మానవ్వుల అర్థ మేమిటా అని పరధ్యానంగా ఆలోచించుకుంటూ గదికి వెళ్లిపోయినాను. అట్లా వెళ్లుతున్నప్పుడు నాకు తెలియకుండా నవ్వుతూఉన్నా ననుకుంటాను. అప్పుడు నన్ను వీధుల పోయేవాళ్లు చూచి ఏ మనుకున్నారో!

పొద్దున నేను ప్రశ్న చెప్పినట్లుగానే ఆరోజు చంద్రుడు పేపరు చాలాబాగా వ్రాసినాడు. అతనే యాభైమార్కులకు తక్కువ రావనీ, అరవైకూడా రావచ్చుననీ చెప్పినాడు. అది విన్నప్పుడు నాకు చదువులూ, పరీక్షలూ, ఫలితాలూ ఇట్లా ఉంటవికదా అని చింతతో కూడిన నవ్వు వచ్చింది.

పరీక్షలు కాగానే అందరికీ పెద్దభారము వదిలినట్లు తోస్తుంది. కాని చంద్రుడి కాసుఖ మేమాత్రమూ లేకపోయింది. అతను తప్పుతాననే నిశ్చయంతో, తప్పిన వార్త విన్నప్పటివలెనే బాధపడ్డాడు. నాలుగైదు రోజులు పట్నంలోనే పిచ్చివానివలె తిరిగినాడు.

అక్కడ అన్నాళ్లు ఉన్నందువల్ల కొంత లాభం కలిగింది. వాళ్ల ఫిజిక్సు పేపర్లు దిద్దే పెద్దమనిషి చాలాసార్లు పరీక్షలు తప్పినవాడు కావడంచేత చాలాబాగా మార్కులు వేస్తాడని తెలిసింది. "ఐనా నే నేమన్నా వ్రాస్తే కాదండీ!" అన్నాడు చంద్రుడు.

ఇట్లా ఉంటూఉండగా ఒకనాడు అకస్మాత్తుగా చంద్రునికి ఇంటిమీద ధ్యానం మళ్లి బయలుదేరినాడు. స్టేషనుకు వెళ్లి పంపించి వచ్చినాను. రైలు కదలగానే నా కేదో బరువుతీరినట్లు తోచింది. అటువంటి భావము నాకు రావడము మంచిదో, చెడ్డదో!

అతను వెళ్లిన కొద్దిరోజులకు అతని బంధువుతో — విక్టోరియా హోస్టలువంటి ఇళ్లు కట్టమన్న బంధువే — అతను ఫిజిక్సు పేపరు చెడగొట్టిన విచిత్రకథ నేను చెప్పుతూ ఉంటే, ఆబంధువు "మీకు తెలియదు లెండి! అత నట్లాగే చెప్పుతాడు గాని తెలిసిన ప్రశ్నలు ఎందుకు వ్రాయలేదు? అతని కసలు లెక్కలు బాగారావు. ఫిజిక్సులో లెక్కల ప్రమేయమున్నది కాబట్టి అది చెడగొట్టినాడు లెండి! అతని కథలు మీరు కాబట్టి నమ్మినారు!" అన్నాడు. ఆయనను ఒప్పించడానికి ప్రయత్నించి ప్రయోజనం లేదని నేను "ఔను కాబోలు, నేను పూర్తిగా మోసపోయినాను సుమా!" అన్నాను.

చంద్రుడు పట్నం విడిచి వెళ్లినతర్వాత నాకు చదువు తీవ్రంగా సాగింది. నాకు చంద్రుడు తరుచుగానే ఉత్తరాలు వ్రాసేవాడు. తాను పరీక్ష కోసము దిగులుపడకుండా ఉంటూ ఉన్నట్లు వ్రాస్తూ వచ్చినాడు. కాని నన్ను సంతోషపెట్టడానికి అబద్ధము వ్రాస్తున్నట్లు వాటిల్లోనే నాకు స్పష్టపడేది. ఒకరి నొకరము బాగా తెలుసుకున్నతర్వాత ఎంత దాచ వలె నని ప్రయత్నం చేసినా మన భావాలు ఒండొరులము తెలుసుకోకుండా దాచలేము. "పిచ్చి చంద్రశేఖరం!" అని మనస్సులో అనుకొని నవ్వుకునేవాణ్ణి. అతని స్థితిలో అతను అప్పుడప్పుడు నాకు ధైర్యం చెప్పవలె నని కూడా ఉత్తరం వ్రాసేవాడు.

"మీ కథ లంతా పొగడుతున్నారు. మీ పేరు దేశంలో మోగిపోయేరోజులు రాకపోవు! బాగా చదవండి! నా మెదడు కూడా మీ మెదడుతో కలిసి మరింత బాగా పనిచేయడానికి పంపుతున్నాను" అని ఉన్నది ఒక ఉత్తరంలో.

దానికి నేను వ్రాసిన జవాబు కాస్త చమత్కారంగా ఉంటుంది. "చంద్రా, నీవు నీ మెదడు నాకు పంపినందుకు నీకనేక వందనములు. కాని నీది పోకుండా మాత్రము చూసుకో!" — కాని ఇందులో చమత్కారము ఇంగ్లీషుభాషలో పెట్టినప్పుడు మరీ చక్కగా ఉంటుంది. ఆ ఉత్తరాలు రెండూ ఇంగ్లీషులోనే వ్రాసుకున్నాము.

౧౦

నిన్నరాత్రి మా స్నేహితుని ఇంట్లో కలిసినప్పుడు జరిగిన సంభాషణసంగతి కొంచెము చెప్పవలసి ఉన్నది. ఆ స్నేహితునికి తా నన్నది బ్రహ్మవాక్యమల్లే ఔతుం దని ఒక నమ్మిక మున్నది. మంచి ఏమో కాని చెడుమాత్రము అత నన్నట్లే రెండుమూడుసార్లు సిద్ధించింది. ఏది ఎట్లా ఉన్నా అత నది గర్వంగా చెప్పుకుంటాడు. వాళ్ల ఇంటి ఎదటనే బావి ఒకటి తవ్వుతున్నారు. "చూశారా, నేను ఈమధ్య అట్లా వెళ్లుతూ ఆతవ్వుతున్న బావివంక తీక్ష్ణంగా చూశాను. ఎంత లోతుకు తవ్వినా ఇప్పటి కింకా నీళ్లు పడలేదు. ఒకవేళ నీళ్లు పడితేమాత్రము తాగేందుకు పనికివస్తవనా?" అన్నాడు.

అది విని చంద్రుడు "మీమాట నిజమవుతుందో కాదో చూతాము. నేను పరీక్ష ప్యాసవుతానో కానో చెప్పండి" అన్నాడు.

ఆ స్నేహితుడు "నీవా, ఇంగ్లీషులో ప్యాసవుతావు. అప్షనల్సులో తప్పుతావు, చూసుకో!" అని నిశ్శంకముగా అన్నాడు. చంద్రుడు చిన్నబుచ్చుకున్నాడు

తర్వాత నేను నవ్వుతూ "నేను ప్యాసవుతానో కానో చెప్పండి!" అన్నాను.

నే నాప్రశ్న అడుగుతా నని ఆయన అనుకోలేదు. మొదట శంకించి చివరకు "మీ సంగతి చెప్పడము నా కిష్టము లేదు" అన్నాడు. నాకు అప్రియము చెప్పడానికి జంకినా డని నన్ను నేను పొగడుకొని సంతోషించినాను.

ఇంతవరకూ తెలిపినతర్వాత చంద్రుని పరీక్షా ఫలితము ఏమని వచ్చినదో వేరే చెప్పవలసిన పనిలేదు. మా ఇంటివద్ద అతనన్నట్లు అతన్ని నేను చాలాదూరము పంపవలసివచ్చింది. నేనన్న "అవసరమైతే ఇంటిదాకా కూడా పంపుతాను" లోని 'అవసరము' వచ్చింది.

దోవలో, పాపము! అతను ఒకటే తీరాన పరీక్షసంగతి మాట్లాడసాగినాడు. "ఆసంగతి విడిచిపెట్టి ఇంకోటి మాట్లాడు, పోనీ!" అన్నాను.

"నా కది చేతకాదు. పోనీ, ఇంగ్లీషులో తప్పి అప్షనల్సులో ప్యాసయితే సంతోషించేవాణ్ణి. ఇంగ్లీషైతే ఇప్పుడున్నవాణ్ణి ఉన్నట్లు పోయి పరీక్షకు కూర్చొని ప్యాసుకాగలనని ధైర్యమున్నది. అంతా ఇంగ్లీషులో ఎందుకు తప్పుతారో తెలియదు. ఇంగ్లీషు నే నస లేమీ చదవలేదు. మీరు చూస్తూనే ఉన్నారుగా!—" ఈ విధంగా ప్రవాహము పోతున్నది.

వాళ్ల అమ్మగారు ఈమధ్యనే ఒకనాడు "మన కివి మంచిరోజులు కావు నాయనా!" అన్నారుట. కొద్దిరోజుల కిందటనే వాళ్లకు కొన్ని వేలరూపాయల

సొమ్ము అప్పుతీసుకున్న వర్తకుడు దివాలా కావడం వల్ల పోయింది. దానికితోడు సెలవుల్లో పెళ్లికి వెళ్లినప్పుడు ఆ పెండ్లి వైభవము పోయినది. చంద్రుని చిన్నతమ్ముడు ఆ సంవత్సరమే ఫోర్తుఫారము తప్పినాడు. కష్టాలన్నీ కలిసి కాని రావనే జనవాక్యము అప్పుడప్పుడు నిజమవుతూనే ఉంటుంది.

ఒకచోట రెండు కంచెలమధ్యనున్న సన్నదారి గుండా పోవలెను. నేను జాగ్రత్తగా కింద చూసి నడుస్తున్నాను. చంద్రుడు మాట్లాడుతూ పరధ్యానంగా నడుస్తూ ఉంటే ముళ్లుగుచ్చుకుంటు వేమోనని, తల ఎత్తి, "ఆదేమిటది?" అన్నాను. చంద్రుడు ముఖ మవతలికి తిప్పి "ఏమీ లేదండీ, గాలిదుమ్ము కళ్లలోపడి నీటి బొట్టు కారిన దింతేనండీ!" అన్నాడు. ధీరోదాత్తులు అంత స్తంభిత బాష్పాలు కారూ! అదిగాక చంద్రుడు పరీక్ష తప్పినందుకు కన్నీటి బొట్టు విడిచినా డనుకోను.

వాళ్ల ఇంటిదాకా చంద్రుణ్ణి పంపినాను. 'విమ ప్రయోగము' కథ కాగితాలు అతని చేతులోనుంచి తీసుకోవడము నేను మరిచిపోలేదు. "చింపమలెండి" అని చంద్రుడు చెప్పుతున్నా, మంచి దని తీసుకున్నాను.

చివరకు అతన్ని ఇంటివద్ద విడిచి "సాయంత్రం తప్పక కలుసుకో! నీకోసము ఆదుర్దాగా ఎదురు చూస్తూ ఉంటాను" అని వెనక్కు తిరిగినాను. అప్పుడు, రాముడి చెప్పిన మా గురువుగారిని ఇంటివద్ద సంధ్యావందనం చేసుకుంటూ ఉండగా విడిచివచ్చినది జ్ఞాపకానికి వచ్చింది. వెంటనే వాయువేగంతో వచ్చి ఇల్లుచేరినాను.

ఇంటివద్ద మా ఉపాధ్యాయులు లేరు. సంధ్యావందన మయ్యేటప్పటికి నేనక్కడ లేకపోవడముచూచి, కొంతసేపు నిరీక్షించి, ఎంతసేపటికీ రాలేదని కోపంతో వెళ్లిపోయి ఉంటారు. ఇవ్వాళ సాయంత్రము ఆయన దగ్గరకు వెళ్లి క్షమాపణము కోరుకోవలె!

౧౧

కాని కథ ఇంకా పూర్తికాలేదు. సామాన్యంగా ఎవరికథ వాళ్లు చెప్పుకోవడమంటేనూ, దాన్ని ఇతరులు మెచ్చుకుంటున్నా రంటేనూ అందరికీ సరదా. కాని నాకు చంద్రునికథ చెప్పడమంటేనూ, అది విని ఇతరులు ఆనందిస్తేనూ సంతోషము కలుగుతుంది. కాని ఇంతవరకూ చంద్రునికథ చెప్పినతర్వాత కొంత నాకథ కూడా చెప్పుకోకపోతే మనశ్శాంతి కలగదు.

పెద్దపరీక్ష లన్నీ ఒక్కొక్క దండయాత్ర ఐనా చేసిన ఆరోగ్యవంతుణ్ణే ఐనా చిన్నపరీక్షలు సక్రమంగా దాటుతూ ఉండడమువల్లనూ, పసితనంలోనే చదువు ప్రారంభించడమువల్లనూ నేను చిన్న ఈడుకే బి. ఏ. ప్యాసయినాను. చిన్నప్పటినుంచీ నాకు ప్లీడర్లంటే అసహ్యమూ, ఉపాధ్యాయవృత్తి అంటే ఇష్టమూ ఉండేది. నా అదృష్టంవల్ల, కష్టపడి ప్రయత్నించకుండానే, మా ఊళ్లో నన్ను పిలిపించి ఉపాధ్యాయోద్యోగము ఇచ్చినారు. మూడే ళ్లక్కడ పని చేసినతర్వాత నన్ను యల్. టి. కి వెళ్లమన్నారు. అట్లాగే వెళ్లుదామనుకుంటూ ఉండగానే పోయిన జూను నెలలో ఒక సాయంకాలము షికారు వెళ్లి వచ్చి, అకస్మాత్తుగా, నేను లాకాలేజీకి వెళ్లుతున్నానని ఇంట్లో చెప్పినాను. గంటసేపటిలో నాజీవితపు భావిచిత్ర మంతా మారిపోయింది. చిన్నప్పటినుంచీ అనుదినాభివృద్ధి చెందిన వకీళ్లమీది వైరము గౌరవాకారము తాల్చింది. కాని నే నేమీ తొందరపని చేశా ననుకోను. నా జీవితంలో ఇంత తెలివిగల పని ఇంకొకటి చేసినట్లు నాకు జ్ఞప్తి లేదు.

ఇంట్లో అందరితోనూ చెప్పినాను గాని నా నూతననిశ్చయము మా నాన్నగారితో మాత్రము చెప్పలేదు. వారు పెద్దవారు. నాకై నిర్మించుకున్న భవిష్యత్స్వప్నాన్ని వారు నావలె గంటలో నిర్మూలించలేరు. అందులో ప్లీడర్లంతా అబద్ధాలఖోరులనీ, ఆ వృత్తే అన్యాయవృత్తి అనీ వారి ఉద్దేశము. ఏదో కృష్ణా రామా అనుకుంటూ ఉండేవాళ్లు తమ కొడుకు అటువంటి వృత్తిలో ప్రవేశించబోతున్నా డంటే ఇష్టపడతారా? ఇంట్లో పెత్తనము నాదే కాబట్టి మా నాన్నగారికి ముందుగా చెప్పి ఒప్పించవలసిన అవసరముకూడా లేకపోయింది. చెన్నపట్టణంప్రయాణానికి సన్నాహ మైన రోజుననే నేను వారికీసంగతి తెలియజేసినాను. అప్పటికే

ఇతరులవల్ల విన్న మా నాన్నగారికి ఈవార్త ఆశ్చర్యము కలిగించలేదు. మొదట ఏదో కలహా ఇయ్యబోయినారు కాని మళ్లీ నాప్రయాణసన్నాహ మంతా చూసి ఊరుకున్నారు. ఇంతా చేస్తే ఆరోజు నా ప్రయాణము సాగనే లేదు. అంతా నెమ్మదిగా చెప్పతాను.

నేను లాకాలేజీలో సీటుకు దరఖాస్తుఫారము కోసము ఉత్తరము వ్రాసినప్పటినుంచీ నేటిదాకా దుశ్శకునపరంపర నన్ను వెంట నంటింది. ఆ ఉత్తరము వ్రాసి పోస్టులో వేయబోతూ, ఆడించుకుంటూ వెళ్లినాను. దోవలో అది రెండుసార్లు కిందపడి మూడో సారికాని పోస్టుపెట్టెలో పడలేదు.

ఆ అనుమానానికి దాఖలాగానే నాకు దరఖాస్తుఫారము రాలేదు. అందరికీ వచ్చినవి. ఎన్నాళ్లో ఎదురుచూసినా నాకు రాలేదు. సీట్లేమో మించి పోతవని మాఊళ్లో పుకారు పుట్టడమువల్ల యూనివర్సిటీ క్యాలెండరు వెదకి, దానిలో ఉన్నట్లు దరఖాస్తుఫారమొకటి టైపు చేయించినాను. తీరా టైపిస్టు అది టైపుచేసి పెట్టెలోనుంచి లాగేటప్పుడు ఆకాగితం కాస్తా చినిగి పనికిరాకుండా పోయింది. ఆ టైపిస్టు పాపము, చాలా నొచ్చుకొని "పోనీ, సాయంత్రం రండి!" అన్నాడు.

ఆయన అన్నట్లు సాయంత్రే మాయనకోసము వెళ్లితే ఆయన అక్కడ కనపడలేదు.

మర్నాడు ఇంకో టైపిస్టువద్దకు వెళ్లి జాగ్రత్తగా టైపుచేయించి పూర్తిచేసి ఉత్తరము పోస్టులో వేసేటప్పుడు ఆడించకుండా తీసుకొని వెళ్లినాను.

చెన్నపట్టణంప్రయాణం పెట్టుకుంటే మూడో సారి కాని సాగలేదు. రెండుసార్లూ ఏ స్నేహితుని కోసమో ఆగవలసివచ్చేది. మొదటిసారి భోజనం చేసి బండీ పిలవబోతున్నప్పుడు ప్రయాణము ఆపుదల చేయవలసివచ్చింది. రెండోసారి బండీ వాకిట్లో వచ్చి నిలిచినతర్వాత ఆగిపోయింది. అందువల్ల నా స్నేహితుల కందరికీ నా చెన్నపట్టణప్రయాణ మంటే నవ్వులాటకింద పడ్డది. ఆఖరుకు నేను రైలులో ఎక్కి కూర్చుంటే వాళ్ల చూపును వాళ్లు నమ్మలేకపోయినారు.

ఇన్నిసార్లు ప్రయాణాలై నేను పట్నంవెళ్లేటప్పటికి కాలేజీ తెరిచి పదిరోజులైంది. వెళ్లినరోజు మంచిదని ఆరోజే జీతం కట్టుదామంటే బ్యాంకు మూసినతర్వాత నేను అక్కడ చేరుకున్నాను. మర్నాడు జీతంకట్టి వచ్చేటప్పటికి స్కూలు మూసివేశారు. ఆ మర్నాడు మంచిరోజు కాకపోయినా రోజులు వృథాగా పోతున్నవని పోయి క్లాసులో కూర్చున్నాను. నేను అట్లా పోయి కూర్చున్న మొదటిగంటలో మా లెక్చరరు అటెండెన్సు తీసుకున్నప్పుడు నా పేరెప్పుడు పిలిచినాడో నాకు వినపడక నేను అప్పుడు అటెండెన్సు చెప్పలేదు. ఆ గంట ఐపోయినతర్వాత ప్రత్యేకముగా ఆయనవద్దకు వెళ్లి అటెండెన్సు వేయించుకున్నాను. మొదటిరోజిట్లా ఐనదనుకుంటే రెండవరోజు అసలు కాలేజీకే సెలవువచ్చి నాకు ద్వితీయవిఘ్నమయింది.

ఆరోజు కాలేజీకి సెలవు అని నేను డాక్టరుస్నేహితుణ్ణి ఒకణ్ణి చూడబోయినాను. అప్పుడు, త్వరగా పోతున్న ట్రాములోనుంచి కిందికి దూకబోయి కింద నిలువునా బోర్లబుక్కలా పడ్డాను. కుడిచేయి గూడు తొలిగింది. ఇప్పటికీ అది అవుడే. వెంటనే నాడాక్టరుస్నేహితుడు ఎముక పాటునవేసి కట్టుకట్టినాడు. అత్యల్పముగానే తొలగడమువల్ల వారమురోజులు కట్టు ఉంచమని స్నేహితుడు చెప్పినా వినక, మర్నాడు పొద్దునే, పోరి, ఆస్నేహితునిచేతనే కట్టు విప్పించుకున్నాను.

ఇన్ని దుశ్శకునాలు ఒకటివెంటఒకటి సంభవిస్తే ఎంత ఆరోగ్యవంతుణ్ణి ఐనా నాకూ కాస్త జంకుపుట్టించినదని ఒప్పుకుంటే నా ధైర్యసాహసాదులకు లోపముండ దనుకుంటాను. ఏమోటారుకింద పడిపోతానో అని నేను బహుజాగ్రత్తగా నడిచేవాణ్ణి. అదృష్టంవల్ల ఇప్పటికి నే నేమోటారుకిందా పడలేదు.

క్రిస్టమసు సెలవులకు ముందు నాకు జ్వరం వచ్చింది కాని మా ఊరురాగానే నయమయింది. ఈ జ్వరంవల్ల చాలారోజులు పోవడమూ, మొదట కాలేజీలో చేరడమే ఆలస్యము కావడమూ, అప్ప

దప్పుడు ఇతరులను అటెండెన్సు చెప్పమని షికార్లు కొట్టితే వాళ్లు భయపడి చెప్పకపోవడమూ — ఇవన్నీ కలిసి నా అటెండెన్సును చాలావరకు మింగివేసినవి. మొదటి టరమ్ము అయ్యేటప్పటికి ముప్పయిరోజులు లైపోయినవి. రెండవ టరమ్ములో మూడురోజులు ఆలస్యముగా వచ్చినాను. ఇక ఐదురోజులు మాత్రము ఆబ్సెంటు కావచ్చును. ఆ ఐదురోజులూకూడా నెమ్మది నెమ్మదిగా తరగవొచ్చినవి. గుండెలు దడదడ లాడసాగినవి. అటెండెన్సు చాలక పరీక్షకు పోకపోతే సిగ్గుచేటు. అంతగా అటెండెన్సు చాలకపోతే ఉపాయ మేమిటీ అని ఆలోచిస్తున్నాను. ప్రిన్సిపాలువద్దకు పోయి "నన్ను రైటర్లు పొరపాటున అన్యాయము చేసినారు. నే నెప్పుడూ ఆబ్సెంటు కానిదే ఇన్ని ఆబ్సెంట్లు పడ్డా" వని నిశ్చలంగా వెళ్లి అబద్ధ మాడవలసివస్తుందేమో, అబద్ధమాడినా లాభిస్తుందో లేదో అని భయం వేయసాగింది. కాని ఆ అవసర మేమీ లేకుండా బోటాబొటీగా నాకు అటెండెన్సు సరిపోయింది. ఇంకో రోజు వెళ్లకపోతే నన్ను పరీక్షకు పోనిచ్చేవాళ్లు కారు.

పరీక్షలు ఇరవైరోజులలోకి వచ్చినవి. ఇన్ని దుశ్శకునాలూ ఫలం లేకుండా ఊరికే ఎట్లాపోతవా అని దిగులుపుట్టింది. ఇక పరీక్ష ఏమవుతుందో అని అప్పుడు అనుమానం ప్రారంభించింది.

అనుమానం ప్రారంభించినకొద్దీ దానికి అనుగుణమైన విషయాలన్నీ మనస్సుకు తట్టసాగినవి. ఇంటరుమీడియేటు నాతోప్యాసయిన నా పేరింటి పెద్దమనిషి ఒకతను ఈసంవత్సరము త్రివేంద్రములో బి. యల్. చదువుతున్నాడు. సెప్టెంబరు పరీక్షలో యఫ్. యల్. పూర్తికాగానే తనవద్దనున్న ఒకటిరెండు పుస్తకాలూ నాకిచ్చినాడు. నేను యఫ్. యల్. పుస్తకాలు వేరే కొనలేదు. ఉన్న ఒకటిరెండు పుస్తకాలూ చదివినవాడు త్రివేంద్రములో బి. యల్. క్లాసులో చేరి సెప్టెంబరులో యఫ్. యల్. పరీక్ష ప్యాసయినాడు.

ఈవిధంగా నేను భయపడుతున్న ఆరోజుల్లోనే మానాన్నగారివద్దనుంచి ఉత్తరం వచ్చింది. "నీవు వెనక పనిచేసిన స్కూలువాళ్లు వీలైతే నిన్ను మళ్లీ తీసుకుందా మనుకుంటున్నారు. నన్ను వాళ్లడగగా 'ఈసంవత్సరం మావాడు ప్యాసయితే పైక్లాసు చదివిస్తాను. లేకపోతే మీస్కూల్లో చేర్పిస్తా'నని జవాబు చెప్పినాను" అనే వాక్యాలుకూడా ఆ ఉత్తరంలో ఉన్నవి. మా నాన్నగారు నేను తప్పవలెనని కోరుకుంటున్నారా అనే ఊహ నాకు రాక తప్పిందికాదు. నేను కథలు వ్రాసుకుంటూ ఉంటానని మానాన్నగారికి తెలుసు కాబట్టి వారి కాకోరిక ఉంటే అది సిద్ధిస్తుందనే ఆశకూడా బలంగా ఉండిఉంటుంది, తప్పదు. చంద్రుని నాన్నగారు అతను తప్పుతాడేమో అని భయపడుతూ ఉంటే, మానాన్నగారు నే నీసంవత్సరము ప్యాసవుతానేమో అని భయపడుతున్నారు. రెంటిలో ఏదైనా ఒకటే, తప్పడానికి సహాయం చేయడానికి! అందులో, చంద్రుడు బాగా చదివినా, ఇతర కారణాలు ఒకదాని కొకటి కూడి అతన్ని తప్పేట్లు చేసేట్లున్నవని నాకు తెలుసును. ఇన్ని దుశ్శకునాలూ, మా తండ్రిగారి కోరికా అన్నీ నన్ను తప్పించవలెననే ప్రయత్నాలు చేస్తున్నవి. చంద్రుని సహవాసమువల్ల నాలో వెనకటి నిర్భయము కొంత సడలిచ్చినట్లున్నది. అదిగాక చంద్రుడు వాళ్ల పుస్తకాలు చదివినట్లు నేను మా పుస్తకాలు చదవలేదు. మర్యాదగా పేపర్లిస్తే తప్పక ప్యాసు కాగలను, లేకపోతే ఎవరికి తెలుసు! ఇక మా నాన్నగారి ఉత్తరం నన్ను కలత పెట్టసాగింది. మెరుపు మెరిసినట్లు మొదటినుంచీ కనబడుతున్న దుశ్శకునాలు తలపుకు వస్తవి. వ్యర్థపు భయాలు చంద్రుని చేత ఫిజిక్సు పేపరు చెడగొట్టించినట్లే నన్ను కూడా చేస్తవేమో అని భయం వేయసాగింది. మూడేళ్లు టీచరుపని చేసి పెద్దక్లాసులకు పాఠాలు చెప్పి, యఫ్. యల్. క్లాసు తప్పినా డంటే నామర్దా అనిపించింది. ఇన్నాళ్లకు, చంద్రశేఖరంతో సాహసంవల్ల పరీక్ష తప్పుతా మంటే భయమూ, తప్పినామంటే సిగ్గూ ఏమిటో నాకు తెలిసింది.

నేను భయపడుతున్నట్లుగానే చివర పేపరు వ్రాయడంలో ఒక విచిత్రం జరిగింది. ప్రశ్నలు చూచినాను. వాటిలో ఒకటి రెండు తప్ప నాకేమీ తెలిసినట్లు తోచలేదు. నా ఎదటనున్న ఆ తెల్లకాగితము

వలెనే ఐపోయింది నామనస్సు. ధైర్యం తెచ్చుకొని, తెలిసిన ఆ ఒకటిరెండు ప్రశ్నలూ జాగ్రత్తగా కాసేపులో వ్రాసేశాను. కావలసినంతవేళ మిగిలింది. ఏమీ తోచలేదు. అట్టే కడుపులోనుంచి ఆవేదన బయలుదేరి దేహమంతా తీవ్రముగా వ్యాపించింది. "ఈ పేపరు సున్నచుట్టితే ఇంకా ఏమున్నది!" అనుకున్నాను. సంవత్సరంనుంచీ చదివిన చదువంతా వ్యర్థమయితే ఎంత కష్టమో నాకళ్లఎదుట కట్టినట్లయింది. ఇట్లా తోచిన కొద్దీ మనస్సు నిరామయం కాసాగింది. చంద్రుడు జ్ఞాపకం వచ్చినాడు. అతను కూడా ఇట్లాగే ఫిజిక్సు పేపరురోజున కూర్చున్నాడు కాబోలు ననుకున్నాను. చంద్రుడు జ్ఞప్తికి రాగానే మరింత ఆశ్చర్యము కలిగింది.

కొంతసేపటికి నన్ను చూసి నేనే బలవంతాన నవ్వుతెచ్చుకొని నవ్వినాను. తోచిందల్లా వ్రాతామని కలమెత్తినాను. కలమెత్తుకుంటే రాయప్రోలు సుబ్బారావుగారి 'లేఖినీ శుభావాహన'తో మొదలుపెట్టి వెంకట పార్వతీశ్వరకవుల పద్యాలలోకి పోయి నెమ్మదినెమ్మదిగా లేఖినీప్రశంస లున్న మధ్యకవుల ధట్రాజుచాటువులలోనికి మనస్సు పరుగెత్తింది. దానితో నేను మరింత నవ్వుకొని ప్రశ్నలకు జవాబులు ఆలోచించ మొదలుపెట్టినాను. ప్రశ్నల కన్నింటికీ లీలగా ఉత్తరములు రా మొదలుపెట్టినవి. వ్రాయడం సాగించినాను. కలం సాగినకొద్దీ ఏమి టేమిటో వ్రాశాను. ఏంవ్రాశానో బాగా జ్ఞాపకం లేదు కాని కథలూ, పద్యాలూమాత్రము వ్రాయలే దని ధైర్యమే. పరీక్షహాలులోనుంచి బయటికి వచ్చి, వ్రాసినవాటిలో అప్పటికి జ్ఞాపకమున్న ఒకటిరెండు విషయాలూ సరియైనవేమో చూదామని పుస్తకం చూసుకుంటే పూర్తిగా సరిగ్గాయిన వని తెలిసింది. కాని సవాలక్షవిషయాలలో ఒక్కటి రెండు సరి ఐతేమాత్ర మేమిలాభము?

పేపరు వ్రాయడం పూర్తికాగానే నా తల సుత్తెలుపెట్టి కొట్టుతున్నట్లు నొప్పి పుట్టసాగింది. వెంటనే రెస్టారెంటుకు వెళ్లి మంచుగడ్డతో చేసే పదార్థాలన్నీ తెప్పించి సాపడ్డాను. తలనొప్పి దానిదోవను అది పోయింది.

మాపరీక్షా ఫలితాలుకూడా పదిహేను రోజుల్లో తెలుస్తవి. కథలు వ్రాసేవాళ్ల మనస్సులు ఎట్లా పూర్తి ఐతే అందంగా ఉంటుందో అట్లా జరుగుతుందని తలుస్తూ ఉంటవి. నేను తప్పితేనే ఈకథకు సరిగ్గాయిన అంత ముంటుంది. అదే జరిగేట్లుకూడా తోస్తున్నది. నిన్నరాత్రి, అన్నమాట అయ్యో స్నేహితుడు నాతో నా పరీక్షసంగతి ఏమీ చెప్పనని చెప్పినా, నేను మాఇంటికి వచ్చిన తర్వాత నా విషయము చంద్రుడడిగితే "ఆయన చెన్నపట్టణం వెళ్లేప్పుడు ఆయనమొహమే చెప్పింది ప్యాసు కాడని! అనుమానంలేదు" అన్నాడుట. ఆయన మాట తప్పేట్లు నేనే చేయవలెను! అందుకని ఐనా ప్యాసవుతే బాగుండు ననిపిస్తున్నది.

కాని ఇవ్వాళనే నా పరీక్షసంగతి తేలిం దని నా కేమిటో చెప్పతున్నది. అది బాధయనా కావచ్చు, అశరీరవాక్కూ కావచ్చు! చంద్రుడు తప్పినతర్వాత నేనుమాత్రము ప్యాసవుతానా! అతను సగము తప్పినాడని మా కే క్షణములో ఇవ్వాళ తెలిసిందో ఆక్షణములోనే నేను చెడగొట్టిన పేపరుకు సున్నచుట్టినా రనిపిస్తున్నది.


నా స్నేహితులలో ముగ్గురు బి. ఏ. కూ, ఒకరు యల్. టీ. కి వెళ్లి తప్పతామని మళ్లీ పరీక్షకు చదువుకున్నారు. నన్ను ప్రేమతో చూస్తున్న మా బావమరది కూడా ఇంటరు ఐదవసారి తప్పిపోయినాడు. అంతా తప్పితే నే నొకణ్ణేనా ప్యాసయ్యేది!

కథ చెడిపోయినా ఫరవాలేదు, కాని నేను ప్యాసవుతే బాగుండు ననే కోరిక నాకు వస్తున్నది, తప్పదు. ఈమాటే నే నంటే ఇదివరకా చంద్రు డిట్లా అన్నాడు: "లోకంలో జరిగే విషయాలు కాస్తన్నా మారుస్తేకాని కథలు కావండీ! లేకపోతే కవికల్పన ఏమున్నదీ? ఇంతవరకూ కథగా జరిగింది. పూర్తిగా జరగదు. చివరన్నా లోపము జరగకపోదు. నేను చెప్పతున్నాను, మీరు ప్యాసవుతారుగా!"

చంద్రుడు చెప్పిన ఈ మాటలమీదనే నాకు ప్రధానంగా ధైర్య మున్నది. ఆ చంద్రునినోట బంగారము పండితే నేను త్రివేంద్రము వెళ్లి నా ఆరోగ్యము కొంత అర్పించుకోవలసిన అవసరం తప్పిపోతుంది.

చంద్రునిమాటలే గాక నాకు కొంత ధైర్య మిచ్చేది ఇంకొకటి ఉన్నది. నేను పెద్ద పరీక్షలు దండయాత్ర చేసే మామూలేగాని చిన్న పరీక్ష లెన్నడూ తప్పి ఎరగను. యఫ్. యల్. పరీక్ష పెద్దదా, చిన్నదా? ఇది తేల్చవలె. లాయర్లంతా ఏమంటారో! రెండుపక్షాలకూ తగిన సమాధానా లున్నవి. యూనివర్సిటీపరీక్ష కాబట్టి పెద్దదే. వేరే డిగ్రీ లేకపోవడం వల్లనూ, తప్పినా ట్రివేండ్రములో పై క్లాసులో చదివే వీలు ఉన్నందువల్లా ఇది చిన్న పరీక్షగా కనపడుతుంది.

ఈ వాద మంతా ఎందుకు? ఈ కథ అచ్చయ్యే వేళకి! అంతా తేలిపోయి ఉంటుంది!



ధర్మరాజరథము

[మహాబలిపురములోని పంచరథము లన్నింటిలోనూ పెద్దది]

అవును—అవే!

(ఎలిజీ)

పన్యాల వేంకట రంగనాథరావు

అవును అవే మీమీపుణికెలు
ఆకలితో అరచిన ఎముకలు
ఎట చూచిన కుప్పలుకుప్పలు
ఏదోకోరికకై తిప్పలు.

అవును అవే మీహృదయమ్ములు
అణగారు విషాదపుసొమ్ములు.
భరియించని ఆవేశములో
బాధలను పడెడి రాజ్యమ్ములు.

అవును అవే రక్తపుధారలు
అశ్రువులై ఆరినచారలు
వేడెక్కిన గుండెలలోపల
డాగని నవయువక జ్వాలలు.

అవును అవే మీ మాంసమ్ములు
పిశాచముల కాహారమ్ములు
నలుప్రక్కల నాట్యము చేసెడి
శ్మశానగణమునకు ముదమ్ములు.

అవును అవే మీమీ కేకలు
ఆకసమున కెగసిన మూకలు
గాలికి చీకటిలో ఆహుతి
గా మారిన తరంగ శాఖలు.

—



ద్వైతాద్వైత వాదము

[నింబార్క సంప్రదాయము]

శ్రీ పూర్ణానంద

✽

నియమేన యదానందో జగ ద్భాసయతేఽఖిలమ్,
త మహం నియమానందం వందే కృష్ణం జగద్గురుమ్.

—సిద్ధాంతజాహ్నవి.

ప్రవేశిక :

సనకాది సంప్రదాయ మనబడు ఈ వేదాంత దర్శనశాఖను విస్తరింపజేసినది శ్రీ నియమానందుడు. బ్రహ్మవస్తు వింద్రియాదుల కగోచరము, అతీతము అని ఉపవర్ణించు శ్రుతులే వీరికి ముఖ్యమగు ఆధారము. సనత్కుమార, సనక, సనందనాదులును, నారదుడును పూర్వాచార్యులుగా చెప్పబడినను, వారి గ్రంథము లెవ్వియును—ఏతద్విషయకములు – గానరాకున్నవి. వేదాంతసూత్రములలో (౧-౪-౨౧; ౩-౪-౪౫; ౪-౪-౬) ఔడులోమి యను ఆచార్యుడు ఇట్టిదే యగు సిద్ధాంతమును నిరూపించినట్లు పేర్కొనబడియున్నది; ఈ ఆచార్య ననుసరించి శ్రీ శంకర రామానుజులకు మధ్య వెలసిన భాస్కరాచార్యులు వేదాంతసూత్రములకు ద్వైతాద్వైతపరముగ నొక భాష్యమును రచించియుండెను. కాని, అది కేవలము 'బ్రహ్మ'పరము. తరువాత, శ్రీకృష్ణపరమగు వ్యాఖ్య నొనరించుచు, ౧౧-వ శతాబ్దపువాడగు శ్రీనియమానందుడు సనకాది సంప్రదాయమును వ్యాపింపజేసెను.

ఈ సంప్రదాయమువారి ముఖ్యకేంద్రము — పీఠస్థానము— బృందావనమునందలి ధ్రువక్షేత్రము. ఆ పీఠాధిపతులకు 'వ్రజవిదేహి' యను బిరుదు గౌరవ సూచకముగ నొసగబడును. ఈశతాబ్దమున ఆ పీఠము నధిరోహించి కీర్తిశేషులైన శ్రీరామదాస్ కతియా బాబాజీ, శ్రీశాంతదాస్ బాబాజీల జీవితము ఆదర్శప్రాయము. ఆధ్యాత్మిక శాంతికాములకు శ్రవణీయము.

ఇట 'బాబాజీ' పదమును జూచి ఈసడించు కొన బనిలేదు. అద్వైత సన్యాసులు 'స్వామి' లన బడునట్లు వైష్ణవ సన్యాసులు 'బాబాజీ'లనబడుదురు. శ్రీ శాంతదాస్ బాబాజీవారి పూర్వాశ్రమ నామము శ్రీతారాకిశోరరాయచౌధరి. వారు చాలకాలము కలకత్తా హైకోర్టువకీలుగా నుండిరి. జడ్జిపదవి లభించు అవకాశ మున్నదని సర్ జాన్ ఉడ్రాఫ్ గారు నివారించినను వినక, సన్యాసమును గ్రహించిన త్యాగపురుషులు వారు. వారిదర్శనము నాకు భువనేశ్వరీ (పూరీ జిల్లా, ఒరిస్సా) గ్రామమున లభించినది. గత వత్సరము నవే వా రిహమును వీడిరి. ప్రస్తుత మా పీఠమున కధిపతులు శ్రీ ధనంజయదాస్ బాబాజీగారు.

శ్రీనియమానందుల శిష్యులగు కేశవభట్టు, హరివ్యాసు లనువారు విరక్తులు, గృహస్థులు అను రెండు శాఖలను బ్రవర్తిల్ల జేసిరి. ఈసంప్రదాయమువారు

ఉత్తరదేశమున అధికముగను; వంగదేశమున అల్పముగను నున్నారు.

"జీవుడు బ్రహ్మమునుండి అత్యంతము భిన్నుడు, అభిన్నుడునుగూడ" అను ప్రతిపాదనవలన దీనికి ద్వైతాద్వైతవాద మను అన్వర్థ నామము కలిగినది.

జీవితము :

శంకర రామానుజాదుల జీవితమును వర్ణించు గ్రంథములు సంస్కృతమునను, తదితర భాషలలోను పెక్కాధికముగ లభించుచున్నవి. కాని, ఈ ఆచార్యుని ప్రసంగ మే గ్రంథమునను వివరింపబడి యుండక పోవుటవలన విశేషము లేవియును తెలియరాకున్నవి.

త్రిలింగదేశమున ఈయన జన్మించినట్లు విజ్ఞుల అభిప్రాయము. ఈయన పాండవ వివరణార్థ మవతరించిన సూర్యుడని తత్సంప్రదాయజ్ఞుల విశ్వాసము. మఱియు సూత్ర భాష్యమున "పరమాచార్యైః శ్రీ కుమారై రస్మద్గురవే శ్రీమన్నారదాయ ఉపదిష్టః" (౧-౩-౮) అనుటవలన ఈయన నారదునకు సమకాలమున నుండె నందురు. ఈ వాక్యమును ఈ రీతిగా అర్థమొనర్చినచో సందేహములు చాలగ కలుగుట కవకాశమున్నది. ఛాందోగ్యోపనిషత్తునందు, శ్రీమద్భాగవతమున, పాంచరాత్రవాఙ్మయమున నారదుని ప్రసంగమున్నది. అగుచో ఈముగ్వురును ఒక్కరేనా, లేక వేర్వేరుగ నున్న మున్గురా? వీరు ఏ యే సమయముల నుండిరి? వీరిలో నియమానందుల గురు వెవరు? —ఇత్యాదిగా.

అద్వైత సన్యాసులు "శ్రీశంకరుడు మాగురు" డని గౌణముగ వ్యవహరించునట్లే, నియమానందుడు "నారదుడు మాగురు"డని వచించియుండునని తోచుచున్నది.

భవిష్యత్పురాణ పరిశిష్టమున భగవద్భక్త మాహాత్మ్య ప్రసంగ మున్నది. అందు నియమానందుని నామము గానవచ్చును.*

ఈయనకు భాస్కరుడు, నింబాదిత్యుడు, నింబార్కుడు అను నామములుగూడ ఉన్నవి. భాస్కరుని భేదాభేద వాదముతో నింబార్కుని సిద్ధాంతమునకు గల సాదృశ్యము ననుసరించియే ఈనామము వచ్చియుండ వచ్చును. నియమానందు డసలు పేరు. నింబార్కుడు, లేక నింబాదిత్యు డను పేరుతోడనే ఈయన ప్రసిద్ధిని గాంచెను.

శేషోక్త నామము కలుగుటకు కారణముగ వంగ భాషయందు పద్యములలో రచింపబడిన 'భక్తమాల' యను గ్రంథ మిట్లు నుడువుచున్నది:

సూర్యాస్తమయానంతరము భుజించు ఆచారము లేని సాధుపురుషు డొకడు నియమానందుని ఆశ్రమమున కరుదెంచెను. వారిరువురకును శాస్త్రవిషయములను గుఱించి వాదము జరుగ, వారికి తెలియకుండగనే సూర్యు డస్తశిఖరిని జేరెను. అప్పుడు నియమానందుడు అతిథికి భోజనము నర్పింపబోవ, నాతడు గ్రహింపకుండెను. నియమానందుడు సూర్యుని ప్రార్థింప (మఱికొందఱి ననుసరించి సుదర్శన చక్రము ప్రార్థింప) నికటస్థ మగు నింబవృక్షమున నిల్చెను. అతిథి సంధ్య ముగియలేదని తలచి భుజించెను.

అప్పటినుండియే నింబాదిత్యుడు, లేక నింబార్కుడను నామమున ఈ ఆచార్యుడు పేర్కొనబడుచుండెను.

సంప్రదాయప్రవర్తకు డగుటవలన ఈయన జీవితమున విశేషము లేవియు లేకపోలేదు. ఎట్టి వివరణయు లభింపనందువలన, శంకర రామానుజాల మధ్యకాలమున, అభినవసృష్టి సిద్ధాంతములు వ్యాప్తియందున్న తఱి ఈ ఆచార్యుని అభ్యుదయమని ఊహించి చెప్పుటకంటె అన్యోపాయ మేమియును లేదు.

గ్రంథములు :

నింబార్కుడు రచించిన సూత్రభాష్యము 'వేదాంతపారిజాత సౌరభ'మనబడుచున్నది. ఇది

* విష్ణుస్వామీ ప్రథమతో నింబాదిత్యో ద్వితీయకః. మధ్వాచార్యస్తృతీయస్తు తుర్యో రామానుజః......

అత్యంతసంక్షిప్తము. ఇందు నింబార్కుడు పరమత ఖండన కొనర్పకయే స్వమతమును ప్రపంచించుట గమనింపదగియున్నది. నింబార్కుని శిష్యుడగు శ్రీనివాసుడు 'వేదాంత కౌస్తుభము' అను టీకను సమకూర్చెను.* దేవాచార్య డను ఆచార్యుడు చతుస్సూత్రికి 'సిద్ధాంతజాహ్నవి' అను వృత్తిని విరచించెను. ఈ వృత్తికి మరల సుందరభట్టు 'సిద్ధాంతసేతుక' యను టీకను వ్రాసెను.

'శ్రీకృష్ణస్తవరాజ' మను స్తోత్రగ్రంథ మొకదానిని ఆరునెలల క్రిందట కలకత్తాయందలి దేవకీనందన ప్రెస్సు వారు వంగాక్షరములలో వెలువరించియున్నారు. ఇందలి శ్లోకములు కడుంగడు హృద్యములై యున్నవి.

వేదభాష్యమును నింబార్కుడు రచించియుండె నందురు కాని, అది ప్రస్తుత మలభ్యము.

ఇవి గాక ప్రకరణగ్రంథము నొకదానినిగూడ నింబార్కుడు రచించియుండునని నా విశ్వాసము. దేవాచార్య, సుందరభట్ట, పురుషోత్తమాచార్యులు (వేదాంతరత్న మంజూష) తమ రచనలలో కొన్ని శ్లోకము లను నింబార్కునివిగా నుదాహరించియున్నారు. మూలగ్రంథము దొరకుట లేదు.

ఈ గ్రంథములలో లభించు సిద్ధాంతముల నొకింత అరయుదము.

అధికారి :

కర్మ బ్రహ్మముల సాతిశయత్వ, నిరతిశయత్వ విషయక మగు జ్ఞానఫలముగా నిర్వేదము నంది, భగవత్ ప్రసాదమును బడసి, తద్దర్శనమును కాంక్షించువాడును, గురుభక్తితో నిండిన హృదయము గలవాడును నగు ముముక్షు వీశాస్త్రమున కధికారి.†

సంబంధము :

శాస్త్ర బ్రహ్మములకు వాచ్య వాచక సంబంధ మున్నది. బ్రహ్మజ్ఞానము కేవలము శాస్త్రము వలననే లభించుచున్నది. విశ్వజన్మాది హేతు వగు అచింత్యశక్తి వేదైక ప్రమాణగమ్యము.

విషయము - ప్రయోజనము :

బ్రహ్మమే జిజ్ఞాసావిషయము. అయ్యది అనంతము, అచింత్యము, విశ్వాత్మ, సర్వభిన్నాభిన్నము. అది రమాకాంతుడును, పురుషోత్తముడును నగు వాసుదేవుడు. భగవత్ ప్రసాద దర్శన లాభములే ప్రయోజనము. దీన సర్వ దుఃఖ నివృత్తియును, పరమానందమును కలుగును.

బ్రహ్మము :

బ్రహ్మము జీవజగత్తులనుండి భిన్నము, అభిన్నమునుగూడ. ఈ రెండును బ్రహ్మముయొక్క పరిణామము. బ్రహ్మమే జగత్తునకు ఉపాదాన కారణము, నిమిత్తకారణమును నై యున్నది. సృష్టి లయముల కయ్యదియే కర్త. అయ్యు అది జగత్తున కతీతమగు తత్త్వముగనే యుండును. కనుక, బ్రహ్మ జగత్తులకు భేదము సిద్ధించుచున్నది. ఇక ఉపాదానకారణము గూడ బ్రహ్మమే యగుటవలన జగత్తుయొక్క ప్రతిష్ఠ బ్రహ్మముననే. కనుక ఈ రెండును అభిన్నములు. జగత్తు గుణాత్మకము; బ్రహ్మము గుణి. గుణవంతునికంటె వేరగు ఉనికి గుణమున కుండజాలదు. అయ్యు గుణయుక్త మగునది గుణముకంటె అతీతమై యుండ గలుగుచున్నది. అందువలన, ఈ రెంటికిని —

---

* సటీకా మాత్రభాష్యమును బృందావనమునందలి కిశోరదాస్ బాబాజీగారును, కాశీయందలి చౌఖాంబా గ్రంథమాలవారును వెలువరించియున్నారు. నింబార్క భాష్యానుసారము ఆంగ్లమున శ్రీధర ముజూమ్ దార్ గారు (బారిసాల్ - బెంగాల్) వ్రాసిన గ్రంథ మున్నది.

† కర్మబ్రహ్మ ఫలసాతిశయత్వ, నిరతిశయత్వవిషయక వ్యవసాయజాత నిర్వేదేన భగవత్ప్రసాదేప్సునా తద్దర్శనేచ్ఛాలంపటేన సాచార్యైకదేవేన శ్రీగురుభక్త్యైకహార్దేన ముముక్షుణా... జిజ్ఞాసా సతతం సంపాదనీయా ఇతి. —వే. పా. సౌ. (౧-౧-౧.)

గుణి గుణములు, లేక శక్తిమంతుడు శక్తి — ఉండు సంబంధము భేదాభేదము. బ్రహ్మము సగుణము, నిర్గుణముగూడ. రూపమున సగుణత్వ నిర్గుణత్వముల కుండు ఆపాతవిరోధము వాఙ్మాత్రము. బ్రహ్మము సర్వజ్ఞ స్వభావము; జడస్వభావము కాదు. బ్రహ్మము నుండి జగత్తు అభిన్న మగుటవలన, విషయము లన్నియును బ్రహ్మమున అభిన్నభావముననే వెలయు చున్నవి. బ్రహ్మస్వరూపమున ఎట్టి వికారమునకును తావు లేదు. కాలశక్తి కూడ బ్రహ్మముననే లయమగుచున్నది. బ్రహ్మమున గుణము, గుణి యను భేదము లేదు. అందు జ్ఞాన - జ్ఞాతృ - జ్ఞేయ భేదములు లేకపోవుటవలన నిర్గుణత్వ నిష్క్రియత్వములు సిద్ధించుచున్నవి.

బ్రహ్మము సర్వశక్తిమంతము. ఈశక్తి స్వాభావికము. ఈశక్తిబలముననే అయ్యది తనకంటె వేరగు జగత్తును ప్రకాశింప జేయుచున్నట్లు తోపట్టును. ఈ శక్తిబలముననే స్వరూపాంతర్గతమగు జగత్తును భిన్నరూపమున దర్శించుచున్నది. ఇట్లు వీక్షించునదియే జీవశక్తి.

జగదతీతమగు బ్రహ్మభావము నిర్గుణము; జగదంతర్గతమగు బ్రహ్మభావము సగుణము. ప్రళయకాలమున జగత్తు బ్రహ్మమున లీనమైనను, దాన బ్రహ్మము కళంకిత మగదు- పృథివీవికారము లందు విలీనములైనను దానిని కలుషిత మొనర్పనట్లు. నిర్గుణ మనగా అనంత గుణము.

జీవుడు :

జీవుడు బ్రహ్మముయొక్క అంశ. జీవుడును, బ్రహ్మమును భిన్నాభిన్నులు. 'జ్ఞాజ్ఞౌ ద్వావజా వీశానీశౌ' 'తత్త్వమసి' అను శ్రుతివాక్యము లీ విషయమునే సమర్థించు చున్నవి. జీవుడు పరమేశ్వరుని కార్యము. కార్యము కారణమునుండి అభిన్నము. అందువలన జీవబ్రహ్మముల కభేదము. సముద్రము తరంగములవలెను, సూర్యుడు తేజములవలెను జీవేశ్వరులు భిన్నాభిన్నులు. మఱియొక ఉదాహరణ : వజ్రవైడూర్యాదులు భూవికారములే యైనను, భిన్నముగ తోచుచున్నవి. వాస్తవమున కవి భిన్నములు కావు.

జీవుడు అణువు; విభుడు కాదు. జీవుడు అల్పజ్ఞుడు. ముక్తావస్థయందుగూడ జీవుడు జీవుడే. అణుత్వ, నిత్యత్వము లాతనియందు స్థిరములు. ముక్తులకును, బద్ధులకును గల ప్రభేద మిది: బద్ధజీవులకు తనయొక్కయు, జగత్తుయొక్కయు బ్రహ్మభావ మనుపలబ్ధము; దృశ్యముతో నేకత్వము నందును. ముక్తావస్థయందు తనయొక్కయు, జగత్తుయొక్కయు, బ్రహ్మముయొక్కయు అభేదత్వము గోచరమగును. అనగా, తన్ను, జగత్తును బ్రహ్మముతో నొకటిగా అరయును. ఏవస్తువుయొక్క స్వరూపమునకును ఐకాంతికవినాశము లేనందువలన జీవుడు జీవుడుగానే యుండిపోవును. 'తత్త్వమసి' వాక్యము అభిన్నత్వ సాదృశ్యపరము; సామ్యజ్ఞాపకము కాదు.

జగత్తు :

బ్రహ్మమే దీనికి నిమిత్తోపాదాన కారణములని పూర్వము చెప్పియుంటిని. క్షీరము దధియగునట్లు బ్రహ్మమే అసాధారణశక్తియోగమున కార్యాకారముగా పరిణతి నందుచున్నది. ఇయ్యది స్వశక్తివిక్షేపము వలన సంభవము. ఇట్లు పరిణమించియు అవికృతముగా నుండుట సర్వశక్తిమంతునిపట్ల చోద్యము కాదు.

సాధన - ముక్తి :

భక్తియే సాధనోపాయము. ఉపాసనాఫలము బ్రహ్మప్రాప్తి. భక్తియే ముక్తిని గూర్చును. జగత్తును, తన్ను బ్రహ్మరూపమున భావించుట భక్తియొక్క అంగము. భక్తుడు భగవంతుని జగదతీతునిగా చింతించును. తత్ఫలముగా నాతడు 'అర్చిరాదిమార్గ'మున బ్రహ్మలోకమున కరుగును. శూద్రులకు బ్రహ్మవిద్యాధికారము లేదు.

అనుశీలన :

బ్రహ్మము సగుణము, నిర్గుణమునుగూడ అగుటవలన ద్వైతాద్వైతమును, బ్రహ్మమును, జీవుడును భిన్నాభిన్ను లనుటవలన భేదాభేదమును సిద్ధించుచున్నవి. ఈ విషయములు నింబార్కునిపై భాస్కరుని సిద్ధాంతముల ప్రభావమును దెలియజేయుచున్నవి.

అయితే :

జీవబ్రహ్మముల అభిన్నత్వ, భేదత్వముల విష యమున ఈ ఇరువురకును నాకింత పార్థక్య మున్నది. ఉపాసనాఫలముగ బ్రహ్మభావమును బొందిన జీవుడు బ్రహ్మముతో నభిన్నత్వమును బొందును. ఇయ్యది వర్తమాన శరీరపతనానంతరము లభించును. కాని, నింబార్కుని ముక్తియందిట్టి ఐక్యము చేకూరదు; జీవుడు జీవుడుగానే యుండును. ముక్తజీవికూడ అంశయే; విభువు కాదు.

ఈ విషయమున నింబార్కుని సిద్ధాంతమునకును, గౌడీయవైష్ణవుల సిద్ధాంతమునకును సాదృశ్య మున్నది.

వేదాంత పారిజాత సౌరభమును జదివినచో బ్రహ్మము యొక్క సగుణభావమే విశేషముగా గోచరించును; నిర్గుణభావ మంతగా స్ఫురింపదు. సూత్ర పాఠ విషయమున శంకరనింబార్కులకు విశేషమగు తారతమ్యము తోచుచున్నది. నింబార్క భాష్యమున గనబడు 'ప్రతిజ్ఞావిరోధాత్' (౧-౧-౮) అను సూత్రము శాంకరభాష్యమున లేదు.

"అంతరాభూతగ్రామవత్ స్వాత్మనోఽన్యథా భేదాఽనుపపత్తి రితి చే న్నోపదేశాంతరవత్" (౩-౩-౩౫) అను సూత్రము శాంకరభాష్యమున రెండు సూత్రములుగా విభజింపబడియున్నది. ఇట్లే, "విద్యైవతు నిర్ధారణాత్ దర్శనాచ్చ" (౩-౩-౪౭) "ప్రతిషేధా దితి చే న్న శారీరాత్ స్పష్టో హ్యేకేషామ్" (౪-౨-౧౨) అను సూత్రవిషయము గూడ.

శాంకర భాష్యమున గనబడు "ఉభయవ్యామోహాత్ తత్సిద్ధేః" (౪-౩-౫) అను సూత్రము నింబార్కభాష్యమున లేదు.

"ప్రతిషేధా దితిచే న్న శారీరాత్"(౪-౨-౧౨) అను సూత్రమును శంకరుడు పూర్వపక్ష సూత్రముగాను, నింబార్కుడు సిద్ధాంతసూత్రముగాను గ్రహించిరి.

"ఆభాస ఏవచ" (౨-౩-౪౯) అని శంకరుడు గ్రహించిన సూత్రమునకు నింబార్కపాఠము "ఆభాసా ఏవచ" అని.

"ఉత్పత్త్యసంభవాత్" (౨-౨-౪౨) అను సూత్రమును శంకరుడు పాంచరాత్ర (భాగవత) మత ఖండన పరముగా వ్యాఖ్యానించెను. శ్రీ రామానుజులు సాంఖ్యమత ఖండన పరముగా నుడివెను. నింబార్కుడు శక్తికారణవాదఖండనపరముగా అర్థమును జెప్పెను.

సమాప్తి :

వేదాంత పారిజాత సౌరభము వ్రాయబడిన, ఆకాలమున నున్న వాదముల నన్నిటిని సమన్వయించి, మతవివాదములను బోనడప నింబార్కస్వామి ప్రయత్నించియుండె నని గ్రహింపగలము. ఒకపక్షము వారు అద్వైతమును, అన్యులు ద్వైతమును గ్రహించి పోరాడుచుండ నింబార్కుడు సర్వశక్తిమంతమగు బ్రహ్మమున ఈ రెండును సమంజస మని నిరూపింప యత్నించెను. ఈ సాధుప్రయత్నము, విరుద్ధధర్మముల యుగపదవస్థానము అసంభవమే యైనను, ధన్యవాదార్హము. * ఈ వైరుద్ధ్యమునుండి తప్పుకొన, తరువాతివారును, నింబార్కుని మతవాదము నెక్కుడుగా పరిగ్రహించినవారును నగు గౌడీయవైష్ణవులు 'అచింత్య' పదమును విరివిగా ప్రయోగించిరి. †

వీరిరువురకును శ్రీమద్భాగవతము ప్రధానగ్రంథము, రాధాకృష్ణుల యుగళమూర్తి ఉపాస్యము. రాధకు గౌడీయ వైష్ణవమతమున నున్నంత ప్రాధాన్యము నింబార్కమతమున లేదు.

---

* స్వసిద్ధాంత వ్యాఘాతకరముగ శ్రీ నింబార్కుడే "ఏకస్మిన్ వస్తుని సత్త్వాసత్త్వాదేః విరుద్ధ ధర్మస్య ఛాయాతపవత్ యుగప దసంభవాత్" (వే. పా. సౌ. ౨-౨-౩౩) అని వచించియుండుట గమనింపదగియున్నది.

† గౌడీయ వైష్ణవసిద్ధాంతము అచింత్య భేదాభేదవాద మనబడుచున్నది.

నేటివఱకును అవ్యాహతముగ నింబార్క సంప్రదాయము నిలిచియుండుట గాంచిన: నింబార్కుని సమయమునను, తదనంతరమును ఇయ్యది బహుళప్రచారమున నున్నట్లు ఊహింపగలము. 'సర్వనిరాకృతి'యగు కాలపురుషుడే తత్సంప్రదాయ గ్రంథములను గ్రసించియుండుట శోచనీయము. అంతేయును ఇచ్ఛామయుని ఇచ్ఛయని సమాశ్వాసించుకొనుటకంటె అన్యోపాయము లేదు.

యువతీనాం యథా యూని యూనాంచ యువతౌ యథా,
మనోఽభిరమతే తద్వన్మనోఽభిరమతాం త్వయి.



చైత్రయాత్ర


శ్రీ రుక్మిణీనాథ శాస్త్రి

ఏ మహితానుభూతికో తపించిన నోములు రిత్తకా వెతక
ఆమని వేఁడి కామనల కందని సుందరి మందహాసమై
నామది నిల్చి, అశ్రువుల నాకయి విల్చిన వెక్కిరింత పూ
లై మెడనిండ నిండినవి ఆశలు పాశములై లగించగా.

ఊహలు కంచునీడలుగ ఊర్చిన నన్ను ఘనీభవించుకో
స్నేహితులైన గూఢగణ నీరవ పర్వత పారిజాతముల్
కాహళ మూద దాహుకుని కైవడి, నన్నరగోట మీట, పై
పై హసియింప, నిల్చితిని పండుగ కెండిన మామిడాకునై.

రాని కరాళవహ్నులను, ప్రమాన్పడి తన్ను గ్రసించు రాహువున్
పూనిన చంద్రమశ్శకలభుక్తిని, పారదలేలిహానమున్
వేసవి కత్తివంపులను, వీథుల వాగ్మి కుజగ్రహమ్ములో
కానుక లందురా ? నిలిపి కత్తులబోనులో ఏడ్వమందురా ?

వేకువ ! కూలిపోయినది వ్యంతము లేడ్చిన మంచుబొట్లలో
నే కకుబంత దుర్దశ, మణిప్రభ పండెను తూర్పు వెల్గులో
చీకిన పంకమున్ మొలిచి జేజె వసించెడి పద్మ మోదు నా
కై కిలికించితాలకు సుఖంపడ రేమొ దివాంధబంధువుల్.



నిజమేనండోయ్ - శ్రీనాథమహాకవి వర్ణించిన విద్యుద్దీపాలు

[శ్రీ గొబ్బూరు వేంకటానంద రాఘవరావు]

విద్యుత్సంబంధమైన విజ్ఞానం ఈమధ్య విశేషంగా వృద్ధిపొందిన సంగతి నిజమే. కాని ఈశక్తిమాత్రం పడమటివారు క్రొత్తగా సృష్టిచేసినది కాదు; మానవుడు క్రొత్తగా తెలుసుకున్నదీ కాదు.

మొన్న మొన్నటిదాకా—అనగా ౧౮-వ శతాబ్దంలో — బెంజమిన్ ఫ్రాన్క్లిన్ (Benjamin Franklin) దొర అమెరికాలో నిరూపించేదాకా మెఱుపు విద్యుత్సంబంధమైన దనే సంగతి పడమటి వాళ్లకు తెలియనే తెలియదు. కాని మనపూర్వులు ఆనాడే మెఱుపు విద్యుత్సంబంధమైన దని తెలుసుకోవడమే కాకుండా దాని పేరే విద్యుల్లేఖ అని పెట్టేశారు. చూడండి: 'మంత్రపుష్పం'లో పరాత్పరుడు నీలమేఘంమీద మెఱుపులాగ ప్రకాశిస్తున్నాడని చెప్పేరు—"నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా" అని.

***

ఇంక నీటిసంగతి చర్చ చేదాం. విద్యుత్తువల్ల ఛేదిస్తే నీటినుండి రెండువాయువులు బయట పడతవి. ఆసంగతి పట్టుకొని "నీరు మూలద్రవ్యము (Element) అనుకుంటున్నారు. మీ పూర్వులికి నీటి సంఘట్టనము (Composition of water) అంటే యేమిటో తెలుసునా? అక్సిజన్, హైడ్రొజన్ అనే గ్యాసుల సమ్మేళనంవల్ల నీరు ఏర్పడుతుందనీ, నీరు మిశ్రద్రవ్య (Compound)మనీ అయినా ఎరగరు" అని పడమటివారూ, వారి నాగరకతాప్రభావంవల్ల తదితరం ఏమీ ఎరగని ప్రాచ్యులూకూడా ఆక్షేపిస్తున్నారు. ఈమధ్యను మద్రాసు గవర్నమెంటువారి యల్. ఐ. యం. స్కూలులో ఉపన్యాసం ఇస్తూ "మీరు పంచభూతాలవాళ్లు; త్రిదోషాలవాళ్లు. ఆయుర్వేదం వైద్యం ఏమిటి" అని అపహాస్యం చేశాట్ట ఒక మహానుభావుడు!

ఈ అపహాస్యం కేవలం అజ్ఞానజనితం. ఏమంటే ఈనాటి వైజ్ఞానికులకు తెలిసిన నీటి సంఘట్టనం (Composition of water) — అంటే ఏదేం పదార్థాలు ఎలా చేరి నీరు అయినదో మనపూర్వులకు తెలియక పోలేదు. పరిణామక్రమమూ, (Evolution) నీటిరచనా కూడా వాళ్లు బాగా ఎరుగుదురు. "ఆకాశా ద్వాయుః; వాయోరగ్నిః; అగ్నే రాపః." అగ్నివల్ల నీరు పుడుతున్నదన్నారు. అగ్నివల్ల నీరు ఆర్చుకుపోతుందా, పుడుతుందా?

సన్నని రంధ్రము గల గాజుగొట్టముద్వారా హైడ్రొజను అనే వాయువును పోనిచ్చి, మండుతున్న అగ్గిపుల్ల ముట్టించినపుడు అది లేతనీలిరంగుజ్వాలతో మండుతుంది. ఆమంటమీద పొడిగా, చల్లగా ఉన్న గాజుగళాసు బోర్లించిఉంచితే పక్కపక్కల్ని నీరు ఆవిర్భవిస్తుంది. ఇందువల్ల అగ్నిజ్వాల నీరుపుట్టుటకు కారణం కాగలదని తేలుతున్నది.

ఇప్పుడు తైత్తిరీయోపనిషత్తు చిత్తగించండి: "అగ్నిః పూర్వరూపం, ఆదిత్య ఉత్తరరూపం, వైద్యుత

స్పంధానం ఆపస్సంధిః" అని అందులో చెప్పబడి ఉన్నది.

అగ్నిః పూర్వరూపం అంటే యేమిటి?

హైడ్రోజన్ అనే వాయువుమంట మూడువేల డిగ్రీల వేడిమి కలిగిఉంటుందనీన్నీ, అంతవేడిగల జ్వాల మరేదీ లేదనీ ఈనాటి పరిశోధకులు నిశ్చయించారు. 'వాయోరగ్నిః' – అనగా వాయువువల్ల అగ్ని ప్రభవిస్తుందని పైన తెలుసుకున్నాం. ఈవాయు వేది, జ్వాలా రూపమైన అగ్నికి పూర్వరూపమైన వాయు వేది అని యోచిస్తే ఈనాటి హైడ్రోజను వాయువే ఆనాటి 'అగ్నిః పూర్వరూపమైన'వాయు వని స్పష్టం అవుతున్నది. దానినే వేదకాలంనాడు అగ్నికి పూర్వ రూపమైన వాయువని వ్యవహరించేవారు.

ఇంక 'ఆదిత్య ఉత్తరరూపం'అంటే యేమిటో తెలుసుకుందాం. ఆదిత్యు డనగా సూర్యుడు. సూర్యుని ఉత్తర రూపం—సూర్యకాంతి ప్రసరించడంవల్ల కలిగే ఫలితం—ముఖ్యమైనది – ఏది? తృణ, లతా, గుల్మ, వృక్షాదులైన ఓషధిజీవులు వర్ధిల్లడమునకు సూర్యకాంతి చాలా అవసరం. సూర్యకాంతి తగలని ఆకులూ, మొక్కలూ పాలిపోతవి కాని పచ్చగా ఉండవు. సూర్యకాంతిలోనే 'హరిత ఆవిశే'—వృక్షజీవుల ఆకులకు పచ్చదనం ఇచ్చే రసం క్లోరోఫిల్ (Chlorophyll) అనే ద్రవ్యం ఉత్పత్తి అవుతుంది; పువ్వులూ, కాయలూ, పళ్లూ పుట్టుకొని వస్తవి. ఆహారం నిర్మించబడుతున్నది. అందుమూలంగానే జంతువులూ, మనుష్యులూ జీవిస్తున్నారు. కాబట్టి 'అన్నం ఆదిత్యమయం' అని భారతం ఘోషిస్తున్నది. జూదంలో ఓడి అడవులపాలైన ధర్మరాజు సూర్యుణ్ణి ఆరాధించి, అన్నం సంపాదించి, తనతో వచ్చినవాళ్లకు భోజనం పెట్టినాడట! దేహపోషణ మూలంగా ప్రాణరక్షణే ఆదిత్యుడు నిర్వహిస్తున్న ముఖ్యవ్యాపారం.

అదేవిధంగా మనగాలిలో ఉన్న ఆక్సిజను అనే వాయువును పీల్చి, వెట్టపుట్టించుకొని, సమస్త ప్రాణులూ దేహధారణ చేసుకుంటున్నవి గనుక దీనిని మనవాళ్లు ప్రాణవాయువు అంటున్నారు. కాబట్టి వేదకాలంనాటి 'ఆదిత్య ఉత్తరరూప' వాయువే ఈనాటి ప్రాణవాయువు; పాశ్చాత్యుల ఆక్సిజనువాయువు అని స్పష్టం అవుతూంది.

కనుక,

అగ్నిః పూర్వరూపం = హైడ్రోజన్ } + { ఆదిత్య ఉత్తరరూపం = ఆక్సిజన్ = ప్రాణవాయువు

ఈ రెండువాయువులకును 'వైద్యుతోస్సంధానం'– Electrical Contact లేక Explosion జరిగించగా పుట్టేది 'ఆపస్సంధిః'—నీరు.

ఇప్పటి సైన్సుక్లాసుల్లో ఈవిధంగా ఈవాయువుల సమ్మేళనం జరిగించి నీరుపుట్టించి చూపిస్తున్నారు. చదవనివారు వేదాలూ ఉపనిషత్తులూ ముట్టుకోరు. భక్తిగౌరవాలతో చదివేవారు గ్రామఫోనుప్లేట్ల మాదిరిగానూ, చిలకపలుకుల మాదిరిగానూ చైతన్యమూ, అర్థజ్ఞానమూ మినహాగా చదువుతున్నారు. అందరూ కూడా పూర్వులకు తెలిసిన విషయాలుకూడా తెలియవని అక్రమంగా అజ్ఞానం అంటగట్టి ఆక్షేపిస్తున్నందుకు విచారం అవుతున్నది. సరిగా చదివి అర్థంచేసుకున్న కొద్దీ మహాఋషుల వాక్యాలలో గొప్పవిశేషాలు బయటపడతవి.

***

కొన్నిజాతుల మణులూ, రత్నాలూ, స్ఫటికాలూ ఇటువంటివి మథించినప్పుడు విద్యుత్తు ప్రభవిస్తుంది. ఆశక్తివల్ల ఆమణి గడ్డిపరకలు మొదలైన తేలికవస్తువులను ఆకర్షించుకో గలుగుతుంది. సువర్ణచ్ఛాయ గల ఏంబరు (Amber)అనే ఒక స్ఫటికానికి ఈశక్తి ఉన్నదని గ్రీసుదేశంలోవారికి రెండువేల ఏళ్లకిందటే తెలుసును. ఈస్ఫటికానికి ఆదేశంలో 'ఎలెక్ట్రాన్'అని పేరు ఉండేది. దానికి గల ఆకర్షణశక్తికే వాళ్లు 'ఎలెక్ట్రిసిటీ' అని పేరుపెట్టినారు.

మనపూర్వులు రత్నశాస్త్రంలో రత్నపరీక్షకు తృణగ్రాహిత్వం ఒక లక్షణంకింద చెప్పారు. కుమారధూర్జటి కృష్ణరాయవిజయంలో దీన్ని గురించి వివిధ ప్రాశాలలో చదవండి.

"అలి తృణగ్రాహియైన నీలమున కరయ
విలువ యధికంబు; తృణమని విడిచినంత
జాతి నీలంబు గాదు—"

తోరమల్లి అనే శిలకుగూడా ఈశక్తి ఉన్నది. తోరమల్లిని పడమటివారు Tourmaline అంటున్నారు.

ఇలాగ్గా విద్యుత్ శక్తితోనూ, ఆశక్తియొక్క వివిధ పరిణామాలతోనూకూడా అనాదికాలంనుంచీ మనవాళ్లకు కొంతకొంతమట్టుకైనా పరిచయమూ, ఉపయోగమూ ఏర్పడిఉన్నవి.

***

ఇక ప్రస్తుతవిషయం. శ్రీనాథుడు వర్ణించిన విద్యుత్ దీపాల (Electric lights) సంగతి చూదాం.

శ్రీనాథుడు నిండుజవ్వనంలో తెనుగున వ్రాశాడు—శ్రీహర్షుడు వ్రాసిన సంస్కృతనైషధాన్ని. అందులో నిషధరాజు — అంటే నలమహారాజు అంతఃపురంలో దమయంతితో కూడిఉన్నప్పుడు ఆ గదిలో ముచ్చట ఇది:

"ఒకదీప మార్పిన నున్నదీపంబులు
వప్పుడ కేమకుఁ దా మారుటయును,
దాలవృంతానిల చేలాంచలాదిక
వ్యాపారముల దీప మారమియును,
నారిన దీపంబు లప్రయత్నంబున
మరి చూడఁజూడంగ నుండుటయును,
మండి,మరియు నారి, మండిన దీపంబు
వెలుఁగు జీఁకటియుఁ గావించుటయును."

అంటూ యీతమాషా అంతా ఎంతోరమ్యంగా వర్ణించాడు, శ్రీనాథుడు!

ఆనాడు ఈదీపాలు అబ్బురం!

ఈనాడో ఈ దీపాల సంగతి నిత్యవ్యవహారం-నిత్యకృత్యం! — చూడండి:

సినీమాప్రదర్శనం ఆరంభించేముందు హాలులో దీపాలన్నీ హఠాత్తుగా ఆరిపోతవి. ఒక రంగం అయిన తరవాత మళ్లీ అన్నీ ఒక్కసారే గప్పున వెలుగుతవి. రైళ్లలోనూ అంతే - ఆవేళ అయ్యేటప్పటికి ఒక పెట్టెలో దీపాలన్నీ ఒక్కసారి వెలుగుతవి. ఆరిపోయే వేళకు అన్నీ ఒక్కసారే ఆరుతవి.

ఇప్పుడు ప్రతిపట్నంలోనూ విద్యుద్దీపాలే! ఇళ్లల్లో,గదుల్లో - అన్నీ విద్యుద్దీపాలే. దక్షిణదేశంలో పల్లెటూళ్లల్లోకూడా ఈదీపాలు కుక్కుమురికి అయివున్నవి.

విసరుకర్రలతోనూ, చీర చెరగులతోనూ విసిరినంతమాత్రంచేత ఈ దీపాలు ఆరిపోతాయా? 'స్విచ్చి' అనే మీట కదిపి నొక్కి తేనే ఆరడమూ, వెలగడమూకూడా. 'గప్'మని వెలిగించడమూ, 'టప్'మని ఆర్పెయ్యడమూ అంతా చేతిలోపనే!

నలమహారాజు అంతఃపురంలోవని శ్రీనాథుడెంతో అపురూపంగా, వింతగా వర్ణించిన ఈదీపాలు ఈనాడు కారుచవక అయినయి.

ఆకాలంలో డైనామో(Dynamo) యంత్రాలూ, ఎలెక్ట్రిక్ కార్పొరేషనులు లేవుకదా, ఈదీపాలు ఎలాగ వెలిగేవి? శ్రీనాథుడు ఊహించి కల్పించాడా, లేక నిజంగా ఇలాంటివి తాను చూశాడా అని ప్రశ్న.

***

ఇంగ్లీషు చదువుకున్నవాళ్లలో నూటికి ౯౫ మంది ఏమనుకుంటూ ఉంటారంటే — హిందువులూ - ఆంధ్రులూకూడా గతకాలంలోనూ,వర్తమాన కాలంలోనూకూడా తెలివి తక్కువవాళ్లు—పనికిమాలిన వాళ్లూ - దద్దమ్మలూ - వాజలూ అని. గురజాడవారి గిరీశం అదే స్పష్టంగా అనేశాడు - "మనవాళ్లు వట్టి వెధవాయలోయ్" అని. ఇలా అనుకునే యువకులు ఒకరకం. అగ్నిహోత్రావధాన్లు ఏమన్నాడూ?—"మన శాస్త్రాల్లో సంగతులన్నీ ఎత్తుకెళ్లి తెల్లదొరలు ఇంతవాళ్లైనారు. ఈ రెయిళ్లు గియిళ్లు యావత్తూ మనవేదాల్లో ఉన్నాయిష" అన్నాడు ఇది మరోరకం. మనలో పూర్వాచార పరాయణులు (Orthodox Section) ఈ రకంలోవాళ్లు.

అగ్నిహోత్రావధాన్లు "ఈపక్టైని జటలో తేమం తటివారు లేరు" అనిపించుకున్న జటాంతస్వాధ్యాయి. అయినా ఫలానావేదంలో, ఫలానా పన్నంలో, ఫలానాచోట ఈ సంగతులు ఉన్నాయని చెప్పడు—చూపించడు. అదీ వచ్చిన ఖర్మం. "ఉన్నాయిమ" అంటాడు గాని "ఇవుగో ఉన్నాయి" అనడు.

పైన వ్రాసిన పద్యం ఆధారంచేసుకుని మన పూర్వులు విద్యుద్దీపాలు పెట్టుకొనేవారు అని ఇదివరకు పత్రికలలో ప్రకటించారు—భాషాభిమానులూ, దేశాభిమానులూ అయిన పెద్దలు. సంతోషం. "మాతాతలు నేతులు తాగేవారు" అంటే అది మన చేతులమీదా, మూతులమీదా కనబడడం లేదు. ఆనాటి నేతిజారీ డొక్కు ఒకటైనా బయటపడితే, "ఈజారీమంత నేతితోనింపి, కొమ్ములోంచి పోసి నెయ్యి వడ్డించుకొనేవారు" అనుకోవచ్చును.

శ్రీనాథుడు వర్ణించిన దీపాలకు విద్యుత్తు అందిచ్చే సాధనం — పాత విద్యుద్ఘటం — ఏదైనా బయటపడితే — ఎంతైనా వుంది! అటువంటి ఉపపత్తి — తగిన బుజువు లేనిదే—అగ్నిహోత్రావధాన్లలాగ అనుకునీ, వ్రాసుకునీ పొంగితే ఏంలాభం? బుజువు చెయ్యలేనిది వట్టి బడాయి అనిపించుకుంటుంది. అది బుజువు చెయ్యడం ఎట్లా అని ఒక జిజ్ఞాస నన్ను పీడిస్తూఉండేది.


***

అటువంటి సమయంలో నామిత్రరత్నం శ్రీ బుద్ధా విశ్వనాథంగారు నాకు కొన్ని పుస్తకాలు అందిచ్చారు. అందులో ఒకవ్యాసం నాకంట బడింది. బంగారపుగని దొరికినంత సంతోషం అయింది.

***

అమెరికాఖండపు న్యూయార్కుపట్నంలో ప్రకటితమౌతూవున్న "Astounding" అనగా "అత్యద్భుతం" అనే ఒక పత్రికలోని విషయాలు సంకలితం చేసి లండనులో ప్రకటింపబడే Armchair Science ౧౯౩౦ ఏప్రిల్ సంచికలో వేశారు. విషయం—"Batteries of Baghdad." (బాగ్దాద్ విద్యుత్ ఘటాలు)

బాగ్దాదునగరం మధ్య ఏషియాప్రాంతంలో ఉన్నది. అరేబియనునైట్సు (Arabian Nights) కథలలో సుప్రసిద్ధుడైన ఖలీఫ్ హారూన్ అల్ రషీద్ చక్రవర్తికి రాజధానీనగరం అది; మహావైభవం అనుభవించింది; మధ్యకాలంలో కొంత మాసినా ఇప్పుడు మళ్లీ ఔన్నత్యంలోకి వస్తూంది ఆపట్నంలో ఇరాక్ చిత్రవస్తుశాల (Iraq museum) ఉన్నది. అందులో ఉంచతగ్గ ప్రాచీన వస్తుసంచయం సేకరిస్తూవున్న డాక్టర్ విల్ హెల్మ్ కోనిగ్ దొరగారికి ౧౯౩౬-౭ సంవత్సరం వేసవి రోజుల్లో, బాగ్దాదుపట్నానికి ఆగ్నేయ భాగమందున్న 'ఖుజాత్ రాబువా' ప్రాంతంలో ఒక గొప్పవిశేషం దొరికింది. చూడడానికి అది ఒక మట్టిజాడీ మాత్రమే.



ఈ పైబొమ్మ చూడండి. అందులో ౪జి- అనేది జిగటమట్టితో తయారుచేసిన జాడీ. అందులో ౩రా- అనేది రాగిగొట్టము. ఆలోపల ౨లో-అనేది లోహమయమైన కడ్డీ. ౧తా-అనేది గొట్టంలో మీదనూ, అడుగునా అమర్చిన తారుదిమ్మలు.

మంటిజాడీఎత్తు సుమారు ఆరుఅంగుళాలు ఉన్నది. దానివ్యాసం; అంటే అడ్డుకొలత ఎక్కువగా ఉన్నచోట మూడు అంగుళములకు సుమారు ఉన్నది. జాడీమూతి సుంద్రంగా రూపాయంత ఉన్నది. ఆజాడీలోపల స్వచ్ఛమైన రాగిరేకుతో తయారుచేసిన—పోలవంటి–సుంద్రనిగొట్టం ఉన్నది. గొట్టపు అడుగున ౻అంగుళము దట్టము గలఅస్ఫాల్టు (Asphalt) ఉన్నది. ఈ అస్ఫాల్టు అనేది జిగురుగల నల్లతారు. గట్టిగా నల్ల జీడిగింజవలె ఉన్నది. తారుదిమ్మమీద పలచని రాగిరేకు అమర్చబడినది. గొట్టముమీది భాగములోకూడా ఇదేవిధమున తారుబిరడా ఉన్నది. మీదవున్న బిరడా మధ్యను మూడు అంగుళముల పొడుగుగల ఒక ఇనపకడ్డీ – పటములో చూపించినట్లు – దూర్చబడిఉన్నది.

మొదట తయారుచేసినపుడు ఈ ఇనపకడ్డీ అర అంగుళమునకు తక్కువమందము కలిగిఉండెను కాని కాలగతిచేత తుప్పుపట్టి అసలుకడ్డీ ఇప్పుడు వత్తిలాగ అయినది. అదేపటములో 'ఇలో' అనుసంజ్ఞతో చూపబడినది. రాగిరేకుల మధ్య తారుబిరడాలతోనూ, మధ్య లోహపుకడ్డీతోనూ కూడుకొనిఉన్న రాగిగొట్టము జిగటమట్టితో తయారైన జాడీలో చమత్కారంగా అమర్చిపెట్టినారు.

ఈజాడీ ఒక పొడిఘటము (Dry cell). అనగా, గంధకామ్లము (Sulphuric acid) మొదలగు ద్రవపదార్థముల వాడుక అక్కరలేకుండా పొడిపదార్థములతోనే విద్యుత్ప్రవాహము పుట్టించే సాధనము. ఈ నాడు ఆబాలగోపాలమూ రాత్రివేళ చీకటిలో అవసరమైనపుడు మీట నొక్కి గప్పున వెలిగించుకొని వాడుకుంటున్న టార్చిదీపాలలో (Torch lights) ఇటువంటి పొడిఘటాలే అమరుస్తున్నారు.

ఏషియాఖండమధ్యమం దుండిన పార్థియారాజ్యములోనూ, టెల్ఓమార్ అనే సెల్యూకియాప్రాంతంలోనూకూడా ఇటువంటి పొడిఘటాలూ, జాడీలూ దొరికినవి.

జర్మనీవారి బెర్లిన్‌నగరంలో మ్యూజియము కోసం వింతలు సేకరిస్తున్న కుహ్నెల్‌దొరకు టెసిఫాన్ ప్రాంతంలో ఇటువంటి ఘటాలు కొల్లలు దొరికాయి. కొన్నిఘటాలలో ఇనపకడ్డీకి బదులుగా రాగితీగలూ, ఇనపతివ్వలూ కూడా ఉన్నవి.

బాగ్దాదులో వెండిపనులు చేసుకునే కమసాలులు ఈఘటాలు వాడి, వెండిపూతలు పెట్టి, ఆ 'గిల్టు' సరుకులు అమ్మేవారని రూఢిగా తెలుస్తున్నది.

వెండిపూతలు పెట్టడానికే ఇటువంటి ఘటాలు ఉపయోగించిన పనివాళ్లు చక్రవర్తిఅంతఃపురంలో దీపాలు వెలిగించి వింతగొల్పడానికి ఆక్షేపణ ఏమి వుంది? అయితే ఈవిషయం బ్రహ్మభేద్యంగా—మహారహస్యంగా దాచివుంచేవారు.

* * *

అయితే మీరు మరొక్క ప్రశ్న వేస్తారు.

ఏషియామధ్యను ఎక్కడో బాగ్దాన్‌ప్రాంతంలో ఇటువంటి ఘటాలు దొరికాయి, ఇందువల్ల విద్యుత్ప్రవాహం పుట్టేది, దానితో గిల్టులు వేసేవారు, దీపాలు వెలిగించుకొనేవారు అనుకుందాం. మన హిందూదేశంలో ఇది వాడుకలో వుండేదని నిదర్శనం ఏమిటి? అది ఎలా ఋజువుచేస్తారు? అని అడుగవచ్చును. దానికి నా సమాధానం ఏమిటంటే—

మధ్యఏషియాలో Balkh మన భారతంలో బాహ్లీకం. Kandahar గాంధారదేశము. Euphrates యువభారతీయులు వలసపోయిన ప్రాంతం. బీహారులో రాజగృహంనుంచి వెళ్లిన గృహకులే గ్రీకులు. ఈజిప్టులో 'శివం' ఉన్నది. ఈజిప్టు చేరినవారు రామేశులు. Hebrew లు ఇటునుండి వలసపోయిన అభీరులు–గొల్లలు. వాళ్లకు అపీరూ (Aperiu) అని పేరు ఉండేది. ఆపేరుతో శాసనాలుకూడా దొరికినవి. (చూ. 64 పేజీ R. E. Anderson-Story of the Extinct Civilisations of the East). Juda యదువంశస్థులది. Chaldea కులదేవులది. Assyria అసురదేశం. మయజాతివారు అసురులు. రావణుని మామ—మండోదరితండ్రి మయుడు. ధర్మరాజుకు సభ యిచ్చినవాడు మయుడు. వింధ్యపర్వతగుహాలలో అద్భుతంగొలిపే శిల్పంతో స్వయంప్రభగుహ నిర్మిం

భిషవాహం మయుడు. మయులు అసురుల విశ్వకర్మలు. గృహోద్యానాలు, సౌధాలు, సభలు, విమానాలు ఇటువంటివి నిర్మించడంలో మయజాతివారు చతురులు. అమెరికాలో కూడా మయులు ఉన్నారు. వారి శిల్పం అక్కడ కూడా బయటికి వచ్చింది.

ఈనాటి రైళ్లు, బస్సులు, టెలిగ్రాములు, టెలిఫోన్లు, రేడియోలు ఇటువంటి విచిత్రాలన్నీ జనసామాన్యానికి 'కుంపిణీవారి మాయ'గా కనపడుతున్నవి. దురవగాహమైన నిర్మాణచాతుర్యం మయుల చేతుల్లో ఉండేది. మయులు చేసినది మాయ. ఆ 'మాయ' శబ్దం ఇప్పటికి భాషలో శల్యంలాగ ఉండిపోయినది. బాగ్దాదు ప్రాంతాలు నాడు అసీరియా రాజ్యంలోవి. అక్కడి స్వర్ణకారులు, రజతకారులు, శిల్పులు అంతా మయులే. అనకాపల్లి బొజ్జన్న మెట్టలలోనూ, అమెరికా హార్వర్డు యూనివర్సిటీలోనూ కనపడ్డ మయుల మహిమ అసురవరులైన అసీరియా ప్రాంతాల్లో కనిపించడానికి సందేహం ఏమీ అక్కర్లేదు.

ఆసమీపమందే ఉండిన పార్థియా రాజ్యంలో కూడా ఈ పాడిఘటాలూ, ఈ జాడీలూ దొరికాయని మీద వ్రాసినాను. పార్థియనులే పల్లవులు (చూడండి: చిలుకూరి వీరభద్రరావుగారి ఆంధ్రుల చరిత్ర I. ౨౦౪). "హిందూ పార్థియనులు పహ్లవు లని భాండార్కరుగారు నుడువుచున్నారు. పార్థియనులు క్రీస్తుపూర్వము 161-వ సంవత్సరమున కాబూలు కనుమలో స్థిరవసతు లేర్పరుచుకొని రని కన్పట్టుచున్నది (చూ: ఇండియన్ ఆంటిక్వేరీ. సంపుటము XVIII p. 126). పార్థివులు కౌశికులలో నొక శాఖవారు. వీరు విశ్వామిత్రుని సంతతిలోనివారు. ప్రహ్లాదపుర స్తంభముమీది శాసనములో శిశుపాలు డను రాజు 'పార్థివరక్షుకు' డను బిరుదు కలిగి యున్నట్లు వ్రాయబడినది (చూ. Dr. Fleet. Gupta Inscriptions P. 250. Also his 'Peep into Early History of India' B. B. R. A. S. సం. ౨౦. పే ౩౫౬—౪౦౫ జేలు)." కాగా పార్థివులు-పార్థియులు, పహ్లవులు పల్లవులు అని తేలుచున్నది. పల్లవనాడే పల్నాడు. పల్నాటిసీమలోనో, అపరిసరసీమలోనో ఏరాజగృహమందో శ్రీనాథుడు డిట్టి విద్యుద్దీపములను చూచి ఈపద్యము రచించియుండునుగాని వట్టి కల్పన వ్రాసియుండడు.

మరొక విశేషం. మయులు శివపూజాధురంధరులు. ఈఘటంలో కడ్డీ అమర్చిన విధానం చూస్తే లింగం స్ఫురించగలదు. లింగపూజ మధ్య ఏషియా ప్రాంతమంతా కానవస్తున్నది. నాగరకత ఎక్కడనుంచి ఎక్కడకు ఎలా పాకిందో పోకాక్ (Pococke), ఫాదర్ హీరాస్, చమన్‌లాల్ లాంటి చరిత్రకారులు చెప్పాలి. చరిత్రకారులే కారు — క్రిమికీటకాలను గురించి ఈ మధ్య 1938 లో పుస్తకం ప్రకటించిన J. H. Fabre గారు ఏమన్నారో చిత్తగించారా? చిన్నపిల్లలు మొదటి పాఠపుస్తకాల్లో చదువుకునే ఈగ—చీమకథ చర్చిస్తూ "The Greek fabulist followed tradition. He himself echoed a more ancient narrative... from India the Venerable Mother of Civilisations." అన్నారు. (చూ. Social life in the insect world. Page 14. ; A '4 of Pelican Books). ఇలాగ చీమ-దోమకథ కాడినించీ ఇక్కడనుండే పడమటకు ఎగుమతి అయినప్పుడు పాడిఘటాలు (Dry Batteries) బాగ్దాదుకు ఇక్కడనుంచి ఎగుమతి కావడంలో ఆశ్చర్యం లేదు.

ప్రెసిడెంటు రూజువెల్టు



జీవితంలోని అంతుపొంతులు

శ్రీ కొత్తపల్లి శ్రీరామమూర్తి

ప్రెసిడెంటు రూజువెల్టు జనవరినెల ౧౯-వ తేదీ ఆదివారంనాడు మూడోసారి అధ్యక్షుని గద్దెను అలంకరించాడు. అమెరికాలోని ఆబాల గోపాలము– ముఖ్యంగా వాషింగ్టన్ నగరంలోని ప్రజలు అపరిమితా నందమును వెలిబుచ్చారు. ఒకేవ్యక్తి వరుసగా రెండు సార్లకు మించి అగ్రస్థానాన్ని అలంకరింపకూడదనే సిద్ధాంతాన్ని భగ్నంచేశాడు రూజువెల్టు.

రూజువెల్టు అధ్యక్షుడుగా ప్రమాణం తీసుకొనుటకై 'వైట్‌హౌసు'ను పోయేముందు చర్చికి పోయి, ప్రార్థనచేసి, సుమారు ౧౧ గంటలకు వైట్‌హౌస్‌లో ప్రమాణం తీసుకొన్నాడు. తాను అమెరికాజాతి ఆదర్శములకు వ్యతిరిక్తముగా ఎన్నడూ ప్రవర్తింపననీ, జాతి స్వేచ్ఛా, ప్రపంచశాంతీ యీ రెండే తన ఆశయము లనీ వ్యక్తపరిచాడు.

నేడు ఇతడు తన ఆశయసిద్ధికొరకై యుద్ధపరిస్థితులను పరిశీలించుటకుగాను యిద్దరు కార్యదర్శులను ఇంగ్లాండుకూ, ఒకరిని యూరపుకూ పంపియున్నాడు. వారిలో, పోయిన ఎన్నికలలో తనతో పోటీచేసిన వెండెల్ విల్కీ ఒకడు. తక్కినవారు జోసెఫ్ డొనొవన్, హారీహోప్‌కిన్సు.

యూరపులోని యుద్ధపరిస్థితులను పరిశీలించుటకు కొందరిని పంపుటేకాక యిటు జైపాజపానులమధ్య జరిగే కలహాన్ని గమనించుటకుకూడా ఒక రాయబారిని పంపియున్నాడు.

ఇట్లు ప్రపంచమంతా ఈ అమెరికన్ అధ్యక్షుని కటాక్ష వీక్షణములకై వేచియుండగ, ప్రపంచమునంతటిని చల్లనిచూపులతో చూచు శాంతిప్రయత్నములు చేయుచున్న యీ ధీశాలిజీవితరహస్యమును కొంత తడవి చూడవలసియున్నది.

***

రూజువెల్టు ఆదిలో అధ్యక్షపదవికి వచ్చేసరికి అమెరికా సంయుక్తరాష్ట్రాలలో పెద్దమ్మ తాండవమాడుతోంది. దానికి కారణం? పాడిపంటలతోనూ, పరిశ్రమలతోనూ తులతూగే అమెరికా ఆనాడు ధనికవర్గంపిడికిలిలో చిక్కుకొనుచునే స్థితిలో వుండడమే. ఎక్కడ చూచినా అరాచకం! ఎక్కడనూ లేని నిరుద్యోగసమస్య, ఆర్థికమాంద్యం! తుదకు ఆకలికేకలహోలు కూడా విజృంభించేటట్టుగా పొగలు లేవసాగాయి.

అట్టితరుణంలో అధికారాన్ని దొరకబుచ్చుకొని ధనికుల కోపానలానికి ఎదురొడ్డి నిలిచి, పేదల పెన్నిధియై, దేశసౌభాగ్యాన్ని కాపాడిన ధీరోదాత్తుడు ప్రెసిడెంటు రూజువెల్టు.

రూజువెల్టు పూర్తిపేరు ఫ్రాంక్లిన్ డెలానో రూజువెల్టు. ఇతడు ౧౮౮౨ జనవరి ౩౦-వ తేదీని న్యూయార్కునగరమందలి హైడ్‌పార్కులో పుట్టాడు.

రూజువెల్టు తల్లి పేరు శారాడిలానో. ఆమెకు యీకుమారునియందు అపరిమితమైన మమకారం. ఇతని తండ్రిపేరు జేమ్సురూజువెల్టు.

ఈ రూజువెల్టువంశీయులు డచ్చిజాతికి చెందినవారు. రోజెన్ ఫెల్ట్ అనువాతడు ౧౬౪౯ లో ఆమ్‌స్టర్‌డాంనుంచి అమెరికాకు వలస వచ్చాడు. నేటి న్యూయార్కునగరము ఆనాడు న్యూ ఆమ్‌స్టర్‌డాం అని వ్యవహరింపబడేది. నేటికిని ఆ ప్రాంతములో డచ్చిజాతీయులే అధికసంఖ్యాకులు.

అక్లీజుమార్ టెన్సెన్, వాన్ రోజెన్ ఫెల్ట్ (Clees Martensyen, Van Rosenfelt) సంతతిలోనివారే - అమెరికా అధ్యక్షుడై అఖండఖ్యాతిని సముపార్జించిన థియొడర్ రూజువెల్టూ, సముపార్జిస్తున్న ఫ్రాంక్లిన్ డెలానో రూజువెల్టున్నూ.

థియొడర్ రూజువెల్టు ౧౯౦౧ లో అమెరికా సంయుక్తరాష్ట్రాలకు ౨౬-వ అధ్యక్షుడైనాడు.

ఫ్రాంక్లిన్ రూజువెల్టు ౧౯౩౨ లో మొదటిసారి ౩౨-వ అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు.

ఈ రూజువెల్టు అతిబాల్యంలోనే తండ్రిని కోల్పోయినాడు. అప్పటికి ఇతనికి ఎనిమిదేళ్ల వయస్సు.

ఇతడు ప్రథమంలో గారటన్ అనుచోట విద్యాభ్యాసం ప్రారంభించాడు. కాని ఆ చదువు ఇతని తలకెక్కేదికాదు. ఆటపాటలందున్న శ్రద్ధ చదువుమీద వుండేదికాదు.

ఏదోవిధంగా ఆ సంటిఓనమాలు విడిచి ౧౯౦౦-వ ఏట హార్వార్డ్ (Harvard) విశ్వవిద్యాలయంలో చేరాడు. అక్కడ కొంత సారస్వతరుచి తగిలింది. విద్యార్థిగానే 'క్రిమిజన్' అనే పత్రిక కొకదానికి సంపాదకత్వము వహించాడు. దానితో ఇతని ప్రతిభ ప్రకాశింపసాగింది; కీర్తిలత ప్రాకుపెట్టింది. ఆ విద్యాలయంలో చదువు పూర్తిచేశాడు. తరువాత 'ఎనాపోలీసు'లోని నావికా ఎకాడమీలో చేరాలనుకున్నాడు. కాని ఈశ్వరాదేశము వేరుగా నున్నది. ఆకోరిక కొనసాగలేదు. కాగా కొలంబియా విశ్వవిద్యాలయంలో న్యాయవాదిపరీక్షకు చదివి ఉత్తీర్ణుడైనాడు.

చదువు పూర్తికాగానే సంసారం మీదపడింది. ౧౯౦౫-వ సంవత్సరంలో ఎనా ఎలీనర్ అను నామెను వివాహం చేసుకొన్నాడు. ఆమె థియొడర్ రూజువెల్టుకు మేనకోడలు. కాగా ఇతడు భార్యతో కూడా అప్పటి అధ్యక్షుడు థియొడర్ రూజువెల్టును 'వైట్‌హౌసు'లో కలుసుకుంటూ వుండేవాడు.

కుటుంబభారం మీద పడగానే కుక్షింభరత్వం కోసమని ఇతడు ౧౯౦౭ లో న్యూయార్కునగరంలో ప్రాక్టీసు ప్రారంభించాడు. ఇతని ప్రాక్టీసు గొర్రెతోకలాగ ఎదుగూ బొదుగూ లేకుండా అట్టే వుండిపో

యుంది. ఇంక ఏమీ లాభం లేదని దానికిన్ని తిలాంజలి అర్పించి 'ఓకనర్' అను ఒక కంపెనీలో వాటాదారుడుగా చేరినాడు.

౧౯౧౦ మొదలు ౧౯౧౩ వరకూ న్యూయార్కు సెనేటు మెంబరుగా పనిచేశాడు.

౧౯౧౩ లో ఆపదవికి రాజీనామా నిచ్చినాడు.

నౌకాశాఖకు సహాయకార్యదర్శిగా ౧౯౨౦ వరకూ పనిచేశాడు.

ఆకాలంలో యూరపుఖండాన్ని ఆవరించిన ప్రళయబీభత్సాన్నీ, అకాలభైరవ నృత్యాన్నీ అరికట్టుటకై అప్పటి అమెరికా అధ్యక్షుడైన ఉడ్రోవిల్సన్ మహాశయుడు విశ్వప్రయత్నములూ చేశాడు. కాగా అక్కడి పరిస్థితులు తనకు విపులీకరించుటకు గాను తనకు కుశిభుజంగా వుంటాడన్న విశ్వాసంతో ౧౯౧౮ లో ఈ రూజువెల్టును యూరపు దేశంలోని అమెరికన్ ఓడలను తనిఖీచేయుటకు ఇన్స్పెక్టరుగా నియమించాడు.

ఆ ప్రపంచసంగ్రామము సమాప్తి కాగానే ఇతడు తిరిగి అమెరికాకు చేరుకున్నాడు.

రూజువెల్టుకు డెమొక్రాటిక్ పార్టీవారి ఆశయములు నచ్చినవి. కాగా ఆపార్టీలో సభ్యుడైనాడు.

ఇతనిలో నిగూఢమై యున్న ఘనత ఆ సభ్యులకు యిట్టే ఆకళింపునకు వచ్చినది. కాగా ౧౯౨౦ లో ఇతన్ని డెమొక్రాటు పార్టీ తరఫున ఉపాధ్యక్ష పదవికి నిలబెట్టారు. కాని ఓడిపోయాడు.

ఆ మరుసటిసంవత్సరమే ఇతడు చేపలవేటకని వెళ్ళి విధివశంచేత కాలుజారి నీటిలో పడ్డాడు. ఆరోజు మొదలు పక్షవాతం వరించింది ఈ భాగ్యశాలిని. రెండు కాళ్లూ పడిపోయాయి. డాక్టర్లు ఇక తిరిగి కాళ్లు రావన్నారు. కాని ఆపిరికిమందు పనిచేయలే దీ ధీరోదాత్తుని మీద. లేకుంటే మనకీ అధ్యక్షుడు దక్కేవాడే కాదని నా నమ్మకం.

ధైర్యమే ధనంగా కలిగిన ఈ మానధనుడు విధితో పోరాడి తనపూర్వపుటారోగ్యమును పొందాడు.

నీటివల్ల సంప్రాప్తించిన ఆ అకాలరోగపిశాచము నీటితాడనములవల్లనే వదలా లనుకొని ఇతడు వేడినీటిప్రవాహంలో నిత్యం స్నానంచేస్తూ వుండేవాడు.

తుదకు దానివల్లనే ఆ రోగమునుండి విముక్తి పొందాడు.

డాక్టర్లు నిరుత్సాహపరచినా విడువక ఏ శక్తితో, ఏ పట్టుదలతో రోగమును విదళించుకొన్నాడో ఆశక్తిసంపదతోనే అమెరికాదేశాన్ని పట్టి పీడుస్తున్న ఆర్థికమాంద్యాన్ని నాశనంచేసి దేశాన్ని సుభిక్షం చేశాడు, ఈ మహోదారుడు.

కాని ఇప్పటికికూడా ఇతడు చరచరా నడవలేడు. తోపుడుబండిలో కూచుని తిరుగుతాడట. ఉపన్యాసవేదికపై కెక్కి ఉపన్యసించే తరుణములందు మాత్రము నిలుచునే ఉపన్యసిస్తాడట.

శరీరారోగ్యంకోసం ఏదో మారుమూలవున్న రూజువెల్టును స్వప్రయోజనంకోసం బలవంతాన ముందుకు లాగాడు ఆల్స్మిత్ అనువాడు. ఇతన్ని న్యూయార్కు గవర్నరుగా ఎన్నుకునేటట్లు ప్రయత్నించాడు స్మిత్. అందులో విజయంపొందాడు.

ఎన్నిసార్లు పోటీచేసినా స్మిత్తుకు అమెరికా అధ్యక్షపదవి లభింపలేదు.

కాగా ౧౯౩౨ లో డెమొక్రాటిక్ పార్టీవారు రూజువెల్టును తమ ప్రతినిధిగా నిలబెట్టారు. ఇతడు అప్పుడు అధ్యక్షుడుగానున్న రిపబ్లికన్ పక్షపు పార్టీ అభ్యర్థి యైన హూవర్ని ఓడించాడు.

అధ్యక్షుడు హూవరు ప్రజాహృదయాన్ని చూరగొనకపోవడమే రూజువెల్టుకు ఉపకారమైంది.

ఆ ఎన్నికలలో రూజువెల్టు ౭౨౬౫ ఓట్ల మెజారిటీతో అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు.

ఈ అపూర్వ విజయానికి కారణం ఇతడు గావించిన ప్రచారసంచార మనే చెప్పాలి.

౧౯౩౬ సెప్టెంబరు ౧౪-వ తేదీనాడు టొపెకాకన్ నగరంలో ఉపన్యసిస్తూ తమ పార్టీ ఆశయము

లను ఇతడు స్పష్టీకరించాడు. దానితో ప్రజలదృష్టి పూర్తిగా ఇతనివైపు తిరిగింది.

ఆ ప్రచారానికిగాను ఆ సంవత్సరంలో ఇతడు సుమారు ౬౯౦౦ మైళ్లు ప్రయాణం చేసినట్లు తెలుస్తోంది. ఇతడు ఎక్కడకు పోయినా అఖండస్వాగతాలే! చికాగో నగరంలో ఇతనికి జరిగిన సన్మానోత్సవంలో సుమారు ౨ లక్షల మంది పాల్గొన్నారని కూడా తెలుస్తోంది.

ఇట్లు అశాలగోపాలముచేతా ఆమోదింపబడి ఇతడు ౧౯౩౩ లో మొదటిసారి అధ్యక్షపీఠము నలంకరించాడు.

అధ్యక్షుడయినవెనుక ఇతడు మైయామీనగరం చూడబోయినాడు. ఆనగరపు మేయరు ఇతన్ని సన్మానించడానికి స్టేషనుకు వచ్చాడు. స్టేషనులో జనం కిటకిటలాడుతూ వున్నారు. ఆ జనాన్ని తప్పించుకొని మెల్లగా తనకై వేచియున్న కారును సమీపించాడు. ఇతడు కారులో కాలు పెట్టేసరికి ధామ్మని శబ్దము వినిపించింది. రూజువెల్టు చటాలున చతికిల బడ్డాడు కారులో. ఆశబ్దాన్ని వెంబడించి వచ్చిన గుండు మేయరు వక్షాన్ని తాకింది.

ఇంతలో ఒక స్త్రీ వేసిన కేకకేక అక్కడి ప్రజల నాకర్షించింది. చటాలున అందరూ అటు తిరిగారు. ఒక బక్కచిక్కిన బక్కుని గట్టిగా కౌగలించుకొని, చేతిలోని రివాల్వరు క్రిందకు దింపకుండా పైకెత్తిపట్టుకుని వున్నది ఆమె. ఆ పిరనారిని కొనియాడనివారు లేరు ఆ సమయంలో.

వెంటనే పోలీసులు ఆబక్కుని బంధించారు. ఈ దారుణకృత్యమునకు ప్రోత్సహించిన దెవరని అతన్ని ప్రశ్నింపగా ఎవరూ తన్ను అట్టిపనికి పురికొల్పలేదనీ, తన ఆకలిమంటే కూసనికి ప్రోత్సహించినదనీ, ధనికవర్గంమీద వున్నమంటేగాని ప్రత్యేకంగా రూజువెల్టుమీద ఎట్టిక్రోధమూ లేదనీ తెలియజేశాడు. అతడొక ఇటలీజాతీయుడు. అతని పేరు జ్జుసరా.

*   *   *

పేదవారి ఆకలిమంటలచే దగ్ధముకానున్న దేశాన్ని కల్యాణప్రదంగా చేసిన ఘనుడు, వీరుడు ఈ రూజువెల్టు.

రూజువెల్టు అధికారంలోకి రాగానే ధనికవర్గంలో కలకలం ప్రారంభమైంది. దానితో బ్యాంకుల వ్యాపారం గజగజ లాడింది. ప్రజలు తమధనాన్ని తీసివేసుకోవడం ప్రారంభించారు. ఈ పాటునకు తాళుకోలేక బ్యాంకులు దివాలాలు తీసేటట్లు కనుపించాయి. కాగా దాన్ని అరికట్టి ఆర్థికస్థిరత్వ మేర్పరచుట ఇతని ప్రథమకర్తవ్యమైంది.

౧౯౩౩ మార్చి నాలుగో తేదీ శనివారం ఇతడు అధికారముద్ర వహించాడు. వెంటనే ౬-వ తేదీ మొదలు ౯-వ తేదీవరకూ బ్యాంకులకు మారిటోరియం ప్రకటించాడు. అంటే, యిచ్చి పుచ్చుకోడాలు నిషేధించాడు.

మార్చి ౯-వ తేదీనాడు అమెరికన్ కాంగ్రెసును సమావేశపరచి ౭ గంటలలో ఒకబిల్లును బయటకు పెట్టాడు.

ఆబిల్లు బంగారాన్ని నిలవచేయడంగాని, ఇతర దేశాలకు ఎగుమతిచేయడం గాని నిషేధించింది.

అంతేకాదు, సంయుక్తరాష్ట్రాలలోని బంగారమునంతనూ ప్రభుత్వపు అధీనంలో వుంచవలెననీ, ట్రెజరీ కార్యదర్శి అనుమతి లేనిదే ఏబ్యాంకులూ వ్యవహారం చేయకూడదనీ శాసించింది.

ఈ విధంగా, పడిపోవడానికి సిద్ధంగా వున్న బ్యాంకువ్యాపారానికి సుస్థిరత చేకూర్చాడు.

౧౯౩౩ ఏప్రిల్ ౨౦-వ తేదీనాడు బంగారపు ఎగుమతిమీద అపరిమితమైన పన్ను విధించాడు.

౧౯౩౩ మే ౭-వ తేదీనాడు తాను చేయదలచుకొన్న సంస్కరణ లన్నిటినీకూర్చి రేడియో ద్వారా యావద్దేశానికీ వెల్లడిచేశాడు. ఇతడు రేడియో ద్వారా ఉపన్యసించడానికి అదే మొదలు.

౧౯౩౩ జూన్ ౧౬-వ తేదీనాడు నేషనల్ రికవరీఆక్టు నొకదాన్ని అమలులో పెట్టాడు. తద్వారా దేశంలోని పరిశ్రమలన్నీ ప్రభుత్వాధికారానికి లోబడి

ఉండవలసి వచ్చింది. అది పెద్దపెద్ద యంత్రాల యాధి కారులకు ఒక పెద్దదెబ్బ.

ఆచట్టం కార్మికుల కూలిని వృద్ధిచేసి, కొనుగోలు తాహతును వృద్ధిచేసింది. నిరుద్యోగసమస్యనూ కొంత వరకు నిర్మూలించింది.

ఇంకా ఎన్నో మార్పులుచేసి, ఇతడు పడిపోతున్న ప్రభుత్వ యంత్రాన్ని నిలబెట్టాడు. బీదలపాలిటి పెన్నిధి అయినాడు.

౧౯౩౬లో తిరిగి రెండవసారి అధ్యక్షుడైనాడు.

ఇతడు తన దేశపు ఆదాయ వ్యయములను అతి జాగ్రత్తగా పరికిస్తాడు. దేశంయొక్క సౌభాగ్యం బీదల ఆర్థికస్థితినిబట్టి వుంటుం దని నమ్ముతాడు. తన బడ్జెట్టును ఆ దృష్టితోనే తయారుచేస్తాడు.

ధనికులు పోట్లాడి తమపనులను చేయించుకో గలరనీ, బీదలను కనిపెట్టడమే అధ్యక్షుని బాధ్యత అనీ ఇతని పూర్ణవిశ్వాసము.

ఇత డొకసారి తాను తయారుచేసిన బడ్జెట్టును ఒక స్నేహితుని చేతిలోపెట్టి, ఇందులో ఏ ఐటం తగ్గించ మంటా వని సలహా అడిగాడట. ఆ స్నేహితునకు ఎందులో తగ్గించమని చెప్పడానికి తోచిందికాదట. తుదకు రిలీఫ్‌ఫండు విషయం వచ్చిందట. అది ఎందుకు తగ్గించకూడదని అడిగాడట. పూర్తిగాతగ్గిస్తే మరీ మంచి దన్నాడట ఆ స్నేహితుడు.

అప్పుడు రూజువెల్టు చిరునవ్వునవ్వుతూ "మహాశయా! మన దేశంలో ౩,౮ మిలియనుల కూలివాండ్రున్న విషయం తమకు విశదమేకదా? వారూ, వారి సంసారములూ జీవించడానికి ఏది దారి? వాళ్లకు పని చూపించలేదంటే అడుక్కు తినమని చెప్పామన్న మాట. అంతేనా? కాని నామతం అది కాదు. నేను అధ్యక్షపదవిలో రాజ్యఖలీనం చేతబుచ్చుకుని కూర్చుని వున్నంతకాలం పాడిపంటలతో తులతూగే యీ అమెరికాలో అడుక్కుతినేవాడు ఉండకూడదని నా సంకల్పం" అన్నాడు.

ఈ వ్యయంలో ఏ పదోవంతు తగ్గించినా వచ్చే లాభంకన్నా దేశసౌభాగ్యానికి-కలిగేనష్టమపారమని ఇతని దృఢవిశ్వాసం. అడుక్కుతినే సోమరిపోతులను పెంపొందించడంవల్ల జాతి నిర్వీర్యమైపోతుందని ఇతని నమ్మకం. ఈవిధంగా పట్టుదలతో ఎదటివాళ్లను నమ్మించి తనపక్షం త్రిప్పుకోగల చతురుడు రూజువెల్టు.

అయితే యింతటి కార్యభారము వహించిన ఈ మహావ్యక్తి నిత్యజీవితం ఎట్లా నడుస్తుందో చూదాం.

ఇతడు అధ్యక్షపదవి నలంకరించినప్పటినుండీ నివాసము వైట్‌హౌసులో. అది చాలాపురాతనమైన భవనం. వాషింగ్టన్ నగరానికి ఆభవనం అసమానమైన శోభను కూరుస్తున్నది. అధ్యక్షుల కందరకూ అది తాత్కాలికనివాసమందిరముగా వుంటూవుంది.

ఆ భవనం అమెరికా జాతికి గుండెకాయ వంటిది.

౧౯౦౨ లో ఆ సుధాధవళమందిరమునకు అనుబంధంగా కట్టిన నిరాడంబరమైన భవంతియే అధ్యక్షుని కార్యనిర్వాహకమందిరము.

అమెరికా జాతీయ జీవనాన్నేగాక ప్రపంచ సాంఘిక, ఆర్థికవాతావరణములను కూడా మార్చగల కేంద్ర మది. చరిత్రప్రసిద్ధమైన పత్రములు ఆగృహమందే జనిస్తాయి.

ఆమందిరముయొక్క ఘనతా, ప్రాముఖ్యమూ మాత్రమే కాకుండా ఆగృహాంతరాళములో జరిగే విషయాలు కూడా అతినిగూఢములై చిత్రంగా వుంటాయి.

ఆ మందిరంలోనే రూజువెల్టూ, ఇతని భార్యా, నలుగురు కుమార్లూ, కూతురూ నివసిస్తూవున్నారు. కుమార్లు మంచిమంచి పదవులలోనే వున్నారు.

ఆ కార్యాలయంలో పనిచేసేవారి సంఖ్య ౧౬౩. వారు లోపలకు వచ్చేపోయే సమయములందు గూఢచారులు వారిని పూర్తిగా పరిశోధిస్తారు.

వైట్‌హౌసు టెలిఫోను నెంబరు ౧౪౧౪. దానిని ఉదయం ౯ గంటలు మొదలు సాయంత్రం ౬ గంటల వరకూ ఎంతమంది పిలుస్తారో చెప్పలేము. ఆవార్తలకు

ఎవరు ఏవిధంగా సమాధానం చెబుతారో కూడా వూహించడం అతీతమైనపని.

సూర్యుని చుట్టూ భూమి తిరుగునట్లు అమెరికన్ రాజ్యాంగయంత్రం అధ్యక్షుని భావములను అనుసరణంగా నడుస్తుంది.

రూజువెల్టు ఉదయం లేవగానే కాల్యకృత్యాలు నిర్వర్తించుకొని వల్లిభుజించి టంచనుగా ౧౦-౩౦ కు ఆఫీసుగదికి వెళ్లుతాడు.

ఆఫీసుకు వెళ్లేలోపలే ఆరోజున వెలువడు దినవారపత్రికలను ఆమూలాగ్రంగా ఒకసారి చూసేస్తాడు. ఆ రోజు చేయవలసిన కార్యక్రమం నిర్ణయించుకుంటాడు. పత్రికావిలేఖరు లెవరైనా వచ్చి ఆరోజు వెలువడిన కొన్ని విషయాలమీద ఇతని అభిప్రాయాన్ని కోరితే పరిపూర్ణంగా చూడలే దంటాడు. కాని వార్తావిషయాలను గురించి తన కార్యదర్శులమీద ఎప్పు డూ ఆధారపడివుండడు. ఆఫీసులో ౫, లేక ౬ గంటలవరకూ వుంటాడు.

కార్యాలయానికీ పడకగదికీ సుమారు నూరు గజా లుంటుంది. తనకార్యాలయంలో కూచునే కార్యదర్శులను పిలుస్తాడు. ఆరోజున చేయవలసిన పనులను గబగబా విడేసి వారివారికి యియ్యవలసిన అనజ్ఞలను ఇచ్చేస్తాడు.

* * *

ఒక్క మంత్రివర్గ సభ్యులు తప్ప ఎవరు గాని ముందుగా అనుమతి పొందనిదే ఇతన్ని దర్శింప వీలుపడదు.

రూజువెల్టు అతిథిపూజ చేయా లనుకుంటే కార్యాలయంలోనే సర్వమూ సిద్ధమౌతాయి.

సర్వసాధారణంగా మధ్యాహ్నపు విందులకు పదార్థములు వైట్‌హౌసు వంటయింటినుంచీ టేబిలేగన్నులో ఆఫీసుకు వెళ్లుతాయి. అక్కడే అందరూ సరదాగా భుజిస్తారు. ఈ పద్ధతివల్ల కొంతకాలమును వృథాపుచ్చ నవసరంలేకుండాపోతుంది రూజువెల్టుకు.

కాలంయొక్క విలువ తెలిసినవా డగుటచేత అట్లా ఏర్పాటు చేశాడు.

ప్రతిదినమూ ౮-౯ మధ్య ఇతడు అనుచరులకు యివ్వవలసిన ఉత్తరువులను చెపుతాడు. వాటిని మిస్ గాస్ టుల్లీ వ్రాస్తుంది.

ఐదు గంటలయిన వెనుక కార్యదర్శులూ, తదితరులూ కలసి ఆరోజు చేసిన పనులను గురించీ, యితర విషయాలను గురించీ సరదాగా సంభాషించుకుంటారు. ఆగంటకు 'చిల్‌డరన్ అవర్' అని పేరు.

సర్వసాధారణంగా ఇతని పార్టీనాయకులతో సంప్రతింపులు గాని, శాసనసభాసమావేశనులు గాని సోమవారం ఉదయం జరుగుతూ వుంటాయి.

ఇతని పెర్సనల్ సెక్రటరీ మిస్ మార్గరెట్టు లేహాండ్ ఇతనికి కుడిభుజం. ఇతని సొంత ఉత్తరాల కన్నింటికీ ఆమెయే సమాధానాలు వ్రాసేస్తుంది. ఆమె కూడా వైట్‌హౌసులోనే కాపురం. ఆమె రూజువెల్టు అప్తులతో ఒకతెగానే ప్రవర్తిస్తుంది. ఆమెను అతని సంతానం 'మిస్సీ'అని అతిచనువుగా ఆప్యాయంగా పిలుస్తారు. ఆమె రూజువెల్టుకు సేవగా నెంబడిస్తుంది. ఆమెను రూజువెల్టు ౨౦ సంవత్సరములుగా ఎరుగును. ఇతని దుస్తులూ, ఇతనికి కావలసిన యితర వస్తువులూ, ఇతను యితరులకు పంపే బహుమతులూ అన్నీ ఆమెయే ఏరుకొంటుంది. ఇతనిఫోటో ఎక్కడెక్కడ ఏయేవిధంగా ప్రచురణ పొందినదీ ఆమె భద్రంగా ఏరి దాచుతుంది.

ఆమె కాక ఇతనికి ముగ్గురు ఇతర కార్యదర్శులున్నారు. వారిపేర్లు: స్టీఫెన్ ఎరలీ, మార్విన్ మైన ఇంటైర్, రుడాల్ఫ్ ఫ్రోస్టరు. వీరుకాక యీమధ్య ఆర్థిక సాంఘికవిషయాలనుగూర్చి ప్రత్యేకపరిశోధనలు చేసి తెలుపుటకుగాను మరి ముగ్గురిని నియమించాడు. వారికి 'లెగ్ మెన్' లని పేరు.

ఇతనికి రోజూ సుమారు ౨ వేలనుండి ౬ వేల వరకూ వుత్తరాలు వస్తాయిట. అవి అన్నీ ఇతనికి పోవు కాని ఏవిషయాన్నిగురించి వచ్చాయో ఆయాశాఖలకు పోతూవుంటాయి. ఆ వుత్తరాలలోని ప్రార్థనలను తెలుసుకొని ఆయాశాఖలకు పంపి ఆ పనులను నిర్వర్తింపజేయడానికిగాను ఒకప్రత్యేకశాఖ వున్నది.

రూజువెల్టు చాలా దయార్ద్రహృదయుడని చెప్పడానికి ఇతన్నిగురించి కొన్నికథలు ప్రచారంలో వున్నాయి.

ఒకసారి న్యూయార్కు గవర్నరుగా వున్నప్పుడు తన ఆఫీసు చూస్తూవున్నాడట.

ఒకచోట ఒక టైపిస్టుగర్లు ఒకచేత్తో తలపట్టుకొని రెండవ చేత్తో టైపు చేస్తోందట. చరచరా ఆమె వద్దకుపోయి కారణమడిగాడట. ఆమె తలనొప్పిబాధగా వుందనీ, పనితొందరచే విడిచి వెళ్లడానికి వీలులేక అట్లా చేస్తున్నాననీ విన్నవించుకుందట. వెంటనే ఇతడు ఆమెను తనకారులో యింటికి పంపించాడట. పంపడమే కాదు, ఆమెకు తగిన సంరక్షణ జరుగుతుందో జరగదో అన్న ఆతురతకొద్దీ రెండుడజనుల నారింజపండ్లు కూడా కొని పంపించాడట.

అట్టి ఉదారస్వభావుడు కనుకనే ఈ మహనీయుని క్రింద పనిచేయడానికి ప్రజలు ఉత్సాహపడతారు.

ఇంకోసారి న్యూయార్కులో వీథివెంట కారులో పోతూవుండగా ఇతనికంటికి ఒక అడుక్కునే ముసలివాడు కనపడ్డాడట. వెంటనే కారు ఆపించి అతనికి ఒక డాలరుయిచ్చి మరునాడు తనఆఫీసుకు రమ్మని చెప్పాడట. ఆ బీదవానికి తన ఆఫీసులో చాలా తేలికైన పని యిచ్చాడట. అతడింక పనిచేయలేనిస్థితిలో తన సొంతడబ్బు యిచ్చి పోషింపసాగాడట.

అమెరికా దేశంలో ముష్టివాళ్లు లేకుండా చేయడమే ఇతడు తన జీవితాదర్శముగా పెట్టుకున్నాడు. ఇంత కార్యభారంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా ఇతడు వారానికి కనీసం రెండుసారులేనా, అనగా మంగళవారం సాయంకాలం శుక్రవారం ఉదయం తప్పకుండా పత్రికావిలేఖరులతో ముచ్చటించకమానడు. ఇతని ఛలోక్తులు వింటానికి పత్రికాధిపతులూ, విలేఖరులూ ఇతనిచుట్టూ మూగుతూ వుంటారు.

ఉద్యానవనంలో నిర్మించుకొన్న కొలనులో ఇతడు పత్రికావిలేఖరులతో కూడా సరదాగా యీతలు కొడతాడని వాడుక. ఆ ఉద్యానవనంలోని పచ్చగడ్డి దిబ్బలే వారికి ఉచితాసనములట.

అప్పటప్పట యీ గంగాస్నానాలకు రూజువెల్టుభార్యకూడా వెళ్లుతుందట. ౮౦ ఏండ్ల ముసలితల్లి కూడా వెళ్లి వారి సరససల్లాపాలను చూచి ఆనందిస్తుందట.

ఆ ఉద్యానవనంలో అప్పుడప్పుడు పత్రికావిలేఖరులకు ఫలాహారాలుకూడా ఏర్పాటు చేస్తూవుంటాడు. బుర్ర గోక్కుంటూ వాళ్లతో కబుర్లు చెబుతాడు. పత్రికావిలేఖరులతో యింత కలిసిమెలిసి ఏఅధ్యక్షుడూ ప్రవర్తింపలేదు. ప్రజాహృదయాన్ని చూరగొన్నవారిలో వాషింగ్టను తరువాత యితణ్నే పేర్కొనాలి.

ఇతనికి చిన్నతనంలో గుఱ్ఱపుస్వారీ అంటే అమితమైన అభిమానం. కాని పక్షవాతం వచ్చాక అది దూరమైపోయింది.

ఓడలన్నా, ఓడల నిర్మాణమన్నా కూడా ఎక్కువ అభిలాష. కాగా యితని కార్యాలయంలో ఓడల బొమ్మలు చాలా వున్నాయి.

ఈ ప్రజారంజకుడైన అధ్యక్షుడు కొన్ని ఉద్గ్రంథాలనుకూడా వ్రాశాడు. అందులో వెదరు బౌండు, ది హేపీ వారియర్, లుకింగు ఫార్వర్డు అనునవి ఉత్తమగ్రంథములు.

ఇప్పుడు ప్రపంచదృష్టి అంతా ఇతనిమీద వున్నది. ఇతడే శాంతిసంధాత అవుతాడని కొందరి అభిప్రాయం. కాని కాలగర్భములో ఏమి దాగి వున్నదో ఎవరికీ తెలియదు.

డిమొక్రసీలో తనకున్న నమ్మకమును వెలిబుచ్చుతూ ఇతడు పెద్ద ఉపన్యాసం యిచ్చాడు మూడోసారి అధ్యక్షస్థానం అలంకరించేసమయాన.

ఇంగ్లాండుకు సంపూర్ణసహాయం చేయుటకుగాను ఒక బిల్లునుకూడా ప్యాసు చేయించాడు. దాని పేరు 'లీజ్ అండ్ లెండు' బిల్లు.

దీన్నిబట్టి చూస్తే యుద్ధం యిప్పట్లో సమాప్తి అయ్యేటట్టు లేదు.

అయినా అవకపోయినా డిమొక్రసీకి రూజువెల్టు అభయహస్తం దొరికింది. కాగా చివరకు దానికే విజయం కాగలదు. డిమొక్రసీ ప్రపంచంలో వున్నంతకాలమూ రూజువెల్టునామం దివ్యప్రకాశంతో వెలుగొందగలదు.



అభాగిని

[కథానిక]

శ్రీ చిలుకూరి శేషగిరిరావు

మా అమ్మమ్మకు జబ్బుగావుంది, రావల్సిందని వుత్తరం రాగానే — ఇంట్లో కల్లా నిరుద్యోగినీ, తీరుబడిగలవాడినీ నే నొక్కణ్ణే మిగలటం చేత పెట్టే బేడా సర్దుకొని గుంటూరుకు ప్రయాణ మైనాను. ఆమెకు అత్యంత వాత్సల్యపూరితుడైన నన్ను చూడగానే కొన ఊపిరితో వున్న ఆమె ప్రాణం స్వస్థానం చేరుకుంది. ఆమెకు వెన్నులో పెద్ద గడ్డ బయలుదేరి, లోలోపలే అది వృద్ధిపొందుతూ వుంది. ఎన్ని మందు లిప్పించినా తగ్గకపోవటంచేత హోమోపతీ మందే యిస్తున్నారు.

ఆమెకు యింకా యీ భూమిమీద నాలుగు రోజులపాటు బ్రతికివుండి గంజి తాగే ప్రాప్తి వుండటంచేతో, లేక ఆమె అపూర్వ వాత్సల్యాన్ని మూరగొనేవాడును, జ్యేష్ఠమనుమడను నైన నా వివాహ మహోత్సవం చూచే అదృష్టం వుండటంచేతనో యమధర్మరాజుతో ఘోరసంగ్రామ మొనర్చి మృత్యుంజయురా లనే బిరుదు పొందింది. ఆమెకు నేను మడి కట్టుకొని పథ్యము వండి పెడుతూవుండేవాణ్ణి.

గుంటూరులో మంచి కమ్మటి నెయ్యీ, తియ్యటి పెరుగూ, పసందైన కాయగూరలూ దొరుకుతూవున్నా అందరికీ ముఖ్యంగా కావలసిన నీటివిషయంలో మాత్రం చాలా యిబ్బంది పడాలి. మునిసిపాలిటీవారు కుళాయిలైతే పెట్టించారుగాని అవి వుండికూడా నిరుపయోగ మనే చెప్పాలి. అవి రోజులో ఏ కొద్ది కాలమో మాత్రమే తెరువబడి వుంటాయి. అందులోనూ ఒకపూట తెరుస్తే ఇక రెండవపూటకు ఆశ వుండదు. ఇక అందులోనుంచి పడే నీటిధార అయ్యరు హోటలులో చేతులు కడుగుకునే పైపుధారకంటే సన్నగానే వుంటుంది. ఇంకొక గంటకో, అరగంటకో పైపులు వదుల్తా రనంగానే జనం తండోపతండాలుగా — మనిషికి రెండుమూడు బిందెలకు తక్కువ లేకుండా తెచ్చుకుంటారు. అలా వచ్చిన సమూహంలో కుల-మత, ఆడ-మగ వివక్షత వుండదు. ఇక ముందు రాబోయే నీటికోసం నాబిందె ముందంటే నాబిందె ముందనీ, నేను ముందు వచ్చానంటే నేను ముందు వచ్చాననీ వాదించుకొంటూ, వొకరి బిందె వొకరు నెట్టుకుంటూ ఆర్భాటం చేస్తారు. అందులో కొందరు లంకాద్వీపవాసులూ, మరికొందరు కిష్కింధావాసులూ వుంటే ముందు నోరు పడేసుకుని, ఆ తరువాత చేతులు కలయజేసుకొని చిన్న రామరావణ సంగ్రామ రంగాన్ని ప్రదర్శిస్తారు. చివరికి నోటిదబాయింపూ, జవసత్వాలూ గలవారికే జయం లభిస్తుంది. ఈ పైరెండు తరగతులకూ చెందని వాళ్లంటి అమాయకు లుంటే, వాళ్లంతా వెళ్లేవరకూ నిరీక్షిస్తూ వుంటారు. ఇంతలో ఆ పైపులకు సెలవియ్యంగానే— కాళ్లీడ్చుకుంటూ, భుజంమీద యిరపై బారల లంగరు త్రాటిని వేసుకొని రెండు ఫర్లాంగుల దూరంలో వున్న మంచినీటి బావులదగ్గరకు పోతారు.

ఈ పైపులు కాక పూర్వం నీటికరవు యింకా ఎక్కువగా వుండటంచేత కొందరు పుణ్యాత్ములు అక్కడక్కడా కొన్ని ధర్మనూతులు త్రవ్వించారు. కాని యివి చాలా లోతుగా వుంటాయి. అందులో

వేసెవిలో నీరు పూర్తిగా అడుగంటిపోతాయి. కొన్ని కొన్ని నూతుల్లో అసలే తడి వుండదు. పైగా అంత కష్టపడి దూరపు నూతులకు వెడితే—తమకు అధమం యిరవై బారల తాడన్నా కట్నంగా యివ్వకపోతే వారితో వియ్యమందమని భీష్మించుకొని కూర్చుంటాయి నూతుల్లోని నీళ్లు. ముందుగా తమకు కొంచెం తైలసంస్కారం లేందే చేదను నూతిలోకి దింపనియ్యమని మొండికేస్తాయి నూతిగిలకలు— అప్పయిప్పించే బ్రోకర్లు కమీషను ముందు గుంజుకునేట్టు. నిజంగా వేసవికాలంలో గుంటూరులో నీటికరవు ఎక్కువనే చెప్పాలి.

మా యింటికిమట్టుకు ఒక బ్రాహ్మణుడు పీపా బండిలోంచి తెచ్చిన నీటిని నాల్గుబిందెలు పోస్తాడు. కాని ఆ బండిలాగేవాడు బ్రాహ్మణేతరుడవటంచేత ఆ నీళ్లు మాఅమ్మమ్మకు పనికిరానందున నేనే స్వయంగా నీళ్లు తేవాల్సివచ్చేది. మా యింటికి సమీపంలో వున్న నుయ్యి పట్టిపోవటంచేత అక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో వున్న నూతికి వెళ్లవలసి వచ్చేది. ఎంత మండుటెండ కాచినా ఆ నూతిలో మాత్రం నిలువునీటికి కొరత వుండదు.

ఆ రోజు లైబ్రరీలో స్నేహితులు చాలా సేపు వుంచేయటంచేత యింటికి వచ్చేటప్పటికి బాగా ఆలస్యమైంది. ఇంటికి రాగానే తువాలు భుజంమీద వేసుకుని నాపరికరాలను పట్టుకుని నీటికోసం బయలుదేరాను. నేను ఆలస్యంగా వెళ్లటంచేత కాబోలు — ఆ నూతికి గల నాలుగు గిలకల్లోనూ ఒకటే పని చేస్తూవుంది. సుమారు పదిహేను రోజుల్నుంచీ అచ్చట నాకు కనిపించని ఒక నూతనముఖాన్ని నే నానాడు సందర్శింపగలిగాను.

ఆమెకు యిరవై రెండేళ్లుంటాయి. గట్టిగా గాలి వేస్తే ఎగిరిపోతుందేమో అనేటంత సన్నగానూ, నీరసంగానూ వుంది ఆ విగ్రహం. అందమైన కోల మొహం. విశాలమైన కన్నులు. తీర్చిదిద్దినట్లున్నాయి తదితర అవయవాలు. కేశసంరక్షణలో తగిన శ్రద్ధ చూపకుండటంచేత కురులు వలిగి స్వేచ్ఛగా ఆమె ముఖంమీద చిందులాడుతున్నాయి. ఆ నిండువెన్నెల్లో ఆమెముఖంలో విచారమూ, వైరాగ్యమూ నాకు గోచరించాయి. ఆ బలువైన రెప్పల్లో సగమువరకూ మూసుకున్న నేత్రాలలోని దీనత్వము నా హృదయంలో ప్రతిఫలించింది. బడికి వెళ్ల నిష్టపడక మారాము చేసే బండబాలునివలె నూతిలోని చేద అతిప్రయాసమీద పైకి వస్తూ వుంది. ఆమె తన్ను బాధపెడుతూవుందని మొఱపెడుతూవున్నట్లుగా గిలక వుండివుండి కిర్రు కిర్రుమంటూవుంది. ఆమె చేదను త్వరితముగా లాగలేక చాలా ప్రయాసపడుతూవుంది. అప్పుడప్పుడు పేగులు తెగిపోయేటంత గట్టిగా దగ్గుతూవుంది.

మంచివయసులో వున్నవాణ్ణి నేనే నూతులోంచి చేదను పైకి లాగటానికి రెండు నిముషాలు తీసుకొంటూ వుండేవాణ్ణి. అలాంటప్పుడు అంత పేలగా వున్న ఆయువతి తన శక్తికి మించిన బలువుగల చేదను ఎంతసేపటికి లాగగలుగుతుంది? అలా తోడుతూ వుంటే ఆమెబిందె నిండే దెప్పుడు?— అనే తలపు కలిగినంతనే నా కామెమీద జాలివేసింది. ఆమె, మధ్యమధ్య ఆయాసంతో దగ్గుతూవుండటం చూచి, ఆ దేహదారుఢ్యానికి తోడు ఏదో వ్యాధితో కూడా బాధపడుతూవున్నదికదా అని గ్రహించి విచారపడ్డాను. అట్టి నీరసురాలిని— అందులోనూ వ్యాధిగ్రస్తను— అంత పెద్దబిందెతో నీళ్లు మొయ్యమని శాసించిన ఆ మూర్ఖుడైన భర్తపై అమితమైన ఆగ్రహం కలిగింది.

ఆమెమొహంలో ఏకవిధమైన ఆకర్షణశక్తి వుంది. అందుచేత ఆమెమొహాన్ని ఎంతసేపు చూచినా తనివి తీరటంలేదు. పాపం, ఆమె అంత అసహాయస్థితిలో వుండగా పురుషుణ్ణయిన నేను చూస్తూ వూరకుండ లేకపోయాను. కాని ఆమెను ఏమని పల్కరించాలో! ఒకవేళ నేను మంచి ఉద్దేశంతో మాట్లాడినప్పటికీ ఆమె దురభిప్రాయపడితే?— సాహసించాను.

"ఏమండీ! మీ రంత నీరసంతో ఎన్ని చేదలని లాగగలరు? నేను సాయపడటానికి అభ్యంతరం చెప్పకండి" అనేశాను తడబడుతూ. కాని ఆమె ఏమంటుందో అనే భయంతో హృదయం కంపిస్తూనేవుంది.

ఆమె బరువైన రెప్పలలోంచి కన్నులు తెరచి నావైపు పరిశీలనాదృష్టితో చూచింది. ఒక చిన్న మందహాసం ఆమెముఖంలో ఒకక్షణమాత్రం మెరసి మాయమైంది.

"తమ్ముడూ! ఇన్నాళ్లకు నీ వొక్కడి నోటి నుండి వెడలిన యీసానుభూతివాక్యం నా హృదయాని కెంతో ఆనందా న్నిస్తూవుంది. కాని, ఇన్నాళ్లూ ఒకళ్లకు సేవచేసే బానిసత్వానికి అలవడ్డ యీ శరీరానికి యిప్పుడు నీనుంచి ఎలాటి సాయమూ అవసరం లేదు" అని ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచింది.

"తమ్ముడూ!" అని ఎంతో ఆదరంతో కూడుకొన్న, మధురంగా నా చెవిలోనికి జొరబడ్డ ఆ అమృతవాక్కు నాశరీరంలోని సర్వావయవాలకూ వ్యాపించి నేను పరవశుణ్ణయినాను. ఎంత మధురమైన వాక్కు! అంతకు నాలుగేండ్లకు ముందు చనిపోయిన మా అక్క జ్ఞప్తికి వచ్చింది. ఆమెకు నాయందు గల వాత్సల్యం చివరకు మా అమ్మకుకూడా లేదంటే అతిశయోక్తి కాదు. ఇప్పు డీమె "తమ్ముడూ!" అని సంబోధించగానే ఆమాటలోని అనురాగమూ, స్వరమూ కేవలం మా అక్కయ్యదే వనిపించింది. నా కన్నులు చెమ్మగిల్లినాయి. వణుకుతూవున్న కంఠంతో "అక్కయ్యా! నీ తమ్ముణ్ణయిన నా సాయం నీకు తగదా?" అని ప్రశ్నించాను.

ఆమె తలను పైకెత్తి కృతజ్ఞతతో నావైపు చూచింది. ఆవెన్నెల్లో ఆమెకళ్లలోని నీరు మెరుస్తున్నది.

"తమ్ముడూ! ప్రపంచంలో నేటివరకూ నోరారా 'తమ్ముడూ' అని పిలుచుకునే భాగ్యం లేకపోయిం దనుకుంటూ వుంటే నేడు నువ్వు నా కా లోటును తీర్చావు. నేడు నువ్వు 'అక్కయ్యా!' అని ఎంతో అనురాగపూరితంగా పిలిచిన ఆ మధురవాక్యం ఇన్నాళ్లనుంచీ నాశరీరంలో జీర్ణించుకునిపోయిన కష్టాన్నంతా మరిపించేసింది. నువ్వు నాయందలి అభిమానంచేత ఇవ్వాళా, రేపూ సాయంచేయగలవుగాని యావజ్జీవం నాలోని రక్తమాంసాలను బానిసత్వానికి ధారపోయవలసిన నా కర్మ మెంతవరకు వుపకరిస్తుందో గ్రహించావా?"

ఆ మాట వెలువడేసరికి ఆమెఅధరం కంపిస్తూ వుంది. అంతవరకూ రెప్పల్లో యిమిడివున్న బిందువులు చెక్కులపై జలజలమని దొరలినవి.

ఆమెకూ నాకూ హఠాత్తుగా కలిగిన యీ బాంధవ్యం నాహృదయాన్ని ఆనందంలో ముంచెత్తుతూవుంది. ఆమె నిరాశాపూరిత వాక్యాలు వింటూ వుంటే నామనస్సు కలతపడుతూవుంది. వెంటనే ఆమె వారిస్తున్నా, చేదను ఆమెచేతుల్లోంచి లాక్కొని "అక్కయ్యా! యీ విషయంలో నువ్వు పట్టు పట్టకు. నాకూ నీలాంటి అక్కయ్యే వుండేది. నేనంటే ఎంతో ప్రాణంగా వుండేది. ఆమె ఎంత వారిస్తున్నా, గృహకృత్యాల్లో ఆమెకు సాయపడటం మానేవాణ్ణి కాను. నా దురదృష్టంకొద్దీ నాలుగేండ్ల క్రితమే ఆమె చనిపోయింది. దైవవశాత్తూ నేడు నీ దర్శనమైంది. చనిపోయిన అక్కయ్యే నీయందు మూర్తీభవించిందనే విశ్వాసం నాకు దృఢంగా వుంది. నేను యిక్కడ ఎలాగూ రెండునెలలవరకూ వుండాలి. అంతవరకూ ప్రతిరోజూ నీకు నేను సాయంచేస్తూవుంటాను. ఇలా చేస్తే చనిపోయిన మా అక్కయ్య ఋణాన్ని కొంతవరకన్నా తీర్చినవాణ్ణవుతా"నని, నీళ్లు తోడుతూ, నా వృత్తాంతమంతా చెప్పాను.

పదినిముషాల్లో బిందెను నీళ్లతో నింపేశాను. "అమ్మా! యింకన్ని బిందెలు కావాలె?" అని అడిగాను.

"బాబూ! ఒకటీ, రెండూ బిందెలతో తెమలదు. అధమం ఎనిమిది బిందెలన్నా వుండాలి. రోజుకు నాలుగుబిందెలు త్రాగటానికీ వంటకూ సరిపోతాయి. మిగిలిన నీళ్లు మా అత్తగారికీ, నాచెల్లెలికీ స్నానానికి సరిపోతాయి."

"అదేమిటమ్మా! స్నానానికూడా మంచినీళ్లే కావాలా? అయితే నా కింకొక చెల్లెలు వుందన్నమాట" అన్నాను ఆశ్చర్యంతో.

"అదంతా నీకు అర్థం అవదు తమ్ముడూ! బాగా చదువుకున్న విదుషీమణులకు స్నానానికి

మంచినీళ్లే కావాలి. ఆ గాథంతా సావకాశంగా చెప్పాలి. ఇప్పటికే ఆలస్యమైంది" అనంగానే బిందెను ఆమెభుజంమీదకు ఎత్తాను. ఆమె ఆ నీరస దేహాన్నీడ్చుకుంటూ వెళ్లింది.

ఆమెఆఖరుమాట వినగానే నా మెదడులో అనేక ఆలోచనలు బయల్దేరాయి. ఆమె అంత నీరసంగా, దీనంగా కనిపించటానికి ప్రబలమైన కారణం ఏదో ఉం దనిపించింది. చదువుకున్న ఆడాళ్లయితే మాత్రం స్నానానికి మంచినీళ్లే కావాలా, ఆమె చెప్పవలసిన గాథ అంత పెద్దదా అనుకుంటూ, మబ్బులలో దాగుడుమూత లాడుతూవున్న చంద్రుడికేసి చూస్తూ కూర్చున్నాను. ఆమె పదినిముషాలకు మళ్లీ వచ్చింది. అదివరకే నాబిందెలో నిండుకొనివున్న నీటిని ఆమె బిందెలో పోసి, "ఏమమ్మా! యింత ఆలస్యమైం" దని అడిగాను.

ఆమె బిందెఅంచులవరకూ నిండిన నీటిని క్రిందకు నెట్టుతూ "బాబూ! ఆ సందు అవతల వీధి చివర నున్నదే అదిగో అదీ మాయిల్లు. వెళ్లి రావట మంటే ఈమాత్రం ఆలస్యం పట్టదూ!" అంటూ, బిందెను నా సాయంతో భుజంమీద పెట్టుకొని వెళ్లిపోయింది.

ఆమె మళ్లీ వచ్చేలోగా బిందెనిండా నీళ్లుతోడి ఆమెరాకకోసం ఎదురు చూస్తున్నాను. ఇలా ఒక గంటలో ఆమెకు కావలసిన నీళ్లు తోడంగానే ఆమె కృతజ్ఞతను తెల్పి వెళ్లిపోయింది. నేను నా బిందెతో యిల్లు చేరుకున్నాను.

మరునాడు ఆదేవేళకు నూతికి చేరుకొన్నాను. ఆమె వచ్చినవెంటనే చేదను అందుకుని నూతిలోనికి దింపుతూ "అక్కయ్యా! నిన్న ని న్నెన్నో ప్రశ్నలు వేద్దా మనుకున్నాను. కాని నీకు ఆలస్యమైపోతుందని మానేశాను. ఇవ్వాళన్నా నీ సంగతంతా చెబుతావన్న ఆశతో నిరీక్షిస్తూ వున్నాను. నీమొహం చూడగానే నువ్వేదో దారుణ మనోవ్యథతో కృశిస్తూ వున్నట్టు గ్రహించాను. నీ తమ్ముణ్ణయిన నావద్ద ఏవిషయమూ దాచకుండా పూర్తిగా చెప్పాలని వేడుకుంటున్నా" నని ఆమెవంక కుతూహలంతో చూస్తూ చెప్పాను.

అప్పు డామె దీర్ఘమైన నిట్టూర్పు విడిచి, గాలికి కండ్లను కప్పుతూవున్న కురుల్ని చెవులపైకి తప్పించి, తన గాథ యిలా చెప్పింది.

"తమ్ముడూ! తెలివైనవాడివి గనుక నా హృదయంలో చిరకాలంనుంచీ అణిగివున్న బాధను గ్రహించావు. నా అనుంగుతమ్ముడివైన నీవద్ద దాపరిక మెందుకు? కాపరానికి వచ్చిననాటినుంచే నేను సంసారంలోని కష్టపరంపరలను ఎదుర్కోవలసివచ్చింది. పదునాలుగేండ్లు నా తలిదండ్రులచేత అల్లారుముద్దుగా పెంచబడిన నాలోని సుకుమారము, మార్దవము, ఆనందము అంతా యీయింటికి వచ్చినమరునాడే నశించిపోయాయి. ఆనాటినుంచీ నాహృదయంలో పరితాపానలం రగుల్కొని నానాటికీ విజృంభిస్తూవుంది. తమ్ముడూ! నా హృదయంలో ఎనిమిదేళ్లనుంచీ వృద్ధిపొందుతూవున్న ఆ పరితాపానలం నా చరిత్ర నీతో కొంత వెళ్లబోసుకుంటే తగ్గుతుందేమో అనే విశ్వాసంతో నాయావద్వృత్తాంతమూ చెప్పేస్తున్నాను.

"మా తల్లిదండ్రులకు లేక లేక చాలా కాలానికి పుట్టిన ఏకసంతాన మవటంచేత నేను అల్లారుముద్దుగా పెరిగాను. తమ ఏకసంతానాన్ని ఏభాగ్యవంతుల యింట్లోనన్నా పడేస్తే సకలభోగాల్నీ అనుభవిస్తుం దనే వెర్రి ఆశతో, వెదకి వెదకి చివరకు యీవూరి సంబంధం నిశ్చయించారు. ప్రస్తుతం కట్నం అడక్కపోతే తమ తదనంతరం తమకు గల ఆరు ఎకరాల భూమినీ, పెంకుటింటినీ పిల్లపేర ముట్టచెబుతామన్నారు. కాని మా అత్తగారు ముందుగా రెండు వేలూ చేతులో పోస్తేగాని వీలులేదని పట్టుపట్టటంచేత ఆరుఎకరాలభూమినీ మూడువేలకు అమ్మి పెళ్లిచేశారు. తనకు ఆడుసంతతి లేకపోవటంచేత వాళ్ల వాటాకూడా కలిపి వియ్యపురాలి లాంఛనాలక్రింద తనకు అయిదు వందలు రావాలని మాఅత్తగారు పేచీ పెట్టింది. అప్పటికి రెండువందలుమాత్రం ముట్టజెప్పి ఎలాగో వివాహం అయిం దనిపించారు. ఇక కార్యానికి డబ్బులేక యిల్లు తణఖా పెట్టారు. కాని మా అత్తగారి ఋణం తీర్చటానికి మాత్రం అసమర్థులయారు.

"నేను కాపరానికి వచ్చిన రెండుమూడు నెలల వరకూ మా అత్తగారు తన డబ్బుకోసం పేచీ పెట్టింది. మావాళ్ల అసమర్థత తెలుసుకుని నన్ను పుట్టింటికి తోలేసి కొడుక్కి రెండోపెళ్లి చేస్తానని పట్టు పట్టింది. మా మామగారి కింకా హృదయమంటూ వుండటంచేత అలా చేయటం అన్యాయమని మందలించారు. ఆనాటినుంచే ఆమెహృదయంలో నాపై యీర్ష్యాగ్ని రగుల్కొని నానాటికీ ప్రజ్వరిల్లుతూ వుంది. తండ్రి కొడుకులిద్దరూ స్వతహాగా మంచి వాళ్లయినా ఆమెచేతిలోని కీలుబొమ్మలైనారు. కారణం? ఆస్తంతా ఆమెస్వాధీనంలో వుంది. చివరకు మామగారి చుట్టల దగ్గర్నుంచీ ఆమే కొనియివ్వాలి. అందుచేత వారు ఆమెఆజ్ఞను జవదాట లేకపోయారు. ప్రతినిత్యమూ, మావాళ్లు తన్ను మోసంచేశా రని ఈర్ష్యతో సూటిపోటు మాటలతో నన్ను వేధించని నిముష ముండదు. నా తల్లిదండ్రులు తీర్చవలసిన ఋణాన్ని నేను తీర్చవలె నని యింటి దాసీదాన్ని మాన్పించి అన్నిపనులూ నాచేతనే చేయించటానికి మొదలుపెట్టింది.

"బాబూ! ఏంచేయను? నా విధిలిఖితం యిలా వుం దనుకుని కిక్కురు మనకుండా ఆమె చెప్పిన పనులన్నీ చేస్తుండేదాన్ని. నన్నింత బాధ పెడుతున్నా ఆమెకు కసితీర లేదు. నా హృదయాన్ని ఛేదించి మలమల మాడ్చివేయాలని నిశ్చయించుకుంది. తనయింట్లో అంట్లుతోమే దాసీయుండ తన కొడుకుకు భార్యగా ఉండుటకు తగదనీ, తన భాగ్యంతో సరితూగగల సంబంధమే తాను చేసుకోవాలనీ ఇంకొక ధనవంతుల పిల్లను కొడుక్కి పెళ్లిచేసింది. పాపం! మా నాన్న ఆసంబంధం కాకుండా చేయాలని తన శాయశక్తులా ప్రయత్నించి విఫలమనోరథు డైనాడు. పెండ్లికికూడా నేను వెళ్ల నోచుకో లేకపోయాను. నేనుకూడా పెళ్లికి వస్తే నలుగురిలోనూ తన కోడ లని చెప్పకోటానికి నామోషీ అని ఆమె నన్ను రానియ్యలేదు. పైగా నీలాంటి హృదయం గలవాళ్లు "బంగారు బొమ్మలాంటి కోడ లుండగా మళ్లీ పెళ్లెందు" కని ప్రశ్నిస్తే నేను గొడ్డుదాననీ, నాకు మాతృస్థానం ఆక్రమించుకొనే అర్హత లేకపోబట్టే నాయిష్టంమీద కొడుక్కి పెళ్లి చేస్తున్నాననీ చెప్పేది.

"బాబూ! స్త్రీ హృదయాన్ని నువ్వుకాదుగదా చివరకు భగవంతుడన్నా గ్రహించ లేడు. వాళ్ల హృదయాన్ని దారుణ సంతాపానలం దహించి వేస్తున్నా తమ సహనశక్తిచేత తమ హృదయంలోని దారుణ బాధను వారు చివరకు కన్నతల్లికైనా తెలియనియ్యరు. నన్ను ఎవరైనా "ఈపెళ్లికి నువ్వు యిష్టపడ్డావా?" అని ప్రశ్నిస్తే నేను యథార్థం చెప్పగలనా? అందుకు నా హృదయం అంగీకరిస్తుందా? నేను ఒక్కత్తెనే ఆరోజు విలపించిన విలాపం, నా కన్నులనుండి వెడలిన వేడి అశ్రుప్రవాహం ఆ పరమాత్మ ఒక్కడే గుర్తించాడు. మా నాన్న నా దురవస్థకు బెంగపడి మంచంపట్టాడు. చివరకు అతడు ఆమంచంమీదే నాకోసం దుఃఖిస్తూ ప్రాణాల్ని వదిలాడు. ఆఖరుసారి అతడి చూపులకుకూడా నోచుకో లేకపోయాను నిర్భాగ్యురాల్ని" అని, జలజలమని రాలుతూవున్న అశ్రువులను పమిట చెంగుతో తుడుచుకుంది.

ఆమె చెప్పే విషాదగాథను వింటూ అంతకుముందే నిండివున్న బిందెలోకి నేను తోడిన నీళ్లు పోసేస్తున్నాను. ఆ నీళ్లు క్రిందకు పార్లిపోతూ వుండటం నా అశ్రుపూరితనయనాలు గుర్తించ లేదు. అలా ఎన్ని చేదలు వ్యర్థమైనాయో?

ఆమె సంగ తంతా గ్రహించి బిందె నెత్తుకుని వెళ్లిపోయింది. నేను అచేతనుణ్ణయి అలాగే కూర్చుండిపోయాను. ఆమె మళ్లీ వచ్చింది. తక్కిన సంగతి చెబుతుం దేమో అని ఆశాపూరిత నయనాలతో నిరీక్షిస్తున్నాను. కాని ఆమె బిందె నెత్తుకొని "తమ్ముడూ! వాళ్లు రెండో ఆటకు సినిమాకు వెడతారట. ఇంటికి నేను కాపలా వుండాలి. రేపు తక్కిన గాథ వినుదువుగాని" అంటూ వెడలిపోయింది. ఆమెకు కావల్సిన నీటిని తోడగానే నా బిందె నెత్తుకొని నిస్పృహతో యిల్లు చేరుకున్నాను.

ఆమరునాడు ఆమె మిగిలిన గాథను యిలా చెప్ప మొదలిడింది.

"తమ్ముడూ! మా నాన్న చనిపోగానే అప్పుల వాళ్లు మాయిల్లు స్వాధీనపరచుకున్నారు. మా అమ్మ 'నా' అనేవాళ్లు లేని ఏకాకిని అయిపోయింది. వృద్ధాప్యంలో నన్ను ఆమెను దగ్గరకు చేరదీసి ఆదరించ వీలులేకపోయింది. పూర్తిగా జవసత్వాలుడిగిన ఆమె జీవనం ఎలా చేయగలదు? వొంట్లో ఓపిక లేకపోయినా ఏలాగో ఒకరియింట్లో వంటకు కుదిరి జీవితం గడుపుతుండేది. కని పెంచిన ప్రాణం గనక అప్పుడప్పుడు వుండబట్టలేక నన్ను చూడటానికని ఏదో ఒక చీరా, రవికా అంటూ పట్టుకొనివచ్చేది. కాని ఏమి లాభం? మా అత్తగారు ఆమెను నోటికి వచ్చినట్లు తిట్టి, గుమ్మం ఎక్కనిచ్చేది కాదు. కిమ్మనకుండా పక్కవారింట్లో వుండి నన్ను పిల్చి తాను తెచ్చినవి నా కిచ్చి, నన్ను కాగలించుకొని నా దౌర్భాగ్యానికి వలవల ఏడుస్తూవుండేది. ఆమె దుఃఖాన్ని యినుమడిస్తుం దనే భయంతో నా హృదయంలోని బాధను అణుమాత్రమైనా ఆమెఎదుట వెల్లడించేదాన్ని కాదు.

"బాబూ! నాకష్టాలు వెల్లడించాలంటే మాటలు చాలవు. మా అత్తగారు కొంత విద్యావంతురాలు, సర్వస్వతంత్రురాలు. ఈ వూళ్లోని మహిళా మండలి కామె స్థాపకురాలు, అధ్యక్షురాలు. నా చెల్లెలు దానికి కార్యదర్శిని. పురుషులతో సమానమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు స్త్రీలకు కావాలని ఎన్నో ఉపన్యాసా లిస్తూవుంటుంది. నా చెల్లెలు స్కూలు ఫైనలు ప్యాసయింది. ఛ్యావస్థలలో, అభిరుచులలో అత్తగారికంటె రెండాకులు ఎక్కువే చదువుకుం దని చెప్పాలి. ఆమెకు స్త్రీపురుష వివక్షత లేదు. వాళ్లిద్దరూ యింట్లో ఒకపనన్నా ముట్టుకోరు. ఎల్లప్పుడూ పత్రికలు చదవటం, క్లబ్బులకు పోవటం, సినిమాలు చూడటంతోనే జీవితాలు గడుపుతారు. ఇంటి చాకిరీ అంతా నేనే చెయ్యాలి. నాకు చదువు రాదు, మర్యాద తెలియదు అని అస్తమానం అత్తగారు నన్ను సాధిస్తూ ఉంటుంది. నిజానికి నేనుమాత్రం చదువురాని మూర్ఖురాల్ని కాను. భారత, భాగవత, రామాయణ గ్రంథాలనూ, తెనుగు పేపర్లనూ బాగా చదివి అర్థం చేసుకో గలను. కాని ఇరవైనాలుగుగంటలూ యింటిపనులతో మునిగి తేలుతూవున్న నాకు తీరుబడి ఏదీ? ముఖ్యంగా ఆమెకు నాపై గల క్రోధానికి కారణం ఏమంటే — ఇంటికి వచ్చిన ప్రతిమగాడితోటీ స్వేచ్ఛగా, చనువుగా, సిగ్గువిడిచి మాట్లాడాలంటుంది. నా చెల్లెలువలె పురుషులతో కలసిమెలసి తిరుగుతూ వారితో టెన్నిసు ఆడుతూ, సినిమాలకు వెళ్లాలంటుంది. ఇదెక్కడి న్యాయం! ఇదెక్కడి నాగరికత! మానాభిమానాలకు పుట్టినిల్లయిన భారత రమణి కిలాంటి పాపపుచర్యలు కూడునా? తమ్ముడూ! ఈ విషయంలో నన్ను చిత్రవధ చేసినప్పటికీ నేను అలా సంచరించటానికి సుతరామూ అంగీకరించను. భారతనారీమణికి పతియే దైవము, శీలమే ఆమెకు శిరోభూషణము. ఆమె పతిసేవ వలననే అత్యంత సులభంగా ముక్తి పొందుతుందనే దృఢ నమ్మకంతోనే, వీళ్లింత క్రూరంగా బాధిస్తూవున్నా, ఓరిమితో సహించి వున్నాను.

"ఇప్పుడు నాగరికులకు అనాగరికులను మా స్త్రీ అంత ఈర్ష్యా, అసహ్యమూ కలగటానికి కారణ మేమిటో వూహించ లేకుండావున్నాను. నా చెల్లెలు నన్నొక బానిసకంటే హీనంగా చూస్తుంది. ఆమె ఆజ్ఞాపించినట్లు నేను నడచుకోవాలి. ఏ మాత్రం ఆలస్యంచేసినా అత్తగారు మండిపడి చీపురుతో, లేకపోతే చేతికర్రతో నాశరీరాన్ని హూనం చేసివేస్తుంది. ఇలాంటి దెబ్బలతో నాశరీరం కాయలు తేరిపోయిందంటే నమ్ము. ఈ చాకిరీకీ, ఈ దెబ్బలకూ నా ఆరోగ్యం పూర్తిగా నాశనమై ఊబ్బసపువ్యాధి అంకురించింది. ఆ బాధ అనుభవించేవాళ్లకు తప్ప మరొకళ్లకు తెలియదు. వీటి కేమీ విచారించేదాన్ని కాను. కాని నావలన సౌఖ్యములేని నానాథుడికి నా చెల్లెలి వలనకూడా తగిన ఆదరణ జరగటం లేదనే విచారం నా హృదయాన్ని వేధిస్తూవుంది. మా అమ్మ ఆరునెలల క్రింద తీర్థయాత్రలకని బయలుదేరి వెళ్లింది. కాని యింతవరకూ ఆమె క్షేమసమాచారం అవంతైనా

తెలియలేదు. నాయందలి విచారంతో ఆకాస్త ప్రాణాన్నీ ఏ గంగాప్రవంతి కర్పించిందో" అని బాష్పధారలతో ఆ నాటికి తన చరిత్రను ముగించింది.

ఆ రాత్రంతా నిద్రపోకుండా ఆమె చరిత్రను పూర్తి విమర్శించటంతో గడిపాను. స్త్రీ జాతిలో కూడా యింత పాషాణ హృదయులు వున్నారా అని పించింది. సామాన్యంగా పురుషాచారాలకూ, అవివేకానికీ లోనైన కొందరు స్త్రీలు కోడండ్రికం పెడుతూవుండటం చూశాను గాని కేవలం విద్యావతియూ, వివేకవంతురాలును, స్త్రీ స్వాతంత్ర్యకాంక్షిణియు అయిన వొకవ్యక్తి మాత్సర్యంతో, స్వార్థంతో సాటి అబలను యింతదారుణంగా బాధిస్తుందని ఎన్నడూ కని, విని, చివరకు వూహించికూడా ఎరగను. తుచ్ఛమైన ధనంకోసం కోమలాతికోమలమైన ఒక అబల అమూల్య జీవితాన్ని యింతక్రూరంగా హింసిస్తూవున్న ఆమెను సంఘం ఒక భయంకర నారీపిశాచికింద పరిగణింపక ఎందుకిట్లు గౌరవించి పూజిస్తూవుండా అని ఆశ్చర్య పోయాను.

ఇలా ఒక యిరవై రోజులు గడిచిపోయినవి. చీకటి రాత్రులు. ఆకాశంలోని నక్షత్రాలు మినుకు మినుకుమంటూ గ్రుడ్డివెలుతురు నిస్తున్నాయి. మునిసిపలు దీపాలు నామమాత్రావశిష్టంగా వెలుగుతూ, ఈ నిము షానికో మరునిముషానికో కొండెక్కేటట్టున్నాయి. నేను మా అక్కయ్యకోసం నిరీక్షిస్తున్నాను. ఆమె అతిప్రయాసతో వచ్చి నన్ను చూడగానే భోరున ఏడ్చింది. నా హృదయం బేజారైంది. ఆమెను బుజ్జ గిస్తూ "అమ్మా! ఎందుకలా ఏడుస్తావూ? జరిగిన సంగతేమిటో చెప్పు" మని తొందరపెట్టాను. అందు కామె ఏడుస్తూనే యిలా చెప్పింది.

"బాబూ! ఇక నాకీ ప్రపంచంలో బ్రతకాలనే ఆశ లేదోయి. కన్న తలిదండ్రులూ, కరవై పోయారు. నా జీవితానికి ఆధారభూతుడైన నాథునికా, నాపై అభిమానం లేదు. తల్లికంటే మిన్నగా ఆదరించవలసిన అత్తగారిట్లయ్యింది. ఇక ఏ ఆశతో బ్రతికి వుండమంటావు చెప్పు. నేను జరిగిన సంఘటనను తలుచుకుంటే నాహృదయం చెరువై పోతుంది.

"ప్రొద్దున చెల్లెలికి జుట్టు దువ్వి తలంటుతున్నాను. పొరపాటున పులుసు ఆమె కంట్లో పడిందో లేదో చెప్పలేను. ఆపళంగా ఆమె తారాజువ్వ వలె లేచి నాదవడపై నాల్గుదెబ్బలు వేసి, నేను తన్ను చంపేస్తున్నానని కేకలువేస్తూ అత్తగారితో చెప్పింది. ఆమెయందు నాకు అణుమాత్రమైనా ద్వేషం లేనప్పుడు నేనలాంటి పని చేస్తానా? నేను నిలువునా నీరై పోయి నిలుచున్నాను. మూర్తీభవించిన చండికవలె అత్తగారు రౌద్రంతో చేతిలోని బెత్తాన్ని ఝాడించు కొంటూ వచ్చి "దౌర్భాగ్యురాలా! నిన్నింతలో వుంచినప్పుడే నీ పొగరు కట్టుపడలేదూ? బంగారం లాంటి పిల్లకళ్లను పాడుచేయాలనుకున్నావా? దీని తెలివి తేటలూ, సుగుణసంపదలూ చూచి నీ కళ్లలో నిప్పులు పోసుకుంటున్నావా? దాసీముండకంటే కనాకష్టమైన నీ బ్రతుక్కింత గర్వమా?" అంటూ ఎత్తిన బెత్తాన్ని దించకుండా నాశరీరాన్ని హూనంచేసింది. నా చెల్లెలు నన్ను తిట్టిన తిట్లకు లెక్కలేదు. మామగారు వూళ్లో లేరు. ఆయన పరీక్షలకు మద్రాసు వెళ్లారు.

"చావుదెబ్బలు తిని కొన వూపిరితో పడి వున్న నన్ను చూచన్నా ఆమె కసి తీరలేదు. పైగా నన్నెంత బాధించినా నేను గట్టిగా కేకలు వేసి అల్లరి చేయననే ధైర్యము. వాళ్లిద్దరూ నా చేతులూ, కాళ్లూ బిగించి కట్టివేశారు. మా చెల్లెలు నన్ను అదిమి పట్టుకుంది. నేను కిక్కురు మనలేదు. మా అత్తగారు అంతకుముందే ఎర్రగా కాల్చివుంచిన అట్లకాడను పట్టు కొని వచ్చింది. తమ్ముడూ! అప్పటి భీకరదృశ్యం చూడగానే నా ప్రాణాలు ఎగిరిపోయాయి.

"హృదయం లేని నా అత్తగారు నాచీరను తొడలవరకూ తొలగించింది. ఆ కాలుతూవున్న అట్ల కాడ నా రెండు తొడలమీదా అంటించింది. 'కెవ్వు' మని బాధలో కేకవేశానని జ్ఞాపకం. కాని మా చెల్లెలు నా నోటిని గట్టిగా నొక్కివుంచటంలో అదీ

ప్రపంచకానికి వినిపించి వుండదు. అలాగే కళ్లు మూశాను..."

ఆమె ఆయాసంతో వాల్గునిముషాలు మాట్లాడలేకపోయింది. తీవ్రమైన బాధతో దగ్గింది. ఆయాసపడుతూ మళ్లా మొదలు పెట్టింది.

"కళ్లు తెరిచేటప్పటికి పన్నెండవుతుంది. అప్పటకు నే నెలాగూ వండననుకొని హోటలునుంచి భోజనం తెప్పించుకుని యిద్దరూ తినివేసి మంచాలెక్కి పేపర్లు చదువుకుంటున్నారు. కట్లు తప్పించి వుండటంచేత అతిప్రయాసమీద లేచి కూర్చున్నాను. రెండు తొడలమీదా ఆరు అంగుళాల పెద్ద పచ్చలు బొబ్బలుదేరి కనిపించాయి. వానిని చూడగానే ఎక్కడలేని దుఃఖమూ ముంచుకొచ్చింది. పెదవిని మెదపకుండానే నా తల్లి దండ్రుల్నీ, నా కష్టాలనూ తలపోసుకొని అరగంటవరకూ భోరున ఏడ్చాను. శరీరంలోని నీరంతా కన్నుల్లోంచి పెల్లగ్రక్కశాను. ఇక నెత్తురుచుక్కలు మాత్రం రావలసివుంది. కాని అదికూడా యీదెబ్బల్లో నీటిరూపం దాల్చటంచేత వాటిని చూచే అదృష్టం పట్టలేదు.

"ఆబొబ్బలు రెండూ చురచుర మంటూ దేహాన్నంతా మండించేస్తున్నాయి. ఆకలిచిచ్చుకు ఆహారం పడకపోవటంచేత నీరసంతో శోష వస్తూవుంది. వోపిక లేకపోయినా అతిప్రయత్నంతో వంటయింట్లోకి పోయి, అన్నంకోసం వెదుకుతున్నాను. ఆరోజున పొయ్యి అంటించనేలేదు. చివరకు పాత్రలు నాకుదామన్నా ఒక్క మెతుకైనా మిగల్లేదు. నాలిక పిడచలు కట్టుతూ వుంటే రెండు గుక్కిళ్ల మజ్జిగ మాత్రం తాగాను. కడుపునిండా తిని, హంసతూలికాతల్పాలలో శయనించి, ఉల్లాసంతో పేకాడుతూవున్న ఆయదృష్టవంతులకు నేను మలమల మాడుతూ చావ సిద్ధంగా ఉన్న విషయం దృష్టియందెందుకుంటుంది? గాయాలకుమాత్రం కొంచెం కొబ్బరినూనె రాసుకున్నాను. ఎవరిని వెళ్లి మందిమ్మని అడగను? ఈగాయాలు ఎందుకొచ్చాయంటే ఏమని సమాధానం చెప్పను? నా దురదృష్టాన్ని నిందించుకుంటూ, ఒకవంక గాయాలు బాధపెడుతూ ఉంటే, మరొకవంక ఆకలిమంట చురచురలాడుతూ వుంటే ఓర్చుకొని ఆకటికనేలమీదే కొంగు పరచుకొని పరున్నాను.

"సాయంత్రమవంగానే మళ్లా పనులు పురమాయించారు. కొనవూపిరితోనే వంటచేసి పెట్టాను. మళ్లా నీళ్లు లేకతప్పదని గద్దించటంచేత యిలా వచ్చాను. ఎంత గాయాలతో కరుడుకట్టిన శరీరమైనా కేవలం ఎప్పుడో చనిపోయినప్పుడు చితిలో కాల్చవలసినదానిని నిండుప్రాణంతో వుండగా కాలుస్తే నొవ్వదూ? దేహమంతా భరించరాని మంటలు బయలుదేరుతున్నా మానం కప్పేందుకని యీచీర కట్టుకున్నాను గాని, అది ఈ పుండ్లను రేపుతూ పెట్టే బాధనుచూస్తే చీరను విప్పి పారేద్దామనిపిస్తుంది. మధ్యమధ్య ఉబ్బసంతో దగ్గటంలో నాప్రేగులు తెగిపోయేటట్టున్నాయి. ఎలాగూ చచ్చిపోయేదానికి మందుదండుగెందుకని మానేశారు. తమ్ముడూ! విన్నావా నా అభాగ్యజీవితపుగాథ? నువ్వే చెప్పు, ఇలాంటి పరిస్థితుల్లో ఇంకే యాశతో బ్రతికి వుండమన్నావో! నాజీవితంలో యిలాంటి సంఘటనలెన్నో సంభవించాయి కాని అన్నిటికన్నా నేటివిషయమే నాజీవితమందు యింకా మినుకుమినుకు మంటూ వుండే ఆశాజ్యోతిని పూర్తిగా ఆర్పివేయటంచేత నాబాధ నీతో చెప్పుకున్నాను" అని వెక్కివెక్కి యేడ్చింది.

ఒక్కసారి భయ సంభ్రమోద్రేకాలచే నా శరీరం కంపించిపోయింది. తోడుతూఉన్న చేదను నేల జారవిడిచి, పండ్లు పటపట కొరుకుతూ "తల్లీ! నీలాంటి సుగుణమణి ఆయమలోకంలో, ఆక్రూర రాక్షసుల నడుమ వుండకూడదు. ఇప్పుడే నాతో మాయింటికి వచ్చేయి. ఈ విషయమంతా పోలీసులకు ఎరుకపరచి, ఆ నరనారీరూప రాక్షసిని క్రూరంగా శిక్షింపిస్తా. అంతవరకూ నా హృదయానికి శాంతి ఉండదు" అని ఆమెచేతిని పట్టుకొని లేవనెత్తాను.

అబ్బా! ఎంతవోర్పు! ఎంత అభిమానం!! నా చేతిని పట్టి బలవంతంగా క్రిందకు కూర్చుండబెట్టింది.

"తమ్ముడా! నీ అమృత హృదయాన్ని చూడగానే నా బాధంతా మాయమైపోయింది. కాని నువ్వు చేయదలచిన పనికి నా అంతరాత్మ అంగీకరించదు. స్త్రీ ఒకళ్ల చేతుల్లోకి వెళ్లాక వాళ్లు ఎంత దారుణంగా బాధించినా, చంపినా, ఓర్పుతో సహించి, తన జీవితాన్ని అత్తింట్లోనే బలిదానం చేయటం భారతనారీమణిధర్మం. కాని ఎన్నటికైనా నశించే యీ పాడు శరీరంమీద మమకార ముంచుకొని, కట్టుదప్పి యితరుల గృహాలలో వుండటం ఆమె జీవితానికి తీరని కళంకం కాదూ? బాబూ! నువ్వు ఆగ్రహపడకు. నువ్వు వాళ్లను నలుగురిలోనూ అల్లరిపెట్టి వస్తే మున్నా సుఖపెట్టగలవా? నీకే గనుక నాయందు నిర్మలమైన అనురాగం వుంటే యీ విషయం ప్రపంచానికి వెల్లడి చేయకు" అని ప్రార్థనాపూర్వకంగా చెప్పింది.

ఆమె అంత దీనంగా వొద్దని వారిస్తూవుంటే ఏం చెయ్యను? నాలోని వుద్రేకాన్నంతా అతి ప్రయత్నంతో అణుచుకోవాల్సి వచ్చింది. ఆమె బిందెను అతి ప్రయాసమీద ఎత్తుకుంది. కాని అడుగులు తడబడుతున్నాయి. చూడలేకపోయాను.

"అమ్మా! యివ్వాళ నీళ్లు పట్టుకొని వెళ్లటానికి సాధ్యం కాదు. మీ యింటిదాకా బిందెను నేనే ఎత్తుకొని వస్తా" నన్నాను.

అంతబాధతోనూ ఆమె ఒక అపూర్వమైన చిరునవ్వు నవ్వి "బాబూ! ప్రపంచంలో నీలాంటి అమృతహృదయాలు చాలా కొద్దిగా వుంటాయి. నువ్వు అలా చేస్తే నన్ను మరీ సంకటపరచినవాడవుతావు. మావాళ్లు చూశారంటే నన్ను నిలువునా చీరేస్తారు. ఒకవేళ వారికంట పడకపోయినా పాడులోకం యిట్టే మనకు అపవాదు అంటగట్టేస్తుంది. ఇంట్లో వాళ్లు ఎంత క్రూరంగా హింసించినా సహించగలంగాని నిజానిజాలు గమనించకుండానే అపవాదులు పుట్టించి నిందించే లోకుల మాటలు భరించటం దుర్భరం. ఈ విషయంలో నువ్వేమీ కలగజేసుకోవ"ద్దని వారించి వెళ్లిపోయింది. నేనేం చేయగలను?

ఆమె లోకంసంగతి ఎత్తగానే నా సర్వావయవాలూ క్రోధోద్రేకంతో మండిపోయాయి. వెధవ లోకం! — తల్లీకొడుకూ, తండ్రీకూతురూ, అన్నాచెల్లెలూ ఎక్కడన్నా వంటరిగా మాట్లాడుకోవటం చూచిందంటే — గ్రుడ్డిలోకం! — ఒకక్షణమన్నా వివేకంతో ఆలోచించకుండా వాళ్లిద్దరికీ యిట్టే అపవాదు కట్టి లోకంలోని ప్రతిప్రాణికీ పనిగట్టుకొని చాటుతుంది.

ఇలా మరో యిరవై రోజులు గడిచిపోయాయి. నేను వచ్చిన వేళావిశేషం మంచిదవటంచేత మా అమ్మ పూర్తిగా ఆరోగ్యవంతురాలైంది. ఇంకొకవారం రోజుల్లో ఆమెను తీసుకొని స్వగ్రామానికి పోదామనుకుంటున్నాను. పాపం! ఆమె దినదినమూ ఆ క్రూరరాక్షసుల చేతుల్లో పడి చిక్కి శల్యమైపోతూవుంది. ఆరోజు నా దుడుకుతనాన్ని చూచి తాను పడే బాధలన్నీ నాతో చెప్పకుండా హృదయంలోనే అణచుకొని క్రుళ్లుతూవుంది. ఆమె యిష్టపడనప్పుడు ఆమె విషయంలో నే నెట్లా కలగజేసుకోను?

నేను త్వరలో వెళ్లిపోతానన్న సంగతి గ్రహించినంతనే ఆమెలోని దిగులు హెచ్చుతూవచ్చింది. జీవితంమీద ఏమాత్రమూ మమకారం లేనట్లు మాట్లాడేది. నేనుమాత్రం ఆమెను హెచ్చరిస్తూ వుండేవాణ్ణి.

స్నేహితుని పెళ్లికి రావలసిందని అర్జంటుగా టెలిగ్రాము రాగానే నేను తెల్లారుతూనే వెళ్లిపోయాను. ఈ విషయం మా అక్కయ్యతో చెప్పటానికి అవకాశం లేకపోయింది. పాపం! ఈ రెండు రోజులూ ఆమెకు ఎవరు సాయంచేస్తారని పరిపరివిధాలుగా ఆలోచిస్తూ స్నేహితుడెంత బతిమాలినా వినకుండా మూడోరోజు రాత్రే బయలుదేరాను. బండి దిగగానే ఆనూతిదగ్గర నుంచే మాయింటికి వెళ్లుతున్నాను. జనం నూతిదగ్గరకు హడావిడిగా పరుగెత్తుతున్నారు. వాళ్లు మాట్లాడుకోవటంలో ఫలానావారికోడలు క్రితము రాత్రి నూతిలో పడి చనిపోయిందనేమాట చలి పిడుగులాగు చెవిని పడగానే నేను నిలువునా నీరైపోయాను. భయ, శోకోద్రేకాలు నా సర్వావయ


వాలనూ కదలనివ్వకుండా చేసినా అతిప్రయత్నంతో ఆప్రదేశాన్ని చేరుకున్నాను.

ఆ నూతిదగ్గర వందలకొలదీ జనం సమిగూడి ఎవరికి తోచినట్లు వారు చెప్పుకుంటున్నారు. పిచ్చి వానిలా ఆగుంపును పొత్తిగించుకొని చూశాను. ఏపనైతే జరుగుతుందని నేను భయపడ్డానో, ప్రతిక్షణమూ ఆమె పెదవుల్లోంచి ఏకోర్కైతే బయటకు వచ్చేదో చివరకు అదే జరిగింది.

నిర్భాగ్యురాలు! తన శరీరంలోని తుదినెత్తురు బొట్టునూ, తన జీవితానందాన్నీ, తన సర్వసుఖాల్నీ, తుదకు తనప్రాణాల్నికూడా ఆ నరరూప నారీపిశాచాలకు బలి గావించి దీర్ఘనిద్ర పోతూవుంది. ఆమె నిరుపమాన సహనశక్తే ఆమె జీవితకుసుమాన్ని నేలరాచి వైచింది. ఆమెముఖంలో నిరుపమాన శాంతరసం పొలుకుతూవుంది.

నాకళ్లు గిర్రుమని తిరిగాయి. ఇక అక్కడ వుండలేకపోయాను. సిల్కు కండువాను ముఖంమీద కప్పుకొని చెరువుగట్టుమీద ఒంటరిగా కూర్చుని నా హృదయం పగిలేటట్టుగా ఏడుస్తున్నాను. అలా ఎంత సేపు ఏడ్చానో నాకే తెలియదు.

ఆశవందగ్గర మొసలికన్నీళ్లను విడుస్తూవున్న ఆరాక్షసులను చూచి,—ఆమె ఉబ్బసపుబాధ భరించలేక ఆత్మహత్య చేసుకొందని నిర్ణయించారు పంచాయతీదార్లూ, లోకమూను.



గాంగ, గంగ వంశములు

ఇప్పటి ప్రసిద్ధచారిత్రకులందరును తలచునట్లు
ఇవి విభిన్నవంశములు కావు

శ్రీ కల్లూరి సాంబమూర్తిశాస్త్రి

కళింగదేశమును చిరకాలము పాలించిన రాజవంశములలో గాంగవంశము ప్రధానమైనది. ఈ వంశమునకు పూర్వము చేదివంశమువాడగు ఖారవేలుడు కళింగమును పాలించినట్లు శాసనములవలన తెలియుచున్నది. ఖారవేలునికిని, గాంగరాజులకును నడుమ దీర్ఘకాల వ్యవధానము కలదు. కాని ఆకాలమున పాలించిన రాజులచరిత్రముమాత్రము తెలియరాలేదు. మహేంద్ర పర్వతప్రాంతమున దొరకిన యొకశిలాప్రతిమ "ఖారవేలుని మనుమనిది" యని కీ. శే. శ్రీ మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు పోంపేటలో తమగృహమున భద్రపరచినదాని నొకప్పుడు నాకు జూపియుండిరి. బహుశః ఆ నడుమకాలమున ఖారవేలుని వంశస్థులే రాజ్యము పాలించియున్నను వారంతగా ప్రసిద్ధులు కాకపోవుటచే శిలాశాసనాదులవలన మనకెరుకరాకుండిరేమో? ఖారవేలుని తరువాత కళింగమును పాలించిన వారిలో మొదటివారు గాంగవంశజులు అనీ, తరువాతి వారు గంగవంశజులు అనీ వారివారి శాసనములవలన తెలియుచున్నది. ఇప్పటి ప్రసిద్ధచారిత్రికులెల్లరు నీ రెండు వంశములను వేఱువేఱుగానే పరిగణించుచున్నారు. కాని యీ రెండువంశములు వాస్తవికభిన్నములు గావనియు, నొక్క వంశముమాత్రమే యనియు, నందు పూర్వులు గాంగశబ్దమును, తరువాతివారు గంగశబ్దమును వ్యవహరించిరనియు, నంతమాత్రమున భిన్నవంశజులనుట న్యాయము గాదనియు నాతలంపు. గంగా శబ్దము శివాదిగణపఠితము కావున "శివాదిభ్యోఽణ్" (౪-౧-౧౧౨) అను పాణినీయసూత్రమువలన అపత్యార్థమున అణ్ ప్రత్యయమును, దన్నిమిత్తముగ "తద్ధితేష్వచామాదేః" (౭-౨-౧౧౭) అనుసూత్రమువలన నాదివృద్ధియు రాగా 'గాంగః' అనురూపము సిద్ధించును. దానికి బహువచనమున లక్షణయా కల్పితమగు 'తద్రాజత్వము' నిమిత్తముగా "తద్రాజస్య బహుషు తేనైవాస్త్రియామ్"(౨-౪-౬౨)అనుసూత్రమువలన అణ్ ప్రత్యయమునకు లుక్కు రాగా 'గంగాః' అనురూపము సిద్ధించును. గంగయొక్క వంశమందు జనించినవాడు గాంగుడనియు, నా శబ్దమునకే బహువచనమున గంగు లనియు రూపము లేర్పడునని పైసూత్రముల తాత్పర్యము.

కళింగరాజుల శాసనములందు గాంగ, గంగ శబ్దములు రెండును నగపడుచున్నవి. అందు ప్రాచీనులగు హస్తివర్మ, సామంతవర్మ, ఇంద్రవర్మ, దేవేంద్రవర్మ మొదలగువారి శాసనములందు గాంగశబ్దమును, అర్వాచీనులగు వజ్రహస్తుడు, అనంతవర్మ మొదలగువారి శాసనములందు గంగశబ్దమును అగపడుచున్నవి. వాస్తవముగ గాంగశబ్దమునకు తద్రాజత్వము లేనేలేదు. కావున దాని అణ్ ప్రత్యయమునకు లోపమును, ఆదివృద్ధినిషేధమును న్యాయములే కావు. గాంగశబ్దమే సుశబ్దమును, గంగశబ్దమే ప్రామాదికము నగును. అయినను "రఘూణామ్, యదుభిః, ఇక్ష్వాకూణామ్" మొదలగు స్థలములందు లక్షణయా తద్రాజత్వలుగ్ వృద్ధినిషేధములచే సాధుత్వము సంపాదింపబడినట్లే 'గంగులు'అను బహువచనరూపము నందును సాధుత్వము సంపాదింప దగియున్నది.

ఈరెండు వంశములును గంగవలననే యుత్పన్నములైనవి. రెండువంశములవారికిని మహేంద్రాచల వాసియగు గోకర్ణస్వామియే యిష్టదైవము. పాల్య దేశము కళింగమే యైనను అర్వాచీనులు ప్రాచీనులపేరెక్కుడను దడవనైనను లేదు. దీనికి కారణము ప్రబలమైనది యుండవలయును. గుణార్ణవుడు, నాతని తనయులు, కామార్ణవ దానార్ణవాదులు మొదలగువారి కథ మనకు

తొలుదొల్త వజ్రహస్తదేవుని శాసనములవలన దెలియవచ్చుచున్నది. అంతకుముందీ ప్రశంస యెందును గానరాలేదు. గుణార్ణవునిదిగాని, కామార్ణవాదులవిగాని శాసనము లేవియు లేవు. కొన్నితరముల పూర్వులను, వారి కాలములను జెప్పినవాడు మొదట వజ్రహస్తుడుమాత్రమే. ప్రాచీన వంశమువారిలో కొందఱు తమ తాతతండ్రుల నామములుమాత్రము పేర్కొనియుండిరి. ఇతరు లామాత్రమును జేయలేదు.

ప్రాచీనుల శాసనములందు ఆర్ష గోత్రములుగాని, వైదికకర్మల ప్రసంగముగాని యిసుమంతయు లేదు. వారు కేవలము గోకర్ణస్వామి భక్తులనిమాత్రమే తెలియుచున్నది. వారు క్షత్రియులై యుండియు తమగోత్రములనుగాని, వైదికకర్మాసక్తతనుగాని ప్రకటించుకొనకుండుటకు హేతు వేమైయుండును? వారు క్షత్రియులు కాకపోయిరైన నుండవలయును; లేదా వైదికమతదూరులైన శైవులైయుండవలయును. బాగుగ నాలోచించినచో వారు వైదికేతరమత ప్రవిష్టులని తోచుచున్నది. దేవేంద్రవర్మ చీడివలసశాసనమునందు గోకర్ణస్వామి ప్రశంస విశేషించి చేయబడుటయేకాక దత్తగ్రామమునకు సీమల పేర్కొను నవసరమున 'ఐశాన్యాం' అని మొట్టమొదట నీశానునాధిపత్యమున ప్రసిద్ధమైన ఈశాన్యదిక్కు చెప్పబడినది. ఏ శాసనమునందుగాని దిక్కులను పేర్కొనుట తూర్పుతో నారంభింపబడుట ప్రసిద్ధమైయుండగా నామార్గము విడిచి ఐశాన్యదిక్కుతో ప్రారంభించుట కతని శైవమతాభినివేశముకంటెను ప్రబల హేతు వొకటి యుండునా? ఇట్లే ఇతరులుగూడ మతాభినివేశమున గోత్రములనుగాని, వైదికకర్మాచరణమునుగాని పేర్కొన్నవారు గారు.

చాళుక్యులలోగూడ ప్రాచీనులు ఆర్షగోత్రాదులను పేర్కొనలేదు. యుద్ధమల్లుడు మొదలగువారి శాసనములందు గాఢమైన శైవమతాభిమాన మగపడుటయేకాక శైవేతరమతద్వేషముగూడ గనబడుచున్నది కదా! అర్వాచీనులుమాత్రమే విష్ణుభట్ట సోమయాజి కథయు, పల్లికథయు పేర్కొని తాము వైదికమత ప్రవిష్టులమని పేర్కొన్నవారు. ప్రాచీనులశాసనములందీ గోత్రప్రశంస లేనేలేదు.

కాకతీయు లన్ననో ఆదినుండి యంతమువఱకును వైదికమతభిన్నమగు శైవమతస్థులుగానే ప్రకటించుకొనిరి. వారికి దైవము స్వయంభూదేవుడు. గురువు శివదేవయ్య. వారు యజ్ఞయాగాదు లొనర్చినట్లుగాని, వైదికకర్మము లాచరించినట్లుగాని యెందును గానరాలేదు. పురాణప్రసిద్ధములగు సూర్యచంద్ర జాతము లగు క్షత్రియవంశముల నెల్లరును ప్రకటించుకొనుచుండ వారా రెండుకులముల నతిక్రమించిన కాకతికుల మను చెప్పుకొనిరి. ఆర్షగోత్రముల చెప్పుకొన్నవా రెల్లరును తమది సూర్యవంశమో, చంద్రవంశమో యని చెప్పుకొనుచుందురు. అర్వాచీన చాళుక్యులేమి, గాంగులేమి యట్లే చెప్పుకొనియున్నారు. తెలుగుదేశమం దిప్పుడున్న రాచకులమువారికి పూర్వకాలమున వైదికకర్మాసక్తతయు లేనట్లును దరిమిలా అవి ప్రాప్తించినవని యీ గొప్పగొప్ప చరిత్రపరిశోధకులు చెప్పియున్నారు. పైవానినెల్ల విమర్శించి చూచినచో ప్రాచీనకాలమున రాజకుటుంబములు అధికారవశమున రాజనామము నొందినను వర్ణవిభాగమున ప్రాప్తమగు క్షత్రియత్వము పొందలేదనియో, కాక వర్ణవిభాగమును అంగీకరింపని శైవాదిమత ప్రవిష్టులో యని నిర్ధారణము చేయవచ్చును.

ఇంకొక చిత్రము. ప్రాచీనకళింగమున నిప్పటివలె షట్కర్మాధికారులగు బ్రాహ్మణు లుండిరో లేరో యనికూడ సంశయము కలుగుచున్నది. దానశాసనము లందలి ప్రతిగ్రహీతలగు బ్రాహ్మణులను నిర్దేశించునపుడు వారివేదశాఖలనుగాని, సూత్రములనుగాని, షట్కర్మాధికారమునుగాని శాసనములు తెలుపలేదు. దేవేంద్రవర్మ చీడివలసశాసనమునందు "ఇజ్యాధ్యయన దానక్రియారతేభ్యః" అని క్షత్రియ వైశ్యుల కుచితములగు మూడుకర్మలు మాత్రమే పేర్కొనబడినవి. దానివలన వారు షట్కర్మాధికారులు కారని స్పష్టపడును.

మఱియొక విశేషవిషయము. ఈ కళింగదేశమున 'పెగిడీలు' అనియు, 'సొండీలు' అనియు రెండుజాతులు గలవు. ఈ రెండుజాతులవారికిని యజ్ఞోపవీతాది క్షత్రియ లక్షణము లేవియు లేవు గాని యిరువురును తాము క్షత్రియుల మనియే చెప్పుకొనుచున్నారు. వీరిలో పెగి

డీలు కల్లుగీయువ్యాపారమును, వ్యవసాయమును జేయుచుందురు. పాండీలకు సారావిక్రయము చేయుట కులవృత్తిగా నున్నది. ప్రస్తుతకాలమున నీరెండు తెగలయందు నే కొలదిమందియో విద్యావంతు లున్నను పెక్కుమంది విద్యాహీనులుగా నున్నారు. సెగిడీలు తాము క్షత్రియుల మనియు, గంగవంశోద్భవుల మనియు జెప్పుకొనుచున్నారు. వారి తెగవిషయమై "ఆర్యహిహిడా క్షత్రియుల" మని రాజవైద్య శ్రీ లా అప్పలనరసింహదేవుగారు మొదలగు వారును, శయనకుల క్షత్రియుల మని శ్రీ కాకుళ ప్రాంతమందలి శ్రీ మండ నరసింహముపంతులుగారి అనుయాయులు కొందఱును ఎవరికి తోచినట్లు, ఇచ్చవచ్చినట్లు వారు చెప్పుకొనుచున్నారు. పేరుభేద మున్నను మొత్తముమీద నెల్లరును క్షత్రియుల మనియు, దమగోత్రము గంగగోత్ర మనియు చెప్పుకొనుచున్నారు. వీరిలో "రామదేవు, అప్పలనరిసింహదేవు, నారాయణదేవు" మొదలగు నామములందు చివర దేవపదము గలదు. దీని నెల్ల నాలోచించిన వీరు ప్రాచీన గాంగవంశమునకు సంబంధించినవా రని తోచుచున్నది. దేవపదము అర్వాచీన గంగవంశజులందును, ఇప్పుడు ప్రసిద్ధముగా నున్న రాజకుటుంబములందునుగూడ నగపడుచున్నది. ప్రాచీన రాజవంశములందు వర్ణవిభాగాయాతము వైదికకర్మములుగాని, ఆర్ష గోత్రములుగాని లేవుగదా! మధ్యకాలమువారిచేతమాత్రము వైదికకర్మములారంభింపబడినవి. అందులో ధనము, అధికారము, బలము గలవా రిప్పు డగపడుచున్న రాజకుటుంబములకు మూలపురుషులై తమ వంశములను క్షత్రవంశములు గావించుకొనిరి— ఆ రెండును లేక వ్యవసాయాదివృత్తులవలంబించువారు శూద్రులుగా నుండిపోయిరి అని తోచుచున్నది. ఇంతియకాక మరియొక విషయముగూడ నాలోచింపవలసియున్నది. చాళుక్యులు మొదలగు నాగరికతనుదిరిన కొందఱు దక్కనసేకు లర్వాచీనులుగూడ తమకులము గంగతోగూడ విష్ణుపాదమున నుద్భవించిన దని చెప్పుకొనుచుందురుగదా! ఈ విషయము ప్రాచీనములగు చాదపరాజా మొదలగువారి శాసనములందును గలదు. గంగతో గలసి పుట్టుట యను భావము నే "గంగవలన జనించుట" అనుపదముగూడ తెలుపును అనుకొన్నచో గంగగాంగవంశముల యుత్పత్తి రహస్యము తేటతెల్ల మగును. గంగవంశము రాజులకు సేనానులై వారితో సంబంధ బాంధవ్యములు నెఱపు కొందఱకు శ్రీ ఖేడీ, ధర్మఖేడీ యనునామములు గలవు. 'ఖేడీ' పద మొకసైనికోద్యోగమును దెలుపును. ఇది వాస్తవమైనచో శ్రీ ఖేడీపదము సెగిడీగ మారిన దనుట నిస్సంశయముగా నమ్మవచ్చును. అప్పుడు వీరు గంగ గాంగవంశములనుండి విడివడిన ధనహీన క్షత్రియ కుటుంబములవా రని తేలును.

గంగగాంగ వంశములతో సంబంధబాంధవ్యము గలిగి వారికి సేనానాయకులుగాను, మంత్రులుగాను, సామంతులుగాను నున్న బాణకదంబ వంశములు శాసనములవలన నెఱుకపడుచున్నవి. పాండీలలో బాణవంశము, కదంబవంశము నను రెండుతెగలు గలవు. బాణ యనుపద మిప్పటివా రజ్ఞానముచేతను, గొప్పకావలయు నను బుద్ధిచేతను 'పాండవ' అని చెప్పుకొనుచున్నారు. 'బాణ' 'పాండవ'గా గ్రామ్యజనుల వ్యవహారమున మార్పుచెందు టొకవింత గాదుగదా! కావున పాండీలు కూడ పూర్వము క్షత్రియుల కుటుంబములనుండి విడివడినవారే యనుట సమంజసము.

ఉద్దాన ప్రాంతమున 'సామంతో' అనునొకజాతి కలదు. వ్యవసాయము, కూలిపని వీరివృత్తి. వీరిజనసంఖ్య మిక్కిలి స్వల్పము. ఓఢ్రము తెలుగు కలిసిన సంకరభాష. వీరు వ్యవహరించుచున్నారు. విద్యలేదు. నాగరకత శూన్యము. 'సామంతో' 'సామంత'పదమునకు ఉత్కలోచ్చారణము. వీరు పూర్వరాజులకు సామంతులుగా నున్న రాజవంశములనుండి బయలుదేఱినవారై యుందురు. ఇప్పటికిని రాజకుటుంబములలో రాజ్యాధికారముగల కుటుంబములకు రాజుగారు, దేవుగారు మొదలగు నామములును, అధికారము లేమియు లేక విడివడిన కుటుంబములవారికి 'సామంతో' లనియు వ్యవహారము జరుగుచున్నది. సామంతోలు పూర్వ రాజకుటుంబములతో సంబంధ బాంధవ్యములు బాహాటముగా చేయుచున్న రాజకుటుంబముల వారేకాని, యితరులు గారు. 'సామంత' 'సామంతో' 'సాంతో',

పదము లేకార్థకములే. ఒక దానికంటె నింకొకటి వికారము నొందినది.

పైవిషయము లన్నియు విమర్శించిన పైని గాంగ గంగవంశములు రెండు నొక్కటియే యనియు, ప్రాచీనులకు వైదికకర్మ్యాకులు లేవనియు, నర్వాచీనులు నాగరికులై యవి సంపాదించుకొనిరనియు, సెగిడీ, సాండీ, సామంతో జాతులు పూర్వము రాజవంశములే యనియు, విద్యా ధనాభావములచే పొట్టకూటికి నీచవృత్తు లవలంబించుటచే నీకాలమున నీచజాతులుగా జూడ బడుచున్నారనియు పిండితార్థము తేలుచున్నది.

నాకు దోచిన యుక్తులతో దోచిన యభిప్రాయములు ప్రకటించితిని. ఇది సిద్ధాంతము లన సాహసింపను. ఐనను గావచ్చును. విమర్శకులకు గొన్ని యుపకరణము లందించుటయే నాతలంపు. కావున విశాలహృదయులగు విమర్శకులీవిషయములు చక్కగ విమర్శింతురు గాక.

బాలానందం

మెరుపుపాపాయి

అనగా అనగా ఒక గంధర్వు డుండేవాడు. ఆగంధర్వుడికి ఇరవయిఎనమండుగురు కూతుళ్లున్నారు. అందులో ఇరవై ఏడుగురు చాలా అందంగా ఉన్నారు. కాని ఆఖరిపిల్ల మెరుపుపాపాయిమాత్రం చాలా నల్లగా ఉండేది. ఆ ఊళ్లో వాళ్లంతా "వాళ్లంతా చాలా అందంగా ఉంటారనీ, మెరుపు పాపాయి అందంగా ఉండదనీ" అనడం విని వాళ్లు గర్వపడ్డం మొదలెట్టారు. వాళ్లు మెరుపుపాపాయిని మాటిమాటికీ వెక్కిరిస్తూండేవారు. ఒకనాడు సాయంత్రం వాళ్లంతా కలిసి అడవిలోకి వెళ్లి చెట్లల్లో సరస్సులదగ్గిర ఆడుకుంటున్నారు. రోహిణి, భరణి, రేవతి రకరకాల పువ్వులు కోసుకొచ్చి ఒకచోట పోగేస్తున్నారు. అనూరాధ, అశ్విని దండలు గుచ్చుతున్నారు. ఇంతలోకే ఉత్తర అక్కడికి వచ్చి "అక్కా, నాకు దండలు పెట్టవే" అంది. అశ్విని దానికి దండలు పెడుతూ "అందంగా ఉన్న వాళ్ల తల్లో పువ్వులు చాలా బాగుంటాయి సుమా" అంది. "అయితే అందంగా లేనివాళ్లకు బాగుండవా?" అంది రోహిణి. "ఆ, కాకేం? మన మెరుపుపాపాయిని చూడు. దానితల్లో ఏమీ బాగుండవు" అంది భరణి. అక్కడే పువ్వులు కోసుకుంటూన్న మెరుపుపాపాయికి ఇది వినగానే కోపం వచ్చింది. తను కోసిన పువ్వులు పట్టుకొచ్చి అనూరాధవొళ్లో పోసింది. ఇంతలో రోహిణి అక్కడికి వచ్చి "నీపువ్వులకు నీనలుపు అంటుకొంటుం దమ్మా, మా కక్కర్లేదు. పట్టుకెళ్లు" అంటూ ఆపువ్వుల్ని దూరంగా విసిరేసింది. పాపం, మెరుపుపాపాయి కన్నీళ్లతో వెళ్లి ఆ పువ్వుల్ని ఏరుకుంటూ "పోనీలే, నేనే ఆడుకుంటా నీటితో" అంది. అంటే వాళ్లందరూ ఒక్కసారి గట్టిగా నవ్వేసి మళ్లీ ఆడుకుంటున్నారు.

ఆకాశం అంతా మెద్దుబ్బేసింది. గాలి! పెద్ద వాన కురవటం మొదలెట్టింది. వాళ్లందరూ గబగబా పువ్వులు తీసుకుని పరిగెత్తుకుని వెళ్లి ఒక గుహలో దాక్కున్నారు. ఆ అడివిలో ఉన్న లేడి ఒకటి చలికి ఉండలేక ఆ గుహలోకి వచ్చింది. "ఇదేమిట్రా, ఈ గుహ మనకే చాలటంలేదు, ఈలేడికూడా ఏమిటి మనకు?" అని ఉత్తర అంది. అనగానే వాళ్లంతా "పోనీ" అని దాన్ని రాళ్లతో కొట్టి తరిమేశారు. కాని మెరుపుపాపాయికి దానిమీద జాలివేసి, "దాన్ని కూడా ఉండనివ్వండర్రా, పోనీ" అని దాన్ని తీసుకు రాబోతే, "నువ్వూ, నీలేడీ కలిసి వానలోకి వెళ్లండి, అంత జాలిగా ఉంటే" అని వాళ్లందరూ అన్నారు. "ఒస్తే నువ్వొక్కర్తెవూ రా. లేకపోతే పొండి" అని ఒకరాయి గుహ కడ్డంగా ఈడ్చేరు. మెరుపు పాపాయీ, లేడీ వానలో తడుస్తూ కొంతదూరం వెళ్లేటప్పటికి ఒక పెద్ద వర్షపుచినుకు ఆపక్కనే ఉన్న సరస్సులో పడింది. దానిలోంచి ఒక అందమైనపిల్ల మెరుపుపాపాయిదగ్గిరకు వచ్చి "ఈవర్షంలో ఎక్కడికి వెడుతున్నావమ్మా" అని అడిగింది. కథంతా చెప్పింది మెరుపుపాపాయి. "నా పేరు వర్షబాల. ఈ లేడిని నీకోసం నేనే పంపించాను. దీనిమీద ఎక్కి మా ఇంటికి వస్తావా, మనిద్దరం కలిసి ఆడుకుంటూ ఉండొచ్చు" అని అడిగింది. "మీ ఇల్లెక్కడుంది?" అని అడిగింది మెరుపుపాపాయి. "మా ఇంట్లో మబ్బుతాతయ్య ఉన్నాడు. మా ఇల్లు అక్కడుంది" అని ఆకాశంవేపు చూపించింది. "మా మబ్బుతాతయ్య రోజూ ఎంచక్కటి

కథలు చెబుతాడు" అంది వర్షబాల. "అయితే నేను కూడా నీతోటి వస్తా" అంది మెరుపుపాపాయి. వాళ్లిద్దరూ ఆ లేడిపైన కూర్చుని మేఘాల లోకి ఎగిరిపోయారు. మబ్బుతాతయ్య మెరుపు పాపాయికి మధు విచ్చాడు. దాన్ని తాగడంతోనే మెరుపుపాపాయి ఢళఢళ, మిలమిల మెరుస్తూ బంగారు తీగలాగా అయిపోయింది. మబ్బుతాతయ్య మెరుపు పాపాయి చెప్పిందంతా విని, ఇలా అన్నాడు: "నిన్ను కాంతిలేనిదాన వన్నారు కనక వాళ్లు కాంతి లేకుండా పోతారు." అని శపించాడు. "శపించవద్దంది" మెరుపు పాపాయి. ఇదంతా విస్తుపోయి చూస్తూ ఉన్న అమె అక్కలు కూడా నమస్కారం పెట్టి క్షమించ మన్నారు. "మెరుపుపాపాయి ఉన్నంతసేపూ మీరు కనబడరు" అని ఆశాపాన్ని తిప్పాడు మబ్బుతాతయ్య.

పెద్దవాళ్లయినా కవారు చాలా బుద్ధిగా ఉండి చంద్రుణ్ణి పెళ్లాడారు. నిష్కారణంగా మెరుపుపాపాయిని తిట్టామే అని విచారించారు.

వర్షబాల, మెరుపుపాపాయీ ఆకాశంమీదికి వాళ్ల తాతయ్యతో ఆడుకోటానికి వస్తూంటారు అప్పుడప్పుడు. దాన్నే మనం మబ్బు, వాన, మెరుపులు అంటాం. అందుకే ఇప్పటికీ మెరుపుపాపాయి వచ్చినప్పుడు మనకు నక్షత్రాలు కనిపించవు.

—మంచాళ శంకరీ దేవి.





మీగడ తరకలు

గ్రంథ గ్రంథులు

[శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి]

ఆంధ్రగ్రంథములందు ముడులువిడని గ్రంథ గ్రంథులుగాఁ గొన్ని పద్యములు, పదములుఁ గానవచ్చుచున్నవి. అట్టివానిలోఁ గొన్నింటి కిక్కడ నాచేత నయినంతలోఁ జిక్కులు విడఁదీయఁ బ్రయత్నము చేయుచున్నాఁడను.

చందమామఘుటిక:

"పాత్రసంశుద్ధి కౌజ్యం బుపస్తరించి
యూరకుండిరి యిది యేమి యొక్కొ వీరు ?
కానరా విప్ర శాకపాకములు నెదుర
మనకు నిజమయ్యె నల చందమామఘుటిక."

[భీమఖండము]

కాశిలో వారముదినములనుండి తిండి లేక త్రిప్పులఁబడుచున్న వ్యాసాది మహర్షు లొక పెద్ద ముత్తయిదువ యన్నప్రదానము చేయుదు ననఁగా నను స్నానములు దీర్చుకొని కూర్చుండిరి. విస్తళ్లు వేసిరి; పాత్రాభిఘారము చేసిరి. అంతే. వడ్డనగాని, యింట వంటవాసన గాని కానరాదయ్యెను. అప్పుడు వ్యాసాదు లనుకొన్నట్టున్నచొప్పు పయి పద్యము. ఇందు "మనకు నిజమయ్యె నల చందమామఘుటిక" అన్న పాదమున కర్థము కావలెను.

"తూష్ణీం స్థితాః కిమేతన్న
నాన్నాదిక మవేక్ష్యతే,
సత్యాభూ దధునాస్మాకం
శశాంకఘుటికాకథా."

అని పయి తెలుఁగు పద్యమునకు సంస్కృత శ్లోకము. వా కిట్లు తోఁచినది: ఉడుగక మారాము పట్టి యేడ్చుచున్న పసిబాలురను పెద్దవా రెత్తుకొని వెన్నెలలోని కరిగి కనువిందు గొలుపు చందమామను జూపుచు "చందమామ రావే జాబిల్లి రావే......వెండి గిన్నెలో వెన్న పెట్టుకొని, పమిడిగిన్నెలో పాలు పోసుకొని, ఒలిచినపండు చేతఁబట్టుకొని, ఒలవని పండు ఒడిలో ఉంచుకొని రావే చందమామా, అబ్బాయీ నీవూ ఆరగింతురుకానీ" అని పాటపాడుచు చందమామ తనకేదో తినుబండారములు తెచ్చిపెట్టునని బాలకు లూరడిల్లియుండునట్లు మోసగింతురు. ఇదీ శశాంకఘుటికాకథ. సంస్కృత భీమఖండమునను, తెలుఁగు భీమఖండమునను 'శశాంకఘుటిక - చందమామఘుటిక' ఉన్నది గాని ఈ నానుడి విష్ణుపురాణమున మఱొక మాదిరిగా నున్నది.

"అందని పంటి కేమిటికి
నఱ్ఱు నిగిడ్చెదు విష్ణుఁ డన్న యూ
కందుక చందమామగుట
కల్, విను మీపని కట్టిపెట్టు."

[ఆశ్వా. ౨]

ఇక్కడఁగూడ 'ఘుటికల్' అని మార్చవచ్చును గాని అచ్చులో 'గుటకల్' అనియే కలదు. ఈ పాకమునకు చందమామ యేమో తెచ్చిపెట్టఁగలఁడని నోరూరఁగా బాలకులు గుటకలు మ్రింగుచుఁ జూచు

చుండు టర్థమగును. ఘటఖండపు ఘుటికకంటె నీ 'గుటక' సారస్యము గలది. కాని సంస్కృతపు 'ఘుటిక'కు 'గుటక' తెలిఁగింపు గాదు కదా!

ఈ 'చందమామగుటక' మాదిరిగా 'చందమామ గ్రుక్కిళ్లు' అని ప్రయోగాంతరము గలదు.

"ఎలమి సుముహూర్తమునఁ జెర యెత్తినంతఁ
బ్రేమ మది మీఱఁగాఁ జందమామ చెలుల
కెంపుమోవుల సుధను గ్రుక్కిళ్లు గ్రింగ
శ్రీతిఁ గలిగెఁ జందమామగ్రుక్కిళ్లు నాఁడు."
[తారాశశాంకము]

శబ్దరత్నాకరకారు లీ పద్యము నుదాహరించి, 'చందమామగ్రుక్కిళ్లు' అను పదమునకు 'అధరామృతము' అని అర్థము వ్రాసిరి. కాని, వారే అక్కడ "ఇట్లు చందమామగుటకలు. ఈయర్థ మింకను విచార్యము" అని వ్రాసిరి. అధరామృత మన్న యర్థము సంగతము గాదు.

కేసము :

"కేసము-అసూయ మొదలగు నర్థములందు నన్నిచోడఁ డుపయోగించెను. 'కేస' క్రొత్త కన్నడము నందే కలదు గాని ప్రాచీన కావ్యములలోఁ గానరాదు. కావునఁ, దత్ప్రయోగము గావించినకవి ద్వాదశశతాబ్దికంటెఁ బ్రాచీనతరుఁడు గాఁజాలఁడు" అని శ్రీ లక్ష్మీపతి శాస్త్రిగారు.

నన్నయభట్టారకునకు నూఱేండ్ల పూర్వపు వాఁడును, కర్ణాట ప్రాచీన మహాకవియు నగు పంపకవి తన విక్రమార్జున విజయమున 'కేస' పదమును పదవ యాశ్వాసము ౩౩-వ పద్యమునను, మఱియు ౮౧-వ పద్యమునను రెండు చోట్ల నన్నిచోడఁ డేయర్థమునఁ బ్రయోగించెనో ఆయర్థముననే ప్రయోగించెను. కాన నిది యాంధ్రకర్ణాటకవితల యాది కాలమునుండియు రెండు భాషలలోను వ్యవహృత మగుచున్న పదమే యని తెలియవలెను.

కనుమారి :

భారత శాంతిపర్వమున

"కల్లు ద్రావిన పాతకం బది యగ్నివ
ర్ణముగాఁగఁ గాఁచి పానంబు సేయఁ
గనుమారి యొఱుకంగ ననలంబుఁ జొర మహా
ప్రస్థాన మాచరింపంగఁ బాయు"
[ఆశ్వా. ౧, ప. ౩౦౪]

అని కలదు. ఇందు 'కనుమూసి యొఱుకంగ' అని పాఠాంతర మున్నది. అది పరిగ్రాహ్యము గాదు. ఇక్కడ "పానంబు సేయఁగను-మారి యొఱుకంగ" అని పదచ్ఛేదమా, "పానంబు సేయఁ — గనుమారి యొఱుకంగ" అని పదచ్ఛేదమా అని సంశయము. ఈ సంశయము నీ క్రింది నాచన సోముని పద్యము తీర్చినది:

"పాయఁ దగు మిమ్ముఁ గనుమారిఁ బడఁబోసంగ
విషముఁ ద్రావుట యోగ్యంబు వెల్లిలోన
మునుఁగు టుచితము మీరెల్లఁ గనుఁగొనంగ
నాత్మ విడుచుట చను నాకు ననుచు నడలి."
[ఉత్తరహరి. ఆ. ౪]

పదము 'కనుమారిఁ బడుట' యనుట స్పష్టము. 'కనుమారిఁ బడుట'కు 'భృగుపతన' మర్థము. శాంతి పర్వపద్యమునకు మూల మిది.

"సురాపానం సకృత్ కృత్వా
యోగ్నివర్ణాం సురాం పిబేత్,
... ...
మరుత్ప్రపాతం ప్రపతన్
జ్వలనం హి సమావిశన్,
మహాప్రస్థాన మాతిష్ఠన్
ముచ్యతే సర్వకిల్బిషైః."
[శాంతి. అ. ౩౪]

"మరుత్ప్రపాతం - నిర్జలదేశే పర్వతాగ్రాత్ పతనం" అని వ్యాఖ్య.

టాటాలు గుణించుట :

"క, ర్ణాటస్త్రీలు కటారికత్రియలచే
రాపాడఁగాఁ బట్టఁగాఁ
టాటా లీడ గుణింపరాదు పెఱచో
టంబోలెఁ జైపాటునన్."
[క్రీడాభిరామము]

తెలుఁగునాట, తెలివితక్కువవానికి 'తద్దన్న' అనీ, మనసుమెత్తనివానికి 'పప్పమ్మ' అనీ, గడుసరివానికి 'టట్టణ్ణ' అనీ, బూకరింపునకు 'చచ్ఛ' అనీ నానుళ్లున్నవి. త వర్గము దంత్యము; చ వర్గము తాలవ్యము; ట వర్గము మూర్ధన్యము; ప వర్గము ఓష్ఠ్యము. 'తద్దన్న' వట్టి మాటకారియే కాని కార్యకారి కాఁడు' పల్లుబిగించే కాని కార్యపు సొంపు లేనివాఁడు (దంత్యముగాన). 'పప్పమ్మ' నే 'వెఱ్ఱిపప్ప', 'వెఱ్ఱిపప్పమ్మ' అనియు నందురు. వట్టి మెత్తనివాఁడు; గట్టిగా వాదు సేయ, మాటాడను నేరనివాఁడు (ఓష్ఠ్యము గాన). 'చచ్ఛ' బూకరింపు (తాలవ్యము గాన). 'టట్టణ్ణ' ఉద్ధతుఁడు; బిఱ్ఱబిగిసి నెత్తికెక్కి మాటాడువాఁడు (మూర్ధన్యము గాన).

ఈ యర్థమునకు సాధకముగాఁ గర్ణాట భారతమున పంపకవిప్రయోగ మున్నది.

" పన్నతెర నడువ నుడియ
లెక్కన్న భుజార్గళమె పాల్గు మెసవేణ్ముని మే
ణెన్ననుడి 'టాతడాధణ' :
మెన్నం బెసనువుదు రాజనూయం బేళల్."

భీముని భాషణము 'టాతడాధణ' అనఁబడినది— ఉద్ధతము, కఠినము అని. క్రీడాభిరామప్రయోగమునఁ గూడ "టాటాలు గుణింపరాదు" అనఁగా గడుసరి దుడుసుఁదనములు సాగింపరాదని యర్థ మగును.

అధ్వానము :

హంసవిలాసమున రతివిలాపములో—

" న, న్నతిదుఃఖాన్వితఁ జించిపోవఁ దగుఁజా
యధ్వానవుం బట్టునన్ "

అని కలదు. 'అధ్వానము - అమార్గము' అని శబ్దరత్నాకరకారు లనిరి. 'అరణ్యము' అని కర్ణాట నిఘంటుకారు లనిరి. ఈ యర్థము లెట్లు వచ్చినవో వారు లక్ష్యము లుదాహరింపలేదు. కర్ణాట పంప భారతమున 'అధ్వానపదపరిశ్రాంత' అని యున్నది. తన్ముద్రాపకులు 'అధ్వానము — మార్గము' అని యర్థము వ్రాసిరి. అది సంస్కృతసమాసమున నున్నది. శ్వ-శ్వాన' శబ్దములవలె 'అధ్వ-అధ్వాన' శబ్దములు సంస్కృతమునఁనే కలవెూ! 'అధ్వ' శబ్దము తత్సమరూపమున 'అధ్వానము' కాఁబోలును! 'అధ్వానము' తత్సమ మనుకొన్న శ్రీనాథప్రయోగమునకు సాధుత్వము, వర్ధము నిర్వాహము లగును గాని కర్ణాట ప్రయోగము రక్షితము గాదు. తెనుఁగున 'అధ్వాన్నము శత్రుమధ్యము' అని నానుడి యున్నది. త్రోవలో వంట చేసికొని తినుట, శత్రువు లప్పుడు చుట్టుముట్టియుండుట దాని కర్థము. కాని, సంస్కృతమున 'అధ్వాంతశాత్రవః=మార్గసీమారిపుః' అని ప్రయోగమును, అర్థమును వాచస్పత్యాది నిఘంటువులలోఁ గానవచ్చును.

తెలుఁగువఁగల 'తలపొలము' పదమున కీ 'యధ్వాంత' పదము సరియయిన సంస్కృతము.

" సాదు లేఁగ నేని
న్నిరు తలపొలమునన కాని నిలువదు సుమీ"

అన్న తిక్కన్న ప్రయోగమునకు " సాధువయిన పసరము చెలరేఁగినదా, అది యుండఁగఁ బోఁగలదో అందాఁకఁ బోయికాని నిలువదు" అన్న యర్థము సంగతము. ఊరిబాట ముగియునట్టి పొలిమేరపట్టు 'అధ్వాంతము-తలపొలము.' తిక్కన ప్రయోగమున కర్థ మిదే యని నిరూపించుట కీ క్రింది ప్రయోగము కాటమరాజుకథలోనిది సాధకము.

" తలపొలమునకుఁ బోటి నిలఁబడ్డగోవులను
కలవిలు చుకొన్నట్టు కాదుకయ్యంబు."

తిక్కనభారతము, కాటమరాజుకథ— రెండును నెల్లూరి కావ్యములే. 'తలపొలము' పద మక్కడ వాడుకకలది కాఁబోలును!

కనకస్వామి :

బసవపురాణమున—

" జాలిఁ బడి కనకసాములు దమకే
వేలిచికొన్న యావిధమగుఁ దమకు "

అని యున్నది. శివాలయములలో శివనివేదితాన్నాదికము నర్చకు లక్కడి బోయల కారగింపనిచ్చుట బసవేశ్వరుని పూర్వకాలపు సంప్రదాయము. బసవేశ్వరుఁ డాసంప్రదాయము మాన్పించి యర్చకులచే

ఆరగింపించెను. బోయలు తగవు సాగించిరి. "శివునికి విషము నివేదింతుము. అది మీ రారగింపఁగలరా ?" యని బసవన బోయల నడిగెను. "ప్రసాదమారగించి బ్రతుకఁగోరుదుముగాని ప్రసాదము విషముచేసినఁ దిని చత్తుముగదా?" అని బోయ లనెడుపట్టునఁ గల ద్విపద యది. బసవపురాణము ముద్రించువారఁ డీద్విపదయర్థము నాకు స్పష్టపడలేదు. 'కనకస్వాములు' అనఁగా రస వాదము (బంగారము) చేయువా రనీ, తత్ప్రక్రియ సరిగా తెలియక తప్పుప్రయోగములుచేసి వారు తమ శరీరములనే కాల్చుకొనుచుండుట జరగును గాఁబోలు ననీ నే నప్పుడనుకొంటిని. ఇటీవల కర్ణాటవిద్వాంసులు శ్రీ శేషయ్యంగారు కర్ణాటభారతమున నేతత్సంబంధి కథ యుండుటఁ జూపిరి. అది యిది: ఆరణ్యపర్వమున యక్షప్రశ్నల సందర్భమున భీమాదులు నలుగురు సోదరులు యక్షునాజ్ఞ మీఱి నీరు త్రావి చెఱువుచెంత మృతప్రాయులై పడియుండిరి. అప్పుడు దుర్యోధనుని పురోహితుఁడు కనకస్వామి యనువాఁడు పాండవులఁ జంప నాభిచారికహోమము చేసి పంపిన కృత్యాదేవత పాండవహననార్థ మక్కడికి వచ్చెను. ఆ చెఱువు దగ్గఱ నప్పుడు కృత్యకు యక్షదేవత (యముఁడే) ప్రత్యక్షమై "నీవు జాతిగల దేవతవై తేని నాచే నిప్పుడు నిపాతితులయి యెంగిలిపడియున్న యీ నలువురను నీ వారగింపరాదు. ఎంగిలితిండి తిందువా, నీవు నీచ దేవత వగుదువు. నా మహత్త్వమునందు నీ నీచ దేవతాకార్యము సాగఁజాల" దని గద్దింపఁగా కృత్యా దేవత యప్రయోజకురాలై "అయ్యో, నే నాఁకలిగొని వచ్చితినే; ఆహారము కావలనే" అనెను. "అక్రమముగా నిన్నిట్లు ప్రయోగించిన యాకనకస్వామినే యారగింపు" మని యక్షుఁ డనెను. అట్లే యాకృత్య దుర్యోధనపురోహితునిఁ గనకస్వామి నే యారగించెను.

"కనకన చేల్వె తసుర్దుగు
కనకనసెం బొందు మాతు ధర గెసెయ సురయో
ధనన పురోహిత నప్పా
కనకస్వామియనె మునిదు కృత్తిగె దిందల్"
[పంపభార. ౭ అశ్వా. ౮౮ ప.]

ఈ కథ సంస్కృతాంధ్ర భారతములలోఁ గానరాదు. కర్ణాట భారతరచనమునకుఁ బూర్వమే "కన కనిచేల్మి కనకనికే తగిలిన" దన్న సామెత యేర్పడి యున్నదని పద్యము తెల్పుచున్నది. తొలుత నీసామెత రసవాదకారునిఁ బట్టి పుట్టి వాడుకలో నుండఁగాఁ బంపకవి దానినిఁ గొని, దుర్యోధనపురోహితునిఁ గనక స్వామిని సృష్టించి తత్పరము గావించి యుండఁ బోలును.

ఉప్పుతోఁ దొమ్మిది :

రామాభ్యుదయమున "ఉప్పుతోఁదొమ్మిదియును బెట్టి కృపణరక్షణము గావించునే గుణసముద్రుఁ" డని యున్నది. 'ఉప్పుతోఁ దొమ్మిది' యనఁగా—

"ఘటం, పటం, జలం, కాష్ఠం,
తండులం, తైలమేవచ;
శాక, మగ్ని సమాయుక్తం,
లవణం, నవ సంయుతమ్"

కోహళి :

"మాళిం గోహళి సంఘటించినక్రియన్
మధ్యాహ్నవేళన్ మహా
కాశం బైన నభోవిభాగమున పీఁ
కం గాసె భీకెండ..."
[హరవిలాసము.]

ఇందు 'కోహళి' పదమున కర్థము తెలియదు.

"పార్వతీపతికిఁ బ్రభాతభూపతి గొన్న
యులరుఁగెందమ్మికోహళి యనంగ."
[ఉత్తర హరివంశము.]

పయి రెండుప్రయోగములు తక్కఁ దెలుఁగున నీపదము నాకెక్కడను గానరాలేదు. కుమార వ్యాసకృత షట్పదీభారతమున 'కోహళి' పద మున్నట్లు కన్నడనిఘంటువున చెప్పఁబడినది. దానికి **Cover, Envelope** అని అర్థము వ్రాయఁబడినది.

"ఎనల దివ్యావయవకాంతియ
మినుగుమోహర దేర్గె మాడిద

వనిమిషాంగద లురగ కాయద
కోహాళేయ నుగిరు "

[కుమారవ్యాస]

నహుషుఁడు సర్వశరీరపు టాచ్ఛాదనమును తొలఁగించుకొనుట యిక్కడ చెప్పఁబడినది. కాన కన్నడనిఘంటుకారు లట్లర్థము వ్రాయుట సంగతమే. కుమారవ్యాసునికంటెఁ జాలఁ బ్రాచీనులగు మన తెల్గుకవుల ప్రయోగములు 'ఆచ్ఛాదనము' అన్న యర్థమునకు సరిపడ వనుకొనెదను. తెల్గు ప్రయోగములు రెండింటికి 'ఉల్లడ', ఒండె 'ఆలవట్టము' ఛత్రము, అర్థము కాఁదగు ననిపించును. హరివంశపుఁ బ్రయోగముఁబట్టి చూడఁగా నది వేల్పులకు రాజులు మొదలగువారు పూజాచిహ్నముగా ధరించు ఛత్రచామరధ్వజాదులవంటిదిగాఁ గానవచ్చును. పార్వతీపతి గగనకేశుఁడు గాన యాదేవుని తలమీఁదికి వచ్చునట్టి ప్రభాతరాజు పైకెత్తిన యాలవట్టమువోలె భానుబింబ మున్నదన్న వర్ణనము సంగతము కాఁదగును. హరవిలాసప్రయోగము నిందుకనుకూలించును. రాగిడివంటి యలంకారవిశేషమో, కిరీటమో యనుకొందమన్న 'నలరుఁగెందమ్మి' పదమునకు తామరపూవువాకృతి గలది యని చెప్పవచ్చునుగాని ప్రభాతభూపతి'కొన్న' యున్న పదమునకు సార్థక్యము కుదురదు. ఆలవట్టము కాని, ఉల్లడకాని 'యలరుఁగెందమ్మి' యాకృతిగలవని యన్వయింప వచ్చును. ఇట్లెల్ల యోచించితిని; గాని 'కోహళె' పదమునకు సమానార్థకముగా మహారాష్ట్రమున 'ఖోళె' పదము కల దని కిట్టెల్ వ్రాసినాఁడు. మహారాష్ట్రపు 'ఖోళె' సులువుగాఁ దెలుఁగున 'కుల్లా' అయియుండవచ్చును. 'కోహళి' శబ్దమునకు 'కోహళె, ఖోళె, కుల్లా' పదములు క్రమ పరిణామ రూపములు కావచ్చును. కాఁగా 'కోహళి' శబ్దమునకు 'కుల్లాయి,టోపి' అర్థమగును. తెలుఁగుప్రయోగములు రెండును 'కుల్లా' అర్థమునకు సరిపడఁగలవు. 'కుల్లా' శీర్షాచ్ఛాదనమేకదా! అది యలరుకెందమ్మి యాకృతిగలది గావచ్చును.

కన్నడపు కుమారవ్యాసప్రయోగము 'శిరఆచ్ఛాదన' మనుటకు సరిపడదు. అతఁడౌపచారికముగా శరీరాచ్ఛాదనమునకే దానిఁ బ్రయోగించియుండఁబోలును.

ఇట్టికసూఁడినవాఁడు:

ఉత్తరహరివంశమున నరకాసురుని కోడి దిక్పాలురు పాఱిపోవుటను వర్ణించుటలో యముని గూర్చి యీ క్రిందిపద్య మున్నది:

"ఇట్టిక సూఁడిన వాఁడో
యొ ట్టిడుకొన్నాఁడొ యనుచు నల్లసమాడన్
బట్టుచు మగిడి చూడక
పట్టణమున కేఁగె లజ్జబండతనమునన్ "

పై పద్యమున కనేకు లర్థము నడిగిరి. లోకాచారము గొంత యెఱిఁగినవారుగాని దీనియర్థము వివరింపఁజాలరు. నరకుని కోడిపోయి యముఁడు తన పురమునకుఁ బరుగువాఱుచున్నాఁడు. అట్లు పరుగువాఱుటలో ముందరిచూపే కాని వెనుకచూపు లేదు. అది చూచినవారు "ఈతఁ డేమి, యిటికయావమునకు నిప్పంటించి వెళ్లుచున్నాఁడా? మఱి, వెనుకకుఁ దిరిగి చూడనే చూడ నని యొట్టుపెట్టుకొని వెళ్లుచున్నాఁడా?" అని పరిహాస మాడఁదగిన ట్లున్నది. ఇటికయావమునకు నిప్పుముట్టించువారు ముట్టించిన నిప్పు అంటుకొన్నదా లేదా అనియైన వెనుకకుఁ దిరిగి చూడకుండ వడిగా ముందుచూపుతోనే వెడలిపోవలెను. అట్లు వెనుకకుఁ దిరిగి చూచిన నా యావముకాల్పు సరిగా సాగక చెడు నని లోకప్రతీతి. ఈలోకప్రతీతి దెలియకున్న పద్యార్థ మెఱుకపడదు.

మఱియు నీపద్యము నాల్గవచరణమున 'లజ్జబండతనమునన్' అనియున్నది. దీనికి 'లంజెబందతనమునన్' అనియు, 'లంజెబండ తనమునన్' అనియుఁ బాఠాంతరము లున్నవి. కవికర్ణ రసాయనమునను, గౌరన హరిశ్చంద్ర చరిత్రమునను ఈ పదము ప్రయోగింపఁబడినది. లజ్జబండఁ=సిగ్గుమాలినవాఁడు.

Annals of the Tirupati Oriental Institute.

వాక్పతి రాజెరిగిన కవులు

[శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి]

కన్యాకుబ్జదేశాధిపతి యశోవర్మ వంగదేశరాజులను గౌడులను జయించినప్పుడు, తద్విజయ ప్రశస్తి రూపంగా వాక్పతిరాజు 'గౌడవహో' అనే ప్రాకృతకావ్యాన్ని రచించినాడు. కాశ్మీరరాజు లలితాదిత్యుడు యశోవర్మ నోడించి సంధి కొప్పించినట్లుగా రాజతరంగిణిలో కల్హణుడు, "శ్రీ యశోవర్మణః సంధా సాంధివిగ్రహికో౽నయం." ఇత్యాది శ్లోకాలను చెప్పినాడు. చారిత్రపరిశోధకులు దీనిని సత్యాగమునగనే ఋజువు చేసినారు. లలితాదిత్యుడు క్రీ. శ. ౭౨౫ లో రాజ్యానికి వచ్చి క్రీ. శ. ౭౬౦ వరకు నున్నాడు. యశోవర్మ క్రీ. శ. ౭౫౫ వరకు జీవించియే ఉన్నాడని జైనసంప్రదాయా లున్నవి. అందుచేత చివరరోజుల్లో యశోవర్మ కాశ్మీరరాజుల సామంతుడుగా ఉన్నాడని తెలుస్తుంది. ఈ ఓటమికి పూర్వమే యశోవర్మ గౌడులను జయించినాడు. ఇది ౭౦౦-౭౨౫ సంవత్సరాలమధ్య ఉంటుం దని శంకర పాండురంగపండిట్ గారు తేల్చారు.

వాక్పతిరాజు యశోవర్మ ఆస్థానకవులలో నొకడు. ఈ గ్రంథంలో రాజు తన్నాహ్వానించి విజయ ప్రశస్తి వ్రాయు మన్నట్లు చెప్పికొన్నాడు. దీనికి తోడుగా కల్హణుడుకూడా

"కవి ర్వాక్పతిరాజశ్రీభవభూత్యాదిసేవితః
జితో యయౌ యశోవర్మా తద్గుణస్తుతివందితః"

అని చెప్పినాడు. యశోవర్మ చేరదీసిన కవులలో భవభూతి వాక్పతులు ముఖ్యులు. ఈ కావ్యాన్ని చూస్తే కాశ్మీరరాజులతో యుద్ధం జరగకముందే వాక్పతి "గౌడవధ"ను వ్రాసినట్లు తెలుస్తుంది.

గ్రంథారంభంలో సుమారు ౬౦ శ్లోకాలు దేవతాస్తుతులకూ, తర్వాత కొన్ని కుకవినిందలకూ సుకవిస్తుతులకూ అర్పించి ప్రధానకథను తీసికొన్నాడు. ప్రధాన కథ ఐపోయినాక తనెరిగిన కవులనుగురించీ, తనకు మార్గదర్శకులైన కవులను గురించీ పదారు శ్లోకాలు వ్రాసినాడు. అందులో ముఖ్యంగా కాళిదాస, అగ్నిమిత్రులను గురించి మనం గమనింపదగ్గ విషయా లున్నవి.

ప్రథమంలో తాను యశోవర్మయొక్క ఆస్థాన కవులలో నొక్కడ నని చెప్పినాడు —

"అథ తస్య స్థిరభుజస్తంభ నిమిత నిఃశేష భువన భారస్య ఆసీ త్కవిరాజచిహ్నః వాక్పతిరాజ ఇతి ప్రణయిలవః భృత్యలేశః" (౭౯౭)

తర్వాతిశ్లోకంలో తన సమకాలికుడను కమలాయుధు డనే కవిని పేర్కొన్నాడు —

"ఆత్మా పీతవాఙ్మాత్రేణ కేవలం విరహో౽పి యస్య
ప్రతిభాతి శ్రీ కమలాయుధచరణైః కథమపి
యద్గృహీత బహుమానః"

ఈ కమలాయుధుడు వ్రాసిన గ్రంథా లింతవరకూ ఏవీ లభించలేదు. ఇక ముందుముందు వ్రాతప్రతులు ఏమన్నా దొరికితే ఏమన్నా తెలుస్తుందేమో! ఈ శ్లోకాన్ని బట్టి చూస్తే కమలాయుధు డీతని గురువో, లేకపోతే అంతరంగిక మిత్రుడుగానో కన్పడుతాడు. మొత్తముమీద కమలాయుధుడుకూడా ఆ కాలపుకవులలో చాలా పేరుపడ్డవాడనే తెలుస్తుంది.

తర్వాత భవభూతిని గురించి ప్రస్తావించాడు—
"భవభూతిజలధినిర్గతకావ్యామృతరసకణా ఇవ స్ఫురంతి,
యస్య విశేషా అద్యాపి వికటేషు కథానివేశేషు"
(౭౯౯)

భవభూతినుంచి సలహాలు తీసుకోవటమే కాకుండా అతని రచనలద్వారా తన భావాలను చాలా బాగా దిద్దుకోగలిగాడు వాక్పతి. అమృత జలధి వంటి భవభూతికవిత్వంలోనుంచి వాక్పతి అమృతరసకణాలను తీసుకోగలిగాడు. ఇతని కవిత్వం భవభూతికవిత్వంలాగానే స్ఫురిస్తుం దని కవే ఒప్పుకున్నాడు.

తర్వాతిశ్లోకంలో తనకన్న ప్రాచీనులైన కవులను పేర్కొన్నాడు —

భాసే జ్వలనమిత్రే కుంతీదేవే (?) చ యస్యరఘుకారే,
సౌబంధవేచ బంధే హారిచంద్రేచ ఆనందః (౨౦౦)

ప్రథమంలో భాసుడిని చెప్పినాడు. ౧౯౧౨ ప్రాంతంలో శ్రీగణపతిశాస్త్రిగారు భాసనాటకాలని, ౧౩ గ్రంథాలను ప్రచురించారు. అవన్నీ భాసుడు వ్రాసాడా లేదా? అనే ప్రశ్నకు సమాధానం ఇంకా తేలలేదు. శ్రీ దేవధర్ గారు అన్నీ భాసుడివి గావని ఈ మధ్యనే వ్రాశారు. మొత్తంమీద భాసుడనే కవి ఒక డున్నాడనటంలో ఎవరికీ తగాదా లేదు.

శూద్రకుని పేరుతో వ్యవహరింపబడుతూ ఉన్న మృచ్ఛకటికలోని మొదటి నాలుగంకాలను చారుదత్త మనే పేరుతో భాసుడికి అంటకట్టటంచేత ఈ విషయం చాలా చిక్కులలో బడ్డది. ప్రథమాంక" లోని "యాసాంబలిః సపది మద్గృహ దేహళీనాం" అనే శ్లోకాన్ని ఉదాహరిస్తూ వామనుడు మృచ్ఛకటిక పాఠంలోనుంచి కొంతా, చారుదత్త పాఠంలోనుంచి కొంతా కలిపివేశాడు. ఇంకా అత డుదాహరించిన "వ్యసనంహి నామ సోచ్ఛ్వాసం మరణం" అనే పంక్తి చారుదత్తలోనే ఉంది. "ద్యూతం హి నామ పురుష స్యాసింహాసనం రాజ్యం" అనేది మృచ్ఛకటికలోనే ఉంది. వామనుడికి శూద్రకు డంటే చాలా గౌరవం ఉన్నట్టు తోస్తుంది. "శూద్రకాది రచితేషు మహాప్రబంధేషు" అని అన్నాడు.

ప్రాచీన వాఙ్మయంలో శూద్రకుణ్ణీ, భాసుణ్ణీ వేర్వేరుగా పేర్కొనకుండా, ఒకర్ని చెప్పి మరొకర్ని వదలివేయటం కద్దు. కాళిదాసు భాస కవినే పేర్కొన్నాడు. బాణుడు భాసుని నాటకాలనుగురించి చెప్పి, తన గద్యప్రబంధానికి శూద్రకమహారాజును నాయకునిగా చేసినాడు. వామనుడు భాసుని పద్యా లుదాహరిస్తూ, శూద్రకుని పొగడాడు. తపతీ సంవరణంప్రస్తావనలో కులశేఖరవర్మ ప్రాచీనకవులను చెప్పుతూ శూద్రకుని మొదట చెప్పి, తర్వాత కాళిదాస, బాణ, హర్షలను గురించి చెప్పినాడు. భాసుని పూర్తిగా వదలేశాడు.

అదీగాక భాసనాటకాలనబడేవాటిల్లో "భరత వాక్యాలు" "నఃరాజసింహః" అనే పదాలు కల్గియున్నవి. నాటక ప్రదర్శనవేళలో కవికూడా సభలో ప్రేక్షకులతో కలసి ఉంటాడు కాబట్టి, కవినిగురించి ఈ వాక్యం నటకు లని ఉండవచ్చు.

పై పెచ్చు స్వప్నవాసవదత్త భరతవాక్యంలో "బలరాముడు నిన్ను రక్షించుగాక" అని ఉన్నది. ఈ వాక్యాలను చూస్తే నటుడే కవిని గురించి చెప్పినట్టు కన్పడుతుంది. అవిమారక భరతవాక్యంకూడా "నారాయణుడు నీకు భూమినంతా ఇచ్చుగాక!" అని చెప్పుతుంది.

దీనికి తోడుగా మన వాక్పతిరాజు "భాసే జ్వలనమిత్రే" అని చెప్పినాడు. జ్వలనమిత్రుడు వేరే గనక ఐతే, భాసకాళిదాసులతో సమంగా వాక్పతిచేత చెప్పబడ్డ ఇతని పద్యాలను ఒక్క ఆలంకారికుడుకూడా ఉదాహరింపకపోవటం శోచనీయం. జ్వలనమిత్రుడనే కవి వేరే ఉన్నాడనటానికి వేరే ఆధారాలేమీ లేవు. శుంగవంశరాజుల్లో అగ్నిమిత్రుడనే రా జొక డున్నాడు. జ్వలనశబ్దము అగ్ని శబ్దానికి ఛందఃపర్యాయము. అందుచేత భాసు డనబడే అగ్నిమిత్రుడు అని సమన్వయించుకోవాలి. భాసుని భరత వాక్యాలుకూడా కవిని రాజసింహునిలాగా పేర్కొనటంచేత ఇతడే అగ్ని మిత్రు డై ఉంటాడు.

అదీగాక అమరకోశవ్యాఖ్యాత క్షీరస్వామి, "అగ్నిమిత్ర" శబ్దానికి "శూద్రక" శబ్దం పర్యాయపదమని చెప్పుతూ ప్రమాణంగా ఒక ప్రాచీనకారిక నుదాహరించాడు. శూద్రకుడు ఆంధ్రరాజులలో నొకడని వాయుపురాణం చెప్పుతూంది. ఆంధ్రరాజుల్లో శ్రీముఖ, శిప్రక అనే పేర్లున్నాయేకాని శూద్రకపదం లేదు. ఏ దెలా ఉన్నా పురాణాలుకూడా శూద్రకుని రాజుగా ఒప్పుకుంటాయి. అందుచేత వాక్పతిరాజు యొక్క శ్లోకంనుంచీ భాసుడు, అగ్ని మిత్రుడు, శూద్రకుడు, అనే మూడు పేర్లూ ఒక్కరివేనని తేలుతుంది.


తర్వాత "కుంతీదేవేచ యస్య రఘుకారే" అని వ్రాశాడు. ప్రాకృత మాతృకలో "కుంతీదేవే" అని

ఉంది. సంస్కృతంలో అదే "కాంతి దేవ" అనే పదంగా మారాలి. "గాడవాహో" వ్యాఖ్యాత కంతీదేవ అని ఛాయలో వ్రాశాడు. అతే డనుసరించినపాఠ మేమో తెలియదు. అందుచేత సంస్కృతంలో "కాంతిదేవ" అనో "కంతీదేవ" అనో ఉండాలి. కాంతిదేవుడు రఘువంశము వ్రాశినాడట! వ్యాఖ్యాత "కాంతిదేవః కవిః, రఘువంశకర్తా, కాళిదాసః" అని వ్రాశాడు.

భోజకాళిదాసకథలూ మొదలైనవాటిల్లో కాళిదాసు అసలు కవిపేరు గాదనే కనపడుతుంది. 'అశ్రమం' పుచ్చుకున్న తర్వాత వచ్చిన పేరులాగా ఉంది. ఇక్కడ వాక్పతి దాన్నే బలపరుస్తూ "కాంతిదేవ" అని అసలు కవిపేరు చెప్పాడు. కాళీభక్తుడవటంచేత కాళిదాసైనట్లు కథలున్నాయి. ఇతని గ్రంథాలు పరిశీలిస్తే ఇతడు శాక్తమతావలంబి అని తేలుతుందని ఈ మధ్యనే ఋజువుపరచినాను. ఇందుచేత కాళిదాస పదము ఇతనికి బిరుదమై ఉండవచ్చు. ఇతని అసలుపేరు "కాంతిదేవ" అనో వ్యాఖ్యాత ప్రకారం "కంతీదేవ" అనో ఉంటుంది.

తర్వాత సుబంధుకృతి వాసవదత్తను, హరిచంద్రుని పేర్కొన్నాడు.

వాక్పతి ఏడెనిమిది శతాబ్దాలవాడు కావటంచేతనూ, చరిత్రాత్మక గ్రంథాన్ని వ్రాయటంచేతనూ స్వకపోల కల్పితకథలను వ్రాయలేదని విశ్వసింపవచ్చును. అందుచేత భాస శూద్రక అగ్నిమిత్రపదాలు ఒక్కరిపేరేననీ, కాళిదాసు అసలుపేరు "కాంతిదేవు"డో, "కంతీదేవు"డో అని తేలుతుంది.



తీతువు

శ్రీ అయ్యగారి విశ్వేశ్వర రావు

ఏటికి తీతువా యఱచె దీగతి, సొమ్ములు పోయినట్లుగాఁ
గాటికి రాఁగదోయి! యని గానము చేసెదు సిగ్గుమాలి, నీ
పాటలు పాడుగాను, భువి పచ్చగ నుండిన కళ్లు కుట్టెనా?
చేటుఁతోడ మానవులు చింతిల భాగ్యమె నీకు తీతువా?

పిల్లలుఁ బెద్ద లందరికి భీతిలఁ జేసెను నీదు కూఁత, యా
యల్లరిఁ గాంచినంతటనె యబ్బుర మందితినోయి! వింటివా?
ముల్లులు నీదుమాటలుఁట, ముప్పులకంతకు బాటలంట, నీ
యిల్లు బజారుపా లయెను, యెందుల కీ యపకీర్తి తీతువా!

కాలుని దూత తీతు వను కల్లరి మాటలు నిండె నేఁడు, నీ
కేలనె, నోళ్ల లోఁ బడుట, యెల్లరు దుమ్మును నెత్తిపోయుటే
శ్రీ లని సంతసింతువె! యినీ! పరువున్ మరియాద నెంచవా?
చాలు! వయస్సు మీరఁగనె సంతల నమ్మితె జ్ఞానసంపదన్.


కోయిల పాటఁ దెచ్చికొనఁ గోరుము, అతని పేరుఁ జెప్పగా
నీ యఖిలప్రపంచమున నింతటిగాయకుఁ డేడి యంచు, నె
న్నో యభివందనాల నిడుదుందురు లోకులు లెక్కలేక, నీ
హేయపుజీవితమ్మునకు నీ నగుబాట్లు ఫలంబు తీతువా!

మొన్న వసంతభూమిపతిముంగిట పాటకచేరిఁ జేయఁగాఁ
గన్నులపండువయ్యెఁ గద, గాయకరత్నమ! ముద్దుకోకిలా!
మన్నన మాటగట్టితివి! మాదగు కొల్వునఁ బాటకాఁడవై
యున్న ముదావహంబ, యిఁక నుండవు లోటులు వేనికేని, నీ
వన్న మదీయరాజ్యమున హర్షమటంచు వసంతుఁడే యనెన్.

కాలగర్భగంపే

కీ. శే. న్యాపతి సుబ్బారావు పంతులుగారు

ఆంధ్రుని భాగ్యదేవతా కిరీటమునుండి కొన్ని వజ్రములు ఈ నడుమ జలజల రాలిపోయినవి, రఘుపతి వేంకటరత్నము, గిడుగు రామమూర్తి, పానగంటి లక్ష్మీ నరసింహారావు, గంటి లక్ష్మన్న, కూచి నరసింహము, నిన్నగాక మొన్న గతించిన న్యాపతి సుబ్బారావు పంతులు— ఇంచుమించుగ నొకటి రెండు సంవత్సరములలో నెన్ని మరణములు! ఒకదృష్టితో జూచినచో వీ రందరియందును సామాన్యలక్షణములు కొన్ని గోచరింపగలవు. ఇవి పూర్ణాయుర్దాయ జాతకములు. అరువదిడెబ్బది సంవత్సరములకు పైమాట కాని తక్కువమాట కాదు. వాఙ్మయరంగమునందు గాని, రాజకీయరంగమునందుగాని వీ రందరును గాంధీయుగమునకు పూర్వపు పంటగ పరిగణింపవలసినవారు. వీరందరి జీవితములను విశిష్టములే యయ్యును శ్రీసుబ్బారావు పంతులుగారి జీవితమునందు ఆయుగమునందలి ఒకతరగతి పురుషుల ఆదర్శములు పూర్ణముగ ప్రతిబింబించుచున్నవి.



* * *

పట్టినదెల్లను బంగారమయిన జాతక మది! క్లీడరీలో, ప్రవేశించినారు! అదివరలో లోయర్ సెకండరీ అప్పర్ సెకండరీ మున్నగు స్వల్ప పరీక్షల నిచ్చి సట్టా పుచ్చుకున్నవారేగాని బి. ఏ. ప్యాసయి తరువరి బి. యల్. కూడ ప్యాసయి హైకోర్టు వకీలయి న్యాయవాదివృత్తి నవలంబించినవారు ఈప్రాంతమున లేకుండిరి. అందుచే రెండుచేతులను గడించుటకవకాశ మేర్పడినది. పబ్లిక్ ప్రాసిక్యూటరు పదవి తనంత తానుగ వచ్చి వీరిని వరించినది. జమీందారులు గులాములవలె వీరివాకిట కావలి యుండి వీరి యనుగ్రహమున కెదురుచూచుచుండిరి.

సమృద్ధిగ ధనము గడించిన తరువాత, ఇక చాలునను కొని ప్రజాహిత జీవితరంగమున ప్రవేశించిరి. అక్కడకూడ వీరి భాగ్యలత యథేచ్ఛగ నల్లుకొని పోయినది. ఇటు శాసనసభలలో, అటు కాంగ్రెసు నాయకులలో వీ రాడిన దాట, పాడినది పాట!

అటుతరువాత మరికొంతకాలమునకు ఉద్యోగముల నన్నిటిని చాలించుకొని, మనుములు మనుమరాండ్రు తామరతంపరగ నున్న కుటుంబ సంపత్తితో— కాలుమీద కాలువైచుకొని తినుచు గూర్చున్నను ఎన్నటికి తరగని ధనసమృద్ధితో — కులాసాగా కాలక్షేపము చేయుచు ఇటు రాజకీయోద్యమములలో, అటు మత సంస్కరణములలో, మరియొకతట్టు నుండి వాఙ్మయాభివృద్ధితో యువకులను ప్రోత్సహించుచు, భారతదేశాభివృద్ధికై లలితమైన పోరాటము— యువకుల ఉత్సాహమును జూచి సంతసించుచున్న పైన పెద్ద

ము—వెనుకటి తమ జీవితమును స్మరించుకొని పరిమితమైన యానందము పొందుచు మహా రాజయోగముతో స్వర్గస్థులయినారు! ఏవంక జూచినను ఆ జీవితమున కొదువయనునది లేదు! పుష్కలమైన ధనార్జనమునకు తగిన భోగము-త్యాగము—ఇది వీరి జీవిత రహస్యము!

* * *

ఆ జీవితము సమప్రదేశమునందలి నదీప్రవాహము వలె ఒడుదుడుకులు లేకుండ హాయిగ సాగిపోయినది. ఆ జీవితమునకు గోదావరి కున్న వెడల్పున్నది గాని గంగానది కున్న లోతు లేదు.

* * *

ప్రకాశముగారి కున్న సాహసము-త్యాగము, సాంబమూర్తిగారి కున్న చొరవ-శక్తి, పట్టాభిగారి కున్న కార్యకౌశలము-మేధస్సు, రామలింగారెడ్డిగారి కున్న సర్వతోముఖ ధీనైశిత్యము-రసికత్వము వీరి యందు గానరావు. యువకులను ఆవేశపూరితులుగ జేసి నడిపింపగలిగిన గుణములు వీరికి లేవు. కాని, ఎవ్వరి మనస్సునకును నొప్పి కలిగింపకుండ అందరి గౌరవమునకును పాత్రు లగుచు నిదానముతో—ఓపికతో—దీక్షతో—ఏర్పరచుకొనిన గమ్యమునకు ఏకాగ్రదృష్టితో నడువగలిగిన సామర్థ్యము వీరి కున్నది. పంతులుగారు విపక్షమువారితో గాని, వ్యక్తితో గాని తీవ్రమయిన యుద్ధమునకు సిద్ధపడు స్వభావము కలవారు కారు! అట్లని ఆర్జవమునకు లోపము లేదు. సెలయేటి పాటయందువలె వీరి జీవితమునందు పరిమిత మయిన గమనవేగము, మాధుర్యము గోచరించును.

కాంగ్రెసు పేరయినను ఎవ్వరికిని తెలియని దినములలో వీరు కాంగ్రెసులో చేరి ప్రభుత్వము వారిని ప్రతిఘటించుచువచ్చిరి. అట్లని ఇప్పటి సత్యాగ్రహనాయకులవలె గాని, అప్పటి తిలక్ మున్నగు అతివాదులవలె గాని కారాగృహ వాసము స్వీకరించినవారు గారు. అందుచే చరమదశలో నాయకత్వము వీరికి సుస్థిరము గాకపోయినను నాయకుల మన్ననలకు మాత్రము సదా పాత్రు లగుచువచ్చిరి.

ఆనడుమ రాజేంద్రప్రసాదుగారు మా గ్రామము (రాజమహేంద్రము) దయచేసినపుడు వారికి స్వాగత మిచ్చుటకయి ఒక మంటపము నిర్మితమాయెను. వేనకు వేలు ప్రజలు వారి దర్శనార్థమయి వేచియుండిరి. రాజేంద్రబాబును రైలుస్టేషనువద్దనే ఎదుర్కొని, పుష్పమాలాలంకృతునిగ జేసి, పట్టణమంతయు నూరేగించి, సభామంటపము నొద్దకు దీసికొని వచ్చిరి. సభామంటప మెక్కుచుండగా క్రింద నొక మూలగ గూర్చుండిన సుబ్బారావుపంతులుగారి మూర్తి రాజేంద్రబాబు కంటబడెను. వెంటనే తాను ఎక్కబోవుచున్న సభామంటపమును దిగి సుబ్బారావుపంతులుగారి యొద్దకు వచ్చి నమస్కరించి వారినికూడ సభామంటపముపైకి దీసికొనిపోయి నతో బాటు సుఖాసీనులను గావించి తన యుపన్యాసము నీరీతిని ప్రారంభించెను:

"సుబ్బారావుపంతులు గారివంటి మహాపురుషుడు ఈసభ నలంకరించుట నాసుకృతవిశేషము. ఈనాటి మన యభిప్రాయములతో వారేకీభవింపనంత మాత్రమున వారిని మనము నిరసింపరాదు. నేను విద్యార్థిదశలో నున్న దినములలో పంతులుగారు కాంగ్రెసునాయకుడు. అప్పుడు పంతులుగారి శిక్షణమున నున్న స్వేచ్ఛాదళములో నే నొకడను. ఈనాడు కాంగ్రెసు మహోచ్చదశ ననుభవించుచున్న దన్నచో ఇదంతయు ఆనాడు వీరు సలిపిన కృషిఫలితమే. ఇట్టి మూలపురుషులను మనము సదా గౌరవించుచుండవలెను" అనునర్థమిచ్చుమాటలు ఆనాడు సభలో గూర్చుండియున్న నా చెవిని బడెను. "సుబ్బారావు పంతులును ప్రసవించిన ఆంధ్రదేశము ధన్యము" అని నాలో నే ననుకొంటిని.

* * *

నేను సుబ్బారావుపంతులుగారిని ప్రథమమున దర్శించినది ఇప్పటి కెనిమిదిసంవత్సరములకు పూర్వము మాత్రమే. అప్పటిలో నేను రామచంద్రపురములో నుండుచు వృత్తికి సంబంధించిన వ్యాపారములో రాజమహేంద్రవరము వచ్చితిని. ఒకనాడు నామిత్రులు కొందరు హిందూసమాజభవనమున భారతమువిూద నాయుపన్యాస మేర్పాటు గావించిరి. శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగా రధ్యక్షత వహించిరి. ఉపన్యాస

మయినవెనుక సుబ్బారావుపంతులుగారే నన్ను గూర్చి ప్రశంసావాక్యములు పలుకుచు నాపూర్వోత్తరములను దెలిసికొనుటకు బ్రయత్నింపగ నామిత్రులు విశ్వనాథ శర్మగారు కాబోలు నన్ను గూర్చి వారికి నివేదించిరి. అది ప్రథమపరిచయము! "వాఙ్మయవిషయములలో ప్రశంసించుటకు సుబ్బారావుపంతులుగారి కేమి యధికారమున్న"దని అప్పుడు నాలో నేను ప్రశ్నించుకొంటిని. ఆప్రశ్నకు సమాధానము వారితో పరిచయము గాఢమైనవెనుకగాని నాకు లభింపలేదు.

తదుపరి ప్రాక్టీసును నేను రామచంద్రపురము నుండి రాజమహేంద్రమునకు మార్చుటయు, హిందూసమాజములో సభ్యుడుగా జేరుటయు, దానిని బురస్కరించుకొని పంతులుగారితో నిత్యము కలసిమెలసితిరుగు నవకాశము లేర్పడుటయు తటస్థించినది.

హిందూసమాజమను సంస్థ పంతులుగారి కభిమానపుత్రిక! తీవ్రమయిన సంస్కారవిధానమున కియ్యకొనక వీరేశలింగముగారితో ప్రతిఘటించినప్పుడు పంతులుగారీసంస్థను స్థాపించియుందురని నే నూహించుచున్నాను. కొన్ని సంస్కారములకు లోబరచి హిందూమతమును, హిందూసంఘమును పునరుద్ధరింపవలెనని దీని ముఖ్యాశయము. కాని ఈ హిందూసమాజభవన ప్రక్కనే క్రీడారంగమను క్లబ్బుకూడ ఒకటి యున్నది. ఈ క్లబ్బు ఊరిలో నట్టనడుమ నుండుటచే పాశ్చాత్య విద్యావ్యాసంగముగల ఉద్యోగస్థులు పెక్కండ్రు ఇందు సభ్యులు. తక్కిన క్లబ్బులందువలెనే ఇందును బిలియర్డ్సు, చీట్లపేక, టెన్నిస్ మున్నగు వినోదవ్యాయామములు నడచుచుండును. కొందరు పెద్దమనుష్యులు ఒకచెట్టుక్రింద చేరి ఇష్టాగోష్ఠికూడ సలుపుచుందురు. వాస్కోడిగామా ప్రపంచమంతయు చుట్టివచ్చుటకు మూడుసంవత్సరములు పట్టినదిగాని — విమానయుగములో నుండుటచే కాబోలు— ఈ పెద్దమనుష్యులకు ప్రపంచము నంతను, కూర్చున్నచోటునుండి కదలకుండ, చుట్టివచ్చుటకు మూడునిముషములు పట్టదు. అదివరలో— బహుశః నేను పుట్టకపూర్వము — పంతులుగారు టెన్నిస్, చీట్లపేక మున్నగు క్రీడలలో పాల్గొనెడివారని వినికి. కాని నాకు పరిచయ మేర్పడినతరువాత వారు చెట్టుక్రింద ఇష్టగోష్ఠినిమిత్తమే వచ్చుచుండువారు. ఈ యిష్టాగోష్ఠి సలుపువారిలో నా యీడువారు కొందరు, పంతులుగారి యీడువారు కొందరు, మధ్యతరగతివారు కొందరూ నుండిరి. అందరును కలసి ఖులాసాగా కాలక్షేపము చేయుచుండిరి. పంతులుగారు ముందుగ షికారుగ మోటారుబండిమీద తమతోటకుపోయి అక్కడినుండి ఒక్కపూవో, కాయో సంగ్రహించుకొనివచ్చి, "ఏరీ చిలకమర్తివారు? ఎక్కడ నున్నారు?" అని ప్రశ్నించి ఆపూవో, కాయో వారిచేతిలో నుంచుచుండిరి. పంతులుగారు చిన్నలలో చిన్న - పెద్దలలో పెద్దగ నుండి అందరితోడను కలసిమెలసి వర్తించుచుండిరిగాని మొత్తముమీద వారియీడువారి సాంగత్యము వారికి సరిపడినట్లు చిన్నవారి సాంగత్యము వారి కంతగ సరిపడలేదేమో యని నాలో నేను శంకించుచుండువాడను.

ఈ యిష్టాగోష్ఠిసమయములందు పంతులవారి యాంతరంగికవిశేషములను తెలిసికొనుటకు నాకెక్కుడుగ నవకాశ మేర్పడెను. నా ప్రథమసందర్శనసమయమునకే వారి కించుమించుగ నెనుబదియేండ్లుండును. అంత వృద్ధులయ్యును ఈ నాటియువకులలో సైతము గానరాని కార్యదీక్ష వారి కుండెడిది. వారికున్న యాస్తి పెద్దదగుటచే రైతుల దగ్గరనుండి శిస్తులు, బాకీదారులయొద్దనుండి ఋణములు వసూలు చేయుటలో విశేషశ్రమ ముండెడిది. ఇవన్నియు వారు నిన్న మొన్నటిదాక స్వయముగ జూచుకొనుటయేగాక ఎప్పటికప్పుడు వార్తాపత్రికలను క్షుణ్ణముగ బఠించుచుండిరి. శ్రీనివాసశాస్త్రిగారు మున్నగు మిత్రులతో నుత్తరప్రత్యుత్తరములు నడపుచుండిరి. హిందూసమాజముతరఫున పుస్తకములు వ్రాయించి వానిని తాము స్వయముగ సంస్కరించుచు, ప్రూఫులు సైతము దిద్దుచు అచ్చువేయించుచుండిరి. ఊరి కెవరైన పెద్దమనుష్యులు-మహాపురుషులు వచ్చెదరని తెలిసినచో వారికి తాము రైలుస్టేషనుకు బోయి స్వాగత మిచ్చుచుండిరి! — ఆ ఓపికకు మితి లేదు! తిక్కన వర్ధంతికి గాబోలు ఒకసారి రామలింగారెడ్డిగారి నాహ్వానించితిమి. ఆ కార్యక్రమముతో పంతులుగారి కంతగా బ్రసక్తిలేదు.

పైగా వారికి దేహమున నస్వస్థతగూడ నుండెను. మేము "వలదు వల"దని నివారించుచున్ననూ వినక రామలింగారెడ్డిగారికి స్వాగత మిచ్చుటకయి స్టేషనుకు వచ్చిరి. తమకు గురుతుల్యులగు పంతులుగారు తమ్మెదుర్కొనుటకయి స్టేషనుకు వచ్చినందులకు నొచ్చుకొనుచు రెడ్డిగారు "పంతులుగారూ, ఇదే మిది? 'వృద్ధులబుద్ధులు చంచలింపవే' అనిన ట్లిక్కడకు వచ్చినారేమి? నేను తమ దర్శనమునకు రానా?" అని పలికిరి.

పట్టాభి సీతారామయ్యగారిపై పంతులుగారికి ప్రత్యేకాభిమానము. పట్టాభి సీతారామయ్యగారి మామగారయిన గంజాము వెంకటరత్నముగారును, పంతులుగారును పరమమిత్రులట! అందుచే పట్టాభిగారి నొకవిధమయిన పుత్రవాత్సల్యముతో జూచుకొనుచుండిరి! వారెప్పుడు రాజమహేంద్రము వచ్చినను పంతులుగారియింట బసచేయవలసినదే! పట్టాభిగారి యుపన్యాసములను వినుటకో, వానిపై అధ్యక్షత వహించుటకో—తరచు అధ్యక్షత వహించుటకే—పంతులుగారు పట్టాభిగారిని వెంటబెట్టుకొని సభలకు రావలసినదే! ఒకప్పుడు మాయూరనున్న యువజన సమితి వార్షికోత్సవము జరిగినది. దానికి పట్టాభిగా రధ్యక్షులు; నేను ఉపన్యాసకుడను. ప్రక్కనే పంతులుగారు కూర్చుండియుండిరి. ఏదో సందర్భవశమున నేను పట్టాభిగారిని వృద్ధులలో చేర్చితిని. పంతులుగారి కది నచ్చలేదు. "నిన్నగాక మొన్న నాకన్నుల ముందు బుట్టినవానిని అప్పుడే వృద్ధులలో చేర్చుచున్నావేమి?" అని నన్ను గద్దించిరి. "మీకంటె యువకుడే గావచ్చును కాని మాకంటె వృద్ధుడే గదా?" అని నేను బదులు పలికితిని. "ఆ! ఏమంత వృద్ధుడులే" అని వారు చాలించిరి. పట్టాభిగారి కెన్నడును వార్ధకమే రాగూడదని కాబోలు వీరియభిప్రాయము.

* * *

సుబ్బారావుపంతులుగారు బ్రతికి యున్నంతకాలము రాజమహేంద్రవరమున నే సభ జరిగినను అధ్యక్షత వహించుట కింకొకరి కవకాశము లేదని నా మిత్రు డొకడు చలోక్తిగ ననుచుండువాడు. ఆయుర్వేదమునుగూర్చి కాని, వ్యాయామమునుగూర్చి కాని, రాజకీయ విషయములనుగూర్చి కాని, రాజకీయములో మరల కాంగ్రెసు పక్షమైనను మరియొక పక్షమైననుగాని వాఙ్మయమునుగూర్చి కాని ఏసభ జరిగినను దానికి పంతులుగా రధ్యక్షత వహింపవలసినదే. పంతులుగారి కట్టి సర్వతోముఖమయిన యభిరుచి కలదు! రాజమహేంద్రపుర ప్రజలకు వారిపై నట్టి యఖండభక్తి కలదు!

ఈ నడుమ శ్రీగౌతమీ సాహిత్యసమ్మేళనమునకు పంతులుగారుకూడ సమావేశకర్తలుగ నుండిరి. "పంతులు లేనిదే మన బ్రదుకు తెల్లవారదు కాబోలు. భాషావిషయమునకూడ వారి కెందులకు ప్రసక్తి?" అని యొకరు విమర్శించిరి. దానికి శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారిట్లు తమ యుపన్యాసములో సమాధానము చెప్పిరి: "చిరకాలముక్రితము వారీయూర 'చింతామణీ' పత్రికను స్థాపించి అముద్రిత గ్రంథముల నెన్నో ప్రకటించి యాంధ్రుల కృతజ్ఞతకు పాత్రులైరి. చింతామణీబహుమానము లని యేర్పరచి నవలలు వ్రాయించిరి. నా 'హేమలత' 'అహల్యాబాయి' 'రామచంద్రవిజయము' మూడును చింతామణీ బహుమానముల నిమిత్తము వ్రాసిన నవలలే. ఇట్టి వాఙ్మయసేవకులు నేడు సమావేశకర్తలుగ నుండుట సందర్భోచితముగ లేదా?" ఈప్రశ్నకు ప్రతిప్రశ్న మరి రాలేదు.

శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారికి విశేషముగ వీరు ధనసాహాయ్యముచేసిరని లక్ష్మీనరసింహముగారి ముఖముననే నేను వింటిని. ఆదిభట్ల నారాయణదాసుగా రెప్పుడు వచ్చినను వీరి యింటనే బసచేయుచుండువారట. దాసుగారి సంగీతమన్నను, పాండిత్యమన్నను, కవిత్వమన్నను వీరి కపరిమితాభిమానము!

ఈసందర్భమున రెం డుదంతములు ముఖ్యముగ పేర్కొనదగినవి. నామిత్రులు కూచిభొట్ల ప్రభాకరశాస్త్రిగారు 'ఆంధ్రప్రతిభ' యను పద్యకావ్యమును పంతులుగారికి కృతియివ్వవలెనని యెంచి నన్ను మాటాడమని కోరిరి. కావ్యము నరాంకితము చేయుటనిన నాకు గిట్టక పోయినను, "నాకు ఫలాపేక్ష

ఏమాత్రమును లేదు. పంతులుగారిపై నున్న గౌరవముచేతనే దీనిని వారికి కృతి యీయవలె నని సంకల్పము" అని ప్రభాకరశాస్త్రిగారు సెలవిచ్చుటచే వారి యుద్యమమునకు సంతసించి, పంతులవారితో నీ ప్రసక్తి తేగా, "నే నెన్నడును కావ్యమును కృతి పుచ్చుకొనుట కంగీకరింపను" అని వారు నిరాకరించిరి. కాని హిందూసమాజములో సభచేసి శాస్త్రిగారి ముఖమున కావ్యము విని పద్యములు మనోహరముగ నున్నవని మెచ్చుకొనిరి. ఇంకొకమారు "ఆంధ్రభీష్మ న్యాయపతి సుబ్బరావు పంతులుగా"రని నేనేదో నోటీసులో వ్రాయబోవుచుండగా "ఆంధ్రభీష్మ యన్న బిరుదము వాడవల"దని మందలించిరి. ఇట్టి నిరాడంబర జీవులు వీరు!

చనిపోవుటకు కొద్దిరోజులు పూర్వమువరకును వీరు గ్రంథపఠన మొనర్చుచునే యుండిరి. నాలుగైదు నెలలకు పూర్వ మొకనాడు బెర్నార్డుషా నాటకములు తమ కంతగ రుచింపలే దని వారు నాతో ప్రసంగించిరి. ఇబ్సెను నాటకములు చదివినచో వారికి తప్పక రుచించునని నేను మనవిచేయగా తక్షణమే కాలేజీ లైబ్రరీనుండి యా నాటకములను తెప్పించుకొని చదివి మరి రెండుమూడు రోజులకు వాని గుణాగుణములను గూర్చి నాతో వితర్కించిరి. ఇట్టి వాఙ్మయపిపాస యువకులందు సైతము దుర్లభముగదా!

* * *

నియమితకాలమునకు కార్యక్రమము ననుసరించుటలో వీరికున్న దీక్షను చూచి ఇప్పటి యువకులు సిగ్గుపడవలసి యుందురు. ఏ సభకయినను వీ రాలస్యముగ వచ్చుట గానము. ఆరుగంటలకు సభయున్నచో సరిగా ఆరుగంటలకయిదునిముషములున్న దనగా వీరు మోటారుబండితో ప్రత్యక్షము! సభకు వచ్చినతరువాత సభ ముగియువరకు నుండవలెనని దీక్ష. ఈ నడుమ నొకటిరెండు సభలు సకాలమున ముగియునట్లు కనబడక పోవుటచే జరాభారమున వీరు ఓపిక పట్టలేక "సభ త్వరగా ముగించవలసిన"దని కోరుచువచ్చిరి. "పంతులుగారూ, మీరు సభ ముగించవలసినదని కోరుచుందురెందులకు? మీరు ప్రేక్షకులుగ నేగదా యిక్కడ నున్నారు— మీ యిష్టము వచ్చినపుడు ఇంటికి పోవచ్చునే" అని నేను సలహా యిచ్చితిని. నా సలహా వారికి నచ్చెడిదికాదు.

ఆహారవిషయమునగూడ వీరు కడు నియమముతో వర్తించువారు. ధన మధికముగ వ్యయపరచి యైనను దేహమునకు పుష్టినిచ్చు ఆహారమును మితముగ వీరు భుజించువారు. మిత్రులను విందులకు పిలుచుట యన్నను, మిత్రులయింటికి విందుకు పోవుటయన్నను వీరికి చాల సరదా! కాని అట్టిసమయములందుకూడ భోజనముమాత్రము మితముగనే చేసెడివారు. అందుచేతనే వీ రంత చిరంజీవులుగ నుండగల్గి రని కొందరి నమ్మకము.


* * *

వీరికి నాపై ప్రత్యేకాదరము. పండితు లెవరు హిందూసమాజమునకు వచ్చినను వారియొద్దకు నన్ను దీసికొనిపోయి పరిచయము గల్పించుచుండువారు. నా నాటకములకు ప్రచారము గలిగింపవలెనని సభలలో తరచు ప్రశంసించువారు. యువకులను వృద్ధికి దెచ్చుట యనిన వీరికి పరమసంతోషము. శ్రీ శారు రాజారావుపంతులుగారిని వృద్ధిలోనికి దెచ్చినది వీరే యని రాజారావుపంతులుగారు తరచు నాతో చెప్పెడివారు.

నేనును, వీరును ఆఖరుసారి శ్రీ జయపురము మహారాజావారి యధ్యక్షతను మాయూర జరగిన సభలో గలసికొంటిమి. అటుతరువాత వీరికి జబ్బుగ నున్నదని విని రెండుమూడుసారులు వీరియింటివరకు పోయితినిగాని "తీర విశ్రాంతి దీసికొనుచున్నవారిని నే నెందుల కిబ్బంది పెట్టవలెను?" అని వీరిదర్శనము చేయకయే వెనుకకు మరలుచు వచ్చితిని. ఇంతలో ఏలూరులో కార్యాంతరమున నుండగ హిందూపత్రికలో వీరిపటము, పటముక్రిందనే ఉల్లిఖిత మైన వీరిమృతివార్త దృగ్గోచర మైనవి.

కడపారి వీరిని దర్శించి వీరి యాశీర్వచనము గైకొనలేకపోతినే యనిన వెత—బాధ— ఇప్పుడు నన్ను పీడించుకొని తినుచున్నవి!

— నందూరి బంగారయ్య.



పంచరథములలో మూడు - నకులసహదేవ, అర్జున, ద్రౌపది నామధేయములు గలవి.



విమర్శనము

గాంధిమహాత్ముడు
(మొదటిభాగము)

సికింద్రాబాదు దేశోద్ధారక గ్రంథమాలలోని తొమ్మిదవప్రచురణము. వెల ఆరుఅణాలు. గ్రంథకర్త: "విష్ణుచక్రం."

మహాత్ముని జీవితమును గురించి విపులోదంతమును తెలుపుట గ్రంథకర్తగారి యాశయము కాదు; గాంధీజీ దృష్టిసమక్షమున దివ్యజ్యోతిర్లీలవలె వెలుగొందు ఆశయములను పరిశీలించి, వ్యాసరూపమున తమ పరిశీలనాంశములను తెలుపుట వారియుద్దేశము... గ్రంథస్థవిషయము భక్తిభరితమైనది. తూ చా తప్పక మహాత్మునిభావములతో గ్రంథకర్తగా రేకీభవించిరి.

ద్వాపర కలియుగముల పరిస్థితులను వివరించి, నాడు శ్రీకృష్ణునివలె నేడు గాంధీజీ ధర్మసంరక్షణార్థ మవతరించెననియు, మహత్తరమైన తమ సంప్రదాయమునకు దూరస్థులై, ఉదారాశయములను మఱచి, ప్రతీచీనాగరతకు అంజలిఘటించి, అంతఃకలహములకు చోటిచ్చి పెక్కురీతుల ముప్పుదెచ్చుకొనిన భారతీయుల నుద్ధరించుటకై, సత్యాగ్రహముచే పశుబలము నెదిరించి జగతిపై శాంతిని నెలకొలుపుటకై మహాత్ముడుదయించెననియు తెలిపి, గ్రంథకర్తగారు ఆత్మశక్తిని, అహింసాశక్తిని, అనురాగశక్తిని, ఆ ? విశ్వాసమందలి శక్తిని, సత్యాగ్రహామహత్త్వమును ఉగ్గడించిరి.

మొదటి ఆఱుప్రకరణములు ఉత్కృష్టాదర్శములను గురించిన నిర్వచనముతో నొప్పుచున్నవి. ఇవి గ్రాంథికభాషలో వ్రాయబడినవి. తరువాతి ప్రకరణములు వ్యావహారికభాషయందు వ్రాయబడినవి. తుదిప్రకరణములందు గ్రంథకర్తగారు భారతదేశమందలి నేటి ఆర్థికపరిస్థితులను పరిశీలించి, యంత్రములవలన పుట్టిన చెఱుపులను చూపి, చేతిపరిశ్రమలవలన, చర్ఖాశక్తివలన భారతాశయములసిద్ధి సుసాధ్యమగునని వచించిరి; కాంగ్రెసుచరిత్రనుండియు, గాంధీజీ ఆత్మకథనుండియు, సుప్రసిద్ధపాశ్చాత్యరచయితల రచనములనుండియు అక్కఱైన వాక్కులను దీసి, తమ యభిప్రాయములకు బలము చేకూర్చిరి.

మహాపురుషుల జీవితగాథలు దేశచరిత్రలగునని కార్లైలు వచించినాడు. మహాత్ముని ఆశయములను గురించిన ప్రస్తుతకథనము కడచిన రెండుదశాబ్దులందు పొడసూపిన భారతచరిత్రాంశములతో నిండియున్నదని పాఠకులు గ్రహింపగలరు.

గ్రంథము పట్టాభిగారిపీఠికతో వెలయుచున్నది. ఇది జిజ్ఞాసువుల దృష్టి నాకర్షింపగలదు.

*　　*　　*

(రెండవ భాగము)

వెల: ఆరు అణాలు.

మహాత్ముని జీవితమునకును, అధునాతన భారతచరిత్రకును సంబంధించిన మఱికొన్ని విశేషముల సింహావలోకన మిందు గలదు. హరిజనోద్యమము, మద్యపాననిషేధము, హిందూమహమ్మదీయ మతస్థుల సంఘీభావము, వార్ధా విద్యావిధానము మున్నగువానిని గురించిన కథన మిందు వెలయుచున్నది.

హరిజనులను ప్రత్యేకమైన తెగగా నిర్ణయించుట వలన తలయెత్తు ముప్పు గొప్పది. స్వాతంత్ర్యసంపాదన

మునకై సలుపబడు కృషియందు మైనారిటీ సమస్య వలన పొడసూపు అంతరాయము అనల్పమైన దని గాంధిజీ యెఱుగును. హరిజనుల ప్రత్యేకత స్థిరమగు తఱి, నైతికపథమందును రాజకీయ రంగమందును విజృంభించు అరిష్టముల నూహించి, తన యుపవాస వ్రతముకతన వరేణ్యుల హృదయములందు పరివర్తన మును పుట్టించి, మహాత్ముడు జయభేరి మ్రోగించి నాడు. ఈయంశముల నుల్లేఖించి, గ్రంథకర్తగారు దేవాలయప్రవేశమును గుఱించి ముచ్చటించుచు, తిరువాన్కూరు ఱేడు కావించిన ఘన కార్యము నగ్గడించిరి. మద్రాసు ప్రభుత్వము వారు కాంగ్రెసుగోత్రీకుల యాజమాన్యమున దేవాలయబిల్లు నంగీకరించిన వృత్తాంతము వెల్లడించిరి... మద్యపాననిషేధమున మహాత్ముడొనరించిన కృషిని పరికించిరి. హిందువులకును, ముసల్మానుల కును ఐక్యమైన పొందును గుఱించి తెలుపుచు, భారత చారిత్రకాంశములను సింహావలోకన మొనరించిరి. అనంతరము కాంగ్రెసు ముస్లింలీగు హింసామహాసభల దృక్పథముల వెల్లడించిరి. పాకిస్థాన్ స్కీములోని లొసు గుల నేకరువుపెట్టిరి. ప్రస్తుతవిద్యావిధానమందలి లోప ములను చూపుచు, వివేకానంద ప్రభృతుల పలుకుల నుల్లేఖించుచు, అహింసాత్మకమై, సత్యసందీపితమై, స్వయంపోషక విద్యావిధానమైన వార్ధా విద్యాప్రణా ళికలోని మహత్త్వ తత్త్వముల వెల్లడించిరి. మహా త్ముని నైజ్ఞానికోన్నతిని ప్రశంసించుచు, ప్రాచీప్రతీచీ మహావిద్వాంసు లుచ్చరించిన ప్రశంసావాక్యములను వివరించిరి. మహాత్ముడవతారపురుషుడని మఱియొక మాఱు నొక్కి చెప్పిరి.

గాంధిజీవితమందలి సారాంశ మిందు చక్కగ తెలుపబడినది. భావబంధురవాక్యములు గ్రంథమున పెక్కుచోటులందు కానబడును. శైలి మనోహర మైనది. " సస్యశ్యామలోపేతమై, అమృతోపమాన మగు...పుణ్యనదులను కలిగి......వాసిగాంచిన భారత దేశము" (పుట ౨౩) మున్నగు వాక్యములను పరిశీ లింపుడు.

గ్రంథము దేశభక్తుల హస్తముల నలంకరింప గలదు.

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

నామరహితం

శ్రీ రావు వేంకటమహీపతి గంగాధర రామా రావు (పిఠాపురం యువరాజా) గారి నవ్యకవితా గ్రంథం ఇది. యువరాజాగారు నవ్యకవితాభిమానులే కాక, నవనవకవులు కూడాను.

వీరి ఈ గ్రంథం నేటి కవితావాహినుల ప్రయా ణాలను గమనించినదిమాత్రమే కాక, వాటితో చను వైన నెయ్యము నెరపుతూ రాగల కొత్తదనాన్ని ఆహ్వానిస్తున్నదికూడాను.

ఒక అనంతవేదన ఈ కవిని తాళోత్తాలముగా ముంచెత్తి వీచికలనుమ వదుపుకున్నదనేది ఆనాటి వీరి 'శ్మశానవస్త్రం' దగ్గరే కాక ఇక్కడకూడా వినబడు తుంది. భావసంఘర్షణలుకూడా విడిపోయి, భావము ఒకేఅగ్రముకేసి ప్రయాణించే స్థిరతకూడా ఈ నామ రహితంలో ఎక్కువగా కనబడుతుంది.

"పొంగిపోయేశక్తి } ఈ రెంటికీ ప్రశస్తి
మండిపోయే అశక్తి } జ్ఞానాభివ్యక్తి

ఈ పైపంక్తుల్లో మామూలుగా చూస్తే ఏమీ కనబడదు. వీటికే కొద్దిగా రంగులు పులిమితే, అది మనకు పరిచితపంథాలో కనబడి, ఓహో అనిపించు తుంటుంది. కాని ఈకవి వొచ్చిన ఊహల్ని వచ్చినట్లుగా నగ్నంగా పేర్చి వాటితో వింతగా సౌందర్యాన్ని చూపే అతివాస్తవికతను (సర్ రియలిజం) గురిమాచి ఇక్కడ విచ్చలవిడిగా వదలివుంటారు. లేకపోతే,

"నిజం చూస్తే—వాడుచేసే పనీలేదు
నువ్వు చేసేపనీ లేదు.
నేను చేసేపనీ లేదు
ఎవరు చేసేపనీ లేదు"

ఈ పంక్తులూ ఇట్టివి ఇంతవింతలుగా పెరగ నక్కరలేదు. పైచోట 'నిజానికి ఎవరు చేసేదీలేదు'

అంచనేవాలు. మరి, వీటినే ఇంకొక్క మెట్టు పైకి ఎక్కిస్తే చేవగల అతివాస్తవికరచనలు అవుతై.

కాగా, ఇది ఒక కొత్తగా తెలుసునాట చిందులు తొక్క చూచే అతివాస్తవికరచనలకు ద్వారము తెరిచిన కొత్త సంప్రదాయ గ్రంథమని తోస్తుంది. అయితే, పాతసంప్రదాయాలు (ఇమేజిజం ఇత్యాదులు) తొంగి చూడకపోవు మరి (ఇదేగా తొలి పుస్తకం).

ఇల్లాంటి భాషోద్యమ గ్రంథాల్లో భాషాదోషాలు—లేలనైనా ఎత్తరానివి అక్కడక్కడ కనబడతాయి:

"హృద్వాన, విశ్వకడలి"—చిన్నయసూరి చెప్పాడనే కాదు, శ్రుతిరంజనను పట్టి చూచినా ఇట్టివి తొలగింపవలసినవి.

వెన్నెలవలె మచ్చలేని అకృతితో ఈగ్రంథం రసజ్ఞులకడకు చేరుతున్నది.

రుక్మిణీనాథశాస్త్రి.

---

౧. కాంగ్రెసు చరిత్ర

(౧, ౨ భాగములు)

గ్రంథకర్త: జానపాటి సత్యనారాయణగారు.

౨. మొగలాయి కథలు

గ్రంథకర్త: సురవరము ప్రతాపరెడ్డిగారు.

౩. పండిత జవాహర్లాల్ నెహ్రూ

గ్రంథకర్త: కె. రంగదాసుగారు.

౪. జాగీరులు

గ్రంథకర్తలు: ఉమ్మెంతల కేశవరావు, సురవరం ప్రతాపరెడ్డిగార్లు.

పై నాల్గింటికీ ప్రకాశకులు: అణాగ్రంథమాల, ౩౬౯౧, తురుపుబజారు, హైద్రాబాదు - దక్కన్. ఒక్కొక్కటి వెల అణా.

౧. కాంగ్రెసు చరిత్ర జన్మపూర్వముగ అతః పూర్వ పరిస్థితుల కథనముతో మొదలై ప్రకృతమైయున్న సత్యాగ్రహారంభదశవరకును దిఙ్మాత్రముగ చిత్రించబడినది.

౨. ఇందులో ఆరుకథ లున్నవి. వినోదప్రాయములు. హాస్యరసపోషణ చేసే కథలు హాసీహీనిగా ఉన్న మనకు వీటి అవసరం ఎక్కువ.

౩. జన్మాదికముతో నారంభించి జవహర్లాల్ నెహ్రూ యిటీవల నిర్బంధపర్యంతము అతని జీవిత చర్య యిందు రచించబడినది. అతని ఆత్మకథ ననుసరించినది.

౪. జాగీరులు- దేశంలో సంస్థానములు పీడాకరములుగా ఉన్నవి. సంస్థానాలలో వాటి చిన్న ప్రతిమలు జాగీరుల రూపాన వెలసినవి—బ్రిటిష్‌యిండియాలో జమీలలాగా. ఈ 'లఘుపుస్తక' గ్రంథకర్తలకన్న విశేషించి వ్రాయగలవారు లేరు.

ఇటీవల హైదరాబాదులో అఖిలాషపరులు తెలుగునుడికారపు వ్యవసాయం అధికంగా చేస్తూ ఉండటం ప్రశంసనీయం. తెలుగుభాష అత్యంతము సజీవమై ఉన్నది. వ్యావహారికార్థ నిరూపణంలో హైదరాబాదీఆంధ్రులు ఒరవడి పెట్టగలరు. వీరి గ్రంథమాల అణాగ్రంథమాల. విషయ నిర్ణయ వివేచనము ఒప్పియుండి గ్రంథమాల జనరంజక గ్రంథమాల యనిపించుకొనుచున్నది.

రెండో ప్రపంచ యుద్ధమా?

(రెండవ భాగము)

౧౩౩ పేజీలు, ఆరు అణాలు. ఆంధ్రకేసరి గ్రంథమాల, ౧౬౮, సుల్తాన్ బజారు, హైద్రాబాదు (దక్కన్).

మ్యూనిక్‌పాక్టు తదనంతర కాలగతితో నారంభమై ౧౯౪౦ సంవత్సరాంతము వరకును యూరప్ యుద్ధకథన మిందు వ్రాయబడినది. ప్రథమభాగాని కిది యేరకంగాను తీసిపోదు. అయితే ఒకసంగతి: యూరప్‌లో సాక్షాత్ ఫలితార్థ ప్రతిపాదకమైన యుద్ధం యేవిధంగా అహింసా ప్రతిరోధాన్ని ఫురిగొల్పిందో దిఙ్మాత్రంగా సూచించిన బాగుండేదిది.

ఎందు కనగా ప్రకృతపశ్చాద్విగ్రహం యూరప్ లోని యుద్ధంవల్లనే అవసరమైనది. గ్రంథమందు తెలుపబడిన విషయము చమ్మగాను, కమ్మగాను తెలుపబడినది.

స. పరకాతవర.

వినోదిని సంక్రాంతిసంచిక

మా సోదరపత్రిక వినోదిని సంక్రాంతివేషం చాలా రమ్యంగా వుంది. కేవలం బాహ్యరూపంలో, పటధారణంలోమాత్రమే కాదు, అంతర్యపు వస్తు ప్రదర్శనవిధానంలోకూడా మా ఈ గాదిసోదరిని పూరా అనుకరించింది ఈ సంక్రాంతిసోదరి. మొట్టమొదలు మరీ లేతవయస్సులో శైశవచాపల్యంచేత కావచ్చు కొంచెం పల్లెటూరి హాస్యాలకు పాల్పడుతూ వచ్చినప్పటికీ ఇప్పుడాపద్ధతినంతనూ మార్చుకొని కొంతవరకు గంభీర, ప్రౌఢ హాస్యపుధోరణికి తిరిగింది. అందు కిందులోని నర్మహాస్య గర్భిత కథలే సాక్ష్య మిస్తున్నాయి. అది అట్లా వుండగా ఇప్పుడు కేవలం హాస్యాన్నే పట్టుకొని ప్రాకులాడడం లేదు. నీతి నియమబోధక కథానికా భరణాలను సైతం అలంకరించుకొంటూంది. సుఖపాశం, చెట్టునీడా, రజనీ, ఆమె అతన్నా మున్నగుకథ లందుకు నిదానాలు. కూచిపూడి భాగవతుల భరతనాట్య ప్రదర్శనాత్మక చిత్రానికి మరోతళుకురంగు వేశారు త్రిదచయితలు. వారే సినిమాలమొగం చూడనివాళ్లకు గూడా ప్రఖ్యాతతారల నందరినీ ఎరుకపరచి చూపించారు తారాపథంబోకనంలో. ధాన్యలక్ష్మికి జోహారులూ, మహాబలిపురం లోనగునవి చారిత్రక, భౌగోళిక విషయాలను చిత్రిస్తున్నాయి. పరిశ్రమలూ, పాఠశాలలూ మొదలైన మరికొన్ని పఠనయోగ్యాలయిన వ్యాసాలకూ ఇందులో స్థానం దొరికింది. వీటన్నింటికీ తోడు త్రివర్ణ సాధారణ వ్యంగ్యచిత్రాలు మరింత అందాన్ని సమకూరుస్తున్నాయి సంక్రాంతికి.

రామాయణసారము

రచయిత: శ్రీ గొబ్బూరు వేంకటానంద రాఘవరావుగారు, ఎలమంచిలి, విశాఖపట్టణముజిల్లా. వెల రు. ౦-౨-౦.

ఇన్ని రామాయణా లుండగా మళ్లీ ఈ రామాయణసార మేమిటా అని పాఠకులకు సందేహం కలుగవచ్చు పుస్తకంచూడగానే. కాని చదివినమీదట దీని ప్రత్యేకత అవగత మవుతుంది. రాఘవరావుగారు వ్రాసింది మామూలుగా ఇదివరకున్న రామకథనే. కాని ఆధునిక యువకకవులు కొందరు పురాణగాథలను తారుమారు చేసి తమతమ భావాలకు సరిపోయేలాగు వ్రాసిన మాదిరిగా గాక వీరొక క్రొత్తమార్గం అవలంబించి దానిలోనే రామాయణకథ యావత్తూ వచ్చేలాగు చేశారు. రామాయణంలోని కాండముల వరుసనూ వీ రనుసరించలేదు. రామ, లక్ష్మణ, భరత, దశరథ, సీతా, కైకలయొక్కయూ, హనుమంతుని యొక్కయూ చరిత్రవిశేషములను వర్ణిస్తూ రామాయణము యావత్తూ వచ్చేలాగు వ్రాశారు. బాలబాలికలకుసరియే, పెద్దలకు కూడా ఇది చదవదగినది.

గణేశవిజయము

గ్రంథకర్త: శ్రీ ఏలేశ్వరపు కృష్ణమూర్తి శాస్త్రిగారు, బి. క. బి. మొగలితుర్రు, పశ్చిమగోదావరి జిల్లా. గ్రంథప్రాప్తి స్థానములు: సంకా కృష్ణమూర్తి, ఫాన్సీషాపు, నర్సాపురము; లేక తటవర్తి నారాయణమూర్తి అండ్ సన్స్, స్టేషనర్స్, భీమవరము. వెల రు. ౦-౫-౦.

సవతితల్లి

గ్రంథకర్తలు: శ్రీ వేంకట వీరరాజకవులు. సున్నం వీరరాజుగారు; ఇంపీరియల్ బాంకురోడ్డు, విశాఖపట్టణం. వెల రు. ౧-౦-౦.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad.



అనుసంధానము
[చిత్రకారుడు: శ్రీ మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలే]